# ఆంధ్రదేశము విదేశయాత్రికులు

భావరాజు వేంకటకృష్ణరావు
(ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలి.)

గ్రంథకర్తచే ప్రకటింపబడినది.

వెల రు. ౧-౨-౦

*All Rights Reserved.*

Hyderabad
221714
8.8.05
abad - 500 134

ప్రథమముద్రణము
1926

T
92
V55A

అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయఁడుగారిచే
సరస్వతీ పవర్ ప్రెస్సునందు ముద్రితము.

ఈ కృతిని

నా ప్రియసఖుఁడు

శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావునకు

అంకిత మిచ్చుచున్నాను

# AUTHOR'S PREFACE.

My chief object in presenting this little book to my young Andhra sisters and brothers, is to introduce them to the original sources of Andhra History which are not accessible in their own language, and thereby create a desire for the study of the history of their native land. I have given in this book, extracts from the writings of three foreigners who visited the country during the three epoch making periods of Andhra history, together with my comments and historical notes wherever necessary. In doing so, my intention has been to give the reader a glimpse into the glorious past, and to create a deep sense of love and admiration for the Motherland.

I have taken three names from our history, three famous figures that left glowing accounts of our country, its peoples and rulers. The first is Yuvan Chwang (Hieun Tsang), the celebrated Chinese traveller and pilgrim; the second is Marco Polo, the Venetian traveller, and the third is Kamalud-din Abdur Razzak, the ambassador from Persia.

In the seventh century of the Christian Era, when Budhism was just on the decline, and Brahmanism and Jainism on the revival, when the Vishnukundins of Vengi, were uprooted by the Chalukyas of the West, who established a dynasty of their own, Yuvan Chwang visited the country and stayed for two years, going from one place of Budhist pilgrimage to another. He travelled on the mainland along the east coast, from Konyodha (Ganjam) in the north, as for as Kanchipura in the south.

Roughly six centuries later, in the palmy days of the Kakatiya rule, under Queen Rudramadevi,

Marco Polo came to the shores of Andhra. He landed at Motupalli, the greatest sea port of Andhradesa from the earliest times down to the end of 15th century, and went into the interior as far as Dharanikota on the Krishna, to see the diamond mines of the kingdom of which he had heard so much. He praised the Queen Ganapamba, wife of Betaraja of Kota family, the ruler of the Dharanikota country, as the most just and wise sovereign that ever ruled. Scholars have erred in holding that Marco praised the Kakatiya Queen Rudramadevi. But this identification has led them to doubt whether queen Rudramadevi was the daughter or wife of king Ganapatideva, though it is finally settled that she was his daughter. King Ganapatideva had two daughters, the eldest Rudramba succeeded to the Kakatiya throne, and the second Ganapamba ruled over her husband's kingdom of Dharanikota i.e., the Six Thousand Country, as a vassal of her sister.

Nearly two centuries later, during the reign of Devaraya II, emperor of Vijayanagara, Abdur Razzak visited the Imperial city as an envoy from Persia. He was in that great city for about eight months. He left a glowing account of Vijayanagara, its seven walls and fortifications, of the brilliancy of a great festival of which he was a spectator, and of the administration of the vast empire. The description given by this traveller gives us a good idea of the spelendour of the great Hindu Capital, in the first half of the fifteenth century which is unfortunately now no more.

After going through this book, if the reader turns earnestly to the study of the Histry of Andhradesa, my humble endeavour, I think, will not be in vain.

# పీఠిక

మనభాషయందు, చరిత్రగ్రంథములు కడు స్వల్పము లుగా నున్నవి, స్వల్పములుగాదు, లేవనికూడ చెప్పసాహ సింతును. జాత్యాభ్యుదయమునకు చరిత్ర ముఖ్యసాధనము లగుచుండ, మనకింతవఱకును, చక్కని దేశచరిత్రలు లేకుండుట కడుశోచనీయము. చరిత్రపఠనమువలననే జనులకు, దేశముపై నభిమానమును గౌరవమును జనించును. "నా జన్మభూమి యిది! నే నాంధ్రుడనని గర్వించుచున్నాను" అని భావము లుత్పన్నములగును. అంతట జాతిని దేశ గౌరవమును చక్క దిద్దుటకు ప్రయత్నములు అప్రయత్నముగ జరుగుచుండును. కావున నే నిపుడీ చిన్నగ్రంథమును, మన ఆంధ్రయువతీ యువ కులకు, ఆంధ్రదేశముపై, నాంధ్రజాతిపై, నభిమానమును, గౌరవమును జనింపజేయుటకు వ్రాసి సమర్పించుచున్నాను.

ఈ గ్రంథమునందు, ముగ్గురిని వర్ణించినాము. అందొ కడు ఏడవశతాబ్దాదిని యేతెంచినచీనా యాత్రికుడు. రెండవ వాడు, కాకతీయాంధ్ర సామ్రాజ్యము మహోచ్ఛదశయం దుండినకాలమున వచ్చిన యిటాలియా వాస్తవ్యుడు. మూడ వవాడు విజయనగర సామ్రాజ్యవైభమును చవిజూచిన పార శీక రాయబారి.

ఏడవశతాబ్దాదిని హిందూదేశమునం దంతటను మహా త్తరములయిన పరిణామములు జరుగుచుండెను. ఉత్తర

రమున హర్షసామ్రాజ్య ముచ్ఛ్రస్థలకి వచ్చియుండెను. దక్షిణా పథమున పశ్చిమ చాళుక్యసామ్రాజ్యము సత్యాశ్రయ రెండవ పులకేశి వల్లభునిచే స్థాపింపబడి, యచిరకాలములోనె యొక్క వెలుగు వెల్గి మెఱపువలె మాయమయ్యెను. తూర్పున చాళుక్యాన్వయ మొకటి రాజ్యము స్థాపించుకొని ఆరుశతాబ్దముల కాల మవిచ్ఛిన్నముగ నాంధ్రభూమిని యేలుటకు బునాదులు వేయుచుండెను. దక్షిణమున కాంచీపుర పల్లవులు విజృంభింప నారంబించుచుండిరి. ఎక్కడ జూచినను అసహ్యాకరము లయిన మహాయన సంప్రదాయాచారములుతో నిండిన బౌద్ధ మతము జనులచే పరిత్యజింపబడుచుండెను. జైనమతమును అట్లే క్షీణించుచుండెను కాని దీనికింకను కొంత రాజాశ్రయ ముండెను. అట్టికాలమున, బౌద్ధుడును, విమతద్వేషియునగు యుఆన్‌చ్వాంగ్ మన యాంధ్రదేశమును సందర్శించి, బౌద్ధ క్షేత్రములందించుక కాలముగడపుచు, దేశమునందు రెండేండ్లు సంచారముచేసి వెడలిపోయెను.

పదమూడవ శతాబ్దాంతమున మార్కోపోలో సందర్శింప నేతెంచినపుడును ఆంధ్రదేశమునందు, మత, సాంఘిక రాజకీయ విప్లవములు జరుగుచుండెను. అయ్యది చాళుక్యచోళ సామ్రాజ్య మంతరించినకాలము. అయ్యది వెలనాటి చోడరాజుల ప్రాభవ యణగి పోయి, కాకతీయభూపాలురు విజృంభించిన సమయము. ఆంధ్రయువతి, పురుషవేషధారిణియై, వీరవనితయై, యాంధ్రభూమిని, నిరుప

మానమైన ప్రజ్ఞతో నేలిన కాలమది. జైన మతము నిర్ధ్వస్తము గావింపబడి, వీరశైవము ప్రతిష్ఠింపబడిన తరుణమది. చిల్లర, చిల్లర రాజ్యములు, అణగద్రొక్కబడి, ఆంధ్రదేశమంతయు నేకచ్ఛత్రాధిపత్యముక్రిందకు గొనిరాబడిన కాలమది. కులభేదములును, వైషమ్యములును బాటింపక, క్షత్రియ, చతుర్థ వంశజులు, నొక్కటిగా కలసి, పోయిన కాలమది. ఆంధ్రుల సముద్రవ్యాపారవైభవము, దేశదేశాంతరముల మాఱు మ్రోగిన కాలమది.

మరి రెండు శతాబ్దములనాటికి, దేశమున గలిగిన మార్పులవలన, కాకతీయసామ్రాజ్య మంతరించిపోయెను. దాని స్థానమున భామినీ రాజవంశము, తురుష్క సామ్రాజ్యమును నెలకొల్పియుండెను. దక్షిణాపథ మంతయు, ఇంచుమించుగా, పూర్వాంధ్ర దేశము తప్ప, మహమ్మదీయుల వశమయ్యెను. పూర్వాంధ్ర దేశము, కొంత కాలము రెడ్ల పరిపాలనముక్రిందను, మరికొంత కాలము, ఒడ్డెగజపతిరాజులక్రిందను పరిపాలింపబడుచుండెను. కృష్ణకు దక్షిణమున గల దేశముపై సర్వాధికారము నెఱపుచు, రెండున్నర శతాబ్దముల కాలము, హిందూమతమును సంఘమును, హిందువుల స్వాతంత్ర్యమును సంరక్షించుకొఱకు విజయనగర సామ్రాజ్యము వెలసియుండెను. ఆసామ్రాజ్యపు వైభవప్రారంభదశయందు, యిమ్మడి దేవరాయలు చక్రవర్తియై పరిపాలించియుండెను. ఆతనితో నెయ్యము నెఱపుటకు, పారశీకసుల్తాను ఖాకానిసయ్యద్

షారుఖ్ సుల్తాను, అబ్దుర్ రజాక్ ను రాయబారిగా పంపి యుండెను.

ఈ ముగ్గురి చరిత్రలను వ్రాసి, చదువరి కర్పించుట నా ముఖ్యోద్దేశము, దేశచరిత్రపఠనమందు అభిరుచి గలిగించుటకన్న మరియొకటిగాదు. ఈమూడు వృత్తాంతములలో, మొదటిదియు గడపటిదియు, నీవఱకు, శారదా, భారతీ పత్రికలయందు వెలువడియున్నవి. వాటినించుక మార్పులతో నచ్చు ముద్రించితిని. రెండవది, మార్కొపోలో,యిటీవల వ్రాసినది. చరిత్రవిషయమున, సంశయాస్పదములును, చర్చనీయాంశములును పెక్కింటిని నా వ్యాఖ్యానములందు జొప్పించియున్నాడను. వాటినిగూర్చిన నాయభిప్రాయములు మార్చుకొనవలసి వచ్చిన మార్చుకొనుటకు సంసిద్ధుడను.

భావరాజు వేంకటకృష్ణరావు

## విషయసూచిక


1 యుఁఆన్ చ్వాంగ్ ౧–౮౫

2 మార్కోపోలో ౮౬–౧౨౦

3 అబ్దుర్ రజాక్ ౧౨౧–౨౦౬

# యుఁఆన్ చ్వాంగ్

# యువాన్ చ్వాంగ్ వర్ణించిన ఆంధ్రదేశము

భరతఖండమును సందర్శించిపోయిన విదేశీయులలో యాత్రికులలోఁ జీనాదేశీయుఁడగు యువాన్-చ్వాంగ్ సుప్రసిద్ధుఁడు. భారతీయ ఇతిహాసికుల కితఁడు చిరస్మరణీయుఁడు. కీర్తనీయుఁడు. ఆతఁడు జన్మించుటఁజేసి చీనాదేశము ధన్యతనొందెను. ఆమహనీయుఁడు భరత వర్షమున కేతెంచి చిరకాలము దేశమందు సంచారము గావించి బౌద్ధవిద్య నభ్యసించుచు తా నేగిన దేశములందు చూచినదానిని, వినినదానిని, తెలుసుకొనినదానిని తన చక్రవర్తి కుల్లాసముకొఱకు గ్రంథస్థముచేసి యుండెను. అందువలన నాతని కాలము నాటి మన దేశపు వ్యవస్థలగూర్చియు, పరిస్థితులగూర్చియు దెలిసికొనుటకు అవకాశము గలుగుచున్నది. చీనాదేశమున నితఁడు కన్ ఫ్యూషీయస్ నకు తరువాత నింతటి ధర్మవేత్త లేడని పేరొందెను. బుద్ధుని తరువాత రాబోవు కల్పమునందు సుగతులగు బోధిసత్త్వులలో నొకడయ్యెనని ప్రసిద్ధికెక్కెను.

ఈతని కొందఱు హ్యూయెన్ త్స్యాంగనియు కొందఱు హౌనుత్స్యాంగనియు మరికొందఱు యువాన్ త్స్యాంగ్ అనియు, యుఆన్ చ్వాంగనియు వివిధములుగ బిలుచు

చున్నారు. ఈతని నామాక్షరముల వర్ణక్రమము, నుచ్చారణము ఏడవ శతాబ్దము నందుండినట్లుండక కాలానుగతముగ అక్షరముల పోలికవలెనే మారిపోయి వివిధములుగ వ్రాయబడుటయు నుచ్చరింపబడుటయు నందులకు గారణములు. జపానీయులీతని నామాక్షరములను వ్రాతలో హ్యువాన్‌ట్స్యాంగనియు నుచ్చారణయందు "గెంజో"యనియు వాడుచున్నారు. ఈపేరుచీనాభాషలో యుఆన్ త్స్యాంగునకుసరిపోవును. ప్రాచీనలిపిని పరిశోధించి యాతనినామమును స్ఫుటముచేసిన ఈకాలమున చీనాపండితులీయాత్రికుని నామము "యుఆన్ చ్వాంగ్"అని యుచ్చరింపవలయునని నిర్ణయించిరి. ఆయుచ్చారణ మంగీకరించుచు మేమీ వృత్తాంతమున వాడియున్నాము.

యుఆన్ చ్వాంగ్ యొక్క పవిత్రజీవిత చరిత్రము మనకు ప్రస్తుత మనవసరముగాదు. కావున ఆతనిజన్మ కాలాదులను గూర్చి మాత్రము సంగ్రహముగ దెల్పి యావల యాతని గ్రంథమును జదివిచూతము. పురాతన కాలమునుండియు గౌరవ ప్రతిష్టలు గలిగి ఋజువర్తనులనియు, ధార్మికులనియు బేరుగాంచి, చక్రవర్తికడ నూడిగమును వంశపారంపర్యముగ జేయుచు ప్రసిద్ధివడసిన 'చేన్' వంశమునందు యుఆన్ చ్వాంగ్ జనించెను. అతడు, పూతజన్ములయిన ఆతని తలితండ్రులకు బుట్టిన నలుగురి కొడుకులలో గడగొట్టువాడు. సోదరులతోపాటు తండ్రికడ, కులవిద్య నభ్యసించుచు, నితర గురువులను గూడ నాశ్రయించి క్రొత్త విద్యల

సంపాదించెను. చిన్ననాటనుండియు నితను, సూక్ష్మగ్రాహియనియు, ఈడుకు మించిన మేధావంతుడనియు బొగడ్త నొందెను. ఇతర బాలురవలె నాటపాటలయందును, వేడుకలందును మన కథానాయకు డభిరుచి గలిగియుండక, నెల్ల వేళల జ్ఞానదాయకములగు విషయములను గ్రహించుటకు తన కాలము నంతయు వినియోగించి కృషి సలుపుచుండెడి వాడు. చిన్ననాటను కన్ ఫ్యూషియను మతసంప్రదాయము నవలంబించి "మాతృ పితృభక్తి"ని గురించి, యామహాత్ముడు రచించిన మహాగ్రంథమును సూక్ష్మబుద్ధితో బఠించెను. తలితండ్రు లీతని కిడిన పేరు "చేన్ ఐ" అయియుండినను ఏమి కారణముననో చీనా సారస్వతమునందా పేరుతో ఈతడు బిలువబడుచుండుటలేదు. ఈతడు పితృ, పితామహులవలె మిక్కిలి పొడవైనవాడు. మంచి కాంతిగల దేహచ్ఛాయ గలవాడు. సుందరమైన రూపముగలవాడు. సోగలయి విశాలములయిన నేత్రములవాడు. చరిత్రకారులు యుఆన్ చ్వాంగ్ యొక్క వంశము, పురాణప్రసిద్ధమైన హుఆంగ్-టి గోత్రోద్భవమనియు, మహాచక్రవర్తి షూ-న్ యొక్క అన్వయమునుండి జనించినదనియు బల్కిరు. మరియు నీతని పూర్వులు, వంశకర్తలు, క్రీస్తునకు పూర్వము ఆరవ శతాబ్దమునాటికే ప్రఖ్యాతి వడసినట్లు చెప్పుదురు. క్రీ. శ. ౬౦౦ సంవత్సరమున చీనా దేశమున ఉత్తర ప్రాంతమున హోనను జిల్లాలోని కౌషి నగరమున

కనతి దూరముననున్న "చేఁ పావు కో" యను కుగ్రామమున నీమహానీయుఁడు జనన మొందెను. చిన్ననాటనుండియు బుద్ధుని యుపదేశములచే నాకర్షింపఁబడి యామతమును స్వీకరించి మతాభినివేశము కలిగియుండెను. ఇంతలో నీతని చిన్నన్నగారు బౌద్ధమతమునందు జేరి భిక్షుకుడై, ధర్మము నభ్యసింప నారంభించెను. ఆతని మార్గము మన చిన్నబాలునికూడ నాకర్షించి, యిరువది సంవత్సరములయిన నిండుటకు బూర్వమే సన్యాసమును స్వీకరింపజేసెను. అంతట నీతఁడు మౌంజియు గాషాయవస్త్రములను ధరించి కమండలమును గైకొని మండనము గావించుకొని భైక్షుకవృత్తిని గ్రహించెను. అది మొదలుగా జ్ఞానతృష్ణాతంత్రుఁడై యెనిమిది సంవత్సరము లనేకమంది గురువుల నాశ్రయించుచు మఠములందు ధర్మము నభ్యసించుచు చీనా దేశమునంతయు గ్రుమ్మరెను. కాని అంతటితో నీతని మనస్సు సంతృప్తి బొందియుండ లేదు. ఆతనికి పేరులుమాత్రమువిన్న గ్రంథములను సంపాదించి స్వయముగ నభ్యసింప కోర్కెపుట్టెను. అంత బుద్ధుఁడవతరించిన పవిత్రభూమిని, తథాగతుడు జీవయాత్రను గడపిన పుణ్యక్షేత్రములను సందర్శించి పరమపురుషార్థమును గ్రహింపవలెనని సంకల్పించుకొనెను. అట్లు సంకల్పించి యెవ్వరికిని దెలియకుండ రహస్యముగ సన్నద్ధుడై క్రీ.శ. ౬౨౯ వ సంవత్సరమున భాద్రపదమాసమున నొక నాటిరాత్రివేళ బయలుదేరెను. అప్పటి కాతనికి ౨౯ సంవత్సరములు వయసుండెను.

నాటగోలె పదునారు సంవత్సరము లాతఁడు విదేశములందు సంచారముచేసి క్రీ. శ. ౬౪౪ వ సంవత్సర చైత్రమాసమున స్వదేశము జేరెను. ఈతని కీర్తిని పాండిత్యమును మహిమను కర్ణాకర్ణిగ నప్పటికే వినియుండుటవలన చక్రవర్తి, యాతఁడు తన సెలవుగైకొనకుండ యరుగుటవలన జేసిన దప్పిదమును మన్నించి గౌరవించి సంభావించెను. చక్రవర్తి సకల సామంత నియోగప్రభృతులకును ఆతని యాగమనసమయమున మహోత్సవమును జరిపింపవలసినదని యాజ్ఞాపించెను. అతని పురప్రవేశసమయమున వీధులందు పచ్చని యాకుతోరణములు పుష్పగుచ్ఛములు వేలాడగట్టబడెను. ఎచ్చటఁ జూచినను రంగురంగుల పతాకముల ఎగురకట్టబడెను. పట్టణమంతయు శోభనదేవతకాశ్రయమువలె పెండ్లిపందిరి యట్లలంకరింపబడెను. వీధులందు, రథ్యలందు, పల్లెపట్టణ, గ్రామములనుండి యామహనీయుని యొకసారి సందర్శించి, జన్మపావనము గావించుకొనదలచి విచ్చేసినజనులుగుంపులుగుంపులుగ క్రిక్కిరిసియుండిరి. యుఁఆన్ చ్వాంగ్ పునరాగమనము ఒక తిరునాళ్ళయుత్సవమువలె గడచిపోయెను. చీనాదేశచారితమునం దెవడును, మరియొక బౌద్ధభిక్షువునకు ఇంతటి మహానందముతో, ఇంతటి మహోత్సవముతో నింతటి సంబరముతో, నింతటి యెదురు సన్నాహముతో వీడ్కోలీయబడుట, వినియుండలేదు. నాడు ప్రకృతికూడ, మనోహరమై గరవాసుల యుత్సాహమున కుత్తేజనమిచ్చునట్లు, మంద

హాసము చేయుచున్నట్లు, మనోజ్ఞమై యుండెను. పదునాకేండ్ల క్రిందట, స్వదేశమును విచారముతో విడిచి చనువేళ సెలవు గైకొనిన పేకవృక్షముగూడ నిపుడు ముసలిదయ్యెను, ప్రియస్నేహితుని యాగమమున కెదురుచూచుచున్నట్లు పశ్చిమదిశకు కొమ్మలన్నియు వాల్చెనట! ఆవృక్షమట్లు తలవాల్చుటయే యుఆన్ చ్వాంగ్ స్వదేశాభిముఖుడై వచ్చుచున్నట్లుసూచన యని యాతని వారనుకొనిరి. నిజముగా నాతని రాక చాల దినములవరకు జనుల కత్యాశ్చర్యకరముగ నుండెను.

అతడు చెప్పిన వింతవింత విషయములనుగూర్చి విసుగు విరామములేక చక్రవర్తి యడుగుచు శ్రద్ధాభక్తుడై యాలకించెను. తుద కావిషయలపై మోహము బట్టజాలక యాతని దన యాత్రలనుగూర్చి యొకగ్రంథము వ్రాసి తనకు సమర్పింపుమని ప్రార్థించెను. చక్రవర్తియాజ్ఞ నాదలవహించి యుఆన్ చ్వాంగ్ "సి-యూ-కి" అనుగ్రంథమునురచించెను.

అతడు స్వదేశమునకు తిరిగి వచ్చునపుడు ఆరువందల ఏబదియేడు బౌద్ధ ధర్మ, మంత్రశాస్త్ర, సూత్ర, వ్యాఖ్యాన గ్రంథములను, ఉష్ట్రములమీదను, ఇరువది అశ్వములమీదను వేసి తీసుకొని వచ్చెను. సువర్ణము, వెండి, మంచిగంధము మొదలగువానితో చేయబడిన బుద్ధుని ప్రతిమలను, బోధిసత్త్వులు, దేవతలు మొదలగువారియొక్క మనోహరమయిన విగ్రహము లనేకములను తీసుకొని వచ్చెను. అనేక చిత్తరవులను తీసుకొనివచ్చెను. వీని యన్నిటికంటెను, బుద్ధునియొక్క

అస్థికలను నూటయేబదింటిని భద్రముగ గొనివచ్చెను.

వీని నన్నిటిని జూచి చక్రవర్తి, యాతడు నివసింప దలచిన సంఘారామమునకు విశేషముగ ధన కనక వస్తు వాహనము లొసంగి హిందూదేశమునుండి గొనరాబడిన సంస్కృతగ్రంథములను, చీనాభాషలోనికి భాషాంతరీకరించుటకు పండితులను జీతము లిచ్చి నియోగించెను. యుఆన్ చ్వాంగ్ను, శేషించిన తన జీవితకాలమును బౌద్ధ ధర్మగ్రంథములను భాషాంతరముచేయుచు మహాయనబౌద్ధధర్మమును శిష్యుల కుపదేశించుచుఁ గాలము బుచ్చెను. అతఁడు క్రీ. శ. ౬౬౪ వ సంవత్సరమున ద్వితీయమాసమున, షష్టమ దివసమున, యీభౌతిక కాయమును విడచెను. తనకు రానున్న యీ పరిణామము నాతఁడు ఎరిగియుండి, తాను సంకల్పించిన పనిని పూర్తిగ నెరవేర్చెను. ఇపుడాతఁడు తుషిత స్వర్గమున నుండి మైత్రేయ బోధిసత్త్వుడు సుగతుఁడై వచ్చునందాక పరలోకమున వేచియున్నాడని చీనావారి విశ్వాసము. మరల తాను మైత్రేయునితో నీలోకమున నవతరింపగలనని యుఆన్ చ్వాంగును విశ్వసించియుండెను.

యుఆన్చ్వాంగ్ మతావేశముచే బౌద్ధుడైనను, స్వదేశాభిమానమును, స్వజాతీయ సంప్రదాయములను,త్రోసిపుచ్చలేదు. కన్ఫ్యూషియస్ యొక్క మతసంప్రదాయము లాతనిని ఎంత సన్యాసియైనను వదలవయ్యెను. పూర్వాశ్రమసంబంధు లయిన సోదరులయందును, తలిదండ్రులయందును ఆతడు

ప్రేమానురాగమును త్రెంపుకొనజాలడయ్యెను. అంతమాత్ర మున నీతని మతావేశమునకు ఏ లోపమును జూపింపజాలము. భరతవర్షము, అందలి మహాత్మ్యములు, పవిత్రక్షేత్రములు, భారతీయుల ప్రతిభ, అన్నియు నతనికి ఆశ్చర్యము, భక్తి, గౌరవమును కలిగించినను, స్వదేశముమీదను పైత్రానుగతమైన సంప్రదాయములమీదను అభిమానమును అణగిపోసియలేదు. అరువదియేండ్లు గడచిన ముదుసలియయ్యు, తన తలిదండ్రులను ఖననముచేసిన తావులందు గట్టబడిన సమాధులు, శిథిలము లయినవని తెలిసినపు డాతడు, చక్రవర్తిసెలవు గైకొని, తన పితృదేవతలకు, మంచిచోట శాశ్వతముగ నుండగల సమాధులను నిర్మించెను.

బౌద్ధసన్యాసియయి, సంఘమున కధిపతియై, మతము ననుసరించునపుడు యువాన్ చ్వాంగ్, ఆచార వ్యవహారము లందు, పట్టుదల, మూఢవిశ్వాసమును ఎక్కువగా జూపి యుండెను. తన పాలనమందున్న సన్యాసులు ఆచార నియమ ములు యథావిధిగ జరుపునట్లు శాసించుచుండెను. అయినను ఆతని మతములో విశాలహృదయము లేకపోలేదు. పరమత సహనమును లేకపోలేదు. ఆతడు తానుతలచినది యెట్టియాటం కములువాటిల్లినను నెరవేరవలయుననిదృఢనిశ్చయముగలవాడు. ఆకారణమున నాతడొకటి రెండుసార్లు మిత్రుడగు చక్ర వర్తితోసయితము, తగవుదెచ్చుకొనెను. ఆతడు సాహసుడు, ధైర్యశాలి, స్వాతంత్ర్యప్రియుడు. ఈప్రపంచమున నాతడెవ్వ

రికిని దాసుడనని యంగీకరింపలేదు. కాని మతవిషయమున మాత్రము, విచక్షణ లేకుండ, నేది యెవ్వరు చెప్పినను, మూఢవిశ్వాసముతో విశ్వసించుచుండెను. అందువలననే యాతని గ్రంథమునందు చారిత్రకజ్ఞానముగాని, వివేచనగాని, పరిశీలనగాని గాన్పించదు.

యుఆన్ చ్వాంగ్ రచించిన సీ-యూ-కి గ్రంథ మిపుడు మన వ్యాసరచనకు ముఖ్యాధారము. ఆ పదమునకు "పశ్చిమ దేశమునందలి బుద్ధునికి సంబంధించిన వృత్తాంతము "లని యర్థము. ఈ గ్రంథమును యుఆన్ చ్వాంగ్ చెప్పుచుండ, ఫీ-షీ యను పండితుడు వ్రాసియుండెనని కొందఱి యభిప్రాయము. మరి కొందఱు, ఆతఁడు మన యాత్రికుఁడు వ్రాసిన దానిని నచ్చటచట సంస్కరించి వ్యాఖ్యానము చేయుచు వచ్చెనని జెప్పుదురు. ఇందేది వాస్తమయినను, యుఆన్ చ్వాంగ్ వ్రాసినట్లు చెప్పెడి గ్రంథమునం దనేక పాఠాంతరము లున్నవి. అనేకములు తప్పులునున్నవి. ఈకాలమున చీనా సారస్వతమునందు సి-యూ-కీ అమూల్యమయినదిగా పరిగణింపఁబడుచు, పాశ్చాత్య ఖండపు భాషలన్నిటిలోనికిని భాషాంతరము చేయుబడియున్నది. ఈ గ్రంథమును బీలు పండితుఁ డాంగ్లభాషలోనికిఁ దెచ్చెను. ఆతని భాషాంతరీకరణమును, జూలియను పండితుని ఫరాంసు భాషాంతరీకరణమును, సంప్రదించి, వాటర్సు పండితుఁడు గ్రంథమునంతయు తిరిగి వాఖ్యతో వ్రాసెను.

యువాన్‌చ్వాంగ్, భరతవర్షమును, క్రీ. శ. ౬౨౯ సంవత్సరమున వర్షఋతువు గడచిన వెనుక ప్రవేశించి, యుత్తర హిందూస్థానము నంతట నే డెనిమిది సంవత్సరములు సంచారము చేసి, క్రీ. శ. ౬౩౭ వ సంవత్సరమును నాలందా సంఘారామమును జేరుకొని యించుమించుగా రెండు సంవత్సరముల కాలమచ్చట గడపి, మహాతత్త్వవేత్తయగు శీలభద్రునికడ అనేక శాస్త్రములను అభ్యసించెను. పిమ్మట బౌద్ధధర్మ గ్రంథములను, శాస్త్రములను అనేకములను సమకూర్చుకుని తామ్రలిప్తి నగరమున నోడనెక్కి, సింహళ ద్వీపముమీఁదుగా, చీనాదేశమునకు మరలిపోవ నిశ్చయించుకొనెను. ఈతఁడు, తామ్రలిప్తి నగరమును జేరునప్పటికి, నాశ్వీయుజమాస మగుటవలన, ఆమాసమున సముద్రయానము వర్జింపవలయునని వారింపబడి, దక్షిణాభిముఖుఁడై, ఆంధ్ర, మహాంధ్రదేశములందలి పుణ్యక్షేత్రముల గూర్చియు అమరావతీ ధాన్యకటకస్థూపములను గూర్చియు కంచినగరమును గూర్చియు వినియుండినందున వానిని కూడ సందర్శించి పోవలెనని సంకల్పించి, నాటుదారిని ప్రయాణము సాగించెను.

ఏమికారణముననో యువాన్ చ్వాంగ్ దక్షిణదేశముల గూర్చి ఉత్తర దేశములవలె, విపులముగను, సవిస్తరముగను వర్ణింపక, సంగ్రహముగా జెప్పుచుబోయినాడు. మరియు, ప్రమాదములయినవి పెక్కు విషయములను జొప్పించి

యున్నాడు. ఒక ప్రాంతమునుండి మరియొక ప్రాంతమునకు గల దూరమును కొంచెము హెచ్చుగనో, కొలదిగ తక్కువగనో, చెప్పుచు నాయా దేశముల నాతఁడు ఒకప్పుడు చూడకయె వర్ణించెనాయను సందియము వొడముసట్లుగా వర్ణించినాడు. యుఆన్చ్వాంగ్ తామ్రలిప్తి నగరమునుండి, కర్ణ సువర్ణ దేశమునకు జనియెను. ఇది దక్షిణవంగదేశములో నొకప్రాంతము: నేడు సింగభూమ్ అనియు, వీరభూమ్ అనియు పిలువబడుచున్న మండలము. ఆ దేశమునుండి మనయాత్రికు డోఢ్ర దేశమునకు జనియెను.

యుఆన్ చ్వాంగ్ ఓఢ్ర దేశమునుండి బయలు దేరి దక్షిణాభిముఖుఁడై ౧౨౦౦లీలు ప్రయాణముచేసి కుంగ్-యూ-టో అని బిలువబడు దేశమును ప్రవేశించెను. ఈ కుంగ్-యూ-టో యనుపేరు చీనీభాషా పండితులు సంస్కృతమునందు "కోన్యోఢ" యని భాషాంతరీకరణముచేసిరి. మన యాత్రికుని వర్ణనలబట్టి యీ దేశము చిల్క-సముద్ర ప్రాంతమునకును గంజాము మండలమునకును సరిపోవుచున్నదని కన్నింగ్హామ్ పెర్గసన్ పండితులు నిర్ణయించిరి.† ఫ్లీటుపండితు డీదేశమును బృహత్ సంహితయందు పేర్కొనబడిన "కుంద్య" లేక "హేమకుంద్యము" నకు సరిపోవుచున్నదని యభిప్రాయ పడుచున్నాడు.‡

† Ancient Geography of India, p, 513

‡ Dr. Fleet in Indian Antiquary Vol. XXii pp 171, 179.

"ఈ కొంగోడ్యము వేయి లీలు చుట్టుకొలత కలిగియున్నది. రాజధాని చుట్టుకొలత యిరువది లీలుండును. దేశమంతయు కొండలతో నిండియున్నది. సముద్ర మిచ్చట చేసువగా నుండి వలయాకారముగ లోనికి జొచ్చుకొనిపోయి నొక అఖాతము క్రింద నేర్పడియున్నది. ఈ ప్రాంత ముష్ణముగా నున్నను పంటలు చక్కగా ఫలించుచున్నవి. ఇచ్చట జనులు, పొడ వైనవారు, ధైర్యశాలులు, కొంచెము చామనచాయగల మేనివారు. స్వగౌరవమును, వివేచనయు నెఱిగి ప్రవర్తింతురు. మోసముచేయు టంతగా నెఱుగరు. వారి భాషాలిపి, యుత్తర హిందూస్థానమునం దుపయోగింప బడుదానివలె నున్నది. కాని భాషమాత్రము వేరొకటిగా గనుపించును. ఇచ్చటి జనులలో బౌద్ధులు గానరారు. దేవాలయములు నూరు వఱకును, తీర్థకుల (జైనులు) ఆలయములు పదివేలవఱకు నిచ్చ టగలవు. సముద్రతీరము నంటి, యీ దేశమున పది పట్టణము లుమాత్రమె కలవు. అవియన్నియు, ఏటవాలుగనున్న కొండల పైనిర్మింపబడి యున్నవి. ఇచ్చట జనులు నాణెములకు బదులు ముత్యములను, గవ్వలను వాడుదురు. దుర్గమమైన దేశ మగుటచేతను, సైన్యములు విశేషముగా నుండుట చేతను కొంగోడ్యము శత్రుభయ రహితముగా నున్నది."

ఏడవ శతాబ్దమునందీ ప్రాంతము, కళింగమునకు నాంధ్ర దేశమునకు నడుమ సరిహద్దుగా నుండినట్లు గాన బడుచున్నది. ఇక్కడనుండి, యుఆన్ చ్వాంగ్, కళింగమును

గూర్చిపయన మయ్యెను. ఈ కాలమున కళింగము యొక్క నిజస్వరూపమును నిరూపించుట దుస్తరము. క్రీస్తుశకారంభ కాలమున కళింగదేశ మాంధ్రసామ్రాజ్యములో జేరిపోయినది మొదలు కాళింగులు నాంధ్రులలో కలిసిపోయి, నామమాత్రమున కొక తెగవారు గానున్నట్లు గాన్పించెడిని.* కాళింగుల వేషభాషలు, నాగరకత మున్నగునవి యాంధ్రములో సమ్మేళన మైపోయెను. మరియు నేడవశబ్దాదిని, కళింగమును బరిపాలించుచుండిన రాజవంశములు గూడ వేంగీ దేశమునుండి, వలసబోయిన వారలుగా గన్పట్టుచున్నారు. మన యాత్రికుండీకళింగమును ప్రవేశించినది మొదలు, వ్రాసినదానిని బరీక్షించి యందలి వృత్తాంతములు ఎంతవరకు జరిత్రసిద్ధములో నరయుదము. ఈ కళింగముగూర్చి యుఆన్ చ్వాంగ్ యిట్లు వ్రాయుచున్నాడు.

“కుంగ్ యూ-టో (కొన్యోధ)- దేశమునుండి నైఋతి దిక్కుగా జనిన చెట్లు చామలు లేనియొక విశాలమయిన యెడారి వంటి ఱాతిభూమిని బ్రవేశింతుము. దానిని దాటిన వెనుక, సూర్య కిరణములను సయితము గప్పివేయునంతటి యున్నతములయి తల విరియబోసి కొన్నట్లుండు వృక్షములతో నిండి గాఢాంధకారమయిన మహారణ్యములను వనములను దాటి సుమారు

* కళింగము, వేంగిరాజ్యము, ఆంధ్రము దక్షిణ కోసలము మున్నగునవి మహాంధ్ర దేశములోని, వివిధ ప్రాంతములకు వచ్చియుండిన యాపాత నామములుగా గ్రహింపవలయును.

౧౮౦౦ లేక ౧౫౦౦లీలు ప్రయాణముచేయునప్పటికి, (క-లెంగ్క) కళింగదేశమును ప్రవేశించితిమి.

„ఈ కళింగదేశ మయిదువేల లీలు వైశాల్యము గలది. రాజధాని, పదిలీలు కైవారము గలది. భూమి సారవంతమై సస్యములతో నిండియున్నది. ఇచ్చట పుష్పములు ఫలములు విశేషముగ లభించును. వందలకొలది లీలవరకు వ్యాపించియున్న కారడవు లీదేశమునిండ గలవు. ఆయరణ్యములందు కారుమబ్బులబోలి, ఉన్నతములయి కొండలవలె నుండు మదపుటేనుగులు ద్రిమ్మరుచు నుండును. వాటిని బట్టుకొని కాళింగులు ఇతరరాష్ట్రములకు గొంపోయి, విశేషధనమునకు విక్రయించుచుందురు. ఈదేశ ముష్ణప్రదేశము, ప్రజలు కొంచము కోపస్వభావులు, ఆవేశపూరితులు. మోటువారుగను, అనాగరకులుగను గన్పట్టినను, కాళింగులు, విశ్వాసపాత్రులు, ఋజుమార్గవర్తులును మాటదప్పనివారుగా నున్నారు. వారు వడిగా మాట్లాడుదురు. వారిమాటలు తేలికగావచ్చుచున్నట్లుండును. కాని యుచ్చారణ చాల స్పష్టముగను నిర్దుష్టముగను నుండును. ఆచార వ్యవహారము లందును, వేషభాషలందును, కాళింగులకును, మధ్యదేశము వారికిని భేదముకలదు. ఈ దేశమున జాలమంది బౌద్ధులును, బ్రాహ్మణులును గలగు. ఇచ్చట పది సంఘారామము (బౌద్ధమఠములు) లున్నవి. వాటియందు స్థవీరసంప్రదాయమునకు జెందినట్టి, మహాయన శాఖాసంబంధులగు ఏనూఱుమంది భిక్షువులు నివసించుచున్నారు. ఈ దేశ

మున నూరు దేవాలయములవఱకును గలవు. ఈదేవాలయములందు బ్రాహ్మణులుగాక ఇతర మతస్థులను బూజ లర్పించుచుందురు. ఇచట బ్రాహ్మణులును బౌద్ధులును గాక నిర్గ్రంథులనిబరగు దిగంబర జైనులుగూడ బెక్కుమంది గలరు.

“కళింగము పూర్వకాలమున మిక్కిలి జన సమృద్ధమై యుండెను. అపుడొకరి భుజములతో నొకరి భుజములు వీధులందు ఒరసికొనుచుండెను. రాజబాటలందు రథ చక్రముల యిరుసు లొండొంటితో సందు లేమి డీకొనుచుండెను. జనులందరు తమ యుత్తరీయములను బైకెత్తి పట్టుకొనినచో, సూర్యుని వెలుతురును గప్పివేయుటకు గుడారమగుచుండెను. జన సంకీర్ణమయియుండిన ఇట్టి దేశము ఒకానొకప్పు డొకతాపసి శాపముచే నంతయు నిర్జనభూమి గావింపబడియెను. ఆకథను జనులిట్లు చెప్పుకొందురు. ఒకప్పు డీ దేశమునం దొక కొండ చివర నొక ఋషి తపము చేసుకొనుచుండగా, మూఢాత్ముఁడైన కాళింగుడొకడు ఆమహాత్మునికపచారము గావించెను. ఆ మహాత్ముడంతట కోపించి, కళింగమును నిర్జనమగునట్లు కోపించి యెటకో జనియెను. ఆశాపమహిమచే నతిశీఘ్రకాలమున జను లెల్లరు దుర్మరణమువాత బడిరి. పిమ్మట కొంతకాల మయినతరువాత, నితర ప్రాంతముల నుండి జనులు కళింగమునకు వలసవచ్చి నివసింపసాగిరి. అది మొదలుగా దేశమిట్లు స్వల్పజన సంవాసితమైన యున్నది.

“రాజధానికి సమీపమున దక్షిణముగా నూరడుగుల

యెత్తుగల స్తూపమొకటి గలదు. దానిచుట్టు నొక యశోకవన మున్నది. పూర్వమిచ్చట కొంతకాలము నలుగురు బుద్ధులు తమ నిర్వాణమునకుఁ బూర్వము నివసించి నట్లు చిహ్నములు గాన్పించుచున్నవి. ఈ రాజ్యమున కుత్తరప్రాంతమున నొక యున్నత పర్వత శిఖరము గలదు. ఆ శిఖరముపై సుమారు నూరడుగుల యెత్తుగల స్తూపమింకొకటి గలదు. ఇచ్చట, మొదటి కల్పమునందుఁ జనులు చాలకాలము జీవించి యుండినకాలమున, ప్రత్యేక బుద్ధుఁడొకఁడు నివసించుచు నిర్వాణమును బొందెను."

బౌద్ధధర్మ గ్రంథములందు కళింగము చాల పవిత్రమైన దేశమని చెప్పఁబడుచున్నది. ఈ దేశమున నివసించి నిర్వాణమును బడయవచ్చునని పూర్వము తథాగతుఁడు వచించెను. యువాన్ చ్వాంగ్ కళింగమును "క-లింగ్ క" యని బిలిచియున్నాఁడు. ఆతని కొలత ప్రకారము ఐదులీలొక మైలగును. కళింగదేశ మట్లయిన యాకాలమున వేయిమైళ్ళ వి స్తీర్ణత కలిగియుండెనని నిర్ణయింపవలయును. యువాన్ చ్వాంగ్ కళింగ రాజధానియందు కొంతకాలము నివసించి యుండినట్లు తోఁచుచున్నది. కాని యానగర నామము నతఁడు దెలుపకున్నాఁడు. మనకు దెలిసిన చరిత్రాంశముల బట్టి కళింగదేశపు రాజధాని ఏడవశతాబ్దాదిని ముఖలింగనగరమని నిశ్చయింపవచ్చును. నేఁడు ముఖలింగమనియు నగరకటకమనియు బరగుచున్న కుగ్రామములు రెండును గలిసి

యీకాలమున కళింగరాజధాని యగు కళింగ నగరమని బిలువబడుచుండెను. కళింగదేశ నామము పూర్వ యుగములందు గంగానదీతీరముననున్న మిథిలా దేశము మొదలుకొని గోదావరి వఱకు గలదేశమున కెట్లుపయోగింపబడుచు వచ్చెనో, యట్లే యీ దేశపు రాజధానియు పాలించిన రాజవంశముల బట్టి యనేక తావులందు నిరూపింపఁబడుచున్నది. బుద్ధునికి బూర్వము కళింగమునకు దంతిపురము రాజధానిగా నుండెనట. ఈదంతిపురమే రాజమహేంద్రవరమని కన్నింగ్ హ్యామ్‌గారియభిప్రాయము †; కాని యిదితృప్తి కరముగ లేదు. గోదావరిమీదనున్న రాజమహేంద్రవర మాదిగా నగరములెన్నియో కళింగరాజధానులుగ ప్రాచీనకాలమునుండి ప్రసిద్ధికెక్కెను. కాని మన యాత్రికుని కాలమున గంజామమండలములోని శ్రీకాకుళముతాలూకాలోని కళింగపట్టణము, సింహపురము,కళింగనగరములలో నేదోయొకటి రాజధానియై యుండవలయును. ఈ నగరములన్నియు వరుసగా వంశధారనదిమీద మొదట ముఖలింగనగరము తరువాత సింహపురము చివర కళింగపట్టణము నున్నవి. రాజధాని కళింగనగరము. రేవు వంశధార ముఖద్వారముననున్న కళింగపట్టణము. కడపటిదే దంతిపురము కావచ్చును. ఈ నగరములన్నిటి, యందునుపురాతనబౌద్ధచిహ్నములు,మఠములు మొదలగునవి

† Ancient Geography of India p. 516,

గాన్పించుచున్నవి. ఏడవశతాబ్దమునకు బూర్వము కళింగము కొంతకాలము పల్లవరాజుల పరిపాలనము క్రింద నుండెను *. ఆకాలమున పిష్ఠపురమో యలమంచిలియో నరసన్నపేట సమీపముననున్న సింహపురమో, రాజధానియై యుండవలయును. ఈపల్లరాజులలో సింహపురశాసనమందు నంద ప్రభంజనవర్మ చండవర్మ, ఉమవర్మ యను మువ్వుర రాజులపేరు లుదాహరింపబడి గానవచ్చుచున్నవి ¶. వీరిలో నెవ్వరుముందో యెవ్వరుతరువాతనో తెలియరాదు. కాని వీరందఱకును సింహపురము రాజధానిగా నుండిన మాట నిశ్చయము. క్రీ.శ. ౫,౬ శతాబ్దములందు కళింగరాజులకును వేంగీరాజులయిన విష్ణుకుండినులకును బద్ధవైరముగా నుండెను. దక్షిణకోసలము నేలు వాకాటకరాజులు, విష్ణుకుండినులకు దగ్గర బంధువులగుటచేత నుభయులును కళింగరాజ్యమునకు చాలబాధాకరులుగా నుండి ఇరుప్రక్కలనుండి తొందరలుగలుగజేయుచుండిరి. ఈకారణమున సర్వదాయుద్ధములలోమునిగి తేలుచుండుటవలన యుఆన్ చ్వాంగ్ నకు దేశము జనసమ్మర్దముగా గన్పట్టియుండక పోవుటలో నాశ్చర్యమేమి? ఏడవశతాబ్దమందు కళింగరాజ్యమున గాంగపల్లవ వంశమొకటి తలయెత్తి విజృంభించి కళింగనరమును (ముఖలింగము) రాజధాని

* Ancient History the Dekhan by G. J. Dubreuil p 93-94.

¶ పూర్వోక్త ప్రమాణము.

గా జేసికొని కళింగరాజ్యము నంతయు తనపాలనము క్రిందకు దెచ్చియుండెను. ఇయ్యది యుఁఆర్ చ్వాంగ్ రాకకు కొంచెము ముందుగనో వెనుకగనో జరిగియుండెను. అందువలన యుఁఆర్ చ్వాంగ్ చూచిన రాజధానిని నిర్ణయింప సాధ్యముగాదు. ఈ కారణమును బట్టియు కూడ నాతడు వర్ణించిన స్తూపమును గూడ గనిపెట్ట జాలము. కాని మన యాత్రికుఁడు సందర్శించిన కళింగరాజధాని సింహపురమని గాని కళింగనగరమని గాని నిర్ణయించినచో అచ్చటకనతిదూరమున గల సాలెహాుండాముసందలి స్తూపమే పూర్వము నలుగురు బుద్ధులు నివసించినచోటని నిర్ణయింపవచ్చును. కాదేని, కళింగనగరములోని భాగమగుచు, మధుకేశ్వరడను నామాంతరము గల ముఖలింగేశ్వరుని దేవాలయమున్నవాడలో, బౌద్ధస్తూపముండినట్లు చిహ్నములు నేటికిని గానవచుచున్నవి; కావున ముఖలింగనగరమె స్తూపముండిన స్థలము గావచ్చును. ఇక కళింగమున కుత్తర ప్రాంతమున ప్రసిద్ధికెక్కిన పర్వతశిఖరము మహేంద్రగిరి. పరశురాముడిచ్చట తపమును, యజ్ఞమును చేసెనని పురాణాదులు వాకొనుచున్నవి. మరియుబౌద్ధధర్మ గ్రంధములందుగూడ మహేంద్రగిరి చాలప్రఖ్యాతి గాంచియుండెను. గావున మన యాత్రికుడు పేర్కొన్న దీ నగమేయని యూహింప వచ్చును.

కళింగరాజ్యము నుండి యుఁఆన్ చ్వాంగ్ వాయువ్యదిశాభిముఖుఁడై అడవులగుండను పర్వతకనుమల గుండను

ఇంచుమించుగా ౧౮౦౦లీలు (౩౬౦ మైళ్ళు) ప్రయాసముతో పయనము సలిపి దక్షిణకోసలమును ప్రవేశించెను. కోసల దేశమందు తాను జూచినదానిని వినిన దానిని యాతఁడిట్లు వర్ణించియున్నాడు.

“కోసలమూరు వేలలీలు (౧౨౦౦ మైళ్ళు) వైశాల్యము గలది. దేశముచుట్టును ఎడతెగని పర్వతపంక్తులు మహారణ్యములు దట్టముగా నలుముకొని వ్యాపించి యున్నవి. కోసల రాజధాని నలుబదిలీలు (౮ మైళ్ళు) వైశాల్యముగలది. ఇచ్చటి భూమి చాల సారవంతమై యుండుటవలన పంటలు విశేషముగా బండుచున్నవి. దేశమునిండ పట్టణములు పల్లెలు విశేషముగా నొకదానికొకటి సమీపముగా గలవు. దేశము మిక్కిలి జనసమర్దమై యున్నది. ఇచ్చటి ప్రజలు మిక్కిలి బలిష్ఠులు, దీర్ఘకాయులు. చామనచాయ గలవారు. మోటుగా గాన్పించెదరు. మఱియు కాళింగులవలెనే కొంచము కోప స్వభావము గలవారు. కాని మంచి ధైర్యవంతులును, సాహసముగల వారుగా నున్నారు. ఈ దేశమున బౌద్ధమతస్తులును బ్రాహ్మణులును గూడ నున్నారు. ప్రజలు చాల తెలివిగలిగి విద్యాగోష్ఠియందును, తత్త్వవిచారణయందును మంచి యభిరుచియు ప్రజ్ఞయు జూపుచున్నారు. ఈ దేశపురాజు క్షత్రియ వంశజుఁడు. ఆతనికి బుద్ధదేవుని యుపదేశములందభిమానము, గౌరవమును మెండు. ఆతని దయయు ధార్మికత్వము నితరదేశములందు నయితము కీర్తింపఁబడు చున్నవి. కోసలదేశమున

సుమా రొక నూరు సంఘారామము లున్నవి. అందు దాదాపుగా పదివేలమంది భిక్షువు లున్నారు. వీరందఱును మహాయనశాఖా సంబంధులే. మరియు నీదేశమున డెబ్బది బ్రాహ్మణ దేవాలయములు గూడ నున్నవి. బౌద్ధులుగాక నిక్కడి జనులలో చాలమంది బ్రాహ్మణులును జైనులుగూడ నున్నారు.

"కోసలరాజధానికి దక్షిణపుదిక్కున అనతి దూరమున అశోకవనమును అందొక స్తూపమునుగలవు. పూర్వకాలమున నిచ్చట, తథాగతుఁడు ధర్మసభను సమకూర్చి తన ప్రజ్ఞాతిశయములచే చాలమంది బ్రాహ్మణులను బౌద్ధులను జేసియుండెను. తరువాతి కాలమున బోధిసత్త్వుఁడగు నాగార్జునుఁడీ సంఘారామమున జాలకాలము నివసించెను. అప్పుడీదేశము నేలుచుండిన రాజుపేరు సాద్వహుఁడు. ఆతఁడు నాగార్జునుని విశేషముగ నాదరించి గౌరవించెను.

"సింహళద్వీపమునుండి యొకప్పుడొక బోధిసత్త్వుఁడు దేవుఁడనువాడు, నాగార్జునుని ప్రజ్ఞావిశేషములను విని, యాతనితో వాదింప నిచ్ఛగొని బయలుదేరి వచ్చి నాగార్జునబోధిసత్త్వునికి తన రాక నెఱిగింపుమని కావలివానిని కోరెను. ద్వారపాలకు డంతట లోనికరిగి దేవుని రాక దెల్పెను. నాగార్జునుఁ డంతకు బూర్వము దేవబోధి సత్త్వుని పాండిత్యమును, మహిమాతిశయమును వినియుండినవాఁ డగుటచే, తత్క్షణమె శిష్యు నొకని బిలచి యొక పాత్రయందు నీరు

నింపి, దానిని దేవుని కడ కట్లై గొంపోవ వలసినదని యాజ్ఞాపించెను. దేవ బోధిసత్త్వుడా జలపూరిత పాత్ర నవలోకించి మాటాడక మెల్లగా సూదినొకదానిని అందు జారవిడచి యూరకుండెను. అది చూచి, శిష్యు డేమియు దోచక నిశ్చేష్టుడై యుండి, పిమ్మట నే సమాధానమును గానలేక, నాగార్జునుకడ కాపాత్రను తిరిగి పట్టుకొని వచ్చి, జరిగిన దంతయు విన్నవించెను. నాగార్జునుఁ డపుడు “ఆహా! ఏ మాతని ప్రజ్ఞావిశేషము! ఇట్టి మహనీయుని నే నెపుడును గాంచియుండలేదు. మానవుల హృదయమును దెలిసికొనగల సమర్థుడు ఒక్కఁడీశ్వరుఁడేగదా. అయినను మానవ హృదయాంతరాళము నుండి యుద్భవించు సూక్ష్మవిషయములను సయితము గ్రహింపగల సమర్థు డీతఁడు తప్పక మహానుభావుఁడును, జ్ఞానియు గావలయును. కావున సత్వరమాతనిఁ లోనికి ప్రవేశ పెట్టుము.” యని యానతిచ్చెను. శిష్యుఁడా మాటలను విని “ఆచార్యా! ఏమి చోద్యమిది! మూగివానివలె మాటలాడ కూరకుండువాఁడు సర్వజ్ఞు డగునా!” అని ఆశ్చర్యముతో నడిగెను. అంతసర్వజ్ఞు డపుడు “వత్సా! యిటు వినుము. జలపూరితమయిన యీ పాత్ర సంపూర్ణమయిన నాజ్ఞానమును సూచించుచున్నది. పాత్రయందు ప్రతి సందు సందులోను ఈ జల మెట్లు వ్యాపింపగలిగియున్నదో, అట్లె నాజ్ఞానముగూడ, విశ్వమంతయు వ్యాపించియున్నది. ఈ జలమెట్లు పరిశుభ్రమైనది గావచ్చునో అట్లు నాజ్ఞానమును

పరిశుద్ధమైనది గావచ్చును. కాని యీ జలమందు దేవుఁడు సూదిని జారవిడచుటచేసి, నా బ్రహ్మజ్ఞానమును అతఁడు ఛేదించినాడని యర్థము. కావున వేగ మాతనికడ కేగి, లోనఁ బ్రవేశపెట్టుము." అని పల్కెను.

"నాగార్జునుని, రూపము, దృష్టియు, మనసును మిక్కిలి గంభీరమైనవి. చూపరుల కాతఁడు భయము నాశ్చర్యమును గొలుపుచుండును. ఆతని ప్రజ్ఞయు, పాండిత్యముకూడ నట్టివే. ఆతనితో వాదింపదలచి వచ్చినవా రాతని వాగ్ధాటికి నిల్వజాలక తమ యజ్ఞానమును వెల్లడించి శిష్యత్వము నంగీకరింతురు. దేవ బోధిసత్త్వుఁ డీ మహనీయుని ప్రజ్ఞా విశేషములను వినియుండినవా డగుటవలన నాతనితో వాదించి, తన సందియములను బాపుకొన దలంచి వచ్చియుండెను. ఇపు డాతఁడు నాగార్జునుని సమీపింపబోవు వేళ మిక్కిలిభీతచిత్తుఁడై తొట్రుపాటుతో నడువ నారంభించెను. అట్లు, సోపానముల నెక్కి మొగసాలలు కడచి ప్రాంగణము దాటి సభా మంటపమును భయ, వినయ, గౌరవ, సంభ్రమములు వెంట నంటి రాఁ బ్రవేశించెను. నాగార్జునునితో వాద మారంభించునప్పుడు కొంత భయకంపితుఁ డయ్యెను. కాని సాయంకాల మగునసరికి, గంభీరముగ తన వాదము నుపన్యసింప సాగెను. అంతట నాగార్జును డాతని వాదములను విని సంతుష్టాంతరంగుఁడై, "దేవా! నీ జ్ఞానమును, పాండిత్యము నపారమైనవి. నీ యనుభవము ప్రపంచాతీతము.

ఈ భువిని నిను బోలినవారు కడచినవారిలో గాని, యిపు డున్న వారిలో గాని, నా కెక్కడను గాన్పించుటలేదు. నే నిపుడు ముదుసలినై దేహబలము తగ్గినవాడ నగుచున్నాను. ఇపు డిక నీవంటి విద్వాంసుని గాంచగలుగుటచే, నా జ్ఞాన జలమును, నిలువ జేసికొనుటకు నీయందు తగిన పాత్రను లభించినవాడ నగుచున్నాను. నాజ్ఞాన జ్యోతిని చల్లారి పోకుండ నాయనంతరముకూడ సంపూర్ణ తేజముతో వెలి గింప గల మహనీయుని గాంచగల్గితిని. నిజముగా నీవే నావెనుక, నీ ధర్మాధ్యక్ష పీఠము నధిష్ఠించి, పరిశుద్ధ మైనదియు, నుత్కృష్టమైనదియు నగు 'ధర్మమును' ప్రతిపా దించి వ్యాపింప జేయగల సమర్థుడవు. కావున నాకడ గూడ కొన్ని ధర్మ రహస్యములను గ్రహింతువుగాక, రమ్మా!" అని బల్కెను.

"దేవుం డీమాటలు విని సంతుష్టాంతరంగుడై అహం కారముతో తానే సర్వజ్ఞుండని గర్వించెను. అంతటనుంచి తన తార్కికత్వమును, పాండిత్యమును దేటపడ అలంకారము లతో, శబ్దాడంబర వాక్యములతో సంభాషింప నారంభించెను. బోధిసత్త్వుండు తన వాగ్ధోరణిని మెచ్చుకొనుచుండెనేమో యని సంతోషించుచు, నొకసారి నాగార్జునివంక చూచెను. కాని యాతని ముఖమున నొక విధమయిన అసంతృప్తియు నాగ్రహమును వ్యక్తమగుచుండుట గాంచి, భయకంపితుం డయ్యెను. వికలచిత్తు డగుటచే మాటలు తడబడ

నారంభించెను. మరికొంతసేపటికి నోరారిపోయి మాటలాడ లేకపోయెను. పిమ్మట ఆసనమునుండి లేచి వినమ్రుడై, చేతులు జోడించి, తన యజ్ఞానమును క్షమించి శిష్యునిగా పరిగ్రహింపవలసినదని ప్రార్థించెను. దేవుని సంభ్రమమును గాంచి నాగార్జును డప్పుడు "దేవా! ఆసీనుఁడవు గమ్ము! భయ వర్జితుడవు గమ్ము. ఇపుడే నీకు నేను బుద్ధుని ధర్మములందలి రహస్యముల నుపదేశింతును." అని శాంతముతో బల్కెను. దేవు డంతట నాగార్జుని ముంగల సాష్టాంగముగ బ్రణమిల్లి హృదయ పూర్వకముగ "నేటి మొదలు యీ యజ్ఞానుని శిష్యునిగా బరిగ్రహించి యనుగ్రహింప వేడెదను." అని ప్రార్థించెను. నాగార్జును డతని యెడ జాలిగొని శిష్యునిగా బరిగ్రహించెను.

"మూలికలచే నౌషధులను తయారుచేయుటయందు నాగార్జునుఁ డద్వితీయుఁడు. మూలికల రహస్యము నాతఁ డెఱింగినట్లు యితరు లెఱుగరు. ఆతఁడొక ఔషధమును సేవించి బుద్ధిబలమును దేహదార్ఢ్యమును చెడకుండ, రూపు మారిపోకుండ చిరకాలము జీవింపగల్గెను. అతని జీవితకాలము కొన్ని శతాబ్దములని జెప్పెదరు. రాజు సాద్వహుఁడు నీయౌషధమును సేవించి నాగార్జునునివలె చిరకాలము జీవింప గల్గెను. నాగార్జును డంత ప్రజ్ఞావంతుడయ్యును, తనంతట తానె, ప్రాణత్యాగము గావించుకొనెను. నాగార్జునుని జీవితముతో సాద్వహుని ఆయువును అంతమొందు. విధి బలమై

యుండినందున నిరువురు నొక్క కాలమున మరణించిరి. సాద్వహుని చావును,నాగార్జునుని చావును,ఇట్లు తటస్థించెనని చెప్పుదురు.

సాద్వహునకు, కడగొట్టువాడొకడు చిన్నకుమారుడుండెను. ఆతఁడు తానెప్పుడు సింహాసన మధిష్ఠించి రాజ్యమును బాలింతునా యని సర్వదా చింతా నిమగ్నుడై యుండెను. ఆతడొకసారి తల్లిని జేరబోయి "అమ్మా! నే నెపుడు సింహాసనమెక్కి రాజ్యముచేయుదును?" అని యడిగెను. అందుల కారాణి విచారముతో! "కుమారా! ఈ జన్మమున నీవు సింహాసనమున గూర్చుండి రాజ్యాభిషిక్తుఁడవయ్యెదవని నాకు తోచదు. నీ జనకుఁ డిప్పటికి కొన్ని వందల సంవత్సరములు జీవించియున్నాడు. అతని ముంగిట నెందరో పుత్రులు, పౌత్రులుఁ, పెద్ద కాలము జీవించి, మరణించిరి. ఇది యంతయు నాగార్జునుని శక్తి ప్రభావము. ఏక్షణమున నాబోధిసత్త్వుడు మడియునో, యాయుత్తర క్షణమున నీ తండ్రియు దేహయాత్ర జాలింపగలడు. ఈనాగార్జునుని ప్రజ్ఞాబుద్ధులును జ్ఞానమును అపారములు. ఆతని ప్రేమయు దయయు నగాధములు. ప్రపంచమందలి జీవులకై యాతఁడు, తన దేహమును, ప్రాణమును సమర్పింప వ్రతము బూనియున్నాడు. కావున నీవరిగి యాతని సందర్శింపుము. ఆతడు నీకేమి కావలయునని యడిగిన నీ శరీరమిమ్మని కోరుము. నీవిది యొనర్చిన నీయభీష్టము సిద్ధించును." అని

హితోపదేశ మొనర్చెను.

"జనని యుపదేశ వాక్యముల నాలకించి యారాజ సుతుడు సత్వరము నాగార్జునుడు నివసించు చుండిన మఠమునకు వచ్చెను. అతని రాకఁ గాంచి, ద్వారపాలకుఁడు భయపడి పలాయనుఁ డయ్యెను. రాజ కుమారుడునులోనికి బరుగెత్తెను. నాగార్జునుఁ డాసమయమున పడసాలలో పచారు చేయుచు, మంత్రములను పునశ్చరణ గావించుచుండెను. ఏదియుగాని సమయమున రాజకుమారు డట్లు భిక్షు వాటిక జొచ్చుటగాంచి, ఆశ్చర్యము నొంది యాతఁడు, "కుమారా! ఈ సాయంతనపు వేళ నింత తొందరగా, భిక్షువులు నివసించు మఠమునం జొచ్చుటకు గతం బేమి? నీ కేమైన విపత్తు వాటిల్లెనా? కాక నేడేనయిన కారణాంతరమున శరణార్థివై వచ్చితివా?" యని యాతురతతో నడిగెను.

ఆప్రశ్నకు, రాజకుమారుడు మెల్లగా "మహానుభావా! వినుడు. ఇంతకుఁ బూర్వము నా జననితో శాస్త్రార్థములు చింతన చేయుచు, ప్రపంచముతో సంబంధము వీడిన సన్యాసుల గూర్చి నే నిట్లంటిని. "అమ్మా! ప్రపంచమందలి జీవరాసులకు ప్రాణముపై నాస మెందుగదా! అట్టి యెడ త్యాగము నుద్ఘోషించు ధర్మశాస్త్రములు, ఇతర జీవులు వాంఛింపునపుడు, ప్రాణత్యాగము నేయుట త్యాగమని యా సన్యాసుల కెందులకు విధించియుండలేదు?" అపుడు నామాటలకు, నాజనని 'కుమారా! అట్లు గాదు. దశ

భూమికలయందలి సుగతులను, మూఁడుకల్పము లందలి తథాగతులును పరమపురుషార్థమును బడయఁగోరి జీవయాత్రను ఈ లోకమున గడపుచు, నిర్వాణమును బొందిరి. వారెల్లరు బుద్ధుని మార్గమును శ్రద్ధతో ననుసరించిరి. ఆతని ధర్మోపదేశములను గ్రహించి శాంతచిత్తముతో నాచరింపుచు వచ్చిరి. వారు ధర్మరక్షణార్థము, తమ దేహములను వన్యమృగముల యాహారము కొరకు నర్పించిరి. పావురమును రక్షించుటకై ఒకడు తన దేహములను కోసి యిచ్చెను. పూర్వము చంద్రప్రభుఁడను రాజొక బ్రాహ్మణునికొరకు తన శిరమును కోసి యిచ్చెను. చేది రాజగు మైత్రిబాలుఁ డొక యక్షుని యాకలిబాధ తీర్చుటకు తన రక్తములఁ ద్రావ నిచ్చెను. ఇంకను యిట్టివా రెందరో ప్రతి యుగమందును గలరు. వారందరును మహనీయులు. మన నాగార్జునుఁడు నట్టివాడే. ఆతఁ డుత్కృష్ట ధర్మములనవలంబించుచున్నాడు." అని చెప్పెను. కావున నో బోధిసత్త్వుఁడా! 'నాకై' తన ప్రాణము నర్పింపగల మహనీయునికై యింత కాలము నుండి నేను అన్వేషించుచున్నాను; కాని యొక్కనిగూడ గాంచలేనైతిని. బలాత్కారముగ నెవ్వనినైన వధించినచో నా హత్యవలన సంభవించు మహాపాపము నన్ను చుట్టుకొనును. ఆ దుష్కార్యమువలన గలుగుదుఃఖ మపారము. భరింప నలవికానిది. అజ్ఞానుఁడగు బాలుని వధించుటకును నా మనసు వప్పుకొనదు. అది నా కీర్తిని పాడుచేయును.

ఇక నీవు బోధిసత్త్వుడవు, ప్రతి దినమును బుద్ధు డుప దేశించిన ధర్మమార్గము నవలంబించుచు నిర్వాణమును బొందదలచి యున్నాడవు. బోధిసత్త్వునికి సమస్త జీవరాసుల యందును ప్రేమ యొక్కరీతిగా వ్యాపించియున్నది. ఆతని దయకు మేరలేదు. ఆతనికి ప్రాణము బుద్బుదప్రాయము, కాయముదారుకవలె క్షణికము, కావున బోధిసత్త్వుడవైన నీ వేల నాయభీష్టమును నెఱవేర్పకుందువు? అట్లు చేయక నీవేల నీజీవితమందలి పరమపురుషార్థమును చెడగొట్టుకొందువు? అని యుపన్యసించెను.

"నాగార్జును డట్లు రాజకుమారుని మాటల నాల కించి "రాజకుమారా! నీవు బల్కినదంతయు సత్యము. నీవన్నయట్లు, నేను బుద్ధుడనగుటకు ప్రయత్నించుచున్నాను. బుద్ధుడగువాడు సర్వము త్యజింప సమర్థుడని నే నెఱుంగు దును. ఆతడు తన దేహము ప్రతిధ్వనివలె క్షణికమైన దనియు, అండజ జరాయుజ స్వేదజ, ఉద్భిజరూపమున, జీవుడు నరక, మృగ, ప్రేత, అసుర, నర, దేవతాకృతిని జన్మించుచు చచ్చుచుండుననియు నాత డెఱుంగును. జీవుల యొక్క కోర్కెల నడ్డగింపకుండుటయే నాప్రతిజ్ఞ, కాని రాజకుమారా! నీకోర్కె చెల్లించుట యందొక, ప్రమాదము కలదు. నే నెప్పుడు ప్రాణము విడుతునో, అప్పుడే నీతండ్రి, రాజును మరణించును. కావున బాగుగా యోచించుకొనుము. నాయనంతరము నీతండ్రిని బ్రతికింపగలవా రెవ్వరు నుండరు."

అని బల్కెను. రాకుమారుడామాటలను విననట్లు, మౌనము దాల్చియుండెను. అంత నాగార్జునుడు నిర్మలచిత్తముతో ప్రాణత్యాగము చేయనుద్దేశించి, యొక యాయుధము కొఱకు అటు నిటు దిరిగి చూచి యేమియు గానక, తుదకొక శుష్కించినయొక తృణమును దీసికొని సునాయాసముగ శిరచ్ఛేదము గావించుకొని యుసురులు విడచెను.

"రాజకుమారుడా ఘోర కృత్యమును జూచి యతి సత్వరముగ నంతఃపురము వైపు బరుగెత్తెను. ఇంతలో నాగార్జునుని విహారమున జరిగిన వృత్తాంతము నంతయు, నవలోకించిన ద్వారపాలకుడు సవిస్తరముగా రాజున కెరిగించెను. అత్తరి రాజును దుఃఖము నాపుకొనలేక వ్యాకులచిత్తుఁడై యుత్తర క్షణమందు ప్రాణములు విడచెను.

"కోసలదేశమునుండి నైరృతి దిక్కుగా ౩౦౦ లీల (౬౦ మైళ్ళు) దూరముననున్న (పోలో మోలో కీలీ) భ్రమర గిరి శిఖరమును జేరబోయితిమి. ఏకాంతప్రదేశమున నున్న యాపర్వతము, తక్కిన వానికంటె యున్నతముగ నుండి, నడుమ నడుమ కనుమలు లేక నొక్కటే ఱాయితో గూడుకొని మిక్కిలి యేటవాలుగనుండు గట్లు గలిగియున్నది. నాగార్జున బోధిసత్త్వని కొఱకు సాద్వహ మహారాజు నీపర్వతమునందు, నడుమువరకు సొరంగమును త్రవ్వించి మార్గమును జేసెను. ఆసొరంగము చివర నసగా, కొండనడుమనొక, సంఘారామమును (బౌద్ధుల మఠము) నిర్మించెను.

ఆ సొరంగము ౧౦ లీలు (౨ మైళ్ళు) నిడివి గలిగియున్నది. ఆ కొండక్రింది నుండి మేము సొరంగమును ప్రవేశించు మార్గము గానక, పైకి చూచునపుడు నేటవాలుగ నుండిన యా యెత్తైన పర్వతముచుట్టును, పొడవునను, సొరంగముల వలె నుండు గుహాలను జూచితిమి. ఆ సొరంగమందు, నడచుట కనుకూలములుగ నుండి యిరుప్రక్కల స్థంభములు గలిగి, పొడవుగా నున్న విహారములును, ఎత్తైన గోపురముల క్రింద వసారాలుగల ఐదంతస్తుల కట్టడము నొకదానిని జూచితిని. ఆ యంతస్తులలో నొక్కొక్క దానియందు నాలుగేసి విహారములు గలవు. విహారములకు నడుమ వానిని చుట్టుకొను పడసాలలు (లేక వసారాలు) గలవు. ఆ విహారములందొక్క దానియందు సువర్ణమయములయిన బుద్ధుని జీవప్రతిమలు గలవు. అవి నవరత్న ఖచితములయి, చిత్ర విచిత్రాలంకారములతో శోభిల్లుచున్నవి. ఈ పర్వతాగ్రము నుండి, సెలయేటిధారల కాల్వలు ప్రతి యంతస్తునందును, మంటపముల గుండను, వసారాల చెంతను, విహారముల చుట్టును ప్రవహించుచు, కొండక్రిందకు ప్రవహించుచుండును. అచ్చటచ్చట గుహాలపై గానవచ్చు సొరంగములు, పైనుండి లోపలిగుహాలోనికి విహారములలోనికి, గాలిని వెలుతురును బోనిచ్చుచు, వాటిని కడు రమణీయములుగను, నివాస యోగ్యములుగను జేయుచున్నవి.

సాద్వహారాజీ పర్వతమును దొలిపించి సంఘారామ

మును నిర్మించునపుడు అనేక వేలమందిజనులు హతులైరి. కోశము అర్థశూన్య మయ్యెను. అప్పటి కింకను తలపెట్టిన కార్యము సగమైన పూర్తి కాలేదు. అందుచే నాతఁడు వ్యాకులచిత్తుడై దుఃఖింప నారంభించెను. రాజు ఖిన్నుఁడై మనోవ్యథనొందుచుండుట నాగార్జునుఁడు గాంచి యొకనాడు రాజా! నీ వేల ఖిన్నుఁడవై యున్నావని యడిగెను. సాద్వాహనుఁ డందులకు విచారముతో “బోధిసత్త్వుడా! నే నీ మహత్కార్యమును పేరాసతో బుణ్యముకొరకై సంకల్పించితిని. ఇయ్యది మైత్రేయ బోధి సత్త్వుఁడు సుగతుఁడై యవతరించుదాక నిలచి యుండవలయునని నా యుద్దేశము. కాని ఇది ఇంకను సగమైన పూర్తి కాలేదు. నా అర్థకోశము క్షీణించి నాజనులు అలసి, చనిపోవుచున్నారు. నా కేమియు దోచుటలేదు. అని విన్నవించెను. నాగార్జును డంతట “రాజా దుఃఖింపకుము; సత్ప్రయత్నము ఫలమును బడయక పోరాదు. ధర్మమందు నీకుగల అభినివేశమువలన నీ యభీష్టము తప్పక సిద్ధించును. భీతిల్లకుము. నిశ్చింతతో నీ రేయి అంతఃపురమున కరిగి సుఖముగా నిద్రింపుము. రేపటి యుదయము వ్యాహ్యాళికిఁబోయి, యీ చుట్టుప్రక్కల ప్రాంతమునంతయు బరీక్షించి, వచ్చిన పిదప నీతో నీ ప్రయత్నములగూర్చి ముచ్చటింతును” అని హెచ్చరించి యోదార్చెను. రాజా వాక్యములను విని, యానందభరితుడై నాగార్జునునికి బ్రణామిల్లి యథేచ్ఛం జనియెను.

“పిమ్మట నాగార్జునుఁడు, తనరసశాస్త్రజ్ఞానమహిమచే చుట్టుప్రక్కలగల పెద్దబండఱాళ్ళ నన్నిటిని కరిగించి దానిలోనొక కషాయమునుబోసి బంగారపు ముద్దలుగా మార్చివేసెను. మరునా డుదయము రాజు ఎక్కడ జూచి నను ఱాళ్ళవంటి బంగారపుముద్దలను గాంచి యాశ్చర్యము నొందుచు, తన సంతోషమును బట్టజాలక, నాగార్జునునికడ కేతెంచి ప్రణమిల్లి తాను అడవియందు ద్రిమ్మరుచు నచ్చ టచ్చట సువర్ణమును ఱాతిబండలువలె, కుప్పలుగా బడి యుండుట గాంచితి ననియు నది దేవతల మహిమచేజరిగెను గాబోలుననియు విన్నవించెను. నాగార్జును డపుడు ‘రాజా! అట్లు దేవతాప్రభావముచేత జరుగలేదు; నీ మనశ్శుద్ధివలనను నీ కార్యదీక్షాపరత్వమువలనను గలిగిన ఫలమిది. ఇపుడు నీకు గావలసినంత ధనము సమకూరినదిగావున నీవు తలపెట్టిన పుణ్యకార్యమునకై దీని నంతయు వినియోగింపుము. నీ యభీష్టము ఫలించుగాక” యని ప్రత్యుత్తర మిచ్చి ఆశీర్వ దించెను. రాజు బోధిసత్త్వుని యానతిచొప్పున నా ధనమును వినియోగించెను. సంఘారామమునిర్మింపగా మిగిలినదానితో, సువర్ణమణిమయాంచితములయిన బుద్ధదేవుని ప్రతిమలను జేయించి విహారములందుంచెను. ఇంకను మిగిలిన ధనము రాజ్యాభివృద్ధికై వినియోగించెను.

తానునిర్మించిన యాసంఘారామములందు నివసించుచు బుద్ధదేవునికి బూజానమస్కారములు చేయుచుండుటకై

సాద్వాహుఁడు వేయిమంది భిక్షువుల ప్రార్థించి రావించెను! భిక్షువుల యుపయోగార్థము నాగార్జునుడు బౌద్ధధర్మశాస్త్ర గ్రంథములను బోధిసత్త్వుల వ్యాఖ్యానములను, మున్నగు ననేక గ్రంథములను సంపాదించి యాసంఘారామమున నొక పెద్ద భాండాగారమును సమకూర్చెను. ఆతఁడు సంఘా రామముయొక్క కడపటి యంతస్తునందు బుద్ధుని సువర్ణవిగ్రహ మును, సూత్ర, శాస్త్ర గ్రంథముల నుంచెను. మొదటి యంతస్తునందు, పరిశుద్ధులయిన బ్రాహ్మణులకు నివాస మిప్పించెను. నడుమ మిగిలిన మూడంతస్తులందును భిక్షు వులనుండ నేర్పాటిచెను. ఈ సంఘారామము పూర్తి యగు నప్పటికి సాద్వాహ రాజునకు తొమ్మిది కోట్ల సువర్ణములు ఖర్చుపడియెనని ప్రాచీన గ్రంథములు వాకొనుచున్నవి.

ఇట్లు కొంతకాలము గతించునప్పటికి బ్రాహ్మణులకును, బౌద్ధులకును కలహములు జనించెను. ఆకలహములను దీర్చుమని బౌద్ధులు, రాజునొద్ద మొఱబెట్టుకొన బోయిరి. ఇంతలో బ్రాహ్మణులు "మనతో సంగ్వాదమున గలహించి యీ బౌద్ధులు, రాజుతో నేరము చెప్పుట కేగినారు. కానిం డ"ని, రోషించి దుర్మార్గులయి, అచ్చటి కావలివాండ్రు మొదలుగాగల పరిచారకులతో గలసి దుస్తంత్రములబన్ని, సమ యముకొఱకు నిరీక్షించియుండి, సంఘారామమును పాడుచేసి, సింహద్వారమును సొరంగమును గప్పివేసి బౌద్ధసన్యాసులు లోనికి రాకుండ నిరోధించిరి. ఇట్లా బ్రాహ్మణులు

సంఘారామమునుండి బౌద్ధులను వెడలగొట్టించి, తమ స్వా ధీనము చేసికొనిరి. అప్పటినుండియుబౌద్ధభిక్షువులచ్చటగాపుర ముండినట్లు కానరాదు. దూరమున నిలువబడి యున్నతమైన యా పర్వతశిఖరమువంక జూచునపు డందలి సొరంగములును, గుహాలును గానుపించెనుగాని, యా సంఘారామమును బ్రవే శించు సొరంగమును గాంచలేనైతిని. ఈ కాలమున నచ్చట నివసించెడి బ్రాహ్మణులు, తమలో రోగులయినవారికి వైద్య చికిత్సకొరకు బౌద్ధుల రావించవలసిన, వారి ముఖములకు మునుగులు వేసియో, కండ్లకు గంతలుకట్టియో లోనికి గొంపోయి పని పూర్తియయినతరువాత మరల నట్లే యావ లకు గొనివచ్చి కండ్లు తెరచెదరు. ఇందువలన బౌద్ధుల కెవ్వ రికిని లోని కరుగుమార్గము తెలియరాదు"

యుఁఆన్ చ్వాంగ్, కోసలదేశమునుగూర్చి, వింతకథ లను వర్ణించినాడు. ఇందీతను, తాను ప్రత్యక్షముగ జూచిన దానిని వినినదానిని గూడ నొక్కరీతిగ వర్ణించినాడు. అందువలన నీతఁడు వర్ణించిన యద్భుత విషయములు అవిశ్వసనీయములని మనకు దోచును. కావున వాటిపరీక్ష యావశ్యకము. కోసలమని మన యాత్రికుడు చెప్పియున్నాడు గాని యిది యుత్తరకోసలము గాక, దక్షిణ కోసలమనియు, నీకాలపు మధ్యమాగాణములలోని నాగపురముజిల్లాకు ఆగ్నేయముగా నున్న బస్తరురాజ్య భాగము విశాఖపట్టణ మండలములోని వాయువ్యభాగమును కలిసి దక్షిణకోసల మగు

చున్నదనియు మనము నిశ్చయింపవచ్చును. వీనిషీ పండితుడు రచించిన మన యాత్రికుని జీవితమందుగూడ నీ దేశము దక్షిణకోసలమనియే ఉదాహరింప బడినది. దక్షిణ కోసలము పురాతనకాలపు విదర్భయని కన్నింగ్‌హాముగారి * యభిప్రాయము. ఫెర్గసనుద్వార దక్షిణకోసలమును చిటికీ ఘడ్ ప్రాంతమునకు సరిబుచ్చుచు, వైర్‌ఘడ్ లేక భాంధక్ నగరములు కోసలరాజధానులుగావచ్చునని నిశ్చయించినాడు. ‡ కోసలమాంధ్ర దేశమున భాగముగా నుండె ననుటకు కొన్ని ప్రబల కారణములు గలవు. ఆంధ్రులు కోసలదేశమును, కోసల నాడని వ్యవహరించుటయు, నచ్చటినుండి వలస వచ్చిన బ్రాహ్మణులను కోసల(కాసల)నాటివారని బిలచుటయు, నెల్లరకుఁ దెలిసిన విషయమే. అదియును గాక, శాతవాహనుల క్రింద నాంధ్రమహాసామ్రాజ్యము విస్తరించి నపుడు దక్షిణకోసలము నాంధ్ర దేశాంతర్గత భాగమై పోయెను. దక్షిణకోసల దేశమును మనయాత్రికుని కాలమున మహాకోసల దేశాధీశులగు సోమవంశీయులో, ప్రవరపురాధీశ్వరులగువాకాటక రాజులో, త్రిపురాధీపతులుకలచుర్యులో పాలించుచుండవలయును. ప్రస్తుతమా దేశచారిత్రమింతకంటె విపులముగ దెలియవచ్చుటలేదు.

కోసలరాజధానిని వర్ణించిన వెనుక, మన యాత్రికుఁడు నాగార్జున, దేవ బోధిసత్త్వుల గూర్చిన వృత్తాంతములను

* Ancient Geography of India p. 5-0.

‡ Journal of the Royal Asiatic Society 1875 p, 260.

వర్ణించినాడు. నాగార్జునాచార్యునిగూర్చి, యీదేశము నందును, చీనా తిబేతు దేశములందు చెప్పఁబడుచున్న గాధ లన్నియు నించుమించుగా నొకదాని కొకటి సరిపోవు చున్నవి. నాగార్జునుఁడు తాను సర్వజ్ఞుఁడనని, జలపూరితమైన పాత్రను, దేవుని కడకు బంపెననియు, నందు దేవుఁడు సూదిని, జాఱవిడచి, యాతని సర్వజ్ఞత్వమును ఛేదింప గల్గితినని సూచించి గర్వభంగము చేసెననియు, కొందఱు వాదింతురు కాని చివరకు దేవుడు, తన యాజ్ఞానమును, అహంకార మును, తెలిసికొని పశ్చాత్తప్తుఁడై శిష్యునిగా ననుగ్రహించి యుపదేశింపుమని నాగార్జునుని వేడుకొనుటచే, నాగార్జునుని సర్వజ్ఞత్వము స్థిరపడుచున్నది. శాతవాహనుఁడను రాజు తన రాణియొక్క దుస్తంత్రమునకు లోనై యామె కడగొట్టు కుమారుడు సుశక్తి యను వానికి రాజ్యము కట్టబెట్టుటకై నాగార్జునుని జంపించి, యాతడు మరణించిన కాలముననే తానును మరణించెనని చీనా యాత్రికుఁడు ఈ చింగ్ కూడ చెప్పియున్నాడు. నాగార్జునుని ప్రాణముతో, తన ప్రాణము కూడ పోవునని యెఱింగనవాఁడగుటవలన, రాజు ఆతని మఠముచుట్టు, రక్షణార్థము కావలివారినుంచెను. నాగార్జు నుఁడు చిరకాల జీవియనుటకు తిబేతు దేశ గ్రంథములుగూడ సాక్ష్యము గనున్నవి. తారానాధు డొకచోట †నాగార్జునుఁడు ౫౭౯ సంవత్సరములు జీవించెనని చెప్పియున్నాడు. చీనా

† Tarranatha's History of Buddhism p. 73

గ్రంథములం దతఁడు నాసికాపుటములగుండ నీరు త్రాగుట మొదలయిన యోగరహస్యముల సహాయమున, కొన్ని వందల సంవత్సరములు జీవించియుండెనని చెప్పబడి యున్నది. ఈతడు చిరకాల జీవి యనుటలో సందియము గానరాదు గాని, పాశ్చాత్యులు కొందఱు దీనిని విశ్వసింపక, నాతని జీవితకాలము మహాయన సంప్రదాయ మభివృద్ధిలో నుండిన యైదాఱు శతాబ్దముల కాలమే. బౌద్ధులచే మహాయన మార్గమును బోధించిన నాగార్జునునకు జీవిత కాలమని అతిశయోక్తిగా చెప్పియున్నారని వ్రాయుచున్నారు. ఈతడు రసవాదశాస్త్రజ్ఞుడనియు, ఱాళ్ళను కరగించి బంగారముచేసెనన్న గాథయు చీనా తిబెతు గ్రంథములందు గానవచ్చుచున్నది.

నాగార్జునుఁడు చరిత్ర ప్రసిద్ధుఁడయ్యును, మనకు మిథ్యాపురుషుఁడును కల్పిత మహావ్యక్తియువలె గన్పట్టును. బౌద్ధమతముయొక్క యుచ్ఛదశయం దీతఁడు అద్భుతమైనట్టియు, దుర్గ్రాహ్యమైనట్టియు వ్యక్తివలె ప్రకాశించుచున్నాడు. పాలీసంస్కృత వాఙ్మయములం దీతఁడు మహామేధావియు సర్వజ్ఞునివలె గన్పట్టును. ఇతఁ డన్యమతములపట్ల నిరుపమానమైన సహనము జూపిన మహనీయుడు. బోధిసత్త్వుడై మతప్రచారము గావించిన మహావీరుఁడు.

**Watter Yuanchwang, Vol, II p, 204**

మహాతత్వవేత్త, కవీశ్వరుఁడు, వాఖ్యాత, రసవాది, శాస్త్రజ్ఞుఁడు, దయాసముద్రుఁడు. బోధిసత్త్వులు బుద్ధులగుటకు బొందవలసిన దశ భూమికలలో, దుష్కటమైనట్టి ప్రథమ భూమికను బొందిన వాఁడగుటవలన నీతఁడు" ఏకోభూమీశ్వరుఁ"డని బేర్కొనఁబడుచుండెను. ఈతని కీర్తి దిగంతవిశ్రాంతమై యుండినను, ఈతని జన్మస్థాన మెద్దియో, నెప్పుడు జన్మించెనో, యెప్పుడు నిర్వాణము చెందెనో, యాతని జీవిత మెట్లు, ఎచ్చ టెచ్చట గడపెనో దెలిసికొనుట కాధారములు గాన్పింపవు. కొందఱీతని జన్మస్థానము పశ్చిమదేశమని యూహింతురు గాని, యించుమించుగా దక్షిణ కోసలదేశ మీయన జన్మభూమి యని దోఁచుచున్నది. తిబెతు గ్రంథములం దీతఁడు చిరకాలము నాలందాసంఘారామమున బౌద్ధ విద్యల నభ్యసించెనని దెలుపఁబడియున్నది. ఈతఁడు జన్మించిన ప్రాంతమాంధ్రభూమి నియు నితఁడాంధ్రుఁడనియు చాల మంది యభిప్రాయ పడుచున్నారు. ఈతఁడు బుద్ధుని నిర్వాణానంతరము, ౨౦౦ సంవత్సరముల కని కొందఱును ౫౦౦ సంవత్సరములకని కొందఱును, ౪౦౦ సంవత్సరములకని కొందఱును, జీవించియుండెనని నిర్ణయించుచున్నారు. బౌద్ధుల ప్రధానగురుపరంపరలో నీతఁడు ౧౩ వ లేక ౧౪ వ ఆచార్యుఁడుగ బేర్కొనఁబడుచు క్రీ. పూ. ౨౧౨ వ సంవత్సరమున మరణించెనని చెప్పబడి యున్నాఁడు.* ఈతఁడించు

* Asiatic Researches Vol. II p. 400.

మించుగ క్రీ. పూ. ౪౫౭ వ సంవత్సరమున జనన మొందెను; శకరాజగు కనిష్కునికి సమకాలీనుఁడై యుండినట్లు రాజ తరంగిణి దెల్పుచున్నది; కుమారజీవునిచే రచింపబడిన లంకావతార సూత్రమందు అంత్యభాగమున, యీతని జీవితము భావికాలమున జరుగునట్లు స్పష్టముగ వర్ణింపబడినది.— కుమారజీవుడు నిశ్చయముగా, క్రీ. శ. ౪ వ శతాబ్దారంభ కాలమున జీవించియున్నట్లు దెలియుచున్నది, గావున, నాగార్జునుఁ డంతకు బూర్వము మూడవశతాబ్దమునందు జీవించియుండవలయునని కొందఱి యభిప్రాయము. ఈతని గ్రంథములందు కనిష్కుడు, కినిశుఁడు మొదలుగా గల రాజుల నామములు, వసుమిత్రుడు, అశ్వఘోషుఁడు, కాత్యాయనీపుత్రుఁడు, ధర్మగుప్తుడు, రాహులభద్రుడు, మున్నగు బౌద్ధ మతాచార్యుల నామములు గానవచ్చుటఁజేసి, నాగార్జునుడు క్రీ. శ. మూడవ శతాబ్దమువాడని వాటర్సు పండితుని యభి ప్రాయము §; కాని యిదియును నిశ్చయము కాదు.

నాగార్జునాచార్యునిచే రచింపఁబడిన గ్రంథములలో నిపుడు ఇరువది మాత్రమే మిగిలియున్నవి. అవియు గూడ చీనాభాషలో భాషాంతరీకరణములై యున్నవి. నిరీశ్వర వాదమును, ప్రతిపాదించుట జేసి బౌద్ధుల గ్రంథములన్నియు, నసత్యములనియు నప్రమాణములనియు మన దేశమున బ్రాహ్మణులచే దగ్ధముగావింపబడెను. ఈతని గ్రంథములలో సుహృల్లేఖ

§ Watter's Yuan chwang Vol, ii p. 204

యను పద్యకావ్యము కడు సుప్రసిద్ధమైనది. ఈకావ్యము తన పోషకుఁడగు శాతవాహనుడగు నాగార్జునునిచే ఉదయనునకు వ్రాయబడినదని తారానాధుఁడు దెల్పుచున్నాడు. ప్రపంచమునం దంతటను, సుహృల్లేఖకు వచ్చిన ప్రసిద్ధి, పూర్వకాలముననైన నేమి, మధ్యకాలమున నైననేమి మరియొక గ్రంథములకు రాలేదట. ఈ గ్రంథ మొక పర్యాయము తిబేతు భాషలోనికిని, మూడుమార్లు చీనాభాషలోనికిని భాషాంతరీకరింప బడెనట! చీనా యాత్రికుఁడగు ఈ చింగ్ భరతవర్షమును సందర్శించి పోయిన కాలమున సుహృల్లేఖ జనులచే ముందుగా నీకాలమున కాళిదాసత్రయమువలె పఠింపబడు చుండెనని వ్రాసియున్నాడు †. సుహృల్లేఖ తరువాత మిగుల ప్రఖ్యాతి గాంచినది "పజ్ఞాపారమిత శాస్త్రము." దీనిని చీనావారు చంగ్లూన్ అని బిలతురు. దీని ననుసరించి నాగార్జునుడు ప్రజ్ఞాప్రదీపశాస్త్రమును రచించెను. ఇది మహాయన శాఖకు జెందిన మాధ్యమిక సంప్రదాయము వారికి ప్రమాణ గ్రంథము. మాధ్యమిక సంప్రదాయము వారనగా, సర్వము శూన్యమని వాదించు బౌద్ధులు. నాగార్జునుఁడు "దశభూమి విభాగశాస్త్రమను" ఇంకొక గ్రంథమును రచించెను. బోధిసత్త్వుని జీవితమునందు గల దశభూమికలను వివరించి, యందుత్తమమైనదియు భిక్షుక వృత్తిని స్వీకరించి నపుడు గలుగునదియునగు ఆనందావస్థయను ప్రమోదిత భూమికను గూర్చియు,

† Itsing by Takakasu p 158

బిక్షుకుఁడైనపిదప పాపమునుండి విముక్తుడైనపుడు ప్రవేశించు విమల భూమికను గురించియు ప్రశ్నోత్తర రూపకమైన గ్రంథ మిది. ఇందు బోధిసత్త్వుడు, బుద్ధుడగుటకు బూర్వము, దుఃఖమున మరల బడిపోకుండ ననుభవించు అమితాయు స్వర్గముయొక్క సౌఖ్యమును గూర్చి మనోహరమైన స్తోత్రకదంబము గలదు. హీనాయన సంప్రదాయము ప్రకారము, మనుష్యుఁడు జీవమును, మృత్యువును దాటి, అతీతుడై నాశ మొందుటయే నిర్వాణపదవని నాగార్జునుడు నమ్మియుండెను. సకల జీవకోటి యొక్క నిర్వాణసిద్ధికై, (దుఃఖనివారణమునకై) యీ గ్రంథ మునం దొకచోట నాగార్జునుడు ప్రార్థన శ్లోకములను రచించెను. అవి మిక్కిలి మనోహరములై యున్నవి. ఇక నాగార్జునాచార్యుని గ్రంథము లన్నిటిలో "ప్రజ్ఞాపార మిత సూత్ర వ్యాఖ్యాశాస్త్రము" మిక్కిలి యుత్కృష్టమైనది. కుమారజీవుడీ గ్రంథమును చీనాభాషలోనికి క్రీ. శ. ౪౦౫ వ సంవత్సరమున భాషాంతరీకరించెను. ఈ గ్రంథము మహా ప్రజ్ఞాపారమితసూత్రము పైన ద్వితీయము, నుద్వేలమగు వ్యాఖ్యయని పేరొందెను.

నాగార్జునుడు మహాయన బౌద్ధమతమునకు ప్రముఖుడును ప్రవర్తకుడనిమాత్రమేగాక, విదేశములందు స్వదేశము నందునుచిరకాలజీవియని దిగంతమైన యశమును సంపాదించి యుండెను. ఈతఁడు బ్రాహ్మణ విద్యాలయందుగూడ నుత్తీర్ణుడై వైదికమతమునందలిరహస్యముల నభ్యసించెను. మూలికల

యొక్క గుణప్రభావముల గ్రహించి ఆయుర్వేదశాస్త్రము నభివృద్ధి పఱచెను. జ్యోతిష, సిద్ధాంతముహూర్త శాస్త్రము లందు పూర్ణమయిన ప్రజ్ఞను సంపాదించెను. రసవాదము నభ్యసించి ప్రజ్ఞావంతు డయ్యెను. మంత్రి తంత్రిశాస్త్రము లభ్యసించెను. ఆతడు ఘనవైద్యుడనియు నేత్రిచికిత్సయం దాతనితో సరిపోల్పదగినవారు ప్రపంచమునందు సయితము లేరను ప్రిఖ్యాతి చీనాదేశమువఱకును వ్యాపించెను. నేత్రరోగ చికిత్సలను గూర్చియు, మూలికాదుల ప్రభావముల గూర్చియు, నీతడు రచించిన శాస్త్రములు చీనా భాషలో నున్నవి. బాణుని హర్షచరితమునం దొకచోట పాతాళము నేలు నాగేంద్రుడు "మందాకిని" యను ముత్యాలహారమును మన నాగార్జునుని కొసంగెననియు, నది సర్వవిషసంహారిణి యనియు, దాని స్పర్శచే సర్వజంతు కోటికి సమస్తమగు బాధలు నివారణమగుననియు జెప్పబడెను. బుద్ధుని యుపదేశములందలి హీనాయన మహాయన మార్గములందు, సమానసిద్ధాంతములను నేర్చి యీతడు నూతనధర్మమును ప్రచారము గావించెను. ఈతఁడు పరమ పురుషార్థమును బడయుటకు, బౌద్ధులచే విధింపబడిన, చతుర్విధమైన సర్వ శూన్యత్వము, బాహ్యశూన్యత్వము, బాహ్యర్థానుమేయత్వము, బాహ్యార్థప్రత్యక్షత్వము, అను వాదములను బోధించెను. స్వయముగ నీతడు దశభూమికలో ప్రథమ భూమికేశ్వరుఁడై, యేకో భూమీశ్వరుఁడని ప్రసిద్ధి వడసెను.

ఈతని గురువుల పేరు శాహులభద్రుఁడు. అతఁడు బౌద్ధమతము స్వీకరించిన బ్రాహ్మణుడు.

కోసలదేశము నేలు రాజు పేరు,(సో టో-పోహో, అనగా) సాద్వహుఁడని, యుఁఆన్‌చ్వాంగ్ చెప్పుచున్నాడు. ప్రాచీన చీనాలిపిలో సో-టో-పో-హో యని వ్రాయబడిన సంస్కృత పదము శాలివాహన లేక సాతవాహన, గావచ్చునని పండితుల యభిప్రాయము. ఈచింగ్ అను చీనాయాత్రికుఁడు కూడ, నాగార్జునుని పోషకుఁడు (దానపతి షా-టో-పో-హా- నా- అనగా)శాతవాహన వంశజుడని చెప్పియున్నాడు. ఆతని పేరు షి-యేన్-టక-యని కూడ బేర్కొనియున్నాడు. చరిత్ర దెలుపునంతవఱకు ఆంధ్రసామ్రాజ్యమును శాతవాహన వంశము ఇంచుమించుగా నాలుగు శతాబ్దములకాల మేలి యుండెను. ఇంతమంది శాతవాహనులలో నాగార్జునుడే శాత వాహనునిచే బోషింపఁబడియెనో దెలిసికొనుటకు యుఁఆన్ చ్వాంగ్ దోడ్పడుటలేదు. ఇక ఈచింగ్ చెప్పిన షి-యేన్-టీ-కయను పేరు సంస్కృతమున జేతక లేక జీవాతక యను పదమునకు సరిపోవుచున్నది *. కాని యీ పేరుగల రాజెవ్వ రును చరిత్రయందు గాన్పించుటలేదు. టిబేతుదేశ గ్రంథము లందు నాగార్జునుని మిత్రుఁడును, దానపతియగు వాని పేరు శాతవాహనుఁడు, లేక అంతివాహనుడు అని వివిధము లుగా బేర్కొనబడియున్నది. ఆ వంశముననాతడు శంకరుడు,

¶ Takakasu "Itsing" p 159

ఉదయనుఁడు, లేక ఉత్తారాయనుడు, అను పేరులకు సరి పోవు తిబేతుపదముల బిలువబడియున్నాడు. మరియు జేతకుఁడు లేక జీవాతకుఁడనియు కూడ నొకచోట బేర్కొన బడి యున్నాడు. తిబేతు దేశచరిత్రకారుఁడును మిక్కిలి ప్రాచీనుఁడునగు తారానాథుడు ‡, నాగార్జునుని పోషకుఁడైన రాజు యౌవనమున జేతకుడని బిలుపబడుచుండిన ఉదయనఁ మహారాజని చెప్పియున్నాడు. శాతవాహన వంశము దక్షిణాపథమును క్రీ. పూ ౨౨౦ మొదలుకొని క్రీ. శ ౨౩౦ వఱకును పరిపాలిచియుండెను. ఈ నడుమ కాలమున నాగార్జును డెప్పుడుజీవించియుండెనో ఉదయన నామాంకితుడగు రాజును గుర్తింపలేకపోవుటవలన నిర్ణయింప వీలుగాకున్నది. నాగార్జునుని పోషించిన చక్రవర్తి, యజ్ఞశ్రీ శాతకర్ణియని శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారు నిర్ణయించిరి, గాని వారుజూపిన యాధారములు తృప్తికరములుగ లేవు. ఎట్లయినను ఆతఁడు చిరంజీవియై కొన్ని శతాబ్దములు బ్రతికి యుండినట్లు విశ్వసింపకపోయినను క్రీ. శ. మొదటి శతాబ్దముననిర్వాణము బొందెననిమాత్రము నిర్ణయింపవచ్చును. ప్రస్తుతమాతని కాలనిర్ణయము ఇంతకంటె నిస్సంశయముగ నిర్ణయింప సాధ్యము గాదు.

ఇక సిబోధి సత్త్వుడు, కోసలదేశమునకు నరువదిమైళ్ళ దూరమునున పో-లో-మో-లో-కి-లీ యను పర్వతము మీఁద

‡ Taranatha's History of Buddhism ps 71, 73 & 303,

నున్న సంఘారామమున జీవయాత్ర గడపెనని, యుఆన్ చ్వాంగ్ వ్రాయుచున్నాడు. పో-లో-మో-లో-కీ-లీ యనునది భ్రమరగిరి యని సంస్కృతమున సరిపోవుచున్నది. మన యాత్రికు డిచ్చిన కొలతనుబట్టి దక్షిణకోసలరాజధాని ఖాండక్ నగరమని నిశ్చయించి యచ్చటనుండి కొలచిచూచిన యెడల నీపర్వతమతము చాందాకు నాగ్నేయ మూలగా మాణిక్యదుర్గమునకును, వరదా నదికిని సమీపమున నుండ వలయును, గాని యచ్చట నీయాత్రికుని వర్ణనలకు సరివచ్చు పర్వతశిఖరముగాని సంఘారామముగాని గానరాదు. ఇక ఫెర్గసనుగారు, ఖాండక్ నగరసమీపమునగల విద్యాసాని పర్వతమే యుఆన్ చ్వాంగ్ వర్ణించిన భ్రమరగిరిసంఘారామ మని నిరూపింప బ్రయత్నించిరిగాని, మనయాత్రికుని వర్ణనల కచ్చటి ప్రాచీనగుహాలు సరిపోవుట లేదు. యుఆన్ చ్వాంగీ భ్రమరగిరినల్లని శిఖరముగల పర్వతమనికూడ వర్ణించియున్నా డు. భ్రమరగిరి, పార్వతి, దుర్గలవంటి శక్తిస్వరూపిణులగు దేవత యొక్క గిరియనిగాని నల్లతుమ్మెదవంటిశిఖరమనిగాని అర్థము చేయవచ్చును. యుఆన్ చ్వాంగ్, భ్రమరగిరిని వర్ణించుటలో కొలతలను తప్పుగా నిచ్చి పొరబడినాడు. అట్లు కాదేని యాతని సి - యూ - కీ చీనాపాఠమును పండితులు తప్పుగా చదివి యపార్థము చేసుకొని వ్రాసి యుందురు. మన యుఆన్ చ్వాంగ్ వలెనే యింతకు పూర్వము వచ్చియుండిన పాహియాను కూడ తాను కాశీనగరమున

నుండి నపుడీ భ్రమరగిరికి సరిపోవు పర్వత సంఘారామమును గూర్చి, వినినదానిని స్వయముగ జూచినవానివలె వర్ణించి వ్రాసినాడు. కాని యాతఁ డీపర్వత శిఖరమును జూడనేలేదు. ఆతఁడు వ్రాసిన వృత్తాంతముగూడ మిక్కిలివింతగా నున్నది. ఆతఁ డీశిఖరము పో-లో-యు అనగా పారావతమను అర్థము వచ్చు పేరున బిలచినాడు. ఆకొండలో పావురపు గూండ్లవలె గుహలుండుటచే, పారావతమను పేరుగలిగి యుండవచ్చు ననుకొనుట యొక యూహా! కాని యాతఁడు పారావతమని బిలచుట కింకొక కారణము కూడనుండును. తిబెతుదేశ బౌద్ధగ్రంథములందు నాగార్జునుఁడు శ్రీపర్వత సంఘారామమునకు భిక్షువుల రావించి, నివాసము లేర్పఱిచె ననియు, వారి యుపయోగార్థము ఒక గొప్పపుస్తక భాండారమును సమకూర్చెననియు వ్రాయబడియున్నది. శ్రీపర్వతమునకు పారావతమను పేరు. అట్లు చీనాయాత్రికుని వ్రాతలందు పొరబాటుగా బడియుండవచ్చును. మఱియు నాగార్జునుడు ది-పా-ల-గిరి అనితిబెతువారిచే బిలువబడుచుండిన శ్రీపర్వతముపై చిరకాలము నివసించి నిర్వాణము బొందెనని తిబెతు గ్రంథములు వాకొనుచున్నవి. బౌద్ధమందు సార్వత శ్రీపర్వతమనియు సంస్కృత వాఙ్మయమున శ్రీశైలమనియు, యు౯ఆన్ చ్వాంగ్ చే భ్రమరగిరి యనియు నుదాహరింపబడిన పర్వతరాజము కర్నూలు (కందనోలు) మంటలములో కృష్ణానది నానుకొని, పైని వ్రేలాడుచున్న శిఖరముపై

భ్రమరాంబా మల్లిఖార్జునుడు దేవులకు దేవాలయమును గలిగి సుప్రసిద్ధ బ్రాహ్మణ శైవపుణ్యక్షేత్రములలో నొక్కటియై చుట్టుప్రక్కల నన్నిశిఖరములకంటె ఎత్తైన శ్రీశైలమే మన యాత్రికునిచే బేర్కొనబడిన భ్రమరగిరియని నిశ్చయింపవచ్చును. ఈ శ్రీశైలము ద్వాదశ శివలింగ క్షేత్రములలో నొకటియై చుట్టుప్రక్కల నచ్చట యుఆన్ చ్వాంగ్ వర్ణనలకు సరిపోవుచు అంతస్తులవలె నుండు గుహాలను, విహారములను సొరంగములను గలిగి నిర్జనారణ్యభూమియందు చొర నశక్యముగానున్నది కావున నీశ్రీశైలమరమే పూర్వకాలమున నాగార్జునాచార్యుని నివాసస్థానమని నిర్ణయింపవచ్చును. ఇయ్యది యాంధ్రసామ్రాజ్య రాజధానియగు ధాన్య కటకమునకు (ధరణికోట) పశ్చిమముగా ౧౦౨ మైళ్ళ దూరమునను కర్నూలునకు ౮౨ మైళ్ళదూరమునను మధ్యపరగణాల లోని మాణిక్య దుర్గమునకు దక్షిణముగా ౨౪౦ మైళ్ళదూరమునను అనగా మన యాత్రికుని కోసల రాజధానికి బహుదూరముగను ఉన్నది. కావున నిక మన పురాతత్వ పరిశోధకులు శ్రీశైలమును తత్ప్రాంతపు గుహాలను బరిశీలించి యేమైన శాసనాదులను వెతికి దీయగలిగినచో నాగార్జును డేకాలపు వాడో యాతని దానపతియగు శాతవాహనవంశజుండగు ఉదయన నామాంకితు డేకాలపువాడో నిస్సంశయముగ నిర్ణయింప గలుగుదుము. అట్టిది ప్రకృతమందు దుర్లభము.

కోసల దేశమునుండి మనయాత్రికుడు దక్షిణాభిముఖుడై

మహారణ్యములగుండ ౯౦౦ లీలు(౧౮౦ మైళ్లు) ప్రయాణముచేసి, ఆంధ్రదేశమును సమీపించెను. ఆంధ్రదేశమును గూర్చి మన యాత్రికు డిట్లువ్రాసియున్నాడు.

“ఈదేశము మూడువేల లీలు (౬౦౦ మైళ్ళు) వైశాల్యము గలిగి యున్నది. రాజధానియు నిరువది లీలు వైశాల్యముగలది. ఈనగరమును జనులు (పిన్-గీ-కి-లో) వేంగీపురమని బిలచెదరు. ఈప్రాంతము మిక్కిలి సారవంతమై యెల్లప్పుడు సేవ్యము చేయబడుచు సర్వసస్య సమృద్ధమై యున్నది. ఈదేశముష్ణ ప్రదేశము. జనులు సాహసము గలవారు. కాని తొందరపాటు గలవారుగా నున్నారు. వీరి భాషయు వాక్యముల కూర్పుయు, మధ్యదేశము వారి భాషకంటె భిన్నముగా నుండును. కాని వీరుపయోగించు అక్షరముల స్వరూపము మధ్యదేశములవారి యక్షర స్వరూపమును ఇంచుమించుగా బోలియుండును. ఇక్కడ నిరువది సంఘారామములును అందు మూడువేల భిక్షువులు నున్నారు. ముప్పది దేవాలయములు గూడ గలవు. ప్రజలలో బ్రాహ్మణులును, జైనులును గూడ గలరు.”

“వేంగిపురమున కనతి దూరమున నొక సంఘారామముగలదు. అందు అంతస్తులుగల హర్మ్యములును, మనోహరములయి విచిత్రములయిన అలంకారములచే శోభిల్లెడి గోపురములును స్థంభములును గల యితర గృహములును చాల గలవు. ఇచ్చటనొక బుద్ధుని విగ్రహము కలదు.

దానిని సత్స్వరూపమును శిల్పి తన నేర్పరితనమునంతయు జూపి చెక్కెనో యన్నంతగా కళలూరుచు మనోహరముగా నున్నది. ఈసంఘారామమున కెదురుగా వందలకొలది యడుగుల ఎత్తుగల స్తూపమొకటి గలదు. ఈస్తూపమును, సంఘారామమును అచలుడను అర్హాతుడు * నిర్మించెను.

"ఈసంఘారామమునకు (మఠము) నైరృతిదిక్కుగా కొంచెముదూరమున నింకొక స్తూపమును అశోకవనమును గలవు. పూర్వకాలమున తథాగతుడిచట నివాసము చేయుచు తనప్రజ్ఞచే చాలమందిని బౌద్ధులనుగాఁ జేయజాలెనట.

"ఇక్కడనుండి నైరృతిదిక్కుగా నిరువది లీలుదూరమున నొంటరిగానున్న కొండపై నొక శిలాస్తూపముగలదు. ఇక్కడ జినబోధిసత్త్వుడు న్యాయద్వార తారకశాస్త్రమును "హేతువిద్యాశాస్త్రమును" రచించెను. బుద్ధుని యనంతర మీ బోధిసత్త్వుడు బౌద్ధమతము నవలంబించి శ్రమణకుడై కాషాయ వస్త్రముల ధరించెను. పిదప జితేంద్రియుడై, నిష్కాముడై, చిరకాల మభ్యసించి బ్రహ్మజ్ఞానమును సంపాదించెను. ఆతని జ్ఞానశక్తియు, తపశ్శక్తియు నపారములు. ఆతడు మహాశక్తి సంపన్నుడైనతరువాత నిరాధారముగ నున్నలోకముపై జాలిచెంది బౌద్ధధర్మములను జనులకు

* అర్హాత పదము సంస్కృతమున ఆచార్యపరముగుచున్నది. బౌద్ధధర్మ సిద్ధాంతముల ననుసరించి పునర్జన్మ లేకుండ చేసికొనగలుగువాడు ఆచార్యుడు (అర్హాతుడు) అగుచున్నాడు.

బోధింప సమకట్టెను. హేతువిద్యాశాస్త్రమగాధమై, దురవగాహమై, బహుశ్రమచేత గాని సుబోధము గాకుండుటచే నది ముక్తిమార్గ మన్వేషించు వారికి నిరుపయోగముగా నుండుట గాంచి యాతడు పర్వత గుహలందు జొచ్చి ధ్యానపరుడై యోగసమాధిలోనుండియాశాస్త్రమును సులభముగా సాధించుటకు దగిన గ్రంథమును రచింప యోచించెను. ఇట్లుండ నాతని తపోనిష్ఠకు పర్వతములు కనుమలు కంపించెను. ఆకసమంతయు ధూమముచేతను కాఱుమబ్బుల చేత నావరింపబడియెను. అంతట నాపర్వతము నాశ్రయించియుండు అధిదేవత యీబోధిసత్త్వుని ఆకసముమీదకు గొంపోయి యిట్లు పలికెను. "పూర్వకాలమున తథాగతుడు ప్రపంచమును నిర్వాణమార్గము వైపు త్రిప్పప్రయత్నించెను. లోకముపై జాలిగొని యాతడు హేతువిద్యా శాస్త్రమును వెల్లడించెను. కాని తథాగతుడు నిర్వాణము బొందినతరువాత నాశాస్త్రము లోకమునకు దుర్గ్రాహ్యమయ్యెను. కావున నోజిన బోధిసత్త్వుడా! నీజ్ఞాన తపములు అపారములు; సర్వజ్ఞుడ వైన నీవు యీశాస్త్రమును పూర్ణముగా నెఱింగి దాని మహిమను లోకమునకు బోధింపుము."

"పిమ్మట బోధిసత్త్వుడు, ప్రపంచము నంతటను జ్యోతిర్మయము చేయగల వజ్రసమాధియందు ప్రవేశించి ధ్యానతత్పరుఁడై యుండెను. ఆ సమయమున నాదేశము నేలు

రాజు జినబోధి సత్త్వుని సమీపించి జన్మరాహిత్యమును బడయుమని ప్రార్థించెను."

జినబోధి సత్త్వుడపుడు "రాజా నేను దురవగాహమైన హేతువిద్యా శాస్త్రసూత్రములను స్పష్టముచేయుటకై సమాధియందు ప్రవేశించితిని. నాహృదయమిపుడు జన్మరాహిత్యమును గోరుటలేదు. సమ్యక్ సంబోధికై యెదురు చూచుచున్నది" అని ప్రత్యుత్తర మిచ్చెను."

"రాజంతట జన్మరాహిత్యఫలమే మహర్షుల యాశయము. మూడువిద్యలనెఱిగి భూర్భువస్సు వర్లోకములనుండి విముక్తుడగుటకన్న ఫలమేమి గలదు. తప్పక మీరు జన్మరాహిత్య ఫల మనుభవింతురుగాక యని విన్నవించెను.

"జినబోధిసత్త్వుడు రాజు చెప్పిన మాటలకు సంతుష్టాంత రంగుడై ధ్యాన సమాధియందు ప్రవేశించి జన్మరాహిత్యఫలమును బడయనెంచెను. కాని యాతడొక్కడే యా విజ్ఞానమును సంపాదించి ముక్తి నొందుటవలన లోకమున కేమియుపకారమునుగలుగదనియు బోధిసత్త్వునియొక్క స్వార్థపరత్వమునకు చింతిల్లి యాతనిపై జాలిగలిగి మంజుశ్రీ బోధిసత్త్వుడాతని ముంగిట సాక్షాత్కరించి యిట్లని యాజ్ఞాపించెను. "అయ్యా! నీవేల మొదట సంకల్పించిన పుణ్యకార్యమును విరమించితివి. నీవొక్కడవే నిర్వాణమును బొందనితరులందఱు అజ్ఞానాంధకారమునుండి సంసార బంధముల దగుల్కొని తిరుగాడ వలసినదేనా? నీవు నీనిర్మల జ్ఞానమును

లోకమునకు బోధింపుము. నీవు నేర్చిన న్యాయశాస్త్రమును మాత్రమునేగాక మైత్రేయ బోధిసత్త్వుని యోగాచార్య భూమి శాస్త్రమున బోధింపుము." జినబోధిసత్త్వుడపుడు మంజుశ్రీ బోధిసత్త్వుని యాజ్ఞ శిరసావహించెదనని చెప్పి నమస్కరింప, నా దివ్యపురుషు డంతర్ధాన మొందెను. పిమ్మట జినుడు చాలకాలము హేతువిద్యాశాస్త్రమును, యోగాచార్య భూమి శాస్త్రమును కడు శ్రద్ధతో నభ్యసించి, తన శిష్యకోటిలో పెక్కుమందికి ఉపదేశించెను. ఆతని శిష్యవర్గములో జాలమంది తమసమకాలీనులలో నంతటివారు యోగ శాస్త్రము నభ్యసించిన వారు లేరని ప్రఖ్యాతి గడించిరి.

"ఇచ్చటినుండి చిట్టడవులతో నిండియున్న ప్రదేశము గుండ దక్షిణముగా జనిన ధాన్యకటక(టో-న-స-కి-చీ-కియా.) మును ప్రవేశింతుము"

దక్షిణ కోసలమునుండి మన యాత్రికుడు చాళుక్య రాజ్యమగు వేంగీ దేశమును గూర్చి బోయెను. కృష్ణాగోదావరీ నదుల మధ్యనుండు ప్రదేశము వేంగీదేశమని వ్యవహరింపబడుచుండుట చరిత్రప్రసిద్ధము. ఈ వేంగీనామము రాజధానియగు వేంగీపురమును బట్టి గల్గెను. వేంగీపురము ఏలూరునకు దూర్పుగా నెనిమిది మైళ్ళదూరమునకు కొల్లేరునకు వాయువ్యముగా నాలుగుక్రోసుల దూరమున నున్నది. వేంగీపురము క్రీ-శ- పూర్వమనేక శతాబ్దముల క్రితమునుండి ప్రసిద్ధమగు నగరమై యొప్పుచుండెను. ఆంధ్ర రాజధానియగు

ధాన్యకటకమునకు వెనుక నింతటివిశాలమైన నగరము నింతటి మనోహరమైన పట్టణము దక్షిణాపథమున నింకొకటి పూర్వము లేకుండెను. ఇపుడీ నగరము భూకంపాదులచే నశించిపోయి శిథిలావశిష్టమయి పాడయి రూపు మాసియున్నది. ఇచ్చటి పురాతన చిహ్నములు ప్రాచీనపు ఔన్నత్యమును దలపునకు దెచ్చుచున్నవి.

వేంగీపురము పల్లవుల కాలమున రాజధానిగా నుండెను. వారికి వెనుక సాలంకాయన పల్లవులకును, పిమ్మట విష్ణుకుండినులకును రాజధానిగ బరగెను. చాళుక్యులీదేశమును జయించిన తరువాత కొంతకాలము పిష్ఠపురము రాజధానిగా మార్చబడినను చాళుక్యరాజులలో రెండవ వాడగు జయసింహుని కాలమున వేంగీపురమునకు తిరిగి రాజధాని మార్చబడెను. యువాన్ చ్వాంగ్ వేంగీపురమున కేతెంచినపుడు వేంగీదేశమును కళింగములో చీపురుపల్లి ప్రాంతమువరకును తూర్పు చాళుక్య పరిపాలనముక్రింద నుండెను. అపుడు తూర్పు చాళుక్యరాజ్యమును శాలించుచుండినవాడు సర్వసిద్ధి బిరుదాంకితుడగు జయసింహవల్లభుడు.

వేంగీపుర ప్రాంతమున నుండినట్లు చెప్పబడిన సంఘారామము ఇపుడు గానరాదు. ఇదియును కాల మహిమచే శిథిలమయి జీర్ణమై పోయియుండును. వేంగీపుర ప్రాంతము నిపుడు పెదవేగి చిన్నవేగి దెందులూరు నేనగూడెము మున్నగు గ్రామముల చెంత గానవచ్చు శిథిలమయిన దేవాలయములు

కట్టడములు, మున్నగువాటిలో నేది మన యాత్రికుఁడు వచించిన శిలాస్తూపమో నిర్ణయింప జాలము. ఈప్రాంతమున అసంఖ్యాకములుగ దేవాలయములు కట్టడములును గలవు. ప్రాచీన వేంగీపురమునకు నాలుగైదు మైళ్ళు దూరమున ఏకాంతమయిన శిఖరముపై నొక సంఘారామము గలదనియు, నచ్చట పెక్కు గుహాలున్నవనియు, నందు పూర్వము జిన్న బోధిసత్త్వుఁడు నివాసముగానుండి హేతువిద్యాశాస్త్రమను తర్కశాస్త్రమును రచించెననియు మనయాత్రికుఁడు చెప్పియున్నాఁడు. ఈకాలమున ఏలూరున కుత్తరముగా ౨౦ మైళ్ళదూరమున కామవరపుకోట చింతగుంటుపల్లియను గ్రామము గలదు. ఇచ్చట సమీపముగా జీలకర్ర గూడెమను పల్లె గలదు. ఈసమీపమున భూగర్భమున పూడ్చుకొనిపోయినవి పది పండ్రెండు స్తూపములు గాన్పించుచున్నవి. ఇంకను సమీపమునగల కొండలో నక్కడక్కడ నైదారు గుహాలు వరుసగాగలవు. ఇవి పూర్వము బౌద్ధసన్న్యాసులు నివసించు గదులని యూహింప వలయును. ఆ సమీపమున శిథిలమయి గన్పట్టు నొకవిశాల సభామంటపమునందు స్థంభము లిప్పటికి గాన్పించుచున్నవి. అదియే పూర్వము విహారమును, చైత్యమంటపము నైయుండెనని యూహింపవచ్చును. ఇక్కడకు సుమారు నూరు గజముల దూరమున నొకకొండ ముఖమున వలయాకారముగ నొకగుహా దొలువబడి గానవగుచున్నది. ఆగుహాకు నడుమ నెత్తిమీద గోపురము గలదు.

ఆ గుహాయొక్క నడిమికొలత పదునెనిమి దడుగులుండును. కుడ్యములు సుమారు పదునైదడుగులెత్తుండును. గోపురము యొక్క గర్భము నాలుగడుగు లెత్తును అడుగున అడ్డకొలత పండ్రెండడుగులు నిడివియు నుండును. ఈగోపురశిఖరమునుండి క్రిందకు గుహాయొక్క ఎడమభాగమునకు ఒక శిలాస్థంభ మొకటిపూర్వము లేచియుండెను. ఇప్పు డాశిలాస్థంభము అచ్చటగానరాదుగాని దానిచిహ్నములు గాన్పించును. ఆస్థంభముయొక్క అడుగుభాగము బ్రాహ్మణులచే శివలింగాకృతిని చెక్కబడి శివాలయముక్రింద పూర్చబడియున్నది. పూర్వపు పైస్థంభముయొక్క పైభాగము ఇప్పటికిని శివలింగమునకు సూటిగా నెత్తిపైగోపురమునందు నడుము కట్టువలె వ్రేలాడుచున్నది. గుహాలయ సింహద్వారముపై గుఱ్ఱపు డెక్కవలె నుండు కవాటముగాన్పించును. ఇచ్చటి స్తూపములును గుహలును విహార నిర్మాణయుగములకు బూర్వము అనగా క్రీ-శ రెండవశతాబ్దాంతమున నిర్మింపబడి యుండవలయును.

మన యాత్రికునిచే వర్ణింపబడిన వేంగీపుర సమీపమునుండి గుహాలు, చైత్యము స్తూపములును, గుంటుపల్లి జీలకఱ్ఱగూడెముల సమీపమునుండి నట్లూహింప వలయును. ఇచ్చట జీవయాత్రను గడపిన జినబోధిసత్త్వుడు దిఙ్నాగాచార్యుడని టిబెతు గ్రంథమూలమున దెలియుచున్నది. చీనాభాషయందు పూర్వయు యువాన్ చ్వాంగ్ వ్రాసినది యీకాలపువర్ణక్రమమునుబట్టి దిఙ్నాగ బోధిసత్త్వుడని చదు

వదగినను యీకాలపు ఫ్రెంచిపండితులు కొందఱు జినయనియు చిన్నయని వివిధములుగా పొరబాటు పడిరి. దిజ్ఞాగాచార్యుడు వేంగీపురపీఠమున కధ్యక్షుడనియు మహాతత్త్వవేత్త యనియు తార్కికుడనియు, యోగ శాస్త్రజ్ఞుడనియు చాల పేరెన్నిక గనినవాడు. ఈతని జీవితము దుర్మార్గులగు అసహన పూరితులునగు బ్రాహ్మణమతస్థులచే నాతని గ్రంథములతో దగ్ధము గావింపబడి విస్మరింపబడినది. ఈతడాంధ్రుడట. ఈతని జీవితమును గూర్చి దెలిసిన కొంచమునుగూడ టిబేతుదేశ గ్రంథములమూలమున దెలియుచున్నది. దక్షిణమున కాంచీపుర సమీపమున సింహవక్త్రమను గ్రామమున నొక బ్రాహ్మణకుటుంబమున నీతడు జనన మొందెను. సింహవక్త్రపుర మాకాలమున నచ్చట నేగ్రామమునకు సరిపోవునో తెలియరాదు. మొదట నీతడు బ్రాహ్మణవిద్య నభ్యసించెను. కొంతకాల మయినతరువాత వత్సీపుత్రసంఘమునకు జెందిన హీనాయన సాంప్రదాయబౌద్ధమతము నీతడు స్వీకరించెను. కాని ఏకారణముననో గురువుయొక్క యాగ్రహమునకు పాత్రుడై సంఘారామమునుండి వెడల గొట్టబడెను. పిదప నీతడు వసుబంధుని సంఘమును జేరెను. ఒడివీసనమను నగరమున భోరశైలమందు చాల కాలముండి ఒకప్పుడు నాలందా సంఘారామమునకు వాగ్వాదము కొఱకు పయనమయ్యెను. అచ్చట చాలమంది అన్య సంప్రదాయకులతోడను ఇతర సాంఘికులతోడను బ్రాహ్మణులతోడను వాదించి

గెలుపొందుచువచ్చెను. ఇతడుఒడివీసనగరమునకు దిరిగి వచ్చిన తరువాత హేతువిద్యా తర్కశాస్త్రమునుగూర్చి యొకశాస్త్రము రచింప దలపెట్టెను. ఆసంకల్పమంకురించి నపుడు భూకంపమును గొప్పవెలుగును బ్రహ్మాండము బ్రద్దలగునంత మహాధ్వనియు నయ్యెనట. అదిచూచిదిజ్ఞాగుడు భయపడుచుండ, మంజుశ్రీ బోధిసత్త్వుడు ప్రత్యక్షమై భయమువాపి, యాతనికి నూతన విషయములను బోధించి ప్రోత్సహించెనట! అంతట నాతనిని యాదేశపు రాజు మిక్కిలిగౌరవించి పోషించెను. దిజ్ఞాగుడు మొదట నివసించుచుండిన భోరశైలమును, ఒడివీస నగరమును బంగాళా దేశమందున్నవి. దిజ్ఞాగుడు చాలకాలము వేంగీదేశమున నివసించిన వాడగుటవలన, యీతని పోషించిన రాజులు విష్ణుకుండినులనిగాని, సాలంకాయనులనికాని యూహింపవచ్చును.

దిజ్ఞాగాచార్యుడు అర్హాతుడైన అచలునిచే నిర్మింపబడిన వేంగీపుర ప్రాంతపు గుంటుపల్లి చైత్యము, స్తూపములందే, చాలకాలము నివసించి యుండెను. కాని యపుడపుడు కొంతకాల మజాంతాగుహాలందును, ఓరుగంటి సమీపమున గల సంఘారామము సందును కాలము గడుపుచు వచ్చెను. మల్లినాథసూరి తనమేఘసందేశ వ్యాఖ్యయందు దిజ్ఞాగుని గూర్చి చేసిన ప్రశంసను విశ్వసించినయెడల మనమాతడు, మహాకవి కాళిదాసునికి సమకాలీనుడైయుండి యాతని గ్రంథములను కడు కాఠిన్యముతో విమర్శించి యుండెనని యూ

హింపవలయును. అలంకారికుఁడును, కాశ్మీరవాసియునగు భామహుఁడీతనికి సమకాలీనుఁడని కొంద అందురు. కాని యిది విశ్వసనీయముగా గన్పట్టుట లేదు. ఇప్పటి చరిత్రకారులు దిఙ్నాగాచార్యుని క్రి.శ. ౫౬ శతాబ్దముల నడుమ జీవించి యుండినట్లు నిర్ణయించుచున్నారు. ఈతని గ్రంథములు మొదటి పర్యాయము క్రీ. శ. ౫౬౦ సంవత్సరమున చీనాభాషలోనికి భాషాంతరీకరణము గావింపఁబడెను. తర్కవిద్య నభ్యసించు విద్యార్థుల కుపయుక్తములయిన, ఎనిమిది గ్రంథముల నీతఁడు తర్కశాస్త్రమునందు రచించెనని వాని పేర్లను ఈచింగ్ యాత్రికుఁడు పేర్కొని యున్నాడు. దిఙ్నాగుఁడు ఒక శాస్త్రమును గూర్చి వ్రాసి మరియొక శాస్త్రమునుగూర్చి వ్రాయలేదని చెప్ప నక్కరలేదు. ఆతడన్ని శాస్త్రములను, పరిశీలించిన వాఁడగుటచే నాతని గ్రంథములు నూటికి మించియున్నవి. 'న్యాయ' సిద్ధాంతము నీతడభ్యసించెను. కాని బ్రాహ్మణ నైయ్యాయికు లీతని భాష్యము నంగీకరింపరు. ఈతడు ప్రజ్ఞా పారమితా శాస్త్రమును బూర్ణముగ నలవడ జేసికొనెను యోగాభ్యాస రహస్యములును గ్రహించి, మానవుని జన్మ రాహిత్యమునకు మార్గములను అన్వేషింప నమకట్టెను. దిఙ్నాగుని, ప్రజ్ఞా పారమితా శాస్త్రముపై వ్యాఖ్య ఆర్య ప్రజ్ఞా పారమితా సంగ్రహ కారికా వివరణ' యని పిలువబడుచు, టిబెతు భాషయందు 'త్రిరత్న దాస' యని భాషాంతరీకరింపబడి యున్నది. ఈతడు హేతు విద్యాశాస్త్ర

మునకు వ్యాఖ్య రచింపబూని ధ్యానపరుడై సమాధియందు ప్రవేశించి నపుడును, తనయొక్క జన్మ రాహిత్యము కొఱకు ప్రయత్నించి నపుడును, మంజు శ్రీ బోధిసత్త్వు డీతనికి ప్రత్యక్షమై యుపదేశము గావించి, యాతని నాస్వార్థ పరత్వము నుండి, బోధిసత్త్వుని మార్గమునకు ద్రిప్పెనని చెప్పబడి యున్నది. ఈకథ లోనివిషయము, దిఙ్నాగాచార్యుడు హీనాయన సంప్రదాయమును వదలి మహాయన సంప్రదాయము నవలంబించు సమయముగా అర్థము చేసికొనవలయును. దిఙ్నాగుని వలె, పూర్వము వసుమిత్రుడనువాడు కూడ దేవతలచే అర్హతుడు గాకుండ, బోధిసత్త్వుని మార్గమునకు మరల్ప బడెనట. ఏలనన అర్హతుడైనవాడు హీనాయన సంప్రదాయము ననుసరించి, జన్మ రాహిత్య ఫలమును బొందునుగాని బోధిసత్త్వుడై లోకము నుద్ధరింపడు. లోకమునకై తనప్రాణ మర్పించలేడు. బోధిసత్త్వుడైనవా డుత్తరభూమి యందు బుద్ధుడగునని మహాయన సంప్రదాయము.

యుఆన్ చ్వాంగ్ ఆంధ్రదేశమును సందర్శించునాటికి మనదేశమున దొరికిన శాసనముల బట్టి, యా కాలమున వేంగీమండలమును పూర్వచాళుక్యాన్వయుండు మొదటి జయసింహవల్లభమహారాజు పరిపాలించుచుండినట్లు తెలియుచున్నది. క్రీస్తుశక మేడవ శతాబ్దాదివఱకు నాంధ్రదేశములో వేంగీవిషయము విష్ణుకుండినవంశపురాజులును, కృష్ణకు దక్షిణ భాగమును, చిల్లరపల్లవ రాజకుటుంబములును, కళింగదేశ

మనబడు నిప్పటి విశాఖపట్టణము గంజాంమండలములును బస్తరుసంస్థానమున్న ప్రాంతమును, పూర్వ గాంగవంశ రాజులును బరిపాలించుచుండిరి. పశ్చిమ చాళుక్యరాజగు రెండవ పులికేశి సత్యాశ్రయవల్లభమహారాజు, పూర్వాంధ్రదేశమును జయించి, క్రీ. శ. ౬౦౨ సంవత్సరప్రాంతమున తన ప్రియానుజుఁడగు కుబ్జవిష్ణువర్ధనుని తనకు ప్రతినిధిగా పాలింప నియమించి, దిగ్విజయార్థమై దక్షిణాభిముఖుఁడై, పల్లవరాజధానియగు కాంచీపురము మీఁదికి జనెను. కుబ్జవిష్ణువర్ధనుఁడు, పిష్ఠపురము రాజధానిగాఁ జేసుకొని క్రమక్రమముగా వేంగీమండలము నంతను, కళింగదేశములోని దక్షిణభాగమును, కృష్ణానదికి దక్షిణమునగల విషయములను జయించి స్వాధీనము జేసుకొని రాజ్యమును విస్తరింపఁజేసి క్రీ. శ. ౬౧౫ వ సంవత్సరమునాటికి సర్వస్వతంత్రమైన చిన్నరాజ్యమును నిర్మించి, మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, పరమభట్టారకాది బిరుదమును ధరించి, పశ్చిమచాళుక్యరాజగు సోదరునికి, కప్పము గట్టుట మాని స్వాతంత్ర్యమును బ్రకటించెను.

ఇత డాంధ్రుల చరిత్రయందు పూర్వచాళుక్యాన్వయ వంశకర్తగా బరిగణింపబడుచున్నాఁడు. ఈతని వంశీయు లాంధ్రదేశము నైదు శతాబ్దములకాల మవిచ్ఛిన్నముగా బరిపాలించియుండిరి. ఇతని వంశములోనివాడు, ఆంధ్రులకు చిరపరిచితుఁడును పూజ్యుడును, ఆంధ్రమహాభారత కృతిపతియు నగు రాజరాజనరేంద్రుఁడు.

# ఆంధ్ర దేశము-విదేశ యాత్రికులు

కుబ్జవిష్ణువర్ధనుని కుమారుఁడు, మొదటి జయసింహ వల్లభుఁడు క్రీ. శ. ౬౩౩ వ సంవత్సరమున సింహాసన మధిష్ఠించి ౬౬౩ వఱకును పాలించెను. ఈతఁడు సింహాసన మెక్కిన రెండుమూడు సంవత్సరములనాటికే యుఁఆన్ చ్వాంగ్, ఆంధ్రదేశమును జూడ నేతెంచియుండెను. అప్పటికి దేశమున, జనసంఖ్య చాల తక్కువగా నున్నదని, చీనా యాత్రికుఁడు వ్రాయుచున్నాడు. అందుల కారణము రెండు మూడు తరములనుండి యాంధ్రదేశ మప్పటికి యుద్ధములలో మునుఁగుచు దేలుచున్నట్లు చరిత్ర వాకొనుచున్నది. పూర్వ చాళుక్యులు, దేశమును జయింపకపూర్వము వేంగిరాజ్యమున శాంతిలేకుండెను. కళింగరాజులయిన పూర్వగాంగేయవంశజులు వేంగిపాలకులయిన విష్ణుకుండినులతో, సర్వదా యుద్ధములు సలుపుచుండిరి. కళింగులకును విష్ణుకుండినుల కాత్మబంధువులయిన వాకాటక, కాలచుర్యులకును ప్రబలవైరమగుటచే, విష్ణుకుండినులతో, కళింగరాజులకు వైర మావశ్యకమయ్యెను. ఈ యుభయులా కారణమున, నొకరి రాజ్యములొకరు ఆక్రమించుకొని పగ దీర్చుకొనుటకు సర్వదా ప్రయత్నించుచుండిరి. మరియు సత్యాశ్రయుఁడు, వేంగిరాజ్య సింహాసనముపై సోదరుని నిలిపినతరువాత, చాళుక్యరాజ్యమును సుస్థిరము చేయుటకై, కుబ్జవిష్ణువర్ధనుఁడు, చిన్నచిన్న రాజకుటుంబములతోడను, సామంతాధిపులతోడను బహుకాలము యుద్ధములు చేసియుండవచ్చును. ఆతని తరువాత

జయసింహమహారాజును, రాజ్యాభివృద్ధికై, వరుసగా కృష్ణకు దక్షిణమునగల దేశమును జయింపనారంభించెను. ఇట్లు సుమారొక యర్ధశతాబ్దమువఱకు నెడతెగని పోరాటములలో మునిగియున్న దేశమున జనసంఖ్య స్వల్పముగా నుండక బహుళముగా నెట్లుండును? ఇన్ని కారణములకుతోడు చాళుక్య రాజులకు ప్రక్కలో బల్లెములక్రింద, పశ్చిమమున రాష్ట్రకూటులును, దక్షిణమున పల్లవులును తలయెత్తి మెదలుచు నూపిరి సలుపకుండ నొత్తిడి కలుగజేయుచుండ, జనసంఖ్య నభివృద్ధిలో లేకుండుటయం దాశ్చర్య మేమిగలదు ?

యుఆన్ చ్వాంగ్, వేంగీదేశమునకు వేంగీనగరము రాజధానియని దెలుపుచున్నాడు. కుబ్జవిష్ణువర్ధనుడు పిష్టపురమును రాజధానిగా జేసుకొని యుండగా నాతని కుమారుడు, నగరును వేంగీపురమున కేల మార్చెనో ఎఱుకపడకున్నది. అయినను కారణ మిట్లూహింపవచ్చును. అప్పటివఱకు దేశమును బాలించిన విష్ణుకుండినవంశమునసంకురము లేకుండ నూడబెఱికివేయుటకును, కృష్ణానదికి దక్షిణమున నున్న ప్రాంతమును వశపఱచుకొనుటకును ఈశాన్యదిశనుండి, కళింగ గాంగరాజులవలన కలుగు యొత్తిడికి దూరముగ నుండుటకును అనుకూలమైనదని వేంగీపురమునకు రాజధాని మార్చి యుండును.

యుఆన్ చ్వాంగ్, కళింగనగరమునుండి బయిలు దేరినది మొదలుగా దాను జూచినవాటిని విన్నవాటిని సవి

స్తరముగా వర్ణింపని కతమున, నాకాలమున ప్రసిద్ధము లయిన జైనబ్రాహ్మణక్షేత్రములు, నగరములు, మత, రాజకీయపరిస్థితులు వివరముగా దెలియకున్నవి. ఎందుచేతనో కాని, శ్రీకాకుళమున కనతిదూరముననున్న సాలెహుండాము సంఘారామముగాని, అనకాపల్లికి సమీపముననున్న సంఘారామముగాని, రామతీర్థాలుగాని, పిష్టపురముగాని తక్కుంగల బ్రాహ్మణ, జైనక్షేత్రములుగాని యాతని వ్రాతలందు గానబడకున్నవి. వీని కంతకు నొకటిరెండు కారణములు పొడసూపుచున్నవి. దేశము జనశూన్యమై యుండుటచేత నెక్కడనేది గలదో చూపించువారు లేకపోవుచుండుట మొదటిది గావచ్చును. మనయాత్రికునికి బౌద్ధమతముగాక అన్యమతములందు గల అసహనము రెండవది గావచ్చును. ఉత్తర హిందూస్థానమున నప్పటి కింకను బౌద్ధమతము మంచి యాదరణ బొందుచు, నుచ్ఛదశయం దుండెను. అచ్చట నాత డెక్కడెక్కడకు బోయినను, రాజులు, మహారాజులు, బౌద్ధధర్మావలంబకులయి, బిక్షువులను రావించుచు 'ధర్మ' వ్యాప్తికి సదుపాయములను గల్పించుచు, సంఘారామములను మంచిస్థితియం దుంచుచు బోషించుచుండుట జూచుచుండెను. ఇక దక్షిణాపథమం దట్లు గాకుండెను. రాజు లెక్కడకు బోయినను బ్రాహ్మణమతావలంబకులుగా నుండిరి. శైవ, వైష్ణవ, జైనమతములను జనులు విశేషముగా నాదరించుచుండిరి. వారికి బౌద్ధముపై నాదరము సన్నగిల్లుచుండె.

అంతేగాక, మంత్రశాస్త్రమునందును, శాక్తేయమునందును, ఐంద్రజాలికవిద్యలందును, జనుల కెక్కువగా ప్రమాణబుద్ధి ప్రబలియుండెను. ఆకాలమునాడు వేంగీదేశమున మంత్రవేత్తలు, ఐంద్రజాలికులు, పెక్కుమంది వర్థిల్లుచుండినట్లు, తారానాధుడను తిబెతుదేశీయుఁడు తన బౌద్ధధర్మచరిత్రయందు దెలిపియున్నాడు. కావున తన కభిమానమైన బౌద్ధమతముపై నాదరములేని, పాపిష్టిదేశమని యుఁఆన్ చ్వాంగ్, ఆంధ్రదేశమును సవిస్తరముగా వర్ణింపనని యూహించుకొనవచ్చును.

వేంగీదేశమునుండి మన యాత్రికుఁడు దక్షిణాభిముఖుఁడై చని మహాంధ్రమని ప్రశంసింపబడు ధాన్యకటక (ధరణికోట) దేశమునకు బోయెను. అతడీ దేశము నిట్లు వర్ణించెను.

"ధనకటక దేశ మారు వేలలీలు వైశాల్యమును రాజధాని నలువదిలీలు వైశాల్యమును గలిగియున్నవి. భూమి సారవంతమై చక్కగా ఫలించుచు, సర్వసస్య సమృద్ధమై యున్నది. దేశము చాల భాగము చెట్లు చేమలు లేని యెడారివలె నున్నది. పట్టణములందును జనులు విశేషముగాలేరు. దేశముష్ణ ప్రదేశము. ఇచ్చటి ప్రజలు పసుపు పచ్చగానుండి చామన చాయగలవారు. భయంకర స్వరూపులును, తొందరపాటు గలవారుగా నున్నారు. కాని విద్యా గోష్ఠియున్న, వీరలకు చాలయిష్టము. ఈప్రాంతమున ననేక సంఘారామ

ములుగలవు. కాని, యవియన్నియు చాలభాగము భిక్షుక శూన్యము లయి, శిధిలములయియున్నవి. ఇపుడు, మంచి స్థితి యందున్న యిరువది మాత్ర ముండును, వానియందు దాదాపు వేయిమంది సన్యాసులున్నారు. వీరందరు "మహాసాంఘిక" శాఖకు జెంది, అభిధర్మపిటకము నభ్యసించువారుగా నున్నారు. బ్రాహ్మణదేవాలయములు నీదేశమున నూఱు వఱకు గలవు. అన్యమతస్థులగువారుకూడ నీదేవాలయములందు బూజ లొనర్తురు.

ఈ దేశపు రాజధానికి తూర్పువైపున నొకకొండపై 'పూర్వశైల సంఘారామ మను యొక మఠముగలదు. నగర మునకుపడమటదిశనంటి యున్న మరియొకకొండపై 'అపర శైలసంఘారామ' మను నింకొకమఠము గలదు. బుద్ధునిప్రీతి కొఱకు పూర్వపురాజొకడు ఈమఠములను కొండలదొలిపించి కట్టించెను. ముందుగా నాతడు కొండను లోయగాదొలిపించి మార్గమునేర్పఱచెను. పిదపనామార్గమున కిరుప్రక్కలను గుహాల దొలిపించి విశాలమయిన మందిరములను చావళ్ళను నిర్మింప చేసెను. ఈపర్వతము నావహించియుండు దేవతలీ సంఘారామములను భద్రముగా జూచుచుండెను. పూర్వము మహార్షులనేకు లిచ్చటికే తెంచి కొంతకాలము నివసించి తిరిగి పోవుచుండిరి. బుద్ధుడు నిర్వాణము నొందినతరువాత వేయి సంవత్సరములవఱకు బౌద్ధులు (శ్రామణులు) ఇచ్చట కేతెంచి వర్షకాలమిందు గడపి అర్హంతులై ఆకాశమున ఎగిరి స్వదేశ

ముల కేగుచుండువారు. అట్లు ఒకవేయిసంవత్సరములు వఱకు బౌద్ధులు బౌద్ధసన్యాసులు కలసి యిచ్చట నివసించుచుండిరి. కడచిన నూఱుసంవత్సరములునుండిమాత్రము పూర్వమువలె బిక్షువులు వచ్చుటలేదు. ఆకారణమున పర్వతదేవతలు క్రూర మృగముల యాకృతిగొని యొకప్పుడు కోతివలెను మరి యొకప్పుడు తోడేలువలెను బౌద్ధులకు గానుపించి ఈసంఘా రామములకు బాధాకరు లగుచుండుటచే సన్యాసులు వచ్చుట మానివేసిరి. ఇప్పుడీ దేశము చాలవఱకు నిర్జనమై భయంకరముగా నున్నది.

"ఈ నగరమునకు దక్షిణమున నొక కొండకు పెద్ద సొరంగము గలదు. అందొక అసురుని హర్మ్యముగలదు. ఆహర్మ్యమునందు, శాస్త్రజ్ఞుడగు భావ వివేకస్వామి మైత్రేయబోధిసత్త్వుడు, సుగతుడై యవతరించు నందాక ధ్యాన సమాధియందుండి వేచియున్నాడు. మహాతపశ్శాలి యనియు, జ్ఞానియనియు, సర్వశాస్త్ర పారంగతుడనియు భావవివేకుడు చాల ప్రఖ్యాతి నొందెను. బాహ్య వేషముచేత నీతడు కపిలుని సాంఖ్యశాస్త్రవాదివలె గన్పట్టినను, హృదయమందు మాత్రము నాగార్జునుని మహాయన సంప్రదాయము నవలంబించి యుండెను."

"పూర్వము భావవివేకుడు మగధదేశమున నివసించుచు తన మహిమచే వేలకొలది జనులను బౌద్ధ మతావలంబకులుగా జేయుచున్న ధర్మపాలుని పాండిత్యమును గూర్చి విని,

యాతనితో వాగ్వాదము చేసి గెలుపొందవలయునని సంక ల్పించుకొని శిష్యసమేతుడై మగధ దేశమును గూర్చి పయాన మయ్యెను. పాటలీపుత్రమును జేరునప్పటికి ధర్మపాలుడు, బోధివృక్షము (రావిచెట్టు) క్రింద కూర్చుండి ధ్యానతత్పరుడై సమాధియందున్నాడని వినెను. అంతట భావవివేకుడు తన శిష్యులనుజూచి "ధర్మపాలుడు బోధివృక్షముక్రింద కూర్చుండి సమాధియందున్నవాడట. మీ రాతని కడకుబోయి నా మాటలుగా నిట్లు బల్కుడు. "ధర్మపాల బోధిసత్త్వుడు, బుద్ధుని ధర్మమును ప్రపంచమున కుపదేశించుచున్నాడు. అజ్ఞానులను జ్ఞాన మార్గమునకు ద్రిప్పుచున్నాడు. శిష్యుల చేతను, బౌద్ధులచేతను ధర్మపాలుడెంత పూజింపబడుచున్నను ఆతని తపస్సును ధ్యానమును దీక్షయు వృధయై నిష్ఫలము లయ్యెను. కావున ధర్మపాలుడు బోధివృక్షముక్రింద కూర్చుం డినంతమాత్రమున బుద్ధుడు కాజాలడు. కావున నీ విప్పుడు సమాధియందు బ్రవేశించి జ్ఞానివిగమ్ము. పిమ్మట దేవతలకు మానవులకు గూడ నీవు మార్గదర్శకుడ వగుదువు" అని చెప్పి పంపెను.

"ధర్మపాల బోధిసత్త్వుడా మాటల నాలకించి "మానవజీవితము అనిత్యమైనది. దేహము బుద్బుదప్రాయము. అహోరాత్రములు నేను మోక్షసాధనమును చింతనచేయుచు ధ్యానించుచున్నాను. నీతో వాదము చేయుటకు నాకు నావ కాశము లేదు. కావున నీవు నచ్చినచోటుకే తిరిగి పొమ్ము"

అని బదులు చెప్పెను. తుదకెంతమంది రాయబారులు సందేశము గొనివచ్చినను ఉభయులకు సమావేశము గాలేదు.

పిమ్మట భావవివేకుడు స్వదేశమునకు దిరిగి వచ్చి నిష్కళంకమైన జీవితమును గడపుచు ధ్యాన సమాధియందు ప్రవేశించి "మైత్రేయుడు సుగతుడై వచ్చునందాక నాసందేహములను బాపు వారెవ్వరు? యని చింతింపసాగెను. ఇట్లు చింతానిమగ్నుడై యుండినకాలమున, భావవివేకుడు ఆహారమును నీటిని పరిత్యజించి నిష్ఠాపరుడై మూడు సంవత్సరములహోరాత్రములు, అవలోకితేశ్వర బోధిసత్త్వుని ప్రమోల నిలచి హృదయ ధారణిమంత్రమును పఠించి ధ్యానించెను. అట్లు మూడు సంవత్సరములు గతించునప్పటికి అవలోకితేశ్వరుడు మోహనమూర్తితో ప్రత్యక్షమై "శాస్త్రపారంగతుడా, నీ వేమి కోరినన్ను ధ్యానించితివి" అని ప్రశ్నించెను. భావవివేకు డపుడు "నా దేహమును, మైత్రేయుడు సుగతుడై వచ్చునందాక నిలచియుండున ట్లనుగ్రహింపుము." అని ప్రార్థించెను. అవలోకితేశ్వరు డంతట "ఓయీ! మానవుని జీవితము క్షణక్షణమును విపత్తులకు లోనై యున్నది. ప్రపంచమంతయు శూన్యమైనది. కావున నీవు జీవితముయొక్క పరమార్థమును, 'తుషిత' స్వర్గమును బొంది మైత్రేయుని బోధనల నాలకింపుటగా గ్రహించి యాతడు బుద్ధుడై యవతరించిన వెనుక ఆతనివలన నిర్వాణ మార్గమున గ్రహించెదవు గాక యని హెచ్చరించెను. భావవివేకు డామందలింపులను

విని "దేవా! నామనస్సు నిశ్చలమైనది. నేను నీనిశ్చితార్థము వీడను" అని బదులు చెప్పెను. అవలోకితేశ్వర బోధి సత్త్వుడపుడు "అటులయినచో, నీవు ధాన్యకటక దేశముకరుగుము. ఆదేశపురాజధానికి దక్షిణమున నొక కొండలో సొరంగ మొకటికలదు. అందు వజ్రపాణియను పర్వతదేవుడు గలడు. ఆశక్తిను ద్దేశించి వజ్రపాణిధారణి స్తోత్రమును జపింపుము. ఆతడే నీయభీష్టము నెరవేర్పగలవాడు." అని బోధించెను.

భావవివేకుడీ మహాంధ్రదేశమునకు వచ్చి వజ్రపాణి దేవును ద్దేశించి ధారణిని మూడు సంవత్సరము లేకచిత్తముతో జపించి వజ్రపాణిని ప్రత్యక్షము చేసికొనెను. వజ్రపాణి భావవివేకుని జూచి "శాస్త్రజ్ఞుడా! నీవేమి కోరి నా గూర్చి ఘోరమగు తపస్సు చేయుచున్నాడవు?" అని యడిగెను. అంతట నాతార్కికుడు "మైత్రేయ బోధిసత్త్వుడు వచ్చునందాక నేనీదేహముతో నుండవలెనని కోరుచున్నాను. అవలోకితేశ్వర బోధిసత్త్వునిచే ప్రేరితుడనై నిన్ను ప్రార్థింప వచ్చితిని. దేవా నీ వీయుపకారమును చేయనోపుదు వేని యనుగ్రహింపుము." అని ప్రార్థించెను.

"వజ్రపాణి దేవుడు సంతుష్టాంతరంగుడై భావవివేకుని కొక మంత్రము నుపదేశించి యిట్లనెను. ఈ పర్వతమునందసురుల ప్రాసాదమున్నది. నీ వీమంత్రమును విధ్యుక్తముగా జరిపించినచో నామాహాత్మ్యముయొక్క శిలాద్వారములు వాని

యంతట నవి తెఱచికొనును. అంతట నీవు లోనికి బ్రవేశించి మైత్రేయుని యాగమమునకై నిరీక్షించుచుండుము. "భావవివేకుడపుడయ్యా నేనీ అంధకారమున నివసించుచుండ సుగతుని యాగమనమెట్లు తెలిసికొనగలను." అని ప్రశ్నించెను. అంతట వజ్రపాణి, "నేను సుగతుని రాక నెరిగించి, లోకమునకు చాటుదును. నీ వంతట, వెలికి రావచ్చును." అని బల్కెను.

"ఇట్లు భావవివేకుడు, వజ్రపాణిచే బోధితుడై తదేకధ్యాన నిష్ఠతో నామంత్రమును మూడు వర్షములు జపించెను. మంత్రోచ్చారణచే పవిత్రీకృతములయిన ఆవగింజలను కొండపై జల్లెను. వెంటనే, యానగము నందు బ్రహ్మాండమయిన సొరంగ మొకటి గాన్పించెను. ఆసొరంగము జూచుటకై అనేకమంది జనులు వచ్చిరి, కాని వారెవ్వరును నా సొరంగమును విడచి పోజాలనట్లు ఆతనికిపొడగట్టెను. వారి స్థితిని జూచి భావవివేకుడు, స్థిరచిత్తుడై, యాగుహాసింహద్వారముయొక్క గడపనుదాటి లోనికి బ్రవేశించి, తన్నవలోకించుచున్న జనసమూహాము వైపు ముఖము ద్రిప్పి చిరకాలమునుండి మైత్రేయుని సందర్శనము కొరకై ధ్యానించితిని, పూజలు చేసితిని, ఇప్పటికి దేవతల కరుణా ప్రభావము వలన, నాశపథము నెరవేరినది. నేను మైత్రేయుని జూడబోవు చున్నాను. బుద్ధునియొక్క యుపదేశమును బొంద గోరువారు, నాతోగూడ నీ గుహాంతరాళమును బవేశించుడు, రండు." యని బిగ్గరగా నాహ్వానించి పల్కెను.

"అచ్చట మూగినజనులు అతని వాక్యములను విని యాశ్చర్య భయముల నొక్కమారుగా బొందిరి. పిమ్మట "ఇది పాతాళము, యిక్కడ పాములుండును. మమ్ముల నవి చంపివేయును. మేము నీతోడ రాజాలము" ని చెప్పిరి. భావ వివేకుడు వారినట్లు ముమ్మారు పిలచెను: ముమ్మారును, వారాతని అనుగమించుటకు సంశయించిరి. కాని యిర్వురు మాత్రము ఆతనివెంట రా సన్నద్ధులైరి. జనసమూహమం తయు దనవంకయు, దనయిర్వుర శిష్యులవంకయు, భీతచిత్తు లయి నివ్వెరపాటుతో దిలకించుచుండ భావవివేకుడు సొరం గములోనికి నడిచిపోయెను. వెంటనే పర్వతసొరంగముచుట్టును శిలాద్వారములు మూసికొనిపోయెను. వెనుక మిగిలినవారు తమ తెలివిమాలినతనమునకు సిగ్గిలుచు, భావవివేకస్వామి పలుకులు పాలకింప మైతిమిగదా యని పశ్చాత్తాపముతో నిండ్లకు మరలిపోయిరి."

"ఇక్కడనుండి దక్షిణముగా వేయిలీలు రెండువందల మైళ్ళు ప్రయాణముచేసి మేము చోడమండలము (చు-లి-య) బ్రవేశించితిమి."

మన యాత్రికుడు ధనకటకదేశమును "తే-న-క-చే-క" అని పేర్కొనియున్నాడు. తే-న-క-చే-క పదము సంస్కృత మున ధనకచకము. లేక ధనకటక మగుచున్నదని పండితు లంగీకరించిరి. ఈధనకటకము టిబెటుదేశ గ్రంథములలో ధాన్య రాసులుండు పట్టణమని పిలువబడుచున్నది. ధాన్యకటకము

ధనకటకము, ధాన్యవాటీపురము, ధాన్యవతీపురము అను పేరులు అమరావతీ నగరమునకు సంబంధించిన పేర్లుగా క్రీ. శ. ౧౦, ౧౧, ౧౨, ౧౩ శతాబ్దముల కాలమునాటి విచ్చట లభించిన శిలాశాసములందు గానవచ్చుచున్నవి. ఒకప్పుడీ పేరులన్నియు నీకాలమున ధరణికోటయని బరగు చున్న నగరమునకే వర్తిలుచుండెను భరతఖండమునందలి పురాతన పట్టణములలో పాటలీపుత్రము తరువాత విశేష ప్రఖ్యాతిగాంచిన దీధాన్యకటక నగరము. ఇది అయిదు శతాబ్ద ములకాల మాంధ్ర మహాసామ్రాజ్యమునకు రాజధానియై, మహోన్నత వైభవమును గాంచెను. ఆపూర్వపు వైభవము నేడు అమరావతి ధరణికోట మంటిదిబ్బలయందు, పాడయి శిథిలావశిష్టములయిన కట్టడములందును గానవచ్చుచు నచ్చె రువు గలిగించుచునే యున్నది.

ధాన్యకటక ప్రాంతమును యూఁఆన్‌చ్వాంగ్ వ్రాతను బట్టి, కన్నింగ్‌హాముదార దానకొట్టదేశమనియు, ధరణికోట ధారణికోటగాని ధరణికోటగాదనియు, భావవివేకస్వామి, వజ్రపాణి ధారణిని జంపించుటచే ధారణికోట యయ్యెననియు విపరీతముగ సిద్ధాంతముచేసినాడు $. ధనకటక నగరముండు దేశమగుటచే యూఁఆన్‌చ్వాంగ్ ధనకటక నగరనామము నా దేశమునకు ముడిపెట్టెను. కాని రాజధాని పేరు నిశ్చయింపలేదు. ఇదిగాక మరియొకచోట మనయాత్రికుఁడు ధనకటక

$ Ancient Geography of India 530 ff. J. R. A. S. 1873. p 263.

దేశమును మహాంధ్రదేశమని బిలచెదరని చెప్పియున్నాడు. ఒకప్పుడు మహాంధ్రదేశమునకు ధాన్యకటకము రాజధానియై యుండెను, గాని యుఆన్‌చ్వాంగ్ వ్రాతలబట్టి జూడ నేడవ శతాబ్దాదిని విజయవాడ రాజధానిగ నుండినట్లు దోచెడిని*. అదియునుగాక ధాన్యకటక దేశము చాళుక్య రాజ్యములో జేరియుండక వేరు రాజ్యముగ నుండెనేమో తెలియగాదు. అట్లున్నట్లు, ఇంతవఱకు శాసన ప్రమాణము గానవచ్చుటలేదు. యువాఙ్‌చ్వాంగ్ వ్రాసిన దానిని బట్టి యాతఁడు ధరణికోటను గాని అమరావతీస్తూపమును గాని గాంచి యుండలేదనియు, నాతఁడు వర్ణించిన రాజధాని విజయవాడయనియు నిర్ణయింపవచ్చును. ఆతఁడు చెప్పిన వర్ణనలన్నియు చక్కగా విజయవాడకు సరిపోవుచున్నవనియు, ధరణికోటకు సరిపోవుటలేదనియు, నీప్రాంతమునంతయు సూక్ష్మముగా బరిశీలించిన రాబర్టు సూయలు, జేమ్సుబర్గెస్, బాస్వేలుదొరల యభిప్రాయము యదార్థముగ గన్పట్టుచున్నది¶. మరియు యుఆఙ్‌చ్వాంగ్ ఆరుమాసము లక్కడనుండి ప్రతియంశమును, గుహను, దేవాలయమును సారంగమును ప్రత్యక్షముగ చూచినవాడగుటచే, నాతఁడు వ్రాసినదానిలో నేమియు తప్పుగాని, పొరబాటునుగాని గన్పట్టుటలేదు. ఈకారణమువలన, యుఆఙ్‌చ్వాంగ్ వర్ణించిన ధనకటకదేశపు రాజధాని విజయ

* Archaeo logical Survey of South India. P. 9. ff.

¶ J. R. S. 1173. q 263 J. R. A. S. Vol. XIIp 98 ff.

వాటిక యనియే నిశ్చయింపవలయును. బౌద్ధోపాసకులు విజయవాడ, సీతానగరము, ఉండవల్లి, గుహాలందు నివాసము చేయుచుండిన కాలమున అక్కడి సంఘారామములన్నియు రాత్రివేళబారులు దీర్చిన దీపములతో కనులపండువ సేయుచు మనోహరముగ నుండెనుగాబోలు !

యుఁఆన్ చ్వాంగ్ ధాన్యకటక దేశమునందలి బౌద్ధసన్యాసులు మహాసాంఘిక శాఖకు జెందినవారని చెప్పుచున్నాడు. మరియు నీతడిచ్చటి భిక్షువులకడ అభిధర్మ పీఠికను అభ్యసించి తిరిగి వారికి మహాయన మార్గమును బోధించెననిగూడ దెలియుచున్నది.

యుఁఆన్ చ్వాంగ్ వర్ణించిన పూర్వశైల సంఘారామము అపరశైల సంఘారామమును బెజవాడనగరమున కిరుప్రక్కలగల కొండలపై యుండునట్లు గాన్పించెడిని. శిథిలములయిన కట్టడములు, గుహాలు, మొదలగునవి యీ యూహానుబలపఱచుచున్నవి. భావవివేకస్వామిఅపరశైలమున, హృదయధారణిని జపించి, అవలోకితేశ్వరుని ప్రత్యక్షముచేసుకొని యుండెనట. ఆయవలోకితేశ్వడీకాలమునాటి మల్లేశ్వరుడగునేమో!మనయాత్రికునివర్ణనలనుపరీక్షించివిజయవాడయందలిఅపరశైల,పూర్వశైల సంఘారామములు రెండును ఒక్కటే మఠమని నిరూపించుచున్నట్లు తోచును.అపరశైలము కనకదుర్గదేవాలయమున్న కొండ. దానిపై నేటికి ననేకగుహాలు, కట్టడములు ప్రాచీనకట్టడముల చిహ్నములు గానవచ్చుచున్నవి.

అట్టిగుహాలు, కట్టడములు కొన్ని పూర్వశైలమునగూడ నీకాలమున గానవచ్చుచున్నవి. ఈ గుహాలను పాడుచేసి, కృష్ణానదికి ఆనకట్టకట్టిన కాలమున, మంచిమంచి ఱాళ్ళు, శాసనములున్న వాటిని, దీసుకొనిపోయి పునాదులక్రింద నదిలో బారవైచిరి. అందులచేత చరిత్రాంశములు చాలవఱకు మనకులు ప్తమైపోయెను. ఈ పూర్వశైల, అపరశైల సంఘారామములను బౌద్ధసన్యాసులిచ్చట వర్షకాలములో నివసించుటకై యొకరాజు గట్టించెనట. ఆ రాజెవ్వరైయుండునో? యుఁఆన్‌చ్వాంగ్ గ్రంథముయొక్క మరియొక పాఠమునందు "రాజు కొండను రెండుగా బ్రద్దలగొట్టించి నదిగుండ నొకబాటను వేసెను. ఆకొండను దొలిపించి చక్కని చావళ్ళు మందిరములు వసారాలు విహారములు నిర్మించెను." అని యున్నది. ఈసందర్భమున యాత్రికుడు వ్రాసిన వ్రాతలు సందిగ్ధముగనుండుటచే నేమియు నర్థముగాకున్నది. కృష్ణానది బెజవాడకడ సీతానగరము కొండకును, ఇంద్రకీలపర్వతమునకు నడుమగా కనుములోనుండి ప్రవహించుచున్నది. మరియు, నీనది ప్రవహించుటకు కొండ రెండుగా జీల్పబడినట్లుగానబడుచున్నది. పూర్వకాలమున నది, ఉండవల్లి కొండనంటి సీతానగరపు కొండకు దక్షిణపువైపున, నా రెండు కొండలకు నడుమగా ప్రవహించినట్లు చిహ్నములు గాన్పించుచున్నవి. ఈకాలమున నది ప్రవహించుతావున పూర్వకాలపు విజయవాడ యుండెనేమో యని సందియముగలుగుచున్నది.

ఈ యూహయే నిజమైనచో, యుఆన్ చ్వాంగ్ చెప్పినది నిజమయి యుండవచ్చును. మరియు పూర్వము ఇంద్రకీలపర్వతముమీద, దక్షిణపువైపునకూడ నదినంటి యేమయిన గుహాలుండెనేమో; యిపుడవియన్నియు నది నొఱసి ప్రవహించుటచేజీర్ణమయి యుండవచ్చును. ఈగుహాలు మఠమును నగరమునకు సమీపముగా నుండినట్లు యాత్రికుని వర్ణనలవలన దెలియుచున్నది.

ఊరికి దక్షిణమున నొకకొండ గలదనియు, నచ్చట భావవివేకస్వామి తపస్సు చేసికొన్నట్టియు అసురుల హర్మ్యమున్నట్టియు పర్వతము గలదని యుఆన్ చ్వాంగ్ చెప్పుచున్నాడు. సీతానగరము ఉండవిల్లి కొండలమీదనున్న ఏకశిలానిర్మితమయిన దేవాలయమును కొండయు యుఆన్ చ్వాంగ్ వర్ణించినట్టి స్థలమని "సూయలు" నిరూపించుచున్నాడు. ఉండవిల్లి కొండపైనున్న, దేవాలయము ప్రాచీనతను జాటదని ఫెర్గసను వాదించినప్పటికిని యితరబౌద్ధగుహాలు ఆలయములు ఎట్లుబ్రాహ్మణ శైవ మతవిజృంభణకాలమును మార్పుచేయబడినవో యీగుహాలయమును తరువాతకాలమున చిత్రవిచిత్రాలంకారములతో శిల్పముతో తరువాత కాలమున అభివృద్ధి చేయబడి యుండునని సమాధానము చెప్పవచ్చును.

భావవివేకు డాంధ్రుడైనను, మహా తార్కికుడైనను శాస్త్రజ్ఞుడైనను బౌద్ధుడగుటచే నీర్ష్యాపరులగు బ్రాహ్మణమతస్థు లాతని బుద్ధిపూర్వకముగ విస్మరించిరి. ఇతరబౌద్ధగ్రం

థములతో పాటు అతని గ్రంథములగూడ దగ్ధముగావించిరి. ఈతని పాండిత్య మహిమయు, కీర్తియు, జీవితమును చీనా, టిబెతు గ్రంథములవలన దెలియవచ్చుచున్నది. ఈతనివలె బౌద్ధులయిన సుప్రసిద్ధాంధ్రు లనేకులు, స్వదేశమును విస్మరింపు టెంతయు శోచనీయము. ఇది బ్రాహ్మణమత ప్రభావముకాని వేఱుకాదు. మలయగిరిప్రాంత మీభావవివేకుని జన్మభూమియని దెలియుచున్నది. మలయగిరి యనగా నిప్పటి విశాఖపట్టణ మండలములోని పశ్చిమభాగమని గాని, వింధ్య పర్వతపంక్తియొక్క తూర్పు కొనయనిగాని భావింపవచ్చును. ఈతడే కాలపువాడో తెలిసికొనుట కాధారములులేవు, గాని యీతనిశిష్యులు నాగార్జుననికిని, దిఙ్నాగునికిని నడుమ కాలమున జీవించి యుండినట్లు యీచింగ్ చెప్పియున్నాడు. యుఆన్‌చ్వాంగ్ వ్రాసిన దానిబట్టి, భావవివేకుడు శీలభద్రునికి గురువగు ధర్మపాలుని కించుక సమకాలీనుడని తెలియుచున్నది. ఈతడు రచించిన మహాయన ముఖ్యహస్తశాస్త్రమను గ్రంథము చీనాభాషలోనికి భాషాంతరీకరింపబడియున్నది. దానిని యుఆన్‌చ్వాంగ్ చీనాదేశమునకు తిరిగి వెళ్ళినతరువాత క్రీ. శ. ౬౪౭ వ సంవత్సరమున భాషాంతరీకరించెను. ఈ గ్రంథము భావవివేకుని యఖండతార్కికశక్తితో విరాజిల్లుచున్నది. ఇందాతడు బౌద్ధమతములో నన్ని సంప్రదాయముల వారియొక్కయు, శాఖలయొక్కయు సిద్ధాంతముల విమర్శించుచు వ్రాసెను. సాంఖ్యసిద్ధాంతమునుగూడ నాతడు

తన గ్రంథమునందు విమర్శించి యుండెను. నాగార్జునుని ప్రజ్ఞా పారమితసూత్రమునకు వ్యాఖ్యానముగా నీతడు "ప్రజ్ఞాలంప శాస్త్రప్రదీపిక" యను గ్రంథమును రచించెను. ఇదియు చీనాభాషలో గలదు. ఈ గ్రంథమునందు నాగార్జునుని మహాయన సంప్రదాయములను సిద్ధాంతముచేసి సమర్థించుటకై భావవివేకుడు సాంఖ్యమునే విశేషముగ నుపయోగించెను. ఈ "ప్రజ్ఞాలంప శాస్త్రప్రదీపిక" తిబెతుభాషయందు, ప్రజ్ఞాప్రదీప మూలా-మాధ్యమిక వృత్తి" యని బరగుచున్నది* ఈతనిచే రచింపబడిన మరియొక గ్రంథము తిబెతుభాష లోనే యున్నది. దాని పేరు "తార్కికజ్వాలా" యుట. ఇది యించుమించుగ "ప్రజ్ఞాప్రదీపశాస్త్ర" మువలె నుండును‡

భావవివేకస్వామి ఉపాసించిన వజ్రపాణి మంత్రి శాస్త్రమున కధిదేవతయని బౌద్ధగ్రంథములు జాటు చున్నవి. మరికొన్ని యాతడు బోధిసత్త్వుడని వాకొనుచున్న వి. మరికొన్ని యాతని యక్షులకు నాయకుడని చేర్కొను చున్నవి. ధారణిసూత్రముల నుపాసనావిధిప్రకారము, ఆవగింజలు మంత్రమున కుపయోగింతురని యుఆన్ చ్వాంగ్ చెప్పు చున్నాడు. విధ్యుక్తముగా జపించిన నావగింజలతో, వర్షము కురిపింపవచ్చునట! పర్వతములను ఛేదింపవచ్చునట! భూమిని రెండుగా జీల్చి వేయనచ్చునని ధారణిసూత్రములు ప్రతిపా

* Taranatha's History of Buddhism p.277

‡ Wassaf's Budhism p. 287

దించుచున్నవి. భావవివేకుడు జపించిన హృదయ ధారణి సూత్రము, యుఁఆన్ చ్వాంగ్ తన దేశమునకు గొంపోయెను. అద్దానిని చీనా దేశములోనికి చిటూంగ్ అనువాడు భాషాంతరీకరించెను. ఈసూత్రమిప్పుడు ఇంగ్లీషు భాషలోనికి భాషాంతరీకరింపబడి, ౧౮౭౫ వ సంవత్సరపు రాయల్ ఏషియాటిక్ సొసైటీవారి పత్రికయందు ౨౭ వ పేజీయందు ప్రకటింపబడి యున్నది.

విజయవాడ లేక ధాన్యకటక దేశము నుండి దక్షిణాభిముఖుడై యుఁఆన్ చ్వాంగ్ చోళ మండలమునుగూర్చి బోయెను. దేశమును గూర్చి యాతడిట్లు వ్రాసెను.

“చోళదేశము ౨౪౦౦, ౨౫౦౦ లీలు (౬౦౦ మైళ్ళు) వైశాల్యము గలిగియున్నది. రాజధాని పదిలీలు వైశాల్యము గలిగి యున్నది. దేశము భయంకరముగానుండి, నిర్జనమై యున్నది. ఎటుజూచినను చిట్టడవులును, తేమలూరు భూములును గాన్పించును. బందిపోటు దొంగలు నిర్భయులయి గ్రామములగుండ పోవుచు, దోచుకొను చుండుటచే, జనులు కాపురము చేయుటకు భయపడుచుందురు. దేశము ఇతరాంధ్ర దేశమువలె, యుష్ణముగా నుండును. జనులు చంచల స్వభావులును, క్రూరులుగా నున్నారు. వీరిలో జాలమంది బ్రాహ్మణులు. సంఘారామములును బిక్షుక శూన్యములై అసహ్యములుగా నుండుచు శిథిలమయి పోవుచున్నవి. ఉన్న సన్యాసులుకూడ నశుభ్రముగా నున్నారు. బ్రాహ్మణ దేవాల

యము లనేకములు గలవు. ఇక్కడ దిగంబర జైనులును పెక్కుమంది గలరు.

"రాజధానికి నైరృతిగా నొక యశోకవనమును,స్తూపమును గలవు. పూర్వమిచ్చట తథాగతుఁడు చాలకాలము నివసించియుండి, చాలమంది దిగంబరజైనులను బ్రాహ్మణులను, దేవతలను, బౌద్ధులనుగా జేసియుండెను."

"నగరమునకు పశ్చిమముగా అనతిదూరమున నొక పురాతనమైన సంఘారామము గలదు. ఇచ్చట అర్హతుడొకనితో, దేవబోధిసత్త్వుడు వాదించెను. ఆవృత్తాంతమిట్టిది. దేవబోధిసత్త్వ డొకప్పుడీ సంఘారామమునందు ఉత్తరుడను అర్హతుఁడు నివసించుచుండుననియు, నాతడు షడభిజ్ఞుఁడనియు అష్టవిమోక్షకుడనియు విని యాతనిఁజూచి యాతని జీవితపద్ధతి నవలంబింపగోరి నేతెంచియుండెను. ఆసంఘారామమునకు వచ్చి తన కారాత్రి నిదురించుటకు తావొసంగవలసినదని అర్హతుని బ్రార్థించెను. అర్హతు డుత్తరుడు నివసించు చోట నొక మంచము మాత్రమే యుండెను. అయినను దేవబోధిసత్త్వుడు, అర్హతుని యాధిక్యమును గ్రహించి, యాతని గదిని బ్రవేశించెను. అర్హతుని కొక చాపయు లేనందున కొన్ని రెల్లుదుబ్బులను దెచ్చి చాపగాచేసి, దేవుని కూర్చుండ బ్రార్థించెను. దేవబోధిసత్త్వ డాసీనుఁడైన పిదప అర్హతుఁడు ధ్యానసమాధియందు బ్రవేశించి, అర్ధరాత్రము గతించినవెనుక లేచివచ్చెను. దేవుఁడప్పుడు

తనకు సంశయము లున్నవనియు, వానిని దీర్పవలసినదనియు నాతని ప్రార్థించెను. దేవుడు ప్రశ్నించుచుండ, అర్హాతుఁడొక దాని వెనుక నింకొక దానికి నదుత్తరము నొసంగెను. ఆత డాడిన ప్రతిపదమును పరిశీలించుచు దేవుడు సూక్ష్మములును దురవగాహములునగు ప్రశ్నలను వేయ నారంభించెను. అర్హాతు డట్లే ఏడవపర్యాయము వాదమారంభించువఱకు ప్రత్యుత్తర మిచ్చెను, గాని పిదప సమాధానము చెప్పజాలక మౌనము వహించి తన దివ్యప్రభావముచే పరకాయప్రవేశముచేసి తుషిత స్వర్గమునుజొచ్చి మైత్రేయుని దేవుడడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తర మీయవలసినదని ప్రార్థించెను. మైత్రేయు డాతనికి గావలసినసమాధాన మిచ్చి "అర్హాతుడా! ఈ ప్రశ్న వేసిన వాడెవడో నీవెరుగుదువా? ఆతడు బోధిసత్వుడగు దేవుడు, మహాప్రజ్ఞావంతుడు. అనేక కల్పములనుండి జీవించుచు ధర్మము (బౌద్ధమతము) నవలంబించుచున్నాడు. భద్రకల్పము యొక్క నడుమకాలమున ఈతఁడు బుద్ధుఁడై యవతరించును. నీవిది యెఱుగవు. కావున వెంటనే యరిగి యాతని విశేషముగ నత్కరించి పూజింపుము" అని చెప్పి పంపివైచెను.

ఆయుత్తరక్షణమున అర్హాతుఁడు నిజశరీరమున ప్రవేశించి బోధిసత్వుడడిగిన ప్రశ్నలకు చక్కగా ప్రత్యుత్తరముల నిచ్చి సందేహములను బాపెను. దేవుడంతట "అయ్యా! ఇపుడు నీవు చెప్పిన విషయములు నీవు జ్ఞానివై స్వతంత్రముగ దెలిసికొనినవిగావు. మైత్రేయబోధిసత్వుడుతక్క నితరుల కీ

రహస్యము లెఱుంగరానివి. కావున తమకీ రహస్యము లింత సులభముగ నెట్లు తెలియవచ్చెనో ఆశ్చర్యముగ నున్నది." అని బల్కెను. అర్హాతు డపుడు "దేవుడా ! నీవు బల్కినది సత్యము. ఇది యంతయు తథాగతుని ప్రజ్ఞయే"అని యనుచు ఆసనమునుండిలేచి బోధిసత్త్వునకు సాష్టాంగముగ బ్రణమిల్లి స్తుతించి పూజించెను."

చరిత్రకారులు చాలమంది యుఆన్‌చ్వాంగ్ ధాన్యకటక దేశమునుండి దక్షిణమున కావేరి తీరమున గల చోళ దేశమున కెట్లు ముందు పోగలిగెనా యని సందేహించి యీతడు వ్రాసినదానిని ఖండింప నారంభించిరి. కాని వారి ఖండనములు ఆశ్చర్యముగను ఆధారరహితములుగను గన్పట్టుచున్నవి. యుఆన్‌చ్వాంగ్ వర్ణనల ప్రకారము ఆతడు బేర్కొని యుండిన దేశము ఇప్పటి కర్నూలుమండల మగుచున్నది. † ఈప్రాంతమును మనయాత్రికుని కాలమున తెలుగుచోడ వంశములు బరిపాలించుచుండినట్లును ఇయ్యది చోళ మండలమని బిలువబడుచుండినట్లును శాసనములవలన దెలియుచున్నది.* శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు చోళమండలము కడపజిల్లాయని నిర్ణయించుచున్నారు. గాని యది కేవలము ప్రమాణముగాదు. కడపమండలముగాక కర్నూలుమండలముగూడ చోళదేశమున జేరియుం

† Cunningham's Ancient Geography of India p. 545

* Report on Epigraphy Southern Circle for p. 1905

డును. ఈదేశమును వర్ణించిన మనయాత్రికు డీరాజ్యమెవరి పాలనమునందున్నదో యాకాలపు కాంచీపురపల్లవరాజగు నరసింహవర్మకు సామంతుఁడో లేక స్వతంత్రుడో దెల్పియుండ లేదు. అయినను చోళమండల మితర శాసనముల బట్టి పల్లవ రాజ్యములో జేరినట్లు దెలియుచున్నది; గావున సామంత రాజ్య మనియే యెంచవలయును.

చోళమండలమునకు నెల్లూరు (విక్రమసింహపురము) రాజధాని గావచ్చునని వాటర్సు పెర్గసను మున్నగు పండి తులు నిర్ణయించిరి, గాని వారివాదము తృప్తికరముగ లేదు. కాని చోళరాజధాని ఎచ్చటనున్నదో అర్హాతుడు త్తరు డెక్కడ నివసించెనో దెలియరాదు. చోళ దేశమునుండి మనయాత్రికుడు తనగురునగు శీలభద్రుని జన్మస్థానమగు కాంచీపురమును ద్రావిడదేశమును జూడబోయెను.

యుఁఆన్‌చ్వాంగ్‌తో నాంధ్రదేశమును, మహేంద్రగిరి మొదలుకొని ద్రావిడదేశము వఱకును ప్రయాణమునల్పి యాతడు వర్ణించినవర్ణలనుబట్టి యాకాలపు స్థితిగతులను వ్యవస్థలను కొంతవఱకు గ్రహింపగలిగితిమి. ఇంచుమించుగా క్రీ. శ. ౬౩౭ వ సంవత్సరమున, వర్షకాలముగడచిన వెనుక కళింగదేశమును బ్రవేశించి యక్కడ కొద్దిదినములుండి కోసల మునకరిగి యచ్చటనుండి, ఆంధ్రవేంగీరాజ్యమును జొచ్చి పిదప విజయవాటికేగి యచ్చట క్రీ. శ. ౬౩౯ - ౬౪౦ వ సంవత్సర ముల నడుమభాగమున నివసించి పిమ్మట చోళదేశమువిూదు

గా కాంచీపురమునకు బోయెను. మొత్తముమీద నాంధ్ర దేశమున నీతడు పదునెనిమిది మాసములు లేక రెండుసంవత్సరముల కాలము గడపెను. ఈతడిచ్చిన కొలతలు ఒకప్పుడు ఎక్కువగ నుండుచు వచ్చినను అవిపొరబాటులని గ్రహింపవలసినదే గాని మరియొండుగాదు. కాక ఆకాలమున దేశమునందు ప్రయాణమున కనుకూలములయినబాట లిప్పటివలె నుండక కొన్నిసమయములందు కొండలడ్డముచేతను, అడవులడ్డముచేతను చుట్టుతిరిగి యుండవచ్చును. మన దేశమును జూచి మనచే విస్మరింపబడియున్న వృత్తాంతములను స్థలములను మరలనొకసారి జ్ఞప్తికిదెచ్చి మహోపకారము చేసిన యుఃఆన్‌చ్వాంగ్ మనకు చిరస్మరణీయుడేకాదు, మనకృతజ్ఞతకు పాత్రుడైనవాడు.

# మా రోజుల్లో

# మార్కోపోలో

యుఁఆన్‌చ్వాంగునకు వెనుక నాంధ్రదేశమును సందర్శించి చనిన విదేశీయులలో పదమూఁడవ శతాబ్దాంతమున ఏతెంచియుండిన మార్కో-పోలో ఆంధ్రులకృతజ్ఞతకుఁ బాత్రుఁడు. ఆతని జీవితమును ఆతని గ్రంథమును కడు మనోజ్ఞములు. ఆతఁడు తెలిపిన విశేషములన్నియు వింతకథలవలె దోఁచుచుండును. పాశ్చాత్యప్రపంచమున టోలమీ తరువాతను కొలంబసునకు బూర్వము, నీతని బోలిన భూగోళశాస్త్రజ్ఞుఁడుగాని, భూప్రదక్షిణము చేసి వచ్చినవాడుగాని మరియొకడు గానరాడు. కొందఱు పండితు లీతని కొలంబసు కంటె ఘనుడని వాదించుచున్నారు. మార్కో-పోలో జన్మింపకుండిన కొలంబసు అమెరికాను చూడగలుగుట జరిగియుండక పోవునని వారి తాత్పర్యము. హిందూస్థానముయొక్క నాగరతావిశేషము, హిందూదేశీయులయొక్క బుద్ధి, ప్రతిభ, తేజము, ఐశ్వర్యము ఖండఖండాంతరములకు వ్యాపించుటకు మధ్యయుగమునందు మార్కో-పోలో కారకుడు. ఆతఁడు రచించిన గ్రంథము సాహసికజీవులకు నూతనోత్సాహము బోసి యావేశము కలిగించెను. దానిఫలితమే, కొలంబసు అమెరికాను గనుగొనుటయు, పోర్చుగీసువారు అట్లాంటిక్ మహాసముద్రమునంతయు దాటి, అఫ్రికాఖండమును జుట్టివచ్చి, హిందూదేశమును, సముద్రముమీదుగా జేరుకొనుటయు నని చెప్పవచ్చును.

మార్కో-పోలో జీవిత మొక చిత్రమైన కథవలె నుం

6½

డును. ఇటలీదేశమున వెనీషియానగరమున పండ్రెండవ శతాబ్దమున 'పోలో' యని యింటిపేరుగల, ప్రసిద్ధవర్తకుల కుటుంబ మొకటి యుండెను. ఆకుటుంబమునందు క్రీ. శ. ౧౨౫౪ వ సంవత్సరమున మనకథానాయకుడగు మార్కోపోలో జన్మించెను. మార్కో, పితామహునిపేరు ఆండ్రియాపోలో. ఆతనికి ముగ్గురు కుమారులుండిరి. వారిలో జ్యేష్ఠుడు మాఫియో. రెండవవాడు నికోలో. ఇతడే, మనమార్కోకు జనకుడు. మూడవవానిపేరు మార్కో. మాఫియోపోలో, నికోలోపోలోయును గలిసి, తుర్కీరాజధానియైన కానిస్టాంటినోపిలు (స్టాంబూలు అని తుర్కీవారు పిలుతురు) నగరమున, సమిష్టిగా వ్యాపార మారంభించిరి. మార్కోయాత్రము సోదరులతో కలియక, సొంతముగా నాయూరనే వర్తకము చేసుకొనుచుండెను.

ఇట్లుండ, క్రీ. శ. ౧౨౬౦ వ సంవత్సరమున వ్యాపారార్థమై నికోలో, మాఫియో పోలోలు, నల్లసముద్రమును దాటి ఉత్తరాభిముఖులై క్రిమియాద్వీపమునకు జనిరి. ఆ ద్వీపమునకు ప్రధానరేవుపట్టణమును, రాజధానియు, సోల్డియానగరమున, మనపోలో సోదరులు వర్తకమువలన విశేషలాభమును గడింపగలిగిరి. అంతట వచ్చినలాభముతో, నమూల్యములయిన వస్తువులను, రత్నములను అపూర్వములయిన యితరములను గొని యింకను విశేషలాభాపేక్షతో, నుత్తరదిశగా, తార్తారరాజధానికి జనిరి. తార్తారదేశాధీశుడీ

వెనీషియను వణిక్కుల నుచితరీతి సంభావించి, విశేషలాభ మిచ్చి, వారిసరకు లన్నింటిని దీసుకొనెను. ఆరాజన్యుడు చేసిన గౌరవమును, ఆదరణయు నానందించుచు, వా రచ్చట రెండుసంవత్సరములుండి పోయిరి. ఇంతలో దక్షిణ తార్తార దేశీయులకును, ఉత్తర తార్తారదేశీయులకు పెద్దపోరు సంభవించెను.

అదివఱకే యింటికి పయనము గొందలచుకొనియున్న మనవర్తకులు రాజునొద్ద సెలవుఁ గైకొని పయనమైరి. కాని యుద్ధముల ఒత్తిడివలన, స్వదేశమునకు బోవు, బాటలన్నియు నపాయకరమైన స్థితియం దుండెను. అందువలన, వారు స్వదేశాభిగమన మప్పటికి చాలించుకొని వాణిజ్యార్థమై పూర్వాభిముఖులై, పారశీకదేశమునందున "బొకారా" నగరమును గూర్చి పయనమైరి. ఈప్రయాణము దీర్ఘమగు నెడారిగుండ సాగింపవలసి వచ్చుటచే నెంతో ప్రయాసకరమయ్యెను. మన వర్తకులు బొకారానగరమున అప్రయత్నముగ నెట్టులో మూ డేం డ్లుండిపోయిరి. వా రచ్చట నున్న దినములలో కాకతాళీయముగ, చీనాచక్రవర్తి కుబ్లయిఖానుని రాయబారు లెచ్చటనుండియో స్వదేశాభిముఖులయి వచ్చుచు, కొంత కాలము బొకారానగరమున నాగుట తటస్థించెను. వారీ ఐరోపీయను వర్తకులనుగాంచి, యంతదూరము దేశమున వారిని గాంచుటకు నాశ్చర్యమంది, వారిని దమ యేలిక కడకు రావలసిన దనియు, నాతడు తప్పక వారిని సముచితరీతిని సంభా

వించుమనియు ప్రార్థించిరి. వ్యాపారలాభమే చూచుకొన్న వారగుటచే నావర్తకులు ఇంటిమాటమఱచి, చీనాదేశమునకు ప్రయాణమైరి. కుబ్లయిఖాను వారినిచూచి యచ్చెరువంది, వారి ననేకవిధముల గౌరవించి ఆదరించెను. వినోదగోష్ఠి యందు, వారల రావించి యూరోపాఖండము, అందలి రాజ్యములు, రాజులు, ధర్మపరిపాలన, రాజనీతి, మతము మున్నగు ననేకవృత్తాంతముల నడిగి విసుగు విరామములు లేక వినుచుండెను. అట్లు కొంత కాలమగు నప్పటికి అతనికి క్రైస్తవ మతము మీద నభిమానము జనించెను. అంతట తనప్రజలకు మోక్షసాధనము నుపదేశింప కొందఱి మతప్రవక్తలను క్రైస్తవమతాధిపతి పోపు పంపునా యని విచారించెను. పిమ్మట నాతఁడు ఆవర్తకులను తిరిగి యూరోపాఖండమునకు బోవలసినదనియు, తన రాయబారులుగా పోపు కడకేగి, యెట్లయిన నూర్గురుమంది ప్రచారకులను మంచి పండితులయినవారిని వాదోపవాదము సేయగల తార్కికులను, ధర్మవేత్తలను బంపవలసినదని ప్రార్థింపఁబంచెను.

మనవర్తకులు చీనాదేశమును వదలి యింటికిఁ జేరునప్పటికి మూఁడువర్షములు పట్టెను. వారు, మధ్యధరా సముద్రపు టొడ్డుననున్న "ఆకర్" రేవును సమీపించునాటికి పోపు మరణించినవార్త తెలిసెను. నూతనముగ పీఠాధిపతి యెన్నుకొనబడునంతవఱకు వెనీషియానగరమందే కాలము గడపనెంచి వారు క్రీ. శ. ౧౨౬౯ వ సంవత్సరమున ఓడనెక్కి వయన

యైరి. ఇలు సేరునప్పటికి నికోలోపోలో భార్యమరణించిన దుఃఖ వార్త తెలిసెను. నికోలో కామెవలన, మన కథానాయకుండగు మార్కో యొక్కడే జనించెను. ఆతని కప్పటికి పదియేనేండ్ల వయసుండెను. మార్కో తల్లిగతించినదాదిగా మేన మామలయిండ్లకడ బెరుగుచుండెను.

నికోలో, మాఫియోపోలోలు, పోపొకడు మెన్నుకొనబడి ప్రతిష్ఠింపబడునని రెండుసంవత్సరములువఱకు వెనీషియాయందు వేచియుండిరి. కాని పోపు నెన్నుకొనుటమాత్రముః జరిగి యుండదయ్యెను. అప్పటి విపరీత మత, రాజకీయ పరిస్థితులనుబట్టి పోపు మెన్నుకొనబడడేమో యని సంశయమంది, తమప్రయత్నములను, రాయభారమును విఫలము లయ్యెనని విన్నవించుటకు మరల నాసోదరులు చీనాకు ప్రయాణమైరి. ఈసారి మార్కోనుకూడ వారు వెంటబెట్టుకొని జనియుండిరి. అది క్రీ. శ. ౧౨౭౧ వ సంవత్సరము. అప్పటికి మన మార్కోపోలోకు పదునేడుసంవత్సరములువయసుండెను.

వారిప్రయాణము బహుదూరము సాగకముందే, ఆకరునందున్న, మతాధికారి, పోపుగా ప్రతిష్ఠింపబడినవార్త వారికి దెలియవచ్చెను. క్రొత్తపోపు శుభ్లయిఖానుని, సందేశమాలకించి, నూరుమంది ప్రవక్తలకు బదులు ముప్పురనుమాత్ర మంపుట కంగీకరించెను. వారును, మన యాత్రికులతో, కొలదిదూరముమాత్ర మరిగి భయపడి వెనుకకు దిరిగిపోయిరి.

కాని పోలోసోదరులును మార్కోయును, చీనాదేశప్రయాణ మును విడువక సాగించిరి. కుబ్లయిఖాను, వారిరాకకు చాల ముదమంది యెప్పటికంటె నధికముగ సత్కరించి యాతిథ్యము నెఱపెను. చక్రవర్తిదృష్టిని, యువకుఁడగు మార్కోపోలో విశేషముగ నాకర్షించెను. నాఁడు మొదలుకొని యాతఁడు చక్రవర్తి ప్రత్యేకమన్ననలకుఁ బాత్రుఁడై, విశ్వాసముతో నాతనిఁ గొలిచెను. మార్కోపోలో అనతికాలములో చీనా భాషను, తార్తారభాషను, వ్రాయను,మాటలాడను గూడ నేర్వఁగలిగెను. చక్రవర్తి యాతని ప్రజ్ఞాబుద్ధివిశేషముల కచ్చెరు వందిదూరస్థములయిన రాజ్యము లెట్లు బరిపాలింపబడుచు న్నవో, జూచి తనకు నివేదింపుటకొఱకు విశ్వాసపాత్రమైన నియోగిగా నొనర్చి పంపుచువచ్చెను. అతఁ డట్లు దూరస్థము లయిన రాజ్యములను సందర్శించుటకు బోయినపు డొక సమయమున, హిందూదేశమును కూడ జూడవచ్చెను. అట్లు తెంచినపుడే, మార్కోపోలో, కాకతీయరాజ్య మునందు గల ప్రసిద్ధ రేవుపట్టణమున మోటుపల్లికడ నోడ దిగి, కాకతీయరాజ్యములోని కేగియుండెను.

అట్లు చీనాచక్రవర్తికడ, క్రీ.శ. ౧౨౭౩, మొదలుకొని క్రీ.శ. ౧౨౯౦ వఱకును పదునేడు సంవత్సరము లూడిగము సలిపినపిమ్మట, నీవెనిషియనులు, తాము స్వదేశమునకు బోవ కుతూహలముతో,నాతురతతో నున్నామనియు, సెలవీయవల సినదని ఖానుని ప్రార్థించిరి. ఇట్లు చక్రవర్తిని మెన్నిసారులో

వారు ప్రార్థించుటయు,నందులకాతడు, వారిమీదగల ప్రేమాతిశయముచేతను, వారివంటి విశ్వాసపాత్రులయిన మిత్రులును సచివులు, భృత్యులు నికలభింపరను సందేహము చొప్పునను వారిప్రార్థన నంగీకరింపడయ్యెను. ఇపుడును చక్రవర్తి యంగీకరించియుండడుగాని, దైవయోగమున నొకయవకాశము గల్గెను. పారశీకప్రభువున కప్పుడు భార్యావియోగముకలిగెను. మరణశయ్యమీదనున్న నాతని సతి, తనపుట్టింట బుట్టిన యాడపడుచునుగాని యితరుల వివాహమాడవలదని, భర్తను శాసించెను. అనురాగబద్ధుడైన సుల్తాను ఆమె కడసారి ముద్దు చెల్లింప సంకల్పించుకొనెను. అతడు వరింపవలసిన బాలిక చీనాచక్రవర్తియగు కుబ్లయిఖానుని వశమందుండెను. ఆమెతలి తండ్రు లాతనిసామంతులు. అందువలన పారశీకసుల్తానాబాలిక కొఱకు కుబ్లయిఖానునకు సందేశహరులనంపెను. ఆయువతికప్పటికి పదునేడు సంవత్సరముల వయసుండెను. లేతయవ్వనమున నున్న యాసౌందర్యవతి నచ్చి, రాయబారులను ఖాను ప్రయాణసన్నాహముగావించెను. కాని అంతలో, తార్తారులలో తార్తారులకు అంతఃకలహములు సంభవించి భయంకరరూపమును దాల్చెను. ఎంతపరివారమిచ్చినను ఆరాయబారులను బాలికను,నాటుదారిని, యుద్ధభూములగుండ పారశీకదేశమున కంపుటకు ఖానుడంగీకరింపక, పెద్దనౌకాదళమును సమకూర్చి, సముద్రమార్గమున ప్రయాణము సన్నాహపఱచెను. సముద్రయానము, పారశీకులకు నూతనమగుటచేత, తెలిసిన వెనీషియను

లను దమకుదోడుగా నంపవలసినదని, రాయబారులు ఖానుని ప్రార్థించిరి. అంతరంగమున, నిష్టములేకపోయినను, మాట తీసివేయజాలక, చక్రవర్తివారి ప్రార్థన మంగీకరించెను. ప్రయాణమునకు గావలసిన దానికంటె యెన్నియో రెట్లధికముగ వారి కన్నియు నిచ్చి యంపెను.

చీనా దేశమునుండి, మన యాత్రికులు ౧౨౯౨ వ సంవత్సరమున బయలుదేరిరి. వారికి పారశీక దేశమును జేరునప్పటికి రెండుసంవత్సరములు పట్టెను. ప్రయాణములో, పరివారములోనివారు ఆరు నందలమంది మరణించిరి. ఇట్లుండ, పెండ్లివారు పారశీక దేశమును ప్రవేశించునప్పటికి, సుల్తాను, కాలధర్మము నొందినట్లు దెలిసెను. కాని యింతవ్యయప్రయాసల కోర్చి, తీసుకొని రాబడిన వధువునకు ప్రియుడు దొరకకపోలేదు. సుల్తాను గతించినందున సింహాసనమెక్కిన యాతని సుతు డాసుందరిని పెండ్లియాడెను. క్రొత్తసుల్తాను, మనయాత్రికులకు కుబ్లయిఖానువలెనే విశేషముగ నాతిథ్యసత్కారములు సెలపి, స్వదేశమును సుఖముగా జేరుటకు నలయు సదుపాయముల ననేకముల గల్పించెను. వారికి, అశ్వదళమును కొంత అంగరక్షగా నిచ్చి సాగనంపెను. స్వదేశోన్ముఖులై, పయనమయి, చాలదూరము సాగకపూర్వమే వారలకు, తమ యేలికయు, పోషకుడునగు కుబ్లయిఖాను చక్రవర్తి పరలోకగతుడయ్యెనన్న వార్త దెలియవచ్చెను. ఆవార్తవిని వారు మిక్కిలి సంతాపమును బొందిరి. పారశీకమునుండి వెనీషియానగరమును

సుఖముగా జేరునప్పటికి వారికొక సంవత్సరము బట్టెను.

క్రీ. శ. ౧౨౯౫ సంవత్సరమున వెనీషియానగరమున, మనయాత్రికులరాక, యొకవింతగా నెల్లరకుఁ దోచెను. ఎన్నడో మృతులయిరని, దాయాదులెల్లరును, పోలో కుటుంబము యొక్క, సొత్తునంతయు నాక్రమించుకొనిరి. ఇంటినికూడ తమ వశముచేసికొని యందు నివసించుచుండిరి. తార్తారులవలె నసహ్యాకరములయిన యుడుపులను ధరించివచ్చిన వారి నెవ్వరును తమవారినిగా నిరూపింపలేక పోయిరి. కాని, వారు తమ భాగ్యమును బ్రకటించి, విందులిచ్చి, బంధువుల నెల్లరను రావించి గౌరవించినపుడును, చీకిచినిగిపోవుచు నసహ్యాకరములయిన వారి యుడుపులను ముక్కముక్కలుగా, కత్తిరించి, అందుగల మడతలలోనుండి యమూల్యములయిన రత్నములను, మణులను ముత్యములను కుప్పలుగా గ్రుమ్మరించినపుడును, ఎల్లరును వారివృత్తాంతమును విశ్వసించియుండిరి. పదునేడు సంవత్సరములు దేశాంతర్గతులయి యుండుటచేత వారిభాషయుకూడ పోల్చశక్యము గాకుండెను.

పెద్దవాఁడగు మాఫియో పెండ్లి యాడకయే ముదుసలియయ్యెను. పెండ్లియాడిన నికోలో, భార్య మరణించెను. జీవితకాలమంతయు ప్రవాసమున గడిపిన, మార్కో మహదైశ్వర్యమునకంతకు నపుడు యజమానియయ్యెను. ఇకనాతఁడు పరిణయమాడి సుఖింపదలచెను. అప్పటి కాతనికి నలువదిరెండు సంవత్సరములు వయసుండెను. ఆతని సంకల్పమెట్లున్నను దైవమును

కూలుడు కాలేదు. ఆతడింకను సుఖముగా జీవయాత్ర గడవుటకు నోచుకొనియుండ లేదు. క్రీ. శ. ౧౨౯౮ వ సంవత్సరమున వెనీషియాకును, జినోవాపట్టణమునకు యుద్ధము సంభవించెను. ఆయుద్ధమునకు మార్కోపోలో సొంతద్రవ్యము వెచ్చించి యోడనుకట్టించి బయలుదేరెను. కాని యుద్ధమునందు వెనీషియనులు, పరాజితులయిరి. మార్కో, పట్టువడి తుదకు ఖైదిగా, జెనీవాకు గొంపోవబడెను. ఆనగరమున, నాతని ప్రఖ్యాతి విన్నవారందఱును ఆతనిసందర్శించి, సంభాషింప నేతెంచుచుండిరి. ఆతనిగూర్చి యత్యాశ్చర్యకరములయిన వృత్తాంతములు నల్దిశల వ్యాపించెను. కాని చెఱవిముక్తి కాదయ్యెను. కోటీశ్వరుడగు తండ్రి యితని నెట్లయిన లంచమిచ్చి విముక్తుని చేయ విశ్వప్రయత్నములు గావించెను, గాని నిష్ఫలములయ్యెను. చెఱసాలలో నున్నప్పుడెందరో, యాతడు కని, విన్న వృత్తాంతములను చెప్పగోరుచు, వేధించుచుండిరి. దానికాతడు సహింపజాలక, తోడిఖైది, "రుస్టీకియానో" యనునునాతనికి, తనకువచ్చియు రాని లాటిన్ భాషలో గ్రంథమును చెప్పి వ్రాయించెను. ఆప్రతినిచూచి, యిటలీలో ననేకప్రాంతములవారు ప్రతులను వ్రాసికొనిపోయి, ఆతురతో, వినోదార్థము చదువుకొనుచుండెడివారు. ఇంతలోనాతని పాండిత్యమును, కులీనతయుమర్యాదయు, కీర్తియు దశదిశల వ్యాపించుటచేత జినోవాప్రభుత్వము వారాతనిని గౌరవముగా చెఱసాలనుండి విముక్తునిం జేసిరి.

ఇంటికివచ్చిన తరువాత మార్కోపోలో నలువదియేడవయేట పెండ్లియాడెను. మార్కో చెఱసాలలో నున్నపుడు, మరల నాతడు చెఱవిముక్తుడై యింటికి రాజాలడనియు తనభాగ్యమంతయు, పరుల పాలగునని భయపడి నికోలో ముదిమిని మరల పెండ్లియాడెను. ఆపెండ్లివలన నికోలోకు మువ్వురు కుమారు లుదయించిరి. కాని వీరిమువ్వురును వెనీషియను ధర్మశాస్త్రానుసారము ఔరసపుత్రులుగా భాగింపఁబడజాలరు. మార్కోపోలో చెఱనుండివిముక్తుఁడై వచ్చినతరువాత, కౌమారమున డొనటా అనునామెను పెండ్లియాడెను. ఆమెవలన నతనికి మువ్వురు స్త్రీసంతానమే గాని పురుషసంతతి కలుగలేదు. తాను వృద్ధుడగుచున్నాడని దెలుసుకొనిన పిమ్మట నాతఁడు క్రీ. శ. ౧౩౨౪ సంవత్సరమున జనవరినెల ౯వ తేదిని ఒక మరణశాసనము వ్రాయించి, తన తదనంతరము, తనయాస్తికి కూతుళ్ళను, కర్తలుచేసి, భార్యను యజమానిగా నియమించెను. ఈమరణ శాసనము వ్రాయించిన తరువాత నీతడెంతకాలమో జీవింపలేదు. వెనీషియానగరమున మార్కోపోలో వ్రాసిన మరణశాసనము మూల ప్రతి మ్యూజియమునం దుంచబడియున్నది! ఆతడు నివాసముండిన సౌధముకూడ నేఁడు యాత్రికులకు మహద్వస్తువుక్రింద జూపబడుచున్నది. ఈ కాలమున వెనీషియనులే కాదు యిటాలియా వాస్తవ్యులందఱును మార్కోపోలోను, గర్వముతో సంస్మరించుచున్నారు.

మార్కోపోలో రచించిన గ్రంథము నాలుగు ఖండములుగ విభజింపబడియున్నది. మార్కో చెప్పుచుండగా వ్రాసిన లేఖరి రుస్టీకియానో యీ గ్రంథమున కొక పీఠికను వ్రాసియున్నాడు. అందాతఁడు, మార్కోపోలో జనకులు ఇల్లు వెడలిన దాదిగా, చీనా దేశమునుండి తిరిగివచ్చి, మన కథానాయకుని వెంటబెట్టుకొని మరల ప్రయాణ మగువఱకు జరిగిన వృత్తాంతమును, పోలో కుటుంబచారిత్రమును సంగ్రహముగా జెప్పినాడు. మార్కోపోలో తన గ్రంథమునందు ప్రథమ ఖండమున, దూర్పు ఆర్మీనియా దేశము మొదలుకొని కుబ్లయిఖానుని రాజధానిని జేరువఱకు చూచినదానినంతయు వర్ణించినాడు. మరియు నందే ఖానుని రాజ్యము, పరిపాలనము, ప్రజలు, రాజధాని మున్నగువాటిని గూర్చి వివరించి, శేషించినదానిని ద్వితీయఖండమున ప్రథమ భాగమున వర్ణించినాడు. ద్వితీయభాగమున నీతఁడు చీనాదేశమందు సలిపిన యాత్రలు, ఆయా దేశములందు తాను చూచిన విశేషములను సంగ్రహముగా వ్రాసినాడు. తృతీయభాగమున కుబ్లయిఖానుని సామ్రాజ్యములో బూర్వదిశయందున్న రాజ్యములను గూర్చి తెలిపినాడు. తృతీయఖండమున జపానుదీవులు, హిందూమహాసముద్రము, అందలి ద్వీపములు, సింహళము, దక్షిణహిందూస్థానము, పారసీక దేశమువఱకుగల రేవులను మున్నగువాటిని వర్ణించినాడు. చతుర్థఖండమున పారసీక దేశము తార్తారరాజ్యము మొదలగు యుత్తరదేశములనుగూర్చి

చెప్పియున్నాడు. మొత్తముమీద నాతని గ్రంథమంతయు మనోజ్ఞముగ నుండును. భూగోళవిషయములు, శాస్త్రవిష యములు, నౌకాయానములు, మొదలగు శాస్త్రసంబంధమైన వృత్తాంతములతో నిండియున్నను,పదమూడవశతాబ్దమునాటి వృత్తాంతములు, మార్కో జూచినవింతలు, చాలవఱకు అవి శ్రవణీయములుగ గన్పట్టుచు, చిత్రవిచిత్రములయిన కథలతో నిండియుండినకతన, చదువునపుడు మిక్కిలి మనోహరమై, ఎప్పటికప్పుడు ముందునకుబోవ కుతూహలము కలిగించుచుం డును. వేయేల! ఆతని గ్రంథమునం దొక విషయముండి, మఱియొకటిలేదని చెప్పవలనుపడదు.

మార్కోపోలో గ్రంథమును సంపాదించి, సంస్కరించి తొలుత ప్రకటించినవాడు ఇటాలియా వాస్తవ్యుడైన రమూ షియో. ఇతడు పదియేనవ శతాబ్దమందు జీవించియుండెను. ఆతడు ప్రచురించిన ప్రతిని బురస్కరించుకొని పరాసుదేశీ యుడగు మూసాపాధియరు పరాసుభాషలోనికి భాషాంతరముచేసెను. ఈరెండింటిని ఉపయోగించుకొని మార్స్డెను ౧౮౧౮వ సంవత్సరమున నాంగ్లమున వాదమును బ్రచురించెను. మార్స్డెనుగారి గ్రంథము చాలప్రశస్తమైనది. దాని తరు వాత, మార్కోపోలో తిరిగిన దేశము లన్నింటినిగూర్చి విశే షముగ శ్రమకోర్చి యెన్నియో నూతనాంశములను సంపా దించి, గ్రంథము నంతయు, మరల నింకొకమారు సంస్కరించి, ప్రాచీన మూలప్రతినిబట్టి ఆంగ్లభాషలోనికి భాషాంతరీ

కరణము గావించి సవ్యాఖ్యానముగ సర్ హెన్రీయూలు ప్రకటించినాడు. యూలుగారి ప్రచురణము వ్యాపించినతరువాత మార్స్డెనుగారి గ్రంథమునకు వ్యాప్తము తగ్గిపోయెను. ఇవుడీవృత్తాంతమును, యూలుగారి గ్రంథమును ప్రధానముగా ముందిడుకొని రచించితిమి.

కుబ్లయి ఖానుని కొలువులోనున్నపుడు, దూరస్థిత రాజ్యములను బాలించు మహామండలేశ్వరుల రాజరిక మెట్లుండెనో యారసివచ్చుటకును, లోపము లున్నయెడల సవరించివచ్చుటకును మన మార్కో నియమింపబడినట్లు ఈవఱకే తెలిపియుంటిమి. ఈ నియోగమందున్న కాలమున నాతనికి తఱచుగా దూరదేశప్రయాణములు కలుగుచుండెను. ఆ కాలమున నొకసారి, దక్షిణచీనారాజ్యములను సందర్శించుటకే తెంచినపుడు, వినోదార్థమై, దక్షిణహిందూమహాసముద్రము నంతయు ప్రయాణముచేసి దీవుల నన్నింటిని చూచివచ్చెను. ఆ కాలమునందే సింహళద్వీపమును, మాబారు దేశమని మహమ్మదీయ చరిత్రకారులచే బిలువబడుచుండిన పాండ్య,చోళ దేశములను ఆంధ్రభూమినికూడ చూడవచ్చెను.

ఈతఁడు దక్షిణహిందూస్థానమున కరుగుదెంచిన సంవత్సరమును సరిగా నిరూపింపజాలముగాని, యించుమించుగా ౧౨౯౦వ సంవత్సరమని యూహింపవచ్చును. అప్పటికి చోళులప్రతిభ సన్నగిలిపోయెను. వారి రాజ్యము, స్వాతంత్ర్యము కూడ, నంతరించెను. దక్షిణమున పాండ్యులు, పశ్చిమ

మున, హొయసల రాజులు, ఉత్తరమున కాకతీయులు, తెలుగుచోడవంశజులు ప్రక్కలో బల్లములై యుండుటచేతను, అంతఃకలహములచేతను, రాజుల ప్రయోజకత్వమువలనను చోళరాజ్యము విచ్ఛిన్నమైపోయెను. పదమూడవ శతాబ్దారంభమునుండియు, విజృంభింపనారంభించిన, మధురానగర పాండ్య రాజుల ప్రాభవము, ఆ శతాబ్దాంతమునాటికి మహోచ్ఛదశకువచ్చెను. క్రీ. శ. ౧౨౫౧- మొదలుకొని యించుమించుగా ౧౨౭౧ వఱకును బరిపాలించిన, జటావర్మ మొదటి, సుందరపాండ్యదేవుడు, పాండ్యరాజ్యమును, పినాకిని నదీపర్యంతము వ్యాపింపజేసి, హొయసలరాజులకడనుండియు, తెలుగుచోడవంజుల కడనుండియు గప్పములు గైకొని దిగ్విజయము చేసి తిరిగి వచ్చుచు శ్రీరంగమున పట్టాభిషేకము చేసుకొనెను. తన రాజధానియందు సువర్ణతులాభారమును తూగెను. ఈతనితో నితనిసోదరులుముగ్గురో నల్గురో, సోదరునికూడ కలిసి నేక కాలమున పరిపాలనముచేసియుండిరి. జేష్ఠుడు రాజ్యాభిషిక్తుడుగను, మిగిలిన సోదరులు, మహామండలేశ్వరులుగను పరిపాలించుచు, నందఱునొక్కరీతిగానే రాజ్యచిహ్నముల నుపయోగించుకొనుచుండుట పాండ్యరాజవంశ సంప్రదాయముగా గానుపించుచున్నది. జటావర్మకువెనుక, రాజ్యాభిషిక్తుడైనవాడు మారవర్మ కులశేఖర సుందరపాండ్యదేవుడు. ఈతడించుమించుగా క్రీ శ. ౧౨౬౮ మొదలుకొని ౧౩౧౧ వఱకును బరిపాలించియుండెను. మార్కో

పోలో. పాండ్య దేశమును జూడ నేతెంచినపుడు పరిపాలించు చుండిన సుందర పాండ్యుడితడే! అప్పటి కితడు పాండ్యభూపతుల లో జేష్ఠుడు, ఇతని రాజధాని, మధురానగరముగాక, కాయల్ పట్టణమో, కావేరిపట్టణమో అయియుండినట్లు తోచుచు న్నది. ఇతని కాలమునకడు శాంతిప్రదమై, సుఖదాయకమై యుండి నట్లును, ఈతని కీర్తి దిగంత విశ్రాంతియై యుండినట్లును, చరి త్ర వాకొనుచున్నది. చీనా దేశమునుండి వచ్చిన రాయబారులి తని కొలువున దర్శనమునకై మొగసాలల వేచియుండువారట! సింహళ ద్వీపము నేలు, విక్రమ బాహు, పరాక్రమ బాహులు ఇతనిధాటికినిల్వజాలక సామంతులయి కప్పముగట్టుచుండిరి. ఇతని రాయబారులు, మంగోలియా దేశాధీశుడగు జమాలుద్దీ ను కొలువునకుగూడ బంపబడినట్లు మార్కోపోలో వచిం చుచున్నాడు.

ఇట్టి రాజుపరిపాలించుచున్న పాండ్య రాజ్యమును, ఆ రాజ్యమున్న మాబారును మార్కోపోలో విపులముగ వర్ణించినాడు. కులశేఖరుని, న్యాయపరిపాలన ప్రజలనాగరకత, కాయల్ పట్టణ సముద్రవ్యాపారము, ముత్యపు చిప్పల వేట,ము న్నగు వాటిని మార్కో చక్కగా వర్ణించినాడు. పాండ్యరా జ్యమునన్న సమయమునకై స్తవసిద్ధుడు థామసునుగూర్చి మనమార్కో పోలో వినియుండెను. థామస్ సిద్ధుని సమాధి యిపుడు చెన్నపట్టణము నకుసమీపముగానున్న (సెయింటు థామస్ మవుంటు) థామస్ సిద్ధునికొండను సందర్శింప బయి

లుదేరెను. ఆసిద్ధుని కొండకు తీర్థయాత్ర సేవించుకొని మరల కలము నెక్కి, ఆంధ్ర దేశములోని ప్రసిద్ధ రేవుపట్టణమగు మోటుపల్లిని గూర్చి విశేషముగ వినియుండినందున నచ్చటికి ప్రయాణమయ్యెను. మార్కోపోలో ఆంధ్ర దేశములోని మోటుపల్లినిగూర్చి యిట్లు వ్రాయుచున్నాడు.

"మాబారు, దేశమునుండి యుత్తరముగా దాదాపు వేయిమైళ్ళు చనిన నీవు ముటఫిలి రాజ్యమున బ్రవేశింతువు. పూర్వమీ దేశ మొకరాజు పాలనమందుండెను. ఆతఁడు చనిపోయినప్పటినుండియు, నాతని రాణి నలువదిసంవత్సరముల నుండి పరిపాలించుచున్నది. ఆమె చాలా ప్రజ్ఞావంతురాలు. భర్తమీఁదగల ప్రేమవలన, తిరిగివివాహమాడలేదు, గడచిన నలుబది సంవత్సరములనుండియు, ఆమె రాజ్యము నేలినట్లు ఆమె భర్తకూడ నేలియుండలేదు. ఆమెన్యాయము ధర్మమును మూర్తిగొన్నట్లు పరిపాలించును. శాంతి సౌఖ్యములు, ఆమె పరిపాలనమున పెట్టినపేరులయ్యెను. ఇంతవఱకు నేరాజును, ఏరాణియు, నీరాజ్యమునింత ప్రజారంజకముగ పాలించియుండలేదు. అందువలనజనులామెను భక్తి, విశ్వాసగౌరవములతో ప్రేమింతురు. ఇచ్చటిజనులు విగ్రహారాధకులు. స్వతంత్రులు. పారతంత్ర్యము నెఱుగరు. వారికిమాంసము, పాలు, బియ్యము, మొదలగునవి యాహారములు,

"ఈరాజ్యమునందే వజ్రములు దొరకును. వజ్రములభించు తెఱగిది; వినుము, ఈప్రాంతమున నేటవాలుగనున్న ఎత్తైన

పర్వతపంక్తులు చాలగలవు. వర్షపాత మిచ్చట విశేషము గానుండును. వర్షములుకురిసినప్పుడు కొండలమీదనుండి, నీరు వాగులవలె వడిగా క్రిందికి బ్రవహించును. వర్షములు వెలిసిన తరువాత, నావాగులెండిపోవును. అంతట జనులు, యీ యే టిగర్భములందిసుకలో వజ్రములకై వెదకుదురు. అప్పుడు వారికి రత్నములు విరివిగా లభించుచుండును. వేసవికాలమందు వజ్రములు లభించుచుండును. కాని గ్రీష్మతాపమునకు వెఱచి జనులుకొండలలోనికిఁ బోరు. అచ్చట త్రాగుటకొక్కగ్రుక్కెడునీరయినను లభించదు. అదియునుగాక నక్కడ భయంకరమ యినక్రూరసర్పములు అసంఖ్యాకములుగ నుండును. సర్పము లేగాదు, విషజంతువులనేకములుగూడ నున్నవి. వీటికికార ణము భరింపరాని యుష్ణము. వజ్రములపై నాసగొనిజని యీ క్రూరసర్పముల కాటులకు మరణించిన వారెంద రోగలరు.

“ ఈకొండలనడుమ పెద్దపెద్ద లోయలున్నవి. పటవా లుగ నుండుటచేతను, నాలుగుప్రక్కలను ఎత్తైనకొండలుండుట చేతను ఈలోయలలోనికి మార్గములులేవు. వజ్రాలకై, జనులు వెడలినపుడు సన్నగాకోసినమాంసపుముక్కలను తీసుకొనిపోయి యీకొండలోయలందు పారవేయుచుందురు. ఇచ్చట నివసించు పాములను భక్షించుటకై, గరుడపక్షులీప్రాంతములందు విశే షముగా నున్నవి. అవి సర్పములకొఱకై యెగురుచున్నపుడు మాంసపు ముక్కలువిసరుటగాంచి, వాటికై లోయలయడుగు

భాగమునకు సయితము దిగుచుండును. తాళ్ళనడుమనుచిక్కుకున్న మాంసపుముక్కలను గ్రుచ్చుకున్న తాళ్ళతో సయితమా గ్రద్దలు తన్నుకొనిపోవుచు, నేకొండకొననో, నేచెట్టుమీదనో గూటిలో పిల్లల యాహారమునకై పెట్టుచుండును. గ్రద్దలువ్రాలుట చూచి, జనులు, తాళ్ళుగ్రుచ్చుకొనిన మాంసపుముక్కలకై ఆపక్షులను తరిమివేసి యామాంసపుముక్కలను దెచ్చుకొందురు. అందుతఱచుగా నితరతాళ్ళతో పాటు వజ్రములుగూడ నుండును. ఈకొండలలోయల యడుగున, వజ్రములిట్లు కుప్పతిప్పలుగా బడియుండుట నిజముగా నాశ్చర్యకరమైనవిషయము. కాని కొండలలోనికి వజ్రములకై ప్రాణములపై నాశవీడి యెవడును చనజాలడు. ఇచ్చటి సర్పములు మనుష్యులను సయితము మ్రింగివేయగలవు. వజ్రములకై జనులు, గ్రద్దల గూండ్లకడ కేగి వాటిరెట్టలనువెదకి యందు రత్నములను గాంచుటయు గూడ గలదు. మాంసపుముక్కలను, అందు చిక్కుకొనిన తాళ్ళతో పాటు, పక్షులుతిని తాళ్ళను జీర్ణము చేసుకొనలేక రెట్టలో కలిపివిడుచును. ఒకప్పుడీపక్షులనుపట్టుకొని జనులు రత్నములకై పొట్టలజీల్చి చంపుదురు. వాటిలోగూడ వజ్రములు లభించుటయుగలదు.

‘‘పెద్దపెద్దవజ్రములు (ముటఫిలి) మోటుపల్లిసీమయందు తప్ప నింకెక్కడను లభింపవు. మనపాశ్చాత్యదేశములకు గొనిరాబడునవి ఇచ్చటివారు మంచివాటిని యేరుకొనన మిగిలిన రెండవరకపు సరకులనినమ్ముదురు. ఇచ్చటిరాజులు, శ్రీమంతులు

తులు మేలయినవాటిని తామే ఉపయోగించుకొందురు.

"ఈదేశమున నూలుబట్టలు, అత్యద్భుతము లయినవి నేయుదురు. అవి సాలె పట్టువలె బహుసున్నితముగానుండును. ఎంతవెలయిచ్చిన నంతకు సరిపోవునట్టి రకవు సెల్లాలిచ్చట లభించును. వాటిని చూచినవు డే దేశము నందైనను ఏ రాజును ఏ రాణియు వాటినిధరింప నిచ్చగొనకుండ జాలరు ! ఇచ్చట జనులకు గొఱియలమందలు లెక్కకుమిాఱియున్నవి. మరియు, వారికి గావలసిన వన్నియు, గావలసినవాటికంటె నత్యధికములుగ లభించుచున్నవి."

మార్కొపోలో ఆంధ్ర దేశములోని తానుజూచిన మండలమును ముటఫిలిరాజ్యమని పేర్కొనియున్నాడు. ముటఫిలి అను రేవుపట్టణ మిాకాలమున మనకు దేశపటములందు ప్రసిద్ధ పట్టణముగా గాన్పించుటలేదు. రేవుపట్టణముగా కూడగాన్పింపదు. ముటఫలి రేవును, మార్కొపోలో మోసల్ అనిగూడ బిలిచియున్నాడు. మోసల రేవు మచిలీపట్టణమని, చరిత్రకారులు నిర్ణయించిరికాని యానిరూపణముయదార్థమైనదికాదు. ముటఫలియనుపేరు యాప్రాంతముననున్న మోటుపల్లికి సరిపోవుచుండుటచేతను, అచ్చట వీరభద్రేశ్వరుని యాలయమున బ్రతిష్టింపబడిన గణపతిదేవుని శాసనమునం దాయూరు గొప్ప రేవుపట్టణమై యుండినట్లు వక్కాణింపబడియుండుటచేతను, మార్కొపోలో సందర్శించినది మోటుపల్లి రేవనియే నిశ్చయింపవలయును. మరియు, మోటుపల్లి, కాకతీయులకు

వెనుక పూర్వాంధ్రదేశమునేలిన రెడ్లపాలనమందుకూడ ప్రసిద్ధమగు రేవుగానుండినట్లు రెడ్డిరాజులశాసనములుసాక్ష్యమిచ్చుచున్నవి. వీటియన్నిటికంటె, మోటుపల్లి వైభవమడుగంటిన పిమ్మటనే మచిలీపట్టణము లేచినట్లు చరిత్రాధారములు గానబడుచున్నవి. *

కాకతీయసామ్రాజ్యమునకు ప్రధాన రేవుపట్టణమై, వర్తకలక్ష్మికినాటపట్టయిచోళమండలములోని కాయల్, కావేరిపట్టణములకు దుల్యమైయొప్పారుచుండిన మోటుపల్లి, ప్రశస్తి, ప్రాక్కీర్తివులు మొదలొ్కనిచీనా, జపానుదేశములవఱకును వ్యాపించుటచేనే మార్కొపోలో యా రేవును జూడవచ్చెను. మరియునా రేవున్న మండలము వజ్రపుగనులకు, ప్రసిద్ధి వడసియుండుటచేత, నాగనులగూర్చి వినుటకు కుతూహలముగల్గియు, వీలయినచో వాటిని జూడదలచియు మార్కొపోలో వచ్చియుండెను.

మోటుపల్లిరేవును గూర్చి వర్ణించినవాటిలో వజ్రములగూర్చి దెలిపినది మిక్కిలి యద్భుతముగ నున్నది. పూర్వపు కథలలోని వృత్తాంతములవలె నున్న వింతకథల నాత డేకరువు పెట్టియున్నాడు. మోటుపల్లియున్న ప్రాంత మిప్పటి గుంటూరుమండల మగుచున్నది. మోటుపల్లి బాపట్లకు ఎనిమిదిమైళ్ళ దూరమున సముద్రపు టొడ్డున యుప్పుటేరుమీద నున్నది. కృష్ణానది కుత్తరపు టొడ్డున పరిటాలయని యొకగ్రామమున్నది. పరిటాల కృష్ణామండలము

(1) ప్రాచీనాంధ్రనౌకా జీవనచరిత్రము:—పుట

వంటుకొని, నైజాముగారి పరిపాలనలో నున్నది. పరిటాలకడ నున్న కొండలకు పూర్వమునుండి వజ్రపుగనులని ప్రసిద్ధి గలదు. ప్రఖ్యాతి జెందిన గోల్కొండవజ్రాలని పేరు, పరిటాల గనులవలన గలిగియుండెను. ఇప్పటికిని పరిటాలకడ కొండలు మార్కోపోలో వ్రాతలకు సరిపోవునట్లుగా నువ్వెత్తుగ లేచుచు నేటవాలుగ నుండును. ఆకొండ లన్నియు శీతావహములయి యొకప్పుడు త్రవ్వబడినట్లును చిహ్నములను నేటికి జూపుచున్నవి. పరిటాల గాక, కర్నూలుమండలములో వజ్రకరూరని మరియొక యూరు గలదు. అచ్చటగూడ వజ్రపుగను లుండెననియు బ్రసిద్ధి గలదు. మొత్తముమీద మోటుపల్లి రాజ్యమున కిరుకెలంకుల నున్న మండలములు వజ్రాలకు బ్రసిద్ధి కెక్కియుండుటవలన మార్కోపోలో తానాకాలమున విన్న కథలను విశ్వసించి మనోహరముగా వర్ణించినాడు.

మార్కో వర్ణించిన రెండవ విషయము, ఇచ్చట నేయబడుచుండిన మంచుతెరలవంటి రవసెల్లాలు. ప్రాచీనకాలమునుండియు, నాంధ్రదేశములోని బూర్వభాగము బట్టల నేతకు పేరువడిన ట్లనేకమంది ప్రాచీన గ్రంథకారులు వచించియున్నారు. ఈ సెల్లాల నేతపరిశ్రమయు, రంగు లద్దకములును మొన మొన్నటివఱకును, ఆంగ్లేయులు సుస్థిరముగ వారి రాజ్యమును బాదుకొలుపువఱకు వర్ధిల్లుచుండెను. ఈ దేశమున విశేషముగా, గొఱియలు, మేకలు, నున్నవని మార్కో వ్రాయుచున్నాడు. ప్రాచీనకాలమునాటి యేదేవా

లయపు గోడను పరీక్షించినను, అచ్చట వెలసియున్న దేవునికి, నిత్యదీపారాధనమునకై వలయు నేయికి, భక్తు లెందరో నూర్లకొలంది గొఱియలను, మేఁకలను దానములు చేసియున్నట్లు వ్రాయించబడియున్న శాసనములు గాననగును. ప్రతి దేవ కిలారమునందును గొల్లబోయల వశమునం దుంచబడిన పశులమందలే, లెక్కపెట్ట నలవిగాకున్నవుఁడు, ఇక జనుల యుపయోగార్థ మెన్నియుండెనో యూహించుకొనవలసినదేగదా!

అన్నిటికంటె మార్కోపోలో ఈదేశము నేలుచుండిన మహారాజ్ఞిని, విశేషముగా గొనియాడినాడు. ఆమెనుగూర్చి యీతడెంతగొప్పగా వినియుండెనోగాని, యాతడామెను గూర్చి వ్రాసిన నాల్గు పంక్తులును, సువర్ణాక్షరములవలె ప్రకాశించుచు, ప్రతి ఆంధ్రుని హృదయమునందును సంతోషమును బుట్టించుచు పులకాంకితులను జేయుచున్నవి. మార్కో ఆమె ధర్మపరిపాలనమును గూర్చి చెప్పి యామె పవిత్ర నామాక్షరములను మాత్రమును దెలుపలేకపోయినాడు. అయిన నాతని కాలము మనకు దెలియును గావున, నాతడు పేరు దెలుపకున్నను ఆకాలమున నాంధ్రదేశము నేలిన పడుచుపేరు మనము గ్రహింపవచ్చును. మార్కోపోలో పేర్కొనిన మహారాజ్ఞి నామము రుద్రమదేవి యని ఆంధ్ర చరిత్రకారులగు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు సుప్రసిద్ధ పరిశోధకులగు డాక్టరు హుల్ట్జ్ గారు

మొదలుగాగలవా రెందరో నిరూపించియున్నారు. కాని వారి యూహా ప్రమాదజనితమైన దేమోయని సందియ మగుచున్నది. మార్కోపోలోయదార్థమునే వచించినట్లును, ఆతఁడు వ్రాసినదానిని, చారిత్రకులు మన దేశచరిత్ర బాగుగా బయలుపడనందున మరియొక రీతిగా నన్వయించుకొని మార్కోపోలో యుదహరించిన నారీరత్నము, రుద్రాంబిక యను భ్రమపడి, యామె గణపతిదేవుని భార్య కాదని విశదీకరించుట కెంతయో ప్రయాస పడిరి. మన కిపుడు, మార్కోపోలో ప్రశంసజేసిన రాణి రుద్రాంబిక కాదనియు, నామె సోదరి యైన గణపాంబయనియు పరిశోధనలవలన దేలుచున్నది. రుద్రాంబికయు గణపాంబామహాదేవియు నేక కాలమున పరిపాలించుటజేసియు, గణపాంబ కేవల మొక మహా మండలేశ్వరుని దేవియై యుండ,. రుద్రాంబిక, మహారాజ్ఞియై, చక్రవర్తినియై, త్రిలింగ సామ్రాజ్యము నంతయు నేకచ్ఛత్రముగ బరిపాలించుటయు, నీ యపోహ జనించుటకు గారణము లయ్యెను. ఇందులకు గణపాంబాదేవి చారిత్రము దెలియకపోవుట యేకారణ మయ్యెను. చరిత్ర దెలిసినయాంధ్రులకు సైతమీా గణపాంబ చిరపరిచితురాలు గాదు. కావున నామె చారిత్ర మిచ్చట వివరించుట యుక్తము. గణపాంబ, కాకతి గణపతి దేవునకు రెండవ కూఁతురు. షట్సహస్రవిషయమను ఆంధ్రదేశభాగము నేలిన, కోటకేతరాజు మనుమడైన బేతరాజీమె భర్త. షట్సహస్రవిషయము, తెనుగున

ఆఱు వేలనాడని వ్యవహరింపబడుచున్నది. కృష్ణానదికి దక్షిణమునగల భాగము, అనగా నిప్పటి సత్తెనపల్లి, గుంటూరు తాలూకాలును, బాపట్లతాలూకాలోని కొంత సీమయు గలిసి, క్రీ. శ. ౧౦, ౧౧, ౧౨ శతాబ్దములనుండియు నాఱు వేలనాడని బరగుచుండెను. కావున, మోటుపల్లియు నాఱు వేలనాటిలోనిది గావలయును. మార్కోపోలో యోడ దిగిన రేవును, ఆతఁడు కథలుగావిన్న వజ్రపుగనులుండిన పరిటాల గ్రామమును, ఆఱు వేలనాటి లోనివిగా నున్నవి. ఈ యాఱు వేలనాటి రాజ్యమునకు రాజధాని, కృష్ణానదిమీద నున్న ధాన్యవాటీపురమని బిలువబడుచుండు అమరావతీ నగరము. ఇయ్యది క్రీస్తుశకారంభకాలమునకు బూర్వము, వెనుకను, నన్నూఱేండ్లులిబాంచిన ఆంధ్ర రాజులగు శాతవాహనులకు రాజధానియై యుండెను. మరియు పూర్వమొకప్పుడు సుప్రసిద్ధబౌద్ధక్షేత్రమై యుండెను. ఇచ్చట నొకప్పుడు మిక్కిలి సుందరతరమైన స్తూపమును ఎత్తైన చైత్యము నుండినట్లు చిహ్నములు గాన్పించుచున్నవి.

మనకథానాయకుని కాలమునాటికి ఆఱు వేల నాటిని కోటవంశ[illegible] చతుర్థకులజులు పరిపాలించుచుండిరి. కాంచీపుర చోళ[illegible]కు నామ మాత్రముగ సామంతులయి, కాంచీపురము మొదలుకొని సింహాచలము పర్యంతము గల యాంధ్ర దేశభాగమును బరిపాలించుచుండిన వెలనాటి వంశజులకు, కోటరాజులు తొలుతనుండియు నా జన్మశత్రువులయి యుండి

నట్లు గాన్పించుచున్నది. చోళులకును, పల్లవులకును జాతివైరము, శతాబ్దముల నుండి వర్ధిల్లుచుండుటచే, కోటరాజులును, తద్వైరసూచకముగ తాము శ్రీమత్రినయన పల్లవప్రసాదిత కృష్ణవేణీనదీ దక్షిణ షట్సహస్రావనీవల్లభులనియు, చోళ చాళుక్యసామంత మదానేక మృగేంద్రులనియు బిరుదులను ధరించుచుండిరి. మొదటి కోటరాజులలో ప్రోలనాయకుడు వెలనాటి మొదటి గొంకరాజునకు సామంతుడుగా నుండినను తరువాత కాలమున వెలనాటి మహామండలేశ్వరులకును,కోట వంశీయులకును వైరము వృద్ధియైనపుడు, వారివినాశమునకై కాకతీయులకు కోటజులు దోడ్పడియుండిరని దోచుచున్నది. ఆశత్రుత్వము తొలుత ప్రకటించినవాడు మహారాజ బిరుదాంకితుడైన రెండవ కేతరాజు. కోటరాజులలో ప్రఖ్యాతులయినవారిలో కేతరాజు అగ్రగణ్యుడు. ఇతడు పరాక్రమశాలియు రాజనీతి తంత్రజ్ఞుడునైయున్నాడు. ఈతడు వెలనాటి రెండవగొంకరాజునకు మేనల్లుడు. ఈతని తల్లిపేరు సబ్బాంబిక తండ్రిపేరు భీముడు. ఈ కేతరాజునకు పెక్కుమంది రాణులుండిరి. వారిలో కాకతీయ గణపతిదేవుని మేనకోడలును, నతవాడి మహా మండలేశ్వరుడైన రుద్రదేవరాజునకును మైలమ్మా (మేళాంబిక) దేవికిని జనించిన కూతురునగు బయ్యాలదేవి పట్టమహిషి గానుండెను

మహామండలేశ్వరుడైన కోట (రెండవ) కేతరాజు యించుమించుగా శా శ. ౧౧౦౦ మొదలుకొని ౧౧౩౧ వఱకు

(క్రీ. శ. ౧౧౭౮-౧౨౦౯) వఱకును బరిపాలించెను. ఈత నికి బయ్యాల మహాదేవివలన రుద్రరాజు జనించెను. ఈకోట రుద్రరాజు కాలముననే గణపతిదేవ చక్రవర్తి వెలనాటి భూపతులను జయించి పూర్వాంధ్రదేశమును సింహాచలపర్యాంతము స్వాధీనముచేసుకొనెను. ఓడింపబడిన వెలనాటి వంశాంకురములవలనగాని పాకనీటి ప్రభువులవలనగాని, కాంచీపుర చోళులవలనగాని తెలుగు చోళభూపతులవలనగాని మున్ముందే యుపద్రవమును సంభవించకుండ తనరాజ్యమును బదిలపడుటకై గణపతిదేవుడు దన రెండవ కూతురైనగణపాంబాదేవిని కోటరుద్రదేవరాజు సుతుడైన బేతరాజునకిచ్చి వివాహము గావించెను. రుద్రదేవరా జెంతకాలము పరిపాలించెనో తెలియదుగాని యించుమించుగానితఁడు క్రీ. శ. ౧౨౧౦ మొదలుకొని ౧౨౧౬ సంవత్సరములనడుమ మరణించి యుండవలయునని దోచుచున్నది. దేవగిరి రాజ్యాధీశుడైన జైత్రపాలుడు రుద్రదేవుడను యాంధ్రరాజు నొకని రణరంగమునబట్టుకొని నరమేధయాగమును చేసినట్లు చెప్పుకొనుచున్నాడు.* జైత్రపాలుని ప్రశస్తి అలంకార భూయిష్ఠములయిన ఆడంబరవాక్యములతోనిండియున్నను గణపతిదేవునికి నాతనికి సంభవించిన పోరులో కోటరుద్రరాజు గణపతిదేవుని పక్షమున పోరాడియోడి, పట్టువడి యంతట దుర్మరణమువాత బడియుండెనని

* హేమాద్రిపండితుని వ్రతఖండపీఠిక ౫౧ వ శ్లోకము
Bombay Gazetteer Vol. 1 part pp 95—96

విశ్వసింపవచ్చునుతన మేనల్లునకింతటివిపత్తుసంభవించుటచేతను బంధుత్వముచెడిపోవకుండుట గణపతిదేవుడు రుద్రదేవరాజు కుమారుడైన బేతరాజునకుతనకూతురుగణపాంబనిచ్చివివాహము జేసియుండెను. రుద్రదేవునకు మేనమామ కుమార్తె యైన గణపాంబ బేతరాజునకు పెండ్లియాడ వరుసయెట్లయ్యెనో యెఱుకపడదు. అయిన నాకాలపు సాంఘికాచారములు గాని రాజనీతిగాని, మనకు దెలియనంతవఱకు, నిట్టి వివాహములు రాజ్యసంరక్షణమునకై రాజనీతి ననుసరించి గావింపబడుచుండిన ట్లూహింపవలయును.

బేతరాజు రాజ్యపరిపాల నారంభసంవత్సర మెప్పుడో తెలియరాదు గాని, యాతడు మరణించినది మాత్రము శా. శ.౧౧౨౩(క్రీ. శ.౧౨౦౧)సంవత్సరమని తెలియవచ్చుచున్నది. * బేతరాజు శాసన మొకటి యాతడు శా. శ. ౧౧౨౩ సంవత్సరమునాటికింకను జీవించియున్నట్లు సూచించుచున్నది. ఆశాసనముశకవర్షము ౧౧౨౩ (క్రీ.శ.౧౨౦౧)వైశాఖశుద్ధ విదియా సోమవారమునాడు వ్రాయించబడినది. అందు కోటబేతరాజు, (మహిషాసురమర్దనగిరి) యనుమదలనుండి రాజ్యమేలుచుండినట్లును, ఆతడా పట్టణమున గోపీనాథుడను పేర కృష్ణునికొక దేవాలయము కట్టించగా, ఆదేవుని అంగరంగవైభవములకు, నిత్యపళ్ళకు, దీపారాధనములకొఱకు నాతని రాణి

* Ep and Vol. III pp 95—96

¶ Ep Coll for 1833 Ep no 120 to 122

గణపాంబ గారగపాడుగ్రామములోని కొంతభూమిని, నూనె తీయుటకొక గానుగను, ఒకపువ్వులతోటను దానముచేసెనని చెప్పబడియున్నది. ఇది యిట్లులుండ నాయూరనే వేణుగోపాలస్వామివారి యాలయముననున్న యొక శాసనమున, గణపాంబ, శా. శ. ౧౧౭౫ నాటికే (క్రీ॥శ. ౧౨౫౦) భర్త చనిపోయినందున పట్సహస్ర విషయమును తానే స్వయముగా పాలించుచుండినట్లు చెప్పుకొన్నది.* ఈ రెండుశాసనములును పరీక్షించిచూచిన కోటబేతరాజు ౧౨౫౦ వ సంవత్సరమునందుగాని, ౧౨౫౧ సంవత్సరమునందుగాని మరణించియున్నట్లు తోచకమానదు.

పైశాసనాధారములబట్టి, బేతరాజు, గణపతిదేవుడికపదిసంవత్సరములకు మరణించుననగా, కాలధర్మమునొందినట్లు నిర్ణయింపవచ్చును. బేతరాజు మృతుడైనది మొదలుకొని గణపాంబ భర్తృరాజ్యమును తానే పరిపాలించినట్లు, యామె వేయించిన యనమదలశాసనములవలనను, అమరావతి శాసనములబట్టియు తెలియుచున్నది. బేతరాజుచిన్నతనమునందే, గణపతిదేవునికి సహాయముగ యుద్ధములందు పోరాడుచు క్రీ. శ. ౧౨౫౧ సంవత్సరమున మణించియుండవచ్చును. ఇతనివెనుక గణపాంబామహాదేవి చాలాకాలము ఆయువేలనాటిని పరిపాలించియుండెను. బేతరాజుచనిపోయినవెనుక, నతనిసోదరుడైన, కోటమన్మకేతరాజపుత్రులయిన, గణపతి దేవరా

Ep coll 142 of 1913

జును, భీమరాజును ఆమెకు సామంతులుగా శా. శ. ౧౧౮౭ (క్రీ. శ. ౧౨౬౫) వఱకును బరిపాలించియుండినట్లు దెలుపు వారి శాసనములు గానవచ్చుచున్నవి. వారి గణపాంబయే రాజ్యపాలనము చేసియుండిన ట్లూహింపవలయును. మార్కోపోలో మోటుపల్లి రేవును జూడవచ్చిన దించుమించుగా క్రీ. శ. ౧౨౯౦ వ సంవత్సరమని యీవఱకే తెలిపియుంటిమి కావున నీతడు మోటుపల్లియందు, గణపాంబామహాదేవియొక్క నలువదియపరిపాలనసంవత్సరమున నుండినట్లు స్పష్టమగుచున్నది. ఇందుల కాతడు "ఈమె తనభర్త చనిపోయినదిగా నలువదిసంవత్సరములనుండి, యాయన రాజ్యమును, ధర్మబుద్ధితో న్యాయపరిశీలనతో విశేషమగు ప్రజ్ఞతో పరిపాలన చేయుచున్నదని వ్రాసినపంక్తులు యదార్థములగుచున్నవి. మార్కోపోలో ప్రశంస జేసిన రాణి, గణపాంబామహాదేవియనుట కింకొక ప్రమాణముకూడ గలదు. ఆమె యేలిన రాజ్యమామె భర్తది గాని, తండ్రిదిగాదు. గణపతిదేవచక్రవర్తి, పుత్రికాసంతానమేగాని పుత్రసంతానము లేనివాడై, కుమార్తెయగు రుద్రాంబికను కుమారునిగా భావించి, విద్యాబుద్ధులు చెప్పించి, రాజనీతి యుపదేశించి, తాను జీవించియుండగనే కాల మాసన్నమైనదని గ్రహించి, మంత్రిపురోహితసేనాపతులను సామంతులనురావించి, 'యామెను పట్టాభిషిక్తురాలిం జేసెను. ఆమెయప్పటికే వైధవ్యము ననుభవించుచుండెను. ఆమె గణపాంబికవలెగాక చిన్ననాటనే భర్త వియోగముకలిగి నాటనుండియు, తండ్రిచే

కుమారునికై వడి బంపబడుచుండెనని దోచుచున్నది. కావున రుద్రాంబిక, పరిపాలించిన రాజ్యమామె పైతృకరాజ్యము. గణపాంబిక పాలించినది భర్తయొక్క రాజ్యము. మార్కోపోలో యీ నారీమణి భర్తరాజ్యమునే పాలించుచుండినట్లు చెప్పినాడుగావున, నాతడు ప్రశంసించినది గణపాంబిక గాని రుద్రాంబిక గాజాలదని నిశ్చయింపవచ్చును. మరియు నింకొక విశేషముగలదు. గణపాంబిక రుద్రమదేవికి సామంతరాజ్ఞియై యుండి కప్పము గట్టుచుండవచ్చునుగాని యామె చిన్నరాజ్యమున నామె సర్వస్వతంత్రురాలుగా నుండెను. అట్టియెడ, నీమెరాజ్యమున రుద్రాంబికపేరు వినబడినదనుటకంటె గణపాంబికదేవికీర్తియే గానము చేయబడుచుండెననుట సమంజసముగానుండును.

ఇంచుమించుగా, రుద్రమదేవియు, గణపాంబయునొకే కాలమున పరిపాలనము సాగించియుండిరిగాని, రుద్రమదేవి కంటె గణపాంబయే అటుపదిసంవత్సరములు నిటుపదిసంవత్సరములును వెరసి యిరువది సంవత్సరములవరకు తండ్రిగణపతిదేవునివలె పరిపాలించియుండినట్లు గానవచ్చుచున్నది. గణపాంబ ఎటుచూచినను రుద్రమదేవిపరిపాలనముమూడుదశలకంటెమించలేదు. గణపాంబ భర్తృమరణాంతరము యనేకధర్మకార్యముల నాచరించెను-ధాన్యకటకములోనియమరేశ్వరాలయముయొక్క గోపురమునకీమె బంగారుకలశమునునిర్మించెను. తనభర్తపేరట బేతేశ్వరాలయమని యొకశివాలయమునుప్రతిష్ట

జేసెను- బేతేశ్వరాలయగోపురములకుగూడ సువర్ణకలశములె త్తించెను. ఈశివాలయ సంరక్షణముకొఱకు ధాన్యసమృద్ధమైన బెనదేవియను గ్రామమును దేవమాన్యముగ ధారవోసి, శాసనముల్వ్రాయించెను. బ్రాహ్మణులకనేక అగ్రహారములుదానముచేసెను. మరియుదనతండ్రి గణపతిదేవచక్రవర్తిపేరట గణేశ్వరాలయమను శివాలయమునుబ్రతిష్టించి దానికై చింతపాడను గ్రామమును దానముచేసెను. ఈమె, మహేశ్వరధ్యానతత్పరురాలై, యవసానకాలమునుగడపెను.

# అబ్దుర్ రజాక్

# అబ్దుర్ రజాక్

## ఇమ్మడి దేవరాయలనాడు విజయనగరమున పారశీక రాయబారి ౧౪౪౧-౧౪౪౪.

### అబ్దుర్ రజాక్ జీవితము.

అబ్దుర్ రజాక్ యొక్క నిండుపేరు కమాలు-ద్దీన్ అబ్దుర్ రజాక్. అతనితండ్రిపేరు జలాలు-ద్దీన్ ఇషక్. అబ్దుర్ రజాక్ తండ్రి మధ్య ఆసియాఖండములో 'సమరఖండ' దేశవాస్తవ్యుడు. మన కథానాయకుడు మహమ్మదీయ హిజరాశకము ౮౧౬ సంవత్సరము ష-అబాన్ మాసమున పన్నెండవదినమున (అనగా క్రీస్తుశకము ౧౪౧౩ వ సంవత్సరము నవంబరు ౬ వ తేది.) హిరాట్ నగరమున జన్మించెను. పారశీక చక్రవర్తియగు సుల్తాను షా-రుఖ్ కొలువున జలాలుద్దీన్ కొంతకాలము "కాజీ" యుద్యోగమునను, మరికొంతకాలము "ఇమామ్" ఉద్యోగముననుండుచు సుల్తానుచే నప్పుడప్పుడు ధర్మసందేహనివర్తికై యాహ్వానింపబడుచు ధర్మగ్రంథములు చదివి వినుపించుచుండెను. అబ్దుర్ రజాక్ తండ్రివలెనే గొప్ప విద్వాంసుడును, అరబీ భాషయందు వైయ్యాకరణియు నై యుండెను. తండ్రిచనిపోయిన తరువాత నతడు అరబీభాషలోని ప్రత్యయములు, సర్వనామములనుగూర్చి 'అజ్దుద్దీన్ యాహ్యా' అనునాతడు వ్రాసినవ్యాకరణమునకు గొప్పవ్యాఖ్యానమును రచించి, దానిని సుల్తాను

షా-రుఖ్‌న కంకితము చేసెను. కృతినొసంగు సమయమున సుల్తాను, అబ్దుర్‌రజాక్ పాండిత్యమునకును రాజభక్తికిని కడు మెచ్చుకొని తనహస్తమును అత్యంతగౌరవసూచకముగ ముద్దిడనిచ్చి సంభావించెను. ఆప్రభువు పరిపాలనావసానకాలమున నితడు విజయనగర చక్రవర్తికడకు రాయబారిగా బంపంబడియెను. విజయనగరమునుండి స్వదేశమగు ఖురాసాన్ దేశమును సుఖముగా జేరునప్పటికి నతడనేకకష్టము లనుభవించి దుర్దశలపాలయ్యెను. విజయనగరమునుండి తిరిగివచ్చిన తరువాత క్రీ. శ. ౧౪౪౭ వ సంవత్సరమున "గిలాన్" దేశమునకు రాయబారిగా బంపబడియెను. కాని యాపని పూర్తిగాకమునుపే యీజిప్తుదేశమునకు బోవలసినదని సుల్తాను షారుఖ్ వర్తమానము పంపియుండెను. ఇంతలో నాతని నింతయాదరించి గౌరవించిన యాసుల్తాను మరణించుటచే ఈజిప్తురాయబారము కొనసాగియుండలేదు. సుల్తాన్‌షారుఖ్ మరణించినతరువాతను గూడ నితడు వరుసగా సింహాసన మదిష్ఠించిన మీర్జాఅబ్దుల్ లటీఫ్, మీర్జాఅబ్దు-ల్లా, మీర్జాఅబుల్ కాశిమ్ సుల్తానుల కొలువుకూటముల గౌరవింపబడుచువచ్చెను.

క్రీ. శ. ౧౪౫౨ వ సంవత్సరమున సుల్తాన్‌అబుల్‌కాశిమ్ బాబరుతో గలసి "టఘ్‌ట్ యద్జు" అనునగరమున కరిగియుండెను. ఆసంచారమునందు చరిత్రకారుడగు షరూఫ్-ఉద్దీన్ ఆలియద్జి అనువానితో సుల్తాను ముచ్చటించినపుడు ఆసంభాషణ నాలకించుట కితడు నాహ్వానింపబడియెను. ఇది జరిగిన

రెండు సంవత్సరములకు సుల్తాను అబుసయిద్‌న కాప్తుడయి యాతనిచే విశేషముగ గౌరవింపబడియెను. ఈతనికాలమున అబ్దుర్‌రజాక్ "ఖాన్‌కహా" అనుసుల్తాన్ యొక్క భోజనశాలకధ్య క్షుడుగా నియమింప బడియెను. ఈయుద్యోగమునం దతడు చనిపోవువఱకు నుండి ప్రభువునకత్యంతప్రియుడై తన యుద్యోగము విశ్వాసముతో నిర్వర్తించియుండెను.

అబ్దుర్‌రజాక్ క్రీ.శ.౧౪౮౨ వ సంవత్సరమున అక్టోబరు నెలలో కాలధర్మమునొందెను. ఈతడు రచించిన గ్రంథము లలో మిక్కిలి యుపయుక్తమైనది, మనకు ప్రస్తుత విషయమును గూర్చి దెల్పునది "మల్లా-ఉస్-సలదయిన్" అను చరిత్రగ్రంథ ము. ఇయ్యది యాతని కాలమునుండియు సర్వజనాదరణీయమై యుండెను. ఇందు మనవిజయనగర సామ్రాజ్యవృత్తాంతము మాత్రమే గాక యాతడు గొల్చియుండిన ప్రభువుల పరిపాల నమునాటి విషయములుగూడ చాలగలవు. ఈగ్రంథము రెండు సంపుటములుగా నున్నది. ప్రథమసంపుటమున విజగీషామనీష గల తైమూరుచక్రవర్తి యారంభదశ మొదలుకొని యాతని మరణాంతరము వఱకు గల చరిత్రియంతయు సవిస్తరముగ దెలుపబడెను. రెండవభాగమున తైమూరువంశస్థుల చరిత్ర మొదలుకొని రజాక్ గొల్చిన కడపటి పారశీకసుల్తాను హాసన్‌మీర్జా మరణానంతరమువఱకు జరిగియుండిన వృత్తాం తములను వివరించెను. ఈగ్రంథమునుఅబ్దుర్‌రజాక్ చనిపోవుటకు రెండుసంవత్సరములకు,బూర్వము క్రీ. శ. ౧౪౭౦ లో రచించెను.

కడు ముదిమికాలమున రచించినదయ్యు నాతని చరిత్ర, విజయనగర సామ్రాజ్యమునకు సంబంధించినంత వఱకు మనోహరములునుసూక్ష్మములునయిన చారిత్రకవిషయములతో నొప్పాఉచున్నది. ఇట్టిగ్రంథమే లేకుండిన యిమ్మడి దేవరాయల నాటి విజయనగర సామ్రాజ్యమునుగురించిన కొన్ని యపూర్వ వృత్తాంతములు మనకు దెలిసియుండవు.

"మల్లా-ఉస్-సఅదయిన్" పారశీకభాషయందు రచింపబడియున్నది. ఇందులో మన విజయనగర సామ్రాజ్యమునకు సంబంధించినంత భాగము, బెంగాలు సివిలుసర్వీసులో పనిచేసిన సి. జె. ఓల్డుఫీల్డు అనునాతనిచే నాంగ్లభాషలోని కనువదింపబడి, సర్ హెన్రీ. యం. ఎలియుట్ గారిచే సంస్కరింపబడియెను. ఇపుడా గ్రంథమే మనచారిత్రమునకు మూలాధారము.*

హిందూస్థానమునకు రాయబారము.

అబ్దుర్ రజాక్, హిందూస్థానమునుగూర్చియిట్లువ్రాయుచున్నాడు. "హిజరాశకము ౮౪౫వ సంవత్సరమున (క్రీస్తుశకము ౧౪౪౧), జ్యేష్ఠమాసమున నొక శుభదినమున సకల పృథ్వీపతియగు మాఱేడు యీచరిత్రకారుడును ఇసాక్ కుమారుడును నగు అబ్దుర్ రజాక్ నకు, హిందూస్థానమునకు

* నే నీచరిత్రమును ప్రతిపదార్థముగా తెనిగింపక కొంచము స్వేచ్ఛగా యథామూలముగా తెలుగుచేసితిని. పాఠకు లిందుకు మన్నింతురుగాక.

రాయబారిగా నరుగవలసినదని ,యాదేశమంపెను. అంతట నాతడు హోర్మజు రేవున బయలుదేరి సముద్రమున కావలిగట్టునుగూర్చి పయనమయ్యెను..............హోర్మజుపట్టణము ఆరాజధానికి ముఖ్యనగరము. అది గొప్ప రేవుపట్టణము, దానికి "జెరూన్" అని మఱియొకపేరుకూడ గలదు. ఆమహా నగరమునకీడయిన పట్టణ మీాధరాతలమున నింకొకటి కాన రాదు. నవద్వీపములనుండి వర్తకు లిక్కడ కేతెంచెదరు. ఈజిప్తు శిరియా,రూమ్ (టుర్కీ) ఆజర్ బైజాన్, ఇరాఖ్,పార్స, ఖురాసాన్,మావారాల్ నహర్ ,టుర్కిస్థాన్ దష్తు-ఇకిప్ చాక్, కల్మక్ దేశములుమున్న గువాటినుండియు, తూర్పున చీన్, మాచీన్, ఖాన్ చాలిక్ మున్నగు దేశదేశాంతరములనుండియు వర్తకులు వచ్చుచు పోవుచుందురు. చీనా, జావా, బంగాళము, సింహళము జీర్ బాద్ నగరములు, తనాసిరి, సకోత్రా, మాలదీవులలోని తొంబదినగరములు, మలబారు, అబిస్సీనియా, జాంజిబారు, విజయనగర సామ్రాజ్యపు రేవులు, కలబరిగె, ఘూర్జరము, కంబా, అరేబియాదేశపు రేవులు, ఏడెను. జంబో,మున్నగునానాద్వీపదేశాంతరపట్టణములనుండి వర్తకులు వారివారి దేశములందు దొరకెడి యపూర్వములయిన వస్తుసామగ్రి నెల్లప్పుడు దెచ్చుచు నిచ్చట నమ్ముకొనుచుందురు. వారు దెచ్చెడిసరకులు సూర్యచంద్రాదులు, వర్షములుగూడ మెరుగుపెట్టదలచునంత అపురూపము లయినవి. భూమిపైగల నీయాదేశములనిలేక యన్నిప్రాంతములనుండియు వ్యాపారులి

చ్చట తాముదెచ్చినసరకుల నమ్ముకొనుచు నిచ్చటిసరకులను గొంపోవుచుందురు. వారుఒక్కొక్కప్పుడు తమకు గావలసిన వస్తువులకు సరియగు విలువగల తమసామగ్రిని మార్చుకొందురు. వెండిబంగారములమీద దప్ప ఈరేవున దిగుమతివస్తువుమీద వెలచేసి నూటికి పదియవపాలు ఆరాజునకువర్తకులు రేవుసుంకము చెల్లింపవలయును. అనేకవిధములగు మతప్రచారకులు కాఫరులు, నాస్తికులు, మున్నగు నానాదేశీయులగు వారనేకు లీనగరమున గలరు. వారంద రానగరాధీశ్వరుని ధర్మపరిపాలనముక్రింద నేయన్యాయమును బొందక సుఖించుచున్నారు. అందువలన నీనగరమునకు న్యాయపరిపాలనమునకు ధర్మమునకు ఉనికిపట్టు అను అర్థమిచ్చు "దారుల్ అమాన్" అను ప్రసిద్ధిగలదు. ఈ నగరవాస్తవ్యులు ఇరాకీయుల విసయమర్యాదలను హిందువులు నేర్చుతో ప్రకటింతురు.

" ఈ నగరమున నేను ప్రయాణమునకు బూర్వము రెండుమాసము లుండవలసి వచ్చెను. నేను వ్యాపారినేమో యనియు సుంకమీయక పారిపోవ దలచినవాడనేమో యనియు, రేవుసుంకరులు నన్ను త్వరలో వెడలనీయక పరీక్ష చేయసాగిరి. ఈ పరీక్షలో ఓడలు బయలుదేరు ఋతువు దాటిపోయెను. అంతట వర్షకాల మారంభమై యుండినందున వర్షములు వెనుకపడి తుపానుల భయము తీఱువరకును నన్ను పయనము సేయనీరైరి. నాతోడనుండిన గుర్రము

లను, మనుష్యులెక్కు ఓడలో * నుంచ వీలులేదని యా గుఱ్ఱముల నొక యోడలోను, నన్నునాపరివారమును మరి యొక యోడలోను నెక్కించిరి. అట్లు ఆ రెండోడలలో నేను ను నాపరివారమును పయనమైతిమి.

,,ఓడలలోని దుర్వాసన నాకు స్మృతిలేకుండ జేసెను. దానికితోడు సముద్రప్రయాణము నాకుభయావహమయ్యెను. ఈ రెండు కారణములవలన నేను మూడు దినములవరకు నూపిరిలేకుండ చచ్చినవానివలె పూర్తిపోయియుంటిని.

,, మూడవనాడు నాసికాగ్రమున కొనియూపిరి కన బడినపుడు మావారు నేనింకను జీవించియుంటినని ధైర్యము దెచ్చుకొనిరి. నాకు కొంచము తెలివి వచ్చునప్పటికి ఓడ మీద నాతోపాటు ప్రయాణము సేయుచుండిన నామిత్రుల నుపర్తకులందరు నైక్యకంఠముగ సముద్రప్రయాణమున కను కూలమైన అదను దాటిపోయిన పిమ్మట బయలుదేరిన నెట్టి యుపద్రవములైన రావచ్చుననియు, అట్టి సమయమున నెవ డైన నకాలమరణము నొందినవానికి వాడే నిందించుకొన వలయును గాని యితరుల నేమనినను లాభము లేదనియు మొదలగు మాటలు నెన్నియో నన్నాడి నిందించి, తుదకు మేమింక నీతో నీయోడమీద రామని మొక్కపెట్టున నంద

* మనుష్య లెక్కు ఓడకు ,,జోగు'' అనియు సరకు గొంపోవు వో డకు ,,కప్పలి'' యనియు నాంధ్రమున పేరులు గలవు.

రును "మస్కాటు" రేవున-ఓడ దిగిపోయిరి. * పాపము వారందరు నోడకేవును ముందుగానే యిచ్చి యుండినందున యానము పూర్తిగాకుండ నోడ దిగుటచే వారెంతో నష్టపడుటయే కాక సరకుల గూర్చి చాల చిక్కులుపడిరి.

"ఇక నేనును వారితోపాటు మస్కాటు రేవున దిగి యచ్చట మాత్రమాగక "కరియాట్" అను పట్టణమునకు బోయి యచ్చట నివాస మేర్పరచుకొంటిని. ఓడ పయనము పూర్తిగాకుండినప్పుడును, అర్థాంతముగ నెక్కడనైన కొంత కాలము తలదాచుకొన వలసినప్పుడును, సముద్రవ్యాపారులు దిక్కుమాలిన వారివలె యిడుముల పాలగుదురు. ఆయిబ్బందులు వారికే తెలియవలయును. దైవము నిర్దయుడై యుండుటవలనను, నాదురదృష్టము ఇంకను దరిచేరకుండుట వలనను నేను కొంచ మధైర్యము చెందితిని. నా హృదయము బ్రద్దలయిన గాజుముక్కలవలె చెదరిపోయెను. బాధలననుభవింపలేక, తుదకు ప్రాణముపై అసహ్యము కలిగి యంతకన్న చచ్చిన మేలను కొంటిని.

"ఇట్టి స్థితియందు, వేరు గతిలేని మేము కరియాట్ గ్రామమున సముద్రపుటొడ్డున కాపుర ముంటిమి. ఇంతలో మొహరమ్ పండుగవచ్చెను. ఆపండుగల తొలినాటి రాత్రి చంద్రుడతిమనోహరమయిన రేఖతో వెలుగసాగెను. దుఃఖ

* మస్కాటురేవు, హార్మజునగరమునకు దక్షిణమున ఉమాన్ సింధు శాఖ ముఖమున అరేబియాలోనున్నది.

భాజనమై యంధకార ప్రక్రియనున్న మా దుస్థితికి ఆమొహరమ్ * నాటి విదియచంద్రుడు ఆశా కిరణములను ప్రసరింపజేసెను. ఆయ్యది దక్షిణాయనమైనను సూర్యుని వేడిమి మాత్రము దుస్సహాముగా నుండెను. గనులలోని కెంపులును, ఎముకలలో క్రొవ్వునుగూడ కరిగింపజేయు నంతటి వేడిగాడ్పు వీచెను. ఆవేడికి మేము తాళలేక పోతిమి. నేను, నా జ్యేష్ట సోదరుడును, మరికొందరు ప్రియమిత్రులు మొదలగువార లనేకు లాయుష్ణమునకు తాళజాలక అరోగ్యము చెడి చాల జబ్బు పడితిమి. అట్లు జబ్బువలన నౌకరి తరువాత నౌకరు నాలుగుమాసములు బాధపడుచు నచ్చటనే యుండిపోతిమి. కాని ఆయూరివారు కొందరు, కరియాట్ గ్రామము నకంటె నవ్పూర్ అను పట్టణము చాలమంచి ఆరోగ్యకరమైన నగరమనియు, నచ్చట మంచి తియ్యని ఆరోగ్యవంతమైన నీరు లభించుననియు నచ్చటికి బోయిన శీఘ్రమే పునరారోగ్యముగలుగుననియు బలుమారు చెప్పుచుండుటచేత వారిమాటలు విశ్వసించి యింకను లేవలేనిస్థితిలో మనపను నేను ఓడమీాద బయలుదేరితిని. కాని నా దౌర్భాగ్యవశమున అక్కడ ప్రవేశించినవెంటనే నాకు రోగ మెక్కువయ్యెను. ఇక్కడ నున్నప్పుడే నాపెద్దన్నగారు మవులానా ఆఖీ-ఫుద్దీన్ అబుల్ వహాబు గారు

* మొహరమ్‌పండుగ ముసల్మానులకు సంవత్సరాదివంటిది. ఫసలీఅంతటనుంచి లెక్కపెట్టబడుచుండును.

కాలధర్మమునొంది మమ్మందఱను దుఃఖసముద్రమున ముంచి వేసిరి.

"ఎట్టకేలకు ఇక్కడనుండి హిందుస్థానమునకు నోడనెక్కితిమి. పదునెనిమిది దినము లహోరాత్రము లొక్కరీతిగ మాయోడ గాలిబోసికొనుచు నడచెను. పరిశుభ్రమైన యా సముద్రపుగాలివలన నాకు సంపూర్ణముగ తిరిగిఆరోగ్యము కలిగెను. అటుల పదునెనిమిదిదినములు గడచి, పందొమ్మిదవ నాటి యుదయమున, దైవకృపవల్ల సురక్షితముగ కళ్ళికోట రేవునమాయోడ లంగరుదింపెను. ఇంతటినుంచి నాదేశమున నేను చూచి వినినవింతల నన్నిటిని యథార్థముగవర్ణించెదను.

"కళ్ళికోట మిక్కిలి నిరపాయకరమైన నౌకాశ్రయము. హార్మజువలె నిచ్చటికు నానాదేశీయులగు వ్యాపారులు, వాణిజ్యార్థమై వచ్చుచు బోవుచుందురు. అబిస్సీనియా, జీర్బాద్, జాంజిబారు దేశీయులనుండి యోడలు సరకులు తీసికొని తెచ్చుచుగా నీరేవునకు వచ్చుచుండును. అప్పుడప్పుడు మక్కానగరము నుండియు, నరేబియా దేశపుటితరనగరములనుండియు నోడలు వచ్చుట గలదు. ఆవచ్చిన యోడలు యిచ్చవచ్చినకాల మాగుచుండును. ఈపట్టణమందెచ్చటజూచినను నాస్తికులు (కాఫరులు,మహమ్మదీయేతరులు) గలరు. అందువలననీనగరమవశ్యము ముసల్మానులచేజయింపబడదగినది. ఇచ్చటచాలమందిమహమ్మదీయులును గలరు. వారు శుక్రవారమునాడు, నమాజుచేసుకొనుటకై రెండుగోపురములు గలపెద్దమసీదులను కట్టించుకొనిరి.

వారలకందఱకును దైవభక్తిపరాయణుడయిన యొక 'కాజీ' కూడగలదు. ఇక్కడి మహమ్మదీయులందఱు 'షాఫీ' కులస్థులు సంపన్నులయిన వర్తకులు. సముద్రతీరపు దేశాంతరపట్టణము లనుండివిలువగలవస్తువులను దెచ్చివర్తకు లీరేవునదింపుకొనుచు విచ్చలవిడిగ వీథులందును, గచ్చులందును రాజబాటలందును కావలిలేకయే నిలువజేసుకొందురు. ఈనగరమున నెవరికినేభీతి యు నన్యాయ భయమును కలుగనంతటి ధర్మపరిపాలనము గలదు. ఎంతటి విలువగలవస్తు వెచట నిర్భయముగా పారవేసి యుంచినను దొంగభయమనునది లేదు. వర్తకులు తాము నిలువజేసికొనిన సరకులపై నెవరిని కాపుంచ నక్కరలేకయే రేవుసుంకాధికారులచే భద్రముగాజూడబడుచుండును. రాత్రిం బవళ్ళు వారు వాటిచుట్టును కావలి గాయుచుందురు. విదేశ వర్తకులు దెచ్చినసరకు అమ్మడు పడువఱకు వానిపై సుంక మును దీయరు. అమ్మబడిన సరకులకు వెలపైనూటికి ౨ 8 ॥ 8 (2½) చొప్పున సుంకము గైకొందురు. ఇతర రేవులను జేరవల సిన సరకుతోనిండిన ఓడలు వాయువశమున గమ్యస్థానమును నగానక నితరరేవులకడ నెక్కడైన మెట్టపట్టిపోయినచో నచ్చటి ప్రజలా యోడలోని సరకులను గొల్లగొట్టు నాచారమున్నది*

* ఇట్టిదురాచారమే యాంధ్రదేశమున కాతీయగణపతిదేవుని కా లమునకు బూర్వ ముండినట్లు శాసన ప్రమాణములు గలవు. చూడుడు. ప్రాచీనాంధ్ర నౌకాజీవనము పుట ౧౨౬-8; Ep. Ind. Vol. XII p. 188 ff.

కాని కళ్ళికోటలో నట్లుగాదు. ఏ దేశమునుండివచ్చిన యోడల యినప్పటికిని ఎట్టిదుస్థితిలో రేవును జేరినప్పటికి నితర యోడలతో సరిసమానముగ సంరక్షింపబడును. ఆయోడ కెట్టియాపదయు వాటిల్లదు.

“మాయేలికయగుసుల్తాను షా-రుఖ్-ఖాకానీ-సయిద్ నృపాలుడు కళ్ళికోటనగరాధీశున కుత్తమాశ్వములను మేలైన జరీయంగీలు, కళ్ళాయిలు మొదలగు నమూల్యములయిన యుడుపులను—సంవత్సరాదిపండుగనాడు కానుకగా నర్పింపం దగినవి—బహుమతులుగా నంపియుండెను.*

“ఇందులకు గారణ మాచక్రవర్తిచే నంపబడిన రాయబారులు బంగాళా దేశమునుండి తిరిగివచ్చు సమయమున, కళ్ళికోట రేవున దిగవలసివచ్చుటయు, నపుడు వారు సామురీకి మారాజు ప్రశస్తినిగూర్చి విశేషముగా దెలుపుటయు సంభవించెను. ఆరాయబారులు స్వదేశమును చేరినపుడు వారిముఖమున మాచక్రవర్తి కళ్ళికోటనుగూర్చి యంతయు దెలిసికొనియుండెను. మరియు ప్రపంచమున నున్న నృపాలురందఱుగూడ కళ్ళికోట ప్రభువుతో నెయ్యము సలుపుట కిచ్ఛగింతురనియు, నాతని

* అబ్దుర్ రజాక్ రాయబారిగా విజయనగరమునకు బంపబడియుండగా కళ్ళికోటసామూరియే తన యేలిక యనుకొనిన చక్రవర్తియని పొరపడి యాతడు పంపిన కానుకలన్నియు సామూరికి నర్పించెను. పిమ్మట తనతప్పు తెలిసికొని యది యితరులకు తెలియకుండ గడుసుదనముగ గప్పిపుచ్చెను. ముందు చూడుడు.

దేశము నుండి వారికావశ్యకములయిన సరకులు గొంపోవ బడుచుండుననియుగూడ వినియుండెను.

"ఇదిజరిగిన కొంత కాలమునకు వంగదేశపు సుల్తాను, జాన్పూరు సుల్తానగు ఇబ్రహీంవలన తనకెక్కువబాధలు కలుగుచున్నవనియు, నాతని జయించుటకు కొంతసైన్య సహాయ మంపవలసినదనియు, మాచక్రవర్తిని శరణుజొచ్చెను. శరణాగత రక్షకుడగు మాచక్రవర్తి వెంటనే జాన్పూరునకు షెయిఖుల్-ఇస్లామ్ ఖ్వాజాకరీముద్దీన్-అబూ-అల్ మకారిమ్ జామీ అను నాతని రాయబారిగా నంపి, వంగదేశముపై నిక ముందెప్పుడును యుద్ధమునకుబోయి బాధింపవలదనియు, నట్లు గావించిన వాటిల్లు అనర్థములకు తానే నిందించుకొనవలయుననియు జాన్పూరు సుల్తానునకు సందేశమంపియుండెను. *

"అందులకు జాన్పూరు సుల్తాను చక్రవర్తి యాజ్ఞను శిరసావహించెను. కళ్ళికోటనగరాధీశు డీవృత్తాంతము వినిన వెంటనే తనదేశమునందు దొరకు విలువగల వింతవస్తువులను ప్రోగుచేసి మాచక్రవర్తి స్నేహమభిలషించుచు నొక రాయబారమంపెను. మరియు తనరాజ్యమున మహమ్మదీయులు ప్రతిశుక్రవారమునాడు నేయాటంకములేక నమాజు చేసికొనుచు, మసీదులలో ఖుతుబాను పఠించు చున్నారనియు,

* అబ్దుల్ రజాక్ చెప్పినదంతయు విస్పష్టమగుటలేదు. అత డుదహరించినవిషయములు బంగాళాదేశమునకు సరిపోవు. గుజరాత్, దక్షిణీసుల్తానుల యుద్ధములకు సరిపోవునేమోనిర్ణయింపజాలను.

వారందఱుమాయేలిక యనుజ్ఞనిచ్చిన నాతనినామముతోఁ జేర్చి నమాజు చేసికొొందురనియు విన్నవింపజేసెను.

"ఆతనిరాయబారి బంగాళాదేశమునుండి తిరిగివచ్చుచుండిన రాయబారులతోఁ గలసివచ్చుటజేసి, మారాజుకొలువున నున్నసామంతరాజులు కొందరు ఆతనిఆగమనము రాజునకెరిగించి కానుకల నర్పింపజేసిరి. ఆవచ్చినకళ్ళికోటరాయబారి మహమ్మదీయుడు; మంచివక్త; తనవాచాలత్వముచే రాజును సులభముగ మెప్పించి, పిమ్మట నీవిధముగ ముచ్చటించెను.

"మాయేలిక మీతోఁ నెయ్యమును స్నేహము నెఱపదలచి న న్నంపియున్నాడు. మీరు మాపై ననుగ్రహించి మహమ్మదీయమతప్రవక్తలను మారాజుకడకు బంపినమొదల అజ్ఞానాంధకారమున నున్న మాదేశపుప్రజలను, ఏలికను, వెలుతురులోనికి దెచ్చి పుణ్యముగట్టుకొనినవా రగుదురు." ఆమాటలకు మాచక్రవర్తి మనసుకరిగినవాడై తా నొకరాయబారము బంప నిశ్చయించెను. ఆమహాత్కార్యము నిర్వహించుభారము దైవకృపవల్ల యీఅల్పునిపై బడెను. నన్నుకొంద ఱనూయాగ్రస్తులు సముద్రయానమున బోయినవారు మరలతిరిగిరాజాలరనియు, నదిఅపాయకరమనియు నిరుత్సాహపఱిచిరి. కానివారిభయములుబెదరింపులునిష్ఫలములయ్యెను. మూడుయేండ్లు గడుచుసరికి నేనుసుఖముగా స్వదేశముజేరితిని.

అప్పటికి నన్ను నిరుత్సాహపఱచినవారు మాత్రము జీవించి యుండరైరి.

కళ్ళికోట నగరము.

"కళ్ళికోటరేవులో నోడదిగి యూరిలోనికి బోవునప్పటికి నేను కలలోగూడ కనివిని యెఱుగని యొకవికృతజాతి మనుష్యులు నాకంటబడిరి. అట్టివారిని మన మెక్కడను జూడజాలము.

నల్లనిదేహచ్ఛాయ వెడదనోరు వ్రేలాడు చెవులు, భీకర స్వరూపము గల్గిన యీ దేశపుస్త్రీపురుషులు మొలపై నొకగుడ్డతప్ప నించుమించుగా దిగంబరులయి యుందురు. కుడిచేతిలో ముత్యమువలె తెల్లనై ప్రకాశించు, నొకకత్తిని, యెడమచేతిలో కాఱుమబ్బువలె నల్లనై కాన్పించుతోలుతో చేయబడిన డాలును ధరించి తిరుగుచుందురు. తిరిపె మెత్తుకొను బిచ్చగాని మొదలుకొని నగరమేలు నృపాలునివఱకు గూడ నిట్లే యుందురు. ముసల్మానులు మాత్ర మట్లుగాక మంచివిలువకలిగి అందములైన యంగీలను, పచ్చడములను, విరివిగా నరబ్బులవలె ధరించి తమసంపన్నత్వమును వెల్లడి చేసుకొనుచుందురు.

"పట్టణములోనికి బోయినవెనుక నేను చాలమంది మహామ్మదీయులతోడను, నాస్తికులగు దేశీయులతోడను ముచ్చటించితిని. వారు నాకొక యనుకూలమైన భవనమును బసగా నిచ్చిరి. మూడుదినములయినపిదప నన్ను వారి రాజు

నొద్దకు దర్శనార్థము దీసికొనిపోయిరి. నేను అచ్చట నితర మనుష్యులవలె మొలగుడ్డ కట్టుకొనియున్న యొకని జూచితిని. అచ్చటివారంద ఱాతని రాజందురు. వారు తమరాజును సామూరి యని పిలుతురు. ఆతడు మరణించినవెనుక, నాతని సింహాసనముపై యాతని తోబుట్టువుకుమారుని కూర్చుండ బెట్టుదురట. కడుపునబుట్టిన కుమారునికిగాని, యాతడు లేన ప్పుడు సోదరునికిగాని పట్టాభిషేకము చేయుదురట! శౌర్యపరా క్రమాదులవల్ల నెవడు నిచ్చట రాజగుట లేదు. ఇచ్చటి నాస్తికులలో పెక్కుతరగతి జాతులవారు గలరు. బ్రాహ్మ ణులు,సన్యాసులు మొదలయినవారున్నారు. వారందఱు అనేక మంది దేవతలను గొల్చుచుందురు. విగ్రహపూజలు గావించు చుందురు. ప్రతివర్ణమువారికిని వింతవింత యాచారములు గలవు.

"ఇచ్చటిజనులలో నొకజాతి గలదు. ఆజాతిలోని స్త్రీకి పెక్కుమంది భర్త లుందురు. వారందఱు తమ యిష్టము వచ్చిన వ్యాపారమును జేసికొను చుందురు. ఆభార్యతో గాపురము చేయుటకు రాత్రింబగ ళ్ళిరువదినాలుగుగంటల కాలమును వారు సమానముగా పంచుకొనుచుందురు.ఒకభర్త యాస్త్రీతో నున్నంతకాలము మరియొకభర్త యాస్త్రీకడకు బోరాదు. ఆదేశపురాజగు సామూరి యీజాతికి చెందిన వాడే యట!

"నేను సామూరిని దర్శింపబోవునప్పటికి అతని కొలు

వున అప్పటికే రెండుమూడువేలమంది హిందువులు పైని చెప్పినవిధముగనే దుస్తులు ధరించి సభ నలంకరించియుండిరి. ముసల్మానులలో ప్రముఖులుగూడ గొంద ఱచ్చట నుండిరి. వారు నన్నుచితాసనమున గూర్చుండ నియమించినతరువాత నేను మాచక్రవర్తి యిచ్చిన శ్రీముఖమును చదివితిని. పిదప ఆమహారాజు పంపిన కానుకలఁదెచ్చి యర్పించితిని. సామూరి నా రాయబారమున కంతగౌరవ మొసంగినట్లు కాన్పింపలేదు. అంతట నేను సెలవుతీసికొని నాబసకు తిరిగి వచ్చితిని. హోర్ముజునగరపు రాజంపిన యుత్తమాశ్వములు మొదలయినసరకులతో నిండినయోడ ప్రయాణమునందుచాల కష్టములపాలయి ఓడ దొంగలచే దోపిడిచేయబడి, వస్తువుల నన్నిటిని గోల్పోయి, చిట్టచివరకు ప్రాణములతో కళ్ళికోట చేరుకొనినది. నిజముగా నాప్రియమిత్రుని ఆయోడలోనుండి బ్రతికివచ్చుట జూచినపుడు నాకు పరమానందమయ్యెను.

“కళ్ళికోటనగరమున అయిదారుమాసములు, నిరుద్యోగినై, గౌరవములేక దుఃఖభాజనమైన జీవనమును గడపితిని. ఆరోజులలో నాకు దుఃఖ మొక్కస్నేహితుడును, కష్టమొకచెలికాడునై యున్నట్లుండెను. అట్లుండ నొకనాడు చీకటిరాత్రి, నేను మంచముపై పరుండి నిద్రించువేళ, విసుగెత్తిన నాప్రాణమునకు కష్టములు గట్టెక్కెనోయన్నట్లు, అంధకారమునుండి వెలికి త్రోయబడినట్లు స్వప్నమొకటి గంటిని. ఆకలయందు మాచక్రవర్తి కాఖాని సయిద్‌సుల్తాను,

నిందురాజసముతో నన్నుజేరి, ఆదరమొప్ప "నీ వింక భయ పడకుము, మనసు నూరక నాయాసపెట్టుకొని ఖేదింపకుము. నీకష్టములు త్వరలో తుదిముట్టగలవు" అని గంభీరభాషణ ముల బలికెను.

"ఉదయమయినతరువాత నేను నమాజుచేసుకొని కూర్చుండినపుడు కడచినరాత్రి కన్న కల జ్ఞప్తికివచ్చి, నన్నొ కింతి యానందపరవశునిగా జేసెను. సాధారణముగా స్వప్న ములు, తదేకధ్యానముతో తలపోసికొనుచున్నవారికి వచ్చును. కలలోని వృత్తాంతములు, పగటిపూట ఎన్నడును జరుగ జాలవు. అయినను కొన్ని స్వప్నములు దైవప్రేరితములనియు, నవి తప్పక జరుగుననియు పెద్దలు చెప్పుటయుగూడ గలదు. ఖొరానునం దట్టి ప్రమాణము లెన్ని లేవు?

"దైవమునకు నాపై నిప్పటికి కరుణ గలిగెననియు దుఃఖభాజనమైన నాజీవితభాగము సాంతమయ్యెననియు త్వరలో నా కదృష్టము పట్టుట కిది శుభసూచకమనియు, నూరకతలపోయుచు, ఆనందించుచు కాలముగడిపితిని. పండి తులయినవారికి కొందఱికి నాకల వివరించితెల్పి వారిని దాని యర్థమువిప్పిచెప్పవలసినదని కోరునంతలో విజయనగరచక్రవర్తి కడనుండి యొకదూత వచ్చెననియు, నాచక్రవర్తి చాలసా మ్రాజ్యము నేలు సార్వభౌముడనియు, నిపు డాతనిరాయబారి సామూరికి పారసీకదేశమునుండి యేతెంచిన రాయబారిని తత్క్షణము తనయొద్దకు బంపవలసినదనియు, నాజ్ఞాపించు నొక

జాబు వ్రాసియుండెననియు దెలియవచ్చెను. సామూరి విజయనగరచక్రవర్తికి సామంతుడు గాకపోయినను, అతడనిన, సామూరి కత్యంత భయముగలదు. ఆచక్రవర్తికి కల్లికోట వంటి రేవులు మూడువందలు గలవట! మరియు నాతని దేశము మూడుమాసంబులు ప్రయాణముచేసినను తరగనిదట!

"కల్లికోట మొదలు కాయిల్ వఱకుగల రేవుపట్టణములనేకము లింకను మలబారుదేశమునందు గలవు. కాయిల్ పట్టణము సింహళద్వీపమున కెదురుగా నుండును. కల్లికోట నుండి బయలుదేరు ఓడలన్నియు మక్కాకు సాధారణముగా మిరియములు, ఏలకులు, లవంగములు, జాజికాయ మున్నగు సుగంధద్రవ్యములను దీసికొని పోవుచుండును. కల్లికోటలో నుండు నావికులు మంచిసాహసికులు. వారిని చీనీపుత్త్రులు అని పిలచెదరు. ఒకానొకప్పుడు చీనాదేశీయులు నావికులు కొందఱీకల్లికోటకు వలసవచ్చియుండిరట. అందువలన వారి సాహసిక నౌకాయానమునుబట్టి యీకాలపు నావికులకు చీనీపుత్త్రిలనుపేరు కలిగినదేమో! కల్లికోటకు వచ్చెడియోడలను, రేవులోనియోడలను ఓడదొంగలు దరిజేరరారు. ఆ రేవున యీ యీ వస్తువులను భేదము లేక సమస్తమును దొరకును. ఆవుమాంసము మాత్రము లభింపదు. ఇక్కడ వారు ఆవులను చంపరు. వాటిమాంసమును భుజింపరు. గోవనిన వారల కెంతయో భక్తి. దానిపేడతో చేసినబూడిదను యీమూర్ఖులు నుదుటిపై ధరింతురు—దౌర్భాగ్యులు !!!

## విజయనగరయాత్ర.

"ఈ 'నీచుడు' సామూరివద్ద సెలవుతీసికొని, కల్లికోట నుండి బయలుదేరి, బందానరేవుమీదుగా, మలబారు సముద్రతీరమున ప్రయాణముచేయుచు విజయనగరరాజ్యము పొలిమేరల నున్న 'మంగళూరు' రేవును చేరెను. అచ్చట రెండు మూడుదినములుండి మెట్టదారిని విజయనగరమునకై బయలుదేరితిని. మంగళూరుదాటి ముప్పదిమైళ్లు వచ్చునప్పటికి ప్రపంచమునం దెచ్చటను సాటిలేనియొక చక్కని దేవాలయమును జూచితిని. ఆ దేవాలయము పదిగజముల చతురమును అయిదుగజముల ఎత్తును గలిగియున్నది. అదియంతయు కంచు లోహముతో చేయబడి యున్నది. ఆ దేవాలయమునకు నాలుగు అంతస్తులుగలవు. అవి యొకదానికంటె నొకటి యెత్తుగ నుండును. అన్నిటికంటె ఎత్తైన అంతస్తులో మనిషి ఎత్తుగల దేవునిసువర్ణవిగ్రహము గలదు. ఆ విగ్రహమునకు రెండు ఎఱ్ఱని పెద్దకెంపులు నేత్రములుగా నమర్పబడియున్నవి. అవి చూచువారికి, విగ్రహము తనవైపు చూచుచున్నదేమో యనునంత మనోహరముగా నమర్పబడి యున్నవి. ఆ దేవాలయ మంతయును మనోహరమయిన శిల్పపుబనులతో శోభిల్లుచు కనులకు మిరుమిట్లు గొల్పుచుండును.

"అచ్చటినుండి పోవుచు, ప్రతిదినమును నొక్కొక్క జనసమ్మర్దమయిన పట్టణమునందో గ్రామముచెంతనో ఆగుచు పయనము చేయుచుంటిని. ఇట్లుండ నొకనాడు నేను ఆ

కారమున సూర్యునిసైతము కప్పివేయజాలినంత యెత్తైనశిఖరమును జూచితిని. ఆపర్వత మొక యరణ్యమధ్యమున నున్నది. ఆయరణ్యమును, పర్వతశిఖరమునుదాటి 'బేదనూరు' అను పట్టణము జేరితిని. బేదనూరు నగరమున నిండ్లన్నియు మేడలవలెను సౌధములవలెను గన్పట్టును. ఈ బేదనూరునందు మిక్కిలి యెత్తయిన యొకప్రసిద్ధమైన దేవాలయము గలదు. దానిశిఖరము బేదనూరునుండి పెక్కుమైళ్ళవరకును గాన్పించుచుండును. అతిశయోక్తియని నిందలేకుండ దాని సౌందర్యమును వర్ణించుట కడుకష్టము. ఆదేవళము నగరమునకు నడుమ విశాలమైన ప్రదేశమునందు, చక్కనిపూందోటయందుగలదు. ఆపూందోటయందు పూయనిపుష్పములు, చిగుర్పనిఆకులు లేవు. ఆ ఆరామముమధ్య చలువరాతితో గట్టిన మేలైన మంటప మొకటిగలదు. ఆ మంటపము మనిషి యెత్తుననుండును. మంటపమునందలిఱాళ్ళు నున్నగా చెక్కబడి యొకదానిపై నొకటి సున్నములేకయే అతుకబడినట్లు అమర్చబడియుండెను. చూపఱ కీమంటప మంతయు నొక్కఱాతితో చెక్కబడినదా యనియుగూడ సందేహము గలుగజేయుచుండును. ఆ మంటపము నడుమ నల్లఱాతితో నిర్మింపబడిన దేవాలయము గలదు. ఆ దేవాలయముపైన మనుష్యవిగ్రహములు నానావిధములుగ, మూడుబారులుగ నొకదానిక్రిందట నొకటిగా చెక్కబడియుండెను.

"ఎంతటినేర్పరియైనను, చిత్రకారుడు తనగంటముతో

గాని, మసిబొగ్గుతోగాని అంతమనోహరముగ నారూపము లను చెక్కజాలడని నాయభిప్రాయము.

"ఉన్నతమయిన యీ దేవాలయమున శిఖరమునుండి పాదమువఱకు నొకయంగుళమేని మేరయినను పూర్వపశ్చిమఖండ ముల పూర్వచిత్తరువులతో నిండియుండని స్థలమే లేదు. ఆ దేవాలయముచుట్టును నాలుగేసి యంతస్థులు గల్గి ముప్పది గజములు పొడవును ఇరువదిగజములు వెడల్పును ఏబదిగజ ములయెత్తును గల నాల్గుగోపురములును గలవు.

"ఇతరమంటపములు మొదలగునవన్నియు నిక్లేయతి మనోహరమయిన చెక్కడపు బనులతోడను చిత్రగువుల తోడను శోభిల్లుచున్నవి. ఆకోవెలయందు రాత్రింబవళ్ళు భగవంతుడు స్వీకరింపని ప్రార్థనలు, సంగీతనృత్య వాద్యములు, నైవేద్యములు సమర్పింపబడుచుండును! ఆ దేవాలయమునుండి ధనమును, వెచ్చములను, సమస్తములును ఆగ్రామవాసులు తెచ్చుకొనుచుందురు. *'నాస్తికులగు' నీహిందువుల కీక్షేత్ర ము మునల్మానుల మక్కావంటిదని చెప్పుదురు. ఇచ్చట రెండుమూడు దినములుండి తిరిగి ప్రయాణము సాగించితిని. జిహిజ్జా [క్రీ.శ. ౧౪౪౩-చైత్రము] మాసాంతమున విజయ నగరపట్టణమును జేరితిని. నారాకవిని సార్వభౌముడుస్వాగత మిచ్చుటకై తగినపరివారమునుఎదురుసన్నాహముచేసి బంపెను.

* ఇది యొక విష్ణ్వాలయము గావచ్చును. అబ్దుర్ రజాక్ చూచిన దేవాలయ మేయూరిదోగాని తెలియరాదు.

వారు సముచితరీతుల గౌరవించి, చక్కనియొక సౌధమునకు గొంపోయి విడిదినిచ్చిరి.*

"విజయనగర మేలు నృపాలుడు అసాధారణబలదర్పితుడు. అతని సామ్రాజ్యము సింహళద్వీప ప్రాంతములనుండి కలబరిగె రాజ్యప్రాంతమువఱకు వ్యాపించి, యెటుచూచిన వేయియామడలదూరము వ్యాపించియున్నది. అతని రాజ్యమునకుపూర్వపశ్చిమదిశలందు సముద్రములే యెల్లలు. దేశమంతయు,చక్కగసాగుచేయబడుచున్నకనులపండువైన భూములతో నొప్పారుచున్నది. ఈభూమిపాలుని రాజ్యమందు దేశదేశాంతర నగరములతో సముద్రవ్యాపారముచేయు ప్రసిద్ధరేవుపట్టణములు మూడువందలు గలవట! నగరమందెచ్చట చూచిన రాక్షసులవలెను కొండలవలెను భయంకరములయిన యేనుగులు వేలకొలది గాన్పించుచుండును. ఈరాజు సైన్యమునందు కాల్బలము పదునొకండు లక్షలు గలదు. ఈదేశీయులు తమయేలికను 'రాయ'లని వ్యవహరింతురు. హిందుస్థానమందెచ్చటనీ రాయలంతటి బలదర్పసంపన్నుండగు భూపాలుడింకొకడు లేడని విందుము. ఇచ్చట ప్రజలలో నందరికంటె బ్రాహ్మణులు విశేషగౌరవమును బొందుచు పూజింపబడుచున్నారు.

* అబ్దుర్‌రజాక్‌ను కళ్ళికోటలోనుండగా, యాతనిగూర్చి వినిన దేవరాయ లాతని దన కొల్వున కాహ్వానించి యుండునని సూయలుదొర అభిప్రాయ పడినాడు. కాని యది సరియైన యూహయని నేననుకొనను.

## విజయనగర వృత్తాంతము - సప్తప్రాకారములు.

"విజయనగరము బహువిస్తీర్ణమై, మనోహరమైనమహా నగరము. విజయనగరమునుబోలిన యనుపమాన భాగ్యవైభవ సౌందర్యములుగలమహానగరమును ప్రపంచమందెచ్చటను ఇం కొకదానిని చూడబోము. మీదుమిక్కిలి వినజాలమన్న అతి శయోక్తి కాదు. ఎంతవిస్తీర్ణము! ఒకప్రాకారములోపల నింకొ కప్రాకారము చొప్పున నేడు ప్రాకారముల నడుమ గట్టబడిన యీ మహానగరము మిక్కిలిదుర్గమమైనది, ఏడవప్రాకారమునకు వెలుపల యేబదిగజముల వెడల్పుగల వాహ్యాళిప్రదేశముగలదు. అచ్చోట నిలువెత్తున మొనలుదేటి, కఱకుగానున్న బండరా ళ్ళుదట్టముగా నిలువులోతున బాతిబెట్టబడియున్నవి. వాని మూలమున కాలిబంటుగాని రౌతుగాని సులభముగానాతాళ్ళ నడుమనుండి పోవజాలడు.♦

"నగరముచుట్టును గలసప్తప్రాకారములలో, వెలుపలిది వలయాకారముగా నుండి యెత్తైన యొకశిఖరముపైనున్నది.*

♦ నిలువుగా బాతిపెట్టబడిన యీతాళ్ళనుగురించి క్రీ. శ. ౧౫౨౦ సంవత్సరమున విజయనగరమును సందర్శింపవచ్చిన „డామినిగోపేయస్" యను బుడతకీచుడు గూడ దానును వాటిని జూచియుంటినని వ్రాసియు న్నాడు. తర్వాత తల్లికోట యుద్ధానంతరమున మహమ్మదీయులచే నీనగర ము విధ్వస్తము గావింపబడినపు డీప్రాకారమును ఈటాళ్ళను రూపుమా పబడెను.

*అబ్దుర్ రజాక్ వర్ణించిన యీసప్తప్రాకారములు అందందుగల ద్వారములు కవాటములు ఈకాలపు విజయనగర యాత్రికులకు నెచ్చటెచ్చ ట నున్నవో సులభముగా బోధపడవు. మనయాత్రికుడుపశ్చిమ తీరమునుండి

"అయ్యది రాతితోడను సున్నముతోడను గట్టిగాగట్టబడి బలిష్ఠమైన కవాటమును కలిగియున్నది. ఆద్వారము చెంత రేయింబవళ్లెల్లప్పుడును రక్షకభటులు ఏమరక పడికావలి గాయుచుందురు. వారు దుర్గరక్షణమందెంత అప్రమత్తులుగ నుందురో, యాగంతులకడ నగరప్రవేశపు సుంకమును గైకొనుటలోకూడ నంతటి యప్రమత్తులు.* వెలికోటనుండి, లోని రెండవప్రాకారమును, దానినిగడచి మూడవదానిని, అందుండి నాలుగవకోట ద్వారమును అట్లు వరుసగా దాటుచుపోయి యేడవప్రాకారమును సమీపించితిమి. ఈకడపటి ప్రాకారము లోపల, రాయలమందిరములు, సౌధములు, సభామంటపములు, కొలువుకూటములు, కచ్చేరీలు గలవు. నగరమునకు వెలుపలగల ఏడవ ప్రాకారమునకు నాలుగు గవనులు గలవు. అం

బయలుదేరి విజయనగరమును నైఋతి దిక్కునగల ద్వారముగుండనే ప్రవేశించినట్లు తోచెడిని. అదియే నిశ్చయమని యెంచినయెడల, నాతని రాక నెఱింగి కర్ణాటక్షితిపాలు డంపిన ప్రతీహారులు, అబ్దుర్ రజాక్‌ను, ఎదుర్కొని నగరను ఏడవ వెలిప్రాకారమున నగరమునకు నైఋతిదిక్కునను న్నదనియే నిశ్చయింపవలయును. ఈరాయబారి ప్రవేశించిన మొదటి ద్వారము హాస్పేటకు నైఋతిదిక్కునగల రెండుకొండలనడుమ నున్నట్లు గానవచ్చును. ఒక్కమన అబ్దుర్ రజాక్ మాత్రమేకాక తరువాతను అంతకు బూర్వమును వచ్చిన విదేశీయులందరు నీ ద్వారముగుండనే నగరును సాచ్చియుండిరి.

*ఈవిధముగ మన దేశమున, ముఖ్యనగరముల వెలుపలగవనుకడ నాగంతుకుల కడనుండియు, సుంకముతీయు నాచారము పూర్వముండెను. ఈబ్రిటిషు పరిపాలనమున నది తీసివేయబడెను.

దు_త్తరదక్షిణముల వాటికి నడుమను, పూర్వపశ్చిమద్వారము ల నడుమను రెండామడల దూరముండును. వెలిప్రాకారము లలో మొదటిదానికిని,రెండవదానికిని నడుమగల ప్రదేశమున సారనంతములయి, సాగుచేయబడుచున్న భూములు, ఫలపుష్ప భరితములయిన చక్కనితోటలు పెక్కులు గలవు. అచ్చట చ్చటను మంచిసౌధములును, యిండ్లును, మంచిబావులును, ఆరామములును గలవు. వెలుపలినుంచి మూడవ ప్రాకారము మొదలుకొని లోపలి యేడవప్రహరీవరకును, రాజవీధి కిరు ప్రక్కలను దట్టముగా నిండ్లు, అంగళ్ళు నడుమ నడుమ వీధులు తోటలును గలవు. ఏడవ ప్రాకారములోపల రాయలు నగ రును, సభాగారములును, సౌధములును నాలుగు రాజవీధులు గలసికొను మొగయును గలదు. ఆ రాజవీధులు నాలుగు నొక దానికొకటి యెదురుగా నున్నవి. ముందుత్తరముగా రాయలు నివసించు నగరుకలదు. ఈనగరువాకిటనుండియే నాలుగువీధు లును నాలుగు మొగలకుబోవును. ప్రతి రాజవీధి మొగనునగరి వాకిటకు సమీపమున ధనురాకారముగా నున్న తోరణముతో గూడిన యెత్తైన గోపురమును, దానిచుట్టును స్తంభములతో నలంకరింపబడిన వసారాయునుగలవు. ఈరాజవీధుల మొగల నున్న తోరణగోపురము లన్నిటికంటె నగరివాకిటను అంద మైన గోపురము ఒకటి గలదు. ఈ తోరణగోపురముల క్రిందినుండి నాల్గుముఖములకుఁ బోవు రాజవీధులు మిక్కిలి వెడల్పుగానుండి రమ్యముగానున్నవి."

మన యాత్రికుడు వర్ణించిన సప్తప్రాకారములను గూర్చి యొక్కింత దెలుపవలసియున్నది.

విజయనగర వెలిప్రాకారములో మొదటిది హాస్పేటకు నైఋతిదిక్కుగా నున్నది. అచ్చటను గల రెండు కొండల నడుమ గల పెద్ద తటాకమునకు బశ్చిమముగా అబ్దుర్ రజాక్ వర్ణించిన మొదటి దుర్గద్వారముగలదు. ఆదుర్గ సమీపమునగల పెద్దచెఱువిపు డెండిపోయినది, గాని యీ నగర ముచ్ఛదశయందుండిన కాలమున, మిక్కిలి లోతుగా నుండి మంచినీరుతో నిండియుండెను. ఆచెఱువునడుమ నొక బలిష్ఠమైన దుర్గ మిప్పటికినిగలదు. అందు రక్షకభటులు కావలిగాయుచుండెడివారు. రెండవప్రాకారము హాస్పేటకు సమీపములో నుండెను. హాస్పేట (నాగలాపురము) ఆ కాలమున జనసమ్మర్దముగానుండినట్లు అబ్దుర్ రజాక్ వర్ణించుచున్నాడుగదా! మూడవప్రాకారము హాస్పేట కుత్తరముగా బోయియుండవలయును. అదియిపుడు గానరాదు. నాల్గవ ప్రాకారమునందు బలిష్ఠమైన కవాట మున్నది. ఈగోడ "మల్పనగుడి" గ్రామమునకు దక్షిణముగాబోవును. మల్పన గుడి యిప్పటికినిగలదు. పూర్వ మీపేటలో సామంతమండలేశ్వరులు నివసించుచుండినట్లు శిథిలావస్థయందున్న సౌధములు, ఆరామములు మొదలయినవి చాటుచున్నవి. అయిదవ గోడ యీగ్రామమున కుత్తరముగా బోయినది. ఆగోడ చాల భాగము శిథిలమయిపోయినదిగాని, యందలి దుర్గద్వారము

పూర్తి మిప్పటికి నిలచియున్నది. ఆరవకోటగోడ కమలాపురపు తటాకమునకు దక్షిణముగా బోయి చుట్టివచ్చును. ఏడవప్రాకార మిప్పటికి మంచిస్థితియం దున్నది. అందున్న నగరులు సౌధములు, మంటపములు, దేవాలయములు, సభాగారములు, మందిరములు మంచిస్థితియందున్నవి. ఈప్రాకారములో నీప్రదేశము తూర్పు పడమరలు రెండుంబాతిక మైళ్ళును ఉత్తరదక్షిణములు ఒకమైలును, పొడవును వైశాల్యమును గలిగియున్నది.

ఈ కాలమున విజయనగరమును జూచివచ్చివారికి రజాక్ వర్ణనలుబట్టి ప్రాచీన విజయనగరమును అర్థము చేసికొనుట కష్టముగానుండును. ఆతడు వర్ణించిన నాలుగు ధనురాకారముగల తోరణములును మంటపములుగల గోపురములు నిపుడు గానరావు. ఆతడుచెప్పిన నాలుగువీథులలో నొకటి తూర్పుగాబోయి తుంగభద్రమీదుగా నానెగొందెకు బోవును. దానికి తాంబూలపు వీథి యని పిలతురు. ఈ వీథిముఖమున నిలువబడియే మన రజాక్ నగరును ముందు వర్ణించి యుండును. ఈ వీథికి సూటిగా నింకొకవీథి పశ్చిమముగా నరిగి కమలాపురపు కోటగుమ్మము చెంత, నుత్తరముగా తుంగభద్ర హంపీ విరూపాక్ష క్షేత్రములకు బోవువీథిని గలసుకొనును. నగరివాకిటను నాల్గువీథులనడుమ తోరణ, గోపుర, మంటపములనడుమ ప్రదేశము నానావిధములగు అంగళ్ళతో నిండి యానాడు రామణీయకముగా నుండెనుగాబోలు. ఆగోపుర

ములు తోరణములు ఎట్లుండెనో యూహించుకొనుటకుమా
త్రము ఉత్తరమున తుంగభద్రయొడ్డు నగలియు నాలుగువీథుల
మొగలుగలిగి శిథిలావస్థయందున్న గోపురమంటపములుజూడ
నగును.

విజయనగర రాజవీథులను అబ్దుల్ రజాక్ ఇట్లు
వర్ణించుచున్నాడు.

"రాజవీథులందిరుప్రక్కలను పుష్పలావికలు పరిమళము
గ్రమ్ముకొను నానావిధపుష్పములను విక్రయించుచుందురు.
అంగళ్ళవాండ్రు తమయంగళ్ళముంగిట అందమైన మంచెలు
గట్టుకొని అందుతమసరకుల నమ్ముకొనుచుందురు. ఇట్లిరు
ప్రక్కలను అంగళ్ళు,పుష్పలావికలుస్థలమాక్రమించుకొనినను,
ఆశ్వికులు,కాలినడకవారు,యేనుగులురథములు,శకటములు,పల్ల
కీలు మున్నగునవి గుంపులుగుంపులుగ నిసుకవైచిన రాలకుండ
వచ్చుచుబోవుచుండుటకు వీలయినంత వెడల్పుగా నీరాజవీథు
లున్నవి. ఈవీథులు చాలపొడుగై కనుచూపుమేరవఱకు వ్యా
పించియుండి నేడు మనోజ్ఞమయిన దృశ్యమునొసంగుచున్నవి.
ఎచ్చట చూచినను పరిమళభరితములయిన వివిధజాతుల దివ్య
కుసుమములే కానవచ్చు చుండును. అన్ని పుష్పములలో
నీదేశీయులకు గులాబి (గొజ్జంగి) పూవులన్న మిక్కిలి యిష్ట
ము. అవి విశేషముగా దొరకును. ఇచ్చటి ప్రజలకు పువ్వు
లనిన ప్రాణము. ఆహారమెంత యావశ్యకమో పూవులం
తావశ్యకము. భోజనమైన లేకుండ బోవుదురుగాని స్త్రీపురు

షులు పూవులు ముడువకుండి, ధరింపకుండ, నెక్కడకు బోలేరు. ఒక్కొక్కవిధమగు వస్తుచయమునువిక్రయించు నొక్కొక వాడవర్తకులు ఒక్కొకచోట గుమిగూడి జట్టుగా వ్యాపారము చేసికొందురు, ఏసరకులవాడ యాసరకులదేగాని యింకొక సరకావాడలో దొరకదు. * ఇచ్చటి రత్నవర్తకులు నిర్భయముగా తమసరకులను ఎంతవిలువగలవాటినైనను తమవజ్ర వైడూర్య మాణిక్యములను, పచ్చలను, నీలములను, పద్మరాగములను, రత్నములను, మంచి ముత్యములను, పగడములను విచ్చలవిడిగా రానులక్రింద బోసి నడివీథులందు విక్రయించుకొను చుందురు.

“అత్యంత రామణీయకమై మనోజ్ఞమైన యచ్చోట నగరివాకిట కెదురుగా నున్న నాలుగువీథులందును చక్కని నునుపైన రాతికాలువగుండ పరిశుద్ధజలము నగరులోనికి పట్టణములోనికి నెడ తెఱిపి లేక పాఱుచుండును. ఈరాతికాలువలు పట్టణమునం దంతటను గానుపించును. రాయలసౌధమునకుకుడివైపునమంత్రిశేఖరునిసభాగారమంటపముకలదు**

* ఇప్పటి మచిలీబందరునందు అట్టివిధమయిన బజారున్నది. ఒక్కొకరకపు దినుసు కొకబజారు యిప్పటికిని బందరునందు గలదు.

** అబ్దుర్ రజాక్ చూచిన సభామంటపమును, దానికుత్తరముగా నుండిన దస్తరములకొట్టును శిథిలావస్థయం దిపుడు నగరువాకిట నాలుగు వీథుల మొగకావలిప్రక్క గానుపించుచున్నవి. సభాగారము పూర్వపు శోభతో నిపుడు గానరాదు. శ్రీనాథుడు కనకాభిషేకమును వడసిన మా

ఆ విశాలమంటపమునకు నలుబది స్తంభములు గలవు. వాని కెదురుగా మనిషికంటె యెత్తయినవసారాయొకటిగలదు. ఆవసారా యించుమించుగా యిరువదిగజములు పొడవును, ఆరుగజములు వెడల్పును గలదిగానున్నది. దీనిని దస్తర్ ఖానా "దస్తరములకొట్టు" అని పిలుతురు. రాజ్యమునకు సంబంధించిన యావత్తుకాగితములు, పత్రములు మొదలగున వన్నియు, దస్తరములుగా గట్టి యందుంతురు. ఇచ్చటనే కరణములు, తెఱపిలేక లెఖల వ్రాయుచు కూర్చుండియుందురు. ఇచ్చటి జనులు రెండువిధముల వ్రాతసామగ్రి నుపయోగింతురు. అందు మొదటిది: రెండుగజములుపొడవును రెండు వేళ్ళ వెడల్పును గల తాటాకులు. ఈజను లాతాటాకులపై గంటములతో పరపర గీకుచు వ్రాయుదురు. ఈవ్రాత అంత శ్రేష్ఠమైనదిగా జనులు తలంపరు. తాటాకులపై గీకబడిన యక్షరములు మసితో వ్రాయబడనందున రంగుతో కంటికి గానరావు. అదియునుగాక తాటియాకులు చిరకాలముండక

క్తికసభాగార మిదియే కావలయును. పూర్వమున ఈ సభామంటపము దారుస్తంభములతో,తోరణములతో మనోజ్ఞములయిన రంగురంగులచిత్తరువులతోనొప్పారుచుండెనుకాబోలు. స్తంభములు కర్రవియనియు సరంబికూడకర్రతో కట్టబడి రంగురంగుల చిత్తరువులతో శోభిల్లుచుండెననియు, నదియంతయు తల్లికోటయుద్ధానంతరము తురకలచే తగుల పెట్టబడియెననియు నూయలుగా రూహించుచున్నారు. ఇపుడామంటపమున నలుబది స్తంభపు దిమ్మలుగాక నరువది గానవచ్చుచున్నవి.

పోవుటవలన వాటిపైని వ్రాయబడిన అక్షరములును చిరకాలము నిలువజాలవు. ఇక రెండవపద్ధతి: తెల్లనిఫలకములకు నల్లరంగుపూసి వాటిపై, రాతిబలపములను పెట్టి తెల్లగా వ్రాయుట. ఈపద్ధతి చాల మంచిదట. ఇట్లు వ్రాసిన యక్షరములు చాలకాలము నిలచియుండును.*

"స్తంభములుగల యాసభామంటపమున నెత్తైన వేదికపై ధన్నాయకుడు(దళవాయి-సర్వసేనాధిపతి) రాజకీయోద్యోగులు పరివేష్టించియుండ కొలువు తీరియుండును.♦ ఉభయపార్శ్వములందును వేత్రహస్తులు (చోబుదారులు) బారులుతీరి నిలువబడియుందురు. మంత్రిశేఖరునితో విజ్ఞాపనమొనరించుకొనదలంచినవారు ఈవేత్రహస్తుల నడుమ నడచివచ్చి, ఏదైన నొకవస్తువును కానుకగా నర్పించి,సాష్టాంగదండప్రణామ మాచరించి లేచి నిలువబడి ముకుళితహస్తులై శిరమువంచి, మనవిఁ దెలిపికొందురు. ధన్నాయకుడును వారి విన్నపమాలించి, యుచితరీతిని న్యాయవిమర్శనముగావించి తీర్పిచ్చి పంపివేయును. ఆతనితీర్పునకు తిరుగులేదు.దణ్ణాయడు

*. శిలాశాసనములు గావచ్చును. అబ్దుర్‌రజాక్ వ్రాయసకాంధ్రదేశాచారములు తెలియనివాడు గావున, పొరబడి యుండవచ్చును.

♦. ధన్నాయకుడు యొకయుద్యోగి యని తెలిసికొనకపోవుటయే కాక నాతడు కొజ్జావాడనియుగూడ రజాక్ పొరబడి వ్రాయుచున్నాడు. ఇమ్మడి దేవరాయని ధన్నాయకుని పేరు నాగన్నయని లూయిరైసుగారు చెప్పుచున్నారు. కాని అబ్దుర్ రజాకు కాలమున మహాప్రధాని లక్ష్మణ ఒడయలనిశాసనప్రమాణముగలదు_ముందుచూడుడు.

సభాగారమునుండి వెడలినపుడు కొలువు చాలింపబడును. ఆయనకు ఏడు రంగు రంగులగొడుగులు గలవు. ఆతడు బయలు దేరునపు డా యాతపత్రములను గైకొని పరివారము ముందు నడచును. వేత్రహస్తులుభయపార్శ్వములందును నడచి నత్తురు. వారి ముంగిట శంఖకాహళాది మంగళతూర్యములు పూరించ బడుచుండును. ఆతని కిరుప్రక్కలను, వందిమాగధులు కై వార ములు సేయుచు స్తోత్రపాఠములనుజదువుచు "జయీభవ! దిగ్విజయీభవ" యనుచు నడచుచుందురు. ముందు వేత్ర హస్తులు బరాబరులు చెలుపుచుండ, ఇతర సేవకులు ఛత్ర చామరములను బట్టుకొని వెంటరా, దణ్ణాయకుడు (సర్వసేనాధి పతియుమహాప్రధానియుఅబ్దుర్ రజాకుకాలముననొక్కడేకాబో లు!) బయలువెడలి, రాజమందిరమున కరుగును. రాజనగరునకు దణ్ణాయకుని సభామంటపమునకు నడుమ నేడు కక్ష్యాంతర ములు గలవు. ఒక్కొక్క కక్ష్యాంతరము గడచునప్పటి కాతని వెంటబట్టుకొని రాబడు గొడుగులలో నొకటి తరువాత నొకరు వరుసగా మూసి వెనుకనుంచబడుచుండును. అట్లా దణ్ణాయడు ఏడుకక్ష్యాంతరములను దాటుసరికి ఏడుగొడుగులు వెనుక నుంచబడును. రాజసముఖమును దణ్ణాయకుడొంటరిగ ప్రవేశింప వలయును. ప్రవేశించి రాజ్యమునందలి సర్వవృత్తాంతములను రాయలకెరిగించి, యాతని యాజ్ఞలను గైకొని సెలవుదీసికొని పోవుచుండును. ఈదణ్ణాయకుని నిజమందిరము రాయలనగరు నకువెనుక నున్నది

"నగరునకు ఎడమవైపున ధన్నాయకుని సౌధము, నా వెనుక టంకశాల, గలదు. ఇచ్చటయు నీ దేశమందు చలామణియగుచున్న నాణెము లన్నియు ముద్రింపబడు చున్నవి. ఈదేశమున మూఁడు విధముల బంగారు టంకములు, రాగికలిపి ముద్రింపబడుచున్నవి. వానిలో మొదటిది హొన్ను లేక వరహా*. ఈవరహా మనదేశపు కొపకీ దీనారములకు రెండిటికి సమానము. వరహాలో సగము విలువగల నాణెమింకొకటి గలదు. దానిపేరు ప్రతాపము.**ఇది రెండవనాణెము. మూడవది బంగారపు పణము. వరహాకు ఇరువది పణములు ప్రతాపమునకు పదిపణములు నిత్తురు. పణమునకు నారు "తర"♦ ములను వెండినాణెములు వచ్చును. "తర" మునకు మూడు "జితలు"♦♦ అను రాగిటంకములు వచ్చును.

* వరహాకు దీనారమని పేరుండినట్లు శ్రీనాథుని చాటుపద్యమువలననే కాక మహమ్మదీయ చరిత్రకారులవలన గూడ దెలియుచున్నది.

** అర్ధవరహాలు- ప్రతాపములు. ఇవి ప్రౌఢదేవరాయలచే, ముద్రితమయినవి గావలయును. అతనికి ప్రతాపదేవరాయలని బిరుదము గలదు. ఆబిరుద మీటంకమునకు నిలచిపోయియుండును.

♦ తరమను టంకమున్న సంగతి దెలుపు శాసనప్రమాణము లేమియు ఇంతవరకు గానరాలేదు. ఇవి వెండిపణములుగాని, రూకలుగానిగావచ్చును. తెలుగుదేశమున విజయనగరపు నాణెములు రూకలుండెను.

♦♦ జితలు అను రాగిడబ్బు పేరుగా డకర్ణాటకదేశములో వ్యవహారమందున్నదేమోగాని యిచ్చట నాకు దెలియదు. అది మహారాష్ట్రభాషాపదము. ఇవి రాగికాసులు గావచ్చును.

ఈ దేశాచారమునుబట్టి రాయలకు సామంతమండలేశ్వరులు మహామండలేశ్వరులు తామీయవలసిన కప్పమును సంవత్సరమున కొకమారు టంకశాలయందు చెల్లించుచుండుట యలవాటు. ఎవరికైన ధనమీయదలచినపుడు రాయలు టంకశాలకు వాని కివ్వదలచినదానికి రాయస మంపును. భటవర్గమున భత్యము నాలుగు నెలల కొకతూరి రాయలిచ్చుచుండును. అందరికిని టంకములనే యిత్తురుగాని, సామంతరాజ్యములపై వచ్చు పన్ను లాదాయమును విలియవేయు నాచారము రాయలపాలనములందు లేదు.

"ఈ దేశపుజనసంఖ్య యింతయని యుజ్జాయింపుగానైనను చెప్పుటకు వలనుగాదు. ఎచ్చటగాంచినను దేశమంతయు జనసంకీర్ణము. ఇసుకవైచిన రాలనంతమంది జనులున్నారు. రాయల కోశాగారమందు ధనము దాచుకొనుటకై పాతాళపుకొట్లు లనేకములు గలవు. అందు బంగారము వెండి కరిగించి దిమ్మలుగా బోసియుంచుదురట. ఈ దేశమునందు పేదవాని మొదలుకొని భాగ్యవంతునివఱకు స్త్రీలు, పురుషులు, బాలురు, చివరకు వీధులలో దొమ్మరిలాటలాడు దొమ్మరులు సయితము చేతులకు, దండలకు, మెడలకు, కాళ్ళకు, అమూల్యరత్నాభరణములో, పూతమెఱుగు నగలో ఏవోకొన్నిటిని ధరించుకొందురు."

ఈకాలపు విజయనగరయాత్రికులకు రజాక్ వర్ణించిన రాయలనువర్ణరత్నపు భాండారము అంతఃపురసౌధమునకును

టంకసాలకు నడుమనున్నట్లుగాన్పించుచున్నది. దానికిలోపల ప్రహారీగోడ యొకటి గలదు. భాండారమంతయు భూమిలో నున్నది. దానికి చుట్టును వీరభటు కావలికాయుటకు వెడల్పయిన త్రోవ యొకటి గలదు. భాండాగారము నలుచదరమైనది. దానిపైన మఱియొక అంతస్థు గలదు. ఆఅంతస్థునకు క్రిందభాగమున కర్రసరంబీ గలదు. ఈ భాండారములోనికి మార్గము తూర్పుగా వచ్చును. ఆమార్గమంతయు చీకటికోణముగా నుండును. ఆమార్గమునకు చివర పైకి వచ్చుటకు ఆరామెట్లు గలవు. ఈ భాండారపుగదినుండి వెలుపలికిబోవుటకు ద్వారముతూర్పువైపు నగలదు. ఆగదిలోపల నాలుగు పెద్ద స్తంభములు గలవు. ఈ గదియు, దానిపైమిద్దెగదియు వాటిగోడలును, స్తంభములును అవియు తెల్లపాలగచ్చుతో నునుపుచేయబడి యున్నవి. ఇపుడా స్తంభములపైనుండిన సరంబి కూలిపోయినది. గాని క్రింద గదిమాత్రము స్తంభములతో మంచిస్థితియందున్నది. వర్షము కురిసినను ఈపాతాళపు కొట్టులోనికినీరు దిగకుండుటకై చుట్టు ఎత్తుగా పిట్టప్రహారీగోడ యొకటి నేటికిని గానవచ్చుచున్నది. ప్రౌఢదేవరాయలకు క్రీడాభిరామకృతి కర్తయనిబరగు వల్లభరాయని తండ్రియగు త్రిపురాంతకుడు (తిప్పయ్యామంత్రి) నవరత్న సువర్ణ భండార రక్షకుడుగా నుండెను.

ఏనుగులు, వాటిని బట్టుకొనువిధము.

"నగరున కెదురుగా (అనగా తూర్పుగా) ప్రధాన మంత్రి సభామంటపము గలదని దెల్పితినిగదా! ఆసభామంట

పమున కెదురుగా రాయల ఏనుగులసాల గలరు. రాయల కీ దేశమందుచాల ఏనుగులు గలవు. కాని వాటిలో మంచివాటిని పెద్దవాటిని మాత్రము రాయలు తన యుపయోగార్థముంచుకొన్నాడు. పట్టణములోనికి ప్రవేశించునపుడు మనకు తగులు వెలుపలి ఆరేడుప్రాకారముల నడుమ వాయవ్యదిశయందు అనగా ఉత్తరపశ్చిమ ద్వారముల నడుమ, నీయేనుగులను పోర్లించుటకు, పిల్లయేనుగులను పెంచుటకు, మత్తగజములను సాధుచేయుటకును, యేర్పాట్లుగలవు. రాయలకు మంచి చక్కనైన ఐరావతమును బోలిన వెల్లయేను గొకటి కలదు. దానిమీద ముప్పదివరకు నల్లని మచ్చలు గలవు.

"ప్రతియుదయమునీవెల్లయేనుగును రాయల సమ్ముఖమునకు దీసికొని పోవుదురు. ప్రాతఃకాలమున నీ మదకరీంద్రము దర్శించుట రాయలకు శుభశకునమట. రాయలవారి రాచయేనుగులకు అన్నము వండి పెట్టుదురు. ఆవంట లాకరులముంగిటనే జరుగవలయును. ఉడుకుటయైన తరువాత నాయన్నమునందు కొంచముప్పును, బెల్లమును వేసి, రెండేసి మణుగులు బరువుగల ముద్దలుగా జేసి, నేతిలోగాని, పెరుగులోగాని ముంచి యా జంతువుల నోటిలో నుంతురు. అయాహారమును తయారుచేయుటలో సేవకులే పదార్థమును పొరబాటున వేయుటమరచినను, ఆజంతువులు వారిని జంప నుద్యమించును. రాయలుకూడ వారి పొరబాటును మన్నింపక కఠినముగా శిక్షించును. ఇట్టి విధమున నా మత్తగజములకు

రెండువేళలమేత నిడుదురు. ఏనుగునకొక్కసాలచొప్పున అన్నింటికిని అన్నిసాలలును గలవు. ఆసాలల గోడలు ఎత్తుగానుండి బలిష్ఠములుగా నున్నవి. ఆ గోడలపైన లావుపాటి దూలములును, వానిపైన కర్రసరంబియు గలదు. పైనున్న దూలములకీ యేనుగుల వీపులకు, మెడలకు, గట్టబడిన ఇనుప గొలుసులు గట్టిగా గట్టబడియుండును. ఇట్లుగాక మరి యేవిధమున వాటిని గట్టిబెట్టినను ఆ పెద్ద జంతువులు బలముగల వగుటవలన సులభముగా గొలుసులను వదలించుకొని పాఱిపో గలవు. వీటికి ముందఱికాళ్ళకు గొలుసుల సంకెళ్ళుకూడ తగిలించబడుచుండును.

"ఈ దేశమున జనులు, గజముల నీక్రిందివిధముగా బట్టుకొందురు. అ జంతువులు సాధారణముగా నీరుద్రావు జలాశయములకు బోవుమార్గమునం దొక పెద్దగోయిని త్రవ్వి, దానిపై, వెదుళ్ళను, ఆకులను కప్పి పలచగా మట్టిని జల్లి మామూలు నేలవలె నుంచుదురు. ఎప్పటి త్రోవయే యనుకొని యేనుగు లా గోతిమీద నడువబోయి యందు కూలును. అటుపిమ్మట రెండుమూడు దినములవఱకు మనుష్యుల నెవరిని ఆ చెంతకు బోనీయరు. అట్లు కొన్నిరోజులు జరిగిన పిమ్మట నొకడా మృగముకడ కేగి, దానిని పెద్దకర్ర తీసుకొని యూరక మోదును. ఒకవంక ఆకలిదప్పులచేతను మరియొకవంక బాధాకరములయిన దెబ్బలచేత నొడలునొచ్చియున్న యాకరి కడకు నొకడు హటాత్తుగా బరువెత్తికొని

వెళ్ళి దానిని కొట్టుచున్న మనుష్యుని చేతిలోనికఱ్ఱలాగుకొ ని వానినిచావగొట్టునట్లు నటించి పలాయితునిజేసి యాక ఱ్ఱను దూరముగా విసిరి పాఱవేయును. పిమ్మట నా యేను గున కాహారముగా నింత రొడ్డను, నీటినియుంచి చల్లగా వె డలిపోవును. ఇట్లు కొన్ని దినములు వరుసగా నీ కపట నాట క మాడబడును. ఒకడు ప్రతిదినమును వచ్చి ఆ యేనుగును చావ మోదుచుండును. రెండవవాడు వానిని తరిమివేసి కఱ్ఱ విసరివైచుచు దాని కింతయాహారము వేసిబోవుచుండును. ఇట్లు కొంతకాలము గడచునప్పటి కాజంతువునకు మొదటివా నిపై తీరనికోపమును, రెండవవానిపై నపారమైన ప్రేమయు నంకురించును. అంతట రెండవవాడు మెల్లమెల్ల నా యేనుగు ను మచ్చిక చేసుకొని, దగ్గరకు జేరి, మేనును, తొండమును నిమురుచు, మంచి రుచ్యములయిన పండ్లను, కాయల నొసం గుచు చనువు చేసికొనుచు ఆ యేనుగును, వానియం దత్యం త విశ్వాసముగలదై, తన మెడకు గొలుసులు తగిలించినను యూరకొనును.

"వెనుక నొకసారి, ఈ రాయుల గజశాలనుండి, తప్పిం చుకొని అడవులకు పాఱిపోయిన యొకానొక మత్తేభమును గూర్చి యొకకథ చెప్పుదురు. అప్పుడాతని మావటీడు, దాని వెంటనే చని తఱుచుగా నాయేనుగు ఆహారమునకై చరించు తావులందక్కడక్కడ పెద్దపెద్ద గోతులను త్రవ్వియుంచెనట. మావటీండ్రు ఏనుగులను బట్టుటకై చేయు మాయపన్ను గడ

లన్నింటినినాయేనుగు బాగుగానెఱింగినదగుటచేత,తొండమునందు లావైనదూలమును బట్టుకొని,తనముందు నేలను గొట్టుచు నడచుచు బోవుచుండెను. ఇట్లనుదినమును, మేతకుబోవుచు, జలాశయమును జేయుచుండెను. అంతట మావటీంద్రకు నాయేనుగును బట్టుకొను నాశ సన్నగిల్లెను. కాని రాయలకు మాత్ర మా ఏనుగును బట్టుకొన వలయునను పట్టుదల తగ్గకపోవుటవలన, వారికి మిక్కిలి ప్రాణసంకట మయ్యెను. అట్లుండ నొకమావటివాడు ధైర్యము చేసికొని, ప్రాణముపై నాశవదలి యాయేనుగు తఱచుగా బోవుమార్గమున నొకచెట్టుపై దాని కంటబడకుండ దాగుకొని కూర్చుండెను. అట్లుకూర్చుండి యాజంతువు చెట్టుక్రిందనుండి పోవునపుడు గుభాలున దానిపైకురికి, దానివీపుమీదనుండి, దేహముచుట్టును గుండెలమీదుగా బిగించికట్టబడియున్న త్రాడును గట్టిగా పట్టుకొనెను. ఈయవమానమును భరింపజాలక యాజంతువు, రోషముజెంది, తొండముతో నామావటివాని నెన్ని పాట్లు పెట్టవలయునో యన్నిపాట్లను బెట్టినది. చివరకు వాడిప్పటికిని వీపుమీదనుండి క్రిందకు పడకుండుట గని నేలపైబడి దొర్లనారంభించెను. మావటివాడును మిక్కిలి చురుకుదనము గలవాడును, గడుసువాడునుకావున, నాయేనుగు ఎట్లు దొర్లినను వాడుమాత్రము దానిక్రిందబడకుండ తప్పించుకొనుచు కుంభస్థలములు బ్రద్దలగునేమో యనునట్లు నెత్తి పడమోదుచుండెను. ఈబాధ భరింపజాలక తుద కామత్తేభము

అలసి, సొలసి, మావటివాడు తన్ను గొలుసులతో దేహమంతయుకట్టి, యిష్టమువచ్చిన తావుకు గొంపోవుటకు సమ్మతించెనట! రాయలఎదుట కామావటివాడు, పట్టువడిన మదపుటేనుగును గొంపోయెను. దానిని జూచినపుడు సంతుష్టాంతరంగుడై రాయలు వాతని యుచితరీతిని బహూకరించి పంపెనట.

"హిందూస్థానమునందు రాజులు వేటకు ఏనుగల నెక్కిబోవుదురు, వేటకు బోయినపుడెల్ల, నెలలతరబడి ఆ యడవులయందుండుచు, ఏనుగుల వేటాడుచు, బట్టుకొనుచుందురు. ఏనుగులవేటయన్న వారికి బరమసంతోషము* రాయల కెవ్వనిమీదనైనను కారణముగల్గి అనుగ్రహము దప్పినపుడును, వానినేరము, మిక్కిలి గొప్పదైనపుడును, వానిని యీమదపుటేనుగుల మ్రోలబడద్రోసి, త్రొక్కించి చంపుదురు. అవి వారిని కాళ్లతో త్రొక్కుచు, దంతములతో బొడుచుచు, తొండములతో చీల్చివేయును. వర్త

* అబ్దుర్ రజాక్ తాను విజయనగరమున, విని, చూచినదానిని బట్టి, హిందూస్థానపు రాజులకందఱకు నొక్క విధమగు నాచారమును వేడుకవ్యాపారమును సూచించుచున్నాడు. అబ్దుర్ రజాక్ నిజముగా పొరబడినాడనియే మామతము. ఈప్రౌఢదేవరాయలకు ఏనుగులవేట యనిన మిక్కిలి ప్రీతియట! అందువలన నాతనికి గజబెంటదేవరాయలని బిరుదము గలదట. దేవరాయనిబట్టి యాతనివేడుకను ఇతరరాజులకు కూడ రజాకు ముడివెట్టియున్నాడు.

కులు ఏనుగులను సింహళమునుండిగూడ, ఈదేశమునకు గొని వచ్చి వాటియెత్తునుబట్టి, గజమున కింత ధరయని నిర్ణయించి యమ్ముచుందురు.

## వే శ్యా వా టి క లు.

"టంకసాల కెదురుగా, కటకపాలుని, కచ్చేరియున్నది. ఆతనిక్రింద ఆనగరక్షణమునకై పండ్రెండు వేలమంది పడికావలివాండ్రు గలరు. వారికి జీతముక్రింద ప్రతిదినమును మనిషి కొకపణము చొప్పున వేశ్యా వాటికలవలన పండ్రెండు వేల పణముల సుంకము వసూలు చేయబడుచుండును. వేశ్యా వాటిక యందలి, వెలయాండ్ర హర్మ్య, సౌధముల విభ్రమ వైభవసంపదలు, అవ్వీటి విలాసినీతతుల సౌందర్యము మొలకలేనగవుతో ముద్దుగురియుచున్నవారి నెమ్మోములు, వారి యొయ్యారపు నడకలు, తళుకులుఎంతటివానినైనవలపించువారి నేర్పరితనపు మినుకులు, మోహనాస్పదములయిన వారిచూ ఆహా! హా! వర్ణింపనాకు శక్యముగాదు. వర్ణింపమొదలువెట్టిన నాకుకూడ మనసుచలించును; గావున నింతటితో వారవనితల విలాసములు వర్ణింపవిరమింతును.

"వేశ్యవాటికనుగూర్చి యొకమాట మాత్రము చెప్పక తప్పదు. టంకసాలవెనుక నించుమించుగా నిరువదిగజముల వెడల్పును మూడువందల గజముల పొడవును గల యొక వీధి గలదు. ఆవీధి కిరుప్రక్కలను చక్కని పూబొదరిండ్లతో నిండిన ముంగిట వాకిళ్ళుగల శోభనగృహములు బారులు తీర్చి

యున్నవి. ఆ ప్రాంగణములందు చంద్రకాంతశిలానిర్మితము లయిన వేదికలు వరుసగా గలవు. ఆ వేదికలకువెనుక, మేడ గోడలపై సింహములు, పులులు, చిరుతపులులు, ఏనుగులు మున్నగు వన్యమృగము లనేకములు జీవము లుట్టిపడునట్లు చిత్రింపబడియున్నవి. అపరాహ్ణమున, ఎండవేడిమి యించుక తగ్గుమందువేళ నీవారవిలాసినులు చక్కగా నలంకరింపబడిన తమయిండ్ల ప్రాంగణములందున్న చంద్రకాంత శిలావేదికలపై తివాసులమీదను, సోఫాలమీదను, విలాసముగ, హాయిగ మీఱి చేటీజనముతో సుఖోపవిష్టులయి, యుందురు. ప్రతి వెలపడుచును ఒడలంతయు, నవరత్నఖచితామూల్యాభరణములతో, మంచిముత్తెముల హారములతో కన్నులకు మిఱుమిట్లుగొల్పు చక్కదనముతో రంగురంగుల చీరెలుకట్టి యలంకరించుకొని, చూచువారల హృదయములను జూఱగొనుచుందును. అచ్చటివారందఱు, పదియాఱ్వన్నె కుందనపు శలాకలవలెనుందు నెఱజవ్వనపు సొగసుకత్తెలే! ఒక్కొక్క పడుపుటింటికి ఇద్దరు ముగ్గురు దాసీలుందురు. వారు తమ యజమానురాండ్రకడనిలువబడి,మార్గమునబోవువిటకాండ్రను తమనేర్పుఱితేన ముట్టిపడునట్లు, వెల్లాటకత్తెల సౌందర్య సముద్రములో ముంచివేయ బ్రయత్నించుచుందురు. ఆవీథిని మన్మథుడు తన చెఱకువింటిని, సంధించి, శరంపరలు గ్రుమ్మరించుచు రేబవలు సంచరించుచు యప్సరసలను బోలిన ఆకాంక్షలవలలోవిరహులగువారినిబడద్రోయుచుందును. వెల

యాండ్ర పొత్తుగూడి సుఖింపగోరువాఁడీవీధికిఁబోవును, తన యిచ్చవచ్చిన తరుణిని గోరుకొని బడయవచ్చును. వేశ్యాగృహములందు పరిచారికలు, దాసీలు, మిక్కిలి జాగరూకులయి యుందురు. పడపుటిల్లాండ్రకై వచ్చిన విటులసొత్తేదయిన నొకగ్రుడ్డిగవ్వయైన పోయినను పరిచారికల ప్రాణము మీఁదికి వచ్చును. వెంటనే వారు గృహమునుండి వెడలగొట్టబడుదురు. ఈనగరపు ఏడుప్రహరీలనడుమ లెక్కకుమించిన వేశ్యాగృహములున్నవి. ఈ వేశ్యలవలన రాబట్టబడిన పండ్రెండువేల పణము లనుదినమును నగరు కావలివాండ్ర జీతబత్తెములకై వినియోగింపబడును. ఈ కావలివాండ్రనుదినమును, అనుక్షణమును ఈయేడు కోటలనడుమ నేమేమిజరుగుచున్నదో, ప్రతిక్షణమును కటకపాలున కెరిగించుచుండవలయును. ఏవస్తువచ్చట పోయినను, ఎక్కడ దేదొంగతనము జరిగినను తక్షణము నేరస్థుడని వెదకి, పోయిన సొత్తును సొత్తువానికి జేర్పవలయును. నగరమున ఏ నేరమును జరుగనియ్యరాదు. వారివలన నేలోపమయిన వచ్చినచో, దానికి వారుకొంత జరిమానా నిచ్చుకొనవలయును. నాస్నేహితుడొకడు కొందఱి బానిసవాండ్రను కొనియుండ, వారు తమ కావలివాండ్ర యధీనము తప్పించుకొని పారిపోయిరి. ఈ వృత్తాంతమును మేము నగరపాలకునికి (కటకపాలుడు) ఎరిగించినంత, నాతడు మేమున్న పట్టణ ప్రాంతమందంతటను గల బీదసాదలను, పాఱిపోయిన బానిసలను పట్టితెచ్చి యొప్పగింప

వలసినదనియు, లేనియెడల వారలను గొనుటకై వెచ్చించిన ధనమును తెచ్చి యీయవలెనని ప్రకటించవలసినదని, తనసేవకుల పడికావలివాండ్రకు కాజ్ఞాపించెను. వారును అట్లు చేసియుండిరి. ఆబీదలు, పాఱిపోయినవారిని తెచ్చియొప్పగింపలేక నెట్టెటో, మేము ఖర్చుపెట్టిన మొత్తమును దెలిసికొని తెచ్చియిచ్చిరి. ఇట్టివి చోద్యమయిన, యీ విజయనగర మహాపట్టణ వృత్తాంతములు! యీనగర మేలు రాయల పరిపాలనా విశేషములు!”

“ఈచరిత్రకారుడు, రాయలవారి యుద్యోగీయులచే సన్మానింపఁబడి, యీతనికై నియోగింపఁబడియున్న రమ్య హార్మ్య తలమున విడిది దిగియుండెను. ప్రయాణపు బడలిక వలన నీతని దేహము మిక్కిలి అలసి సొలసి యుండినందున పెక్కుదినములితడు సుఖముగ, నిర్విచారముగ, నాచక్కని సౌధమున, స్వర్గసమమైన యీమహానగరమున నేకొదువయు నులేక మొహారము పండుగలు వచ్చునంతవఱకు గాలము బుచ్చెను.

## రాయల సందర్శన భాగ్యము.

“ఇట్లుండ నొకనాడు రాయలవారి సన్నిధినుండి నాకొఱకై చారులువచ్చి, సార్వభౌముని యాజ్ఞయైనదని, తెలియచేసిరి. ఆసాయంకాలము నేనును సర్వసన్నద్ధుడనై, కొలువుకూటమున కేగి, రాయలసందర్శనప్రాప్తికి పరమానందము నొందుచు, మాయేలిక యభిమతానుసారముగ, నైదు పార

సీకయుత్తమాశ్వములను, తొమ్మిదిరకములు ఎఱ్ఱపట్టు, మొఖమలు పట్టువస్త్రములను, అంగీగుడ్డలను, రెండుపళ్ళెరములలో బెట్టి, రాయలకు కానుకగా సమర్పించితిని. వెనుక నేను వర్ణించిన నలువది స్తంభములుగల సభామంటపమున నత్యంత వైభవముతో నొకవేదికపై గల సింహాసనముపై రాయలు సుఖోపవిష్టుడై, నాకు దర్శనమిచ్చెను. కర్ణాటక్ష్మాపాలుఁడగు నా రాయలు ఒకవంక, పండితులు బ్రాహ్మణులు, కవులు, వేదాంతులు, వేశ్యలును, ఒకవంక వీరభటులు, సామంతమండలేశ్వరులు బలిసి కొలుచుచుండ, మహావైభవముతో కొలువు దీరియుండెను. ఆతడు పసుపుపచ్చని పట్టుతో చేయబడిన యుడుపులను ధరించియుండెను. మెడలో, నవరత్నఖచితమై వెలలేని మంచిముత్యములచే చుట్టబడిన కంఠపట్టికను నానావిధరత్నభూషణములను ధరంచియుండెను. ఆతని యాభరణముల విలువ ప్రపంచమున నేరత్నవర్తకుడుకూడ కట్టజాలడు; ఆతడు పచ్చని కుందనపు మేనిచాయగలవాడు. కొంచెము పలుచగానుండి పొడవైనవాడు. ఆతనిరూపరేఖాదులుచూడ చాల చిన్నవయసువాడుగా గానుపించినాడు. * ఆతని చెక్కి-

* అబ్దుర్ రజాక్ వ్రాసిన దీసందర్భమున సంశయమునకు తావొసంగుచున్నది. అప్పటికిరువదియైదుసంవత్సరములనుండియేలుచున్న యిమ్మడిదేవరాయలు యౌవనవయస్కుడెట్లగునో తెలియదు. ఒకవేళ నీ పారశీక రాయబారి సందర్శించినది, యిమ్మడిదేవరాయ లగునో కాదో? కాకున్న మరియెవరై యుండురు? ఒక్కటి నిజమయి యుండవచ్చును. యిమ్మడి

ళ్ళించుక పలుచగా నున్నవి. సొగసైన మీసమున్నది. గడ్డము మాత్రము లేదు. ఆతని చూపులును, దృష్టియు, చల్లనవై హృదయానందకరములై విశ్వాస, భయ, గౌరవములను గలిగింపజాలినవిగ నున్నవి. కొలువు కూటమును ప్రవేశించి నపుడు నేనును గౌరవసూచకముగ శిరసువంచియుంటిని. ప్రతీహారులు రాయలకు నన్నెఱిగించిరి. రాయలును అంతట నన్నుచితరీతిని సంభావించి, తన చెంత గూర్చుండ నాజ్ఞాపించెను. నేనపుడు మాప్రభువుపంపిన సుహృల్లేఖను రాయలకందీయ, ** ఆతడు దానినితనదుబాసినిగైకొమ్మని యాదేశించి యిట్లని మృదుమధురగంభీర భాషణముల బల్కెను.

దేవరాయలు క్రీ. ౧౪౪౩ ఏప్రిలుమాసమున క్రూరముగ చంపబడబోయెను. ఆవిఘాతమున, నాతడు మరణించినట్లు అబ్దుర్ రజాకు తెలుపలేదు. కావున, యిమ్మడి దేవరాయలు, కాయవంటివాడు గావచ్చుననియు, ధృఢకాయు డగుటచేతగాని, పిన్ననాటనే సింహాసనమెక్కి యుండుటవలనగాని వయసుమీఱిన వాడుగాడనియు నూహింపవలయును; సింహాసనమెక్కు నాటికి ఇరువదియేండ్లు నన్నని యనుకొన్నను, రజాక్ చూచునప్పటికినలువదియైదు సంవత్సరములుకంటె నెక్కువ యుండజాలవు.

** అబ్దుర్ రజాక్ రాయలకొసగవలసిన యుత్తరములను మొదట పొరబడి సామూరి కర్పించెను. సామూరి ఆయుత్తరములు తనకు గావని తెలిసికొనినపుడు అబ్దుర్ రజాక్‌న కిచ్చివేసియుండును. అందువలనే కళ్ళికోటయం దితనికి ఏమియు గౌరవము జరిగియుండలేదు. తనకు సామూరి సన్నిధిని జరిగిన పరాభవమును, నిరాదరణయు, గడుసుదనముగా నబ్దుర్ రజాక్ చెప్పక దాచినాడు.

“మీరాజు అత్యంతాదర గౌరవములతో పుత్తెంచిన రాయబారమును, ఈలేఖను గాంచుటచే నాహృదయము పరమానందభరితమైనది.”... నేనాసమయమున నూపిరి సలుపకుండునంతటి దట్టముగా నుడుపులను ధరించినవాడ నగుటచే, తమకమును దాచుకొనజాలమివలన యుష్ణము పైకుబికి, నాకు ముచ్చెమ్మటలు గ్రమ్మజేసి వైచెను. అంతట నేను చెమటచే బాధనొందుచుండ కరుణార్ద్రహృదయుడైన రాయలు, తమచేతనున్న వట్టివేళ్ళవీవనను విసరుకొనుటకై నాకు ప్రసాదించిరి. ఆమహాగౌరవమునకు నేను మిక్కిలి అలరితిని. ఇంతలో సేవకులు కొందఱు ఒక బంగరుపళ్ళెములో రెండు మోదల తమలపాకులును, ఇన్ని పోకలును, సుగంధద్రవ్యములును, అయిదు నూర్ల పణములుగల నొక పట్టుసంచియు, నిరువది దీనారములెత్తు పచ్చకర్పూరమును, దెచ్చియొసంగిరి. ఆ కర్పూరగతాంబూలమందిన తరువాత రాయలు సెలవుతీసికొనుట కనుజ్ఞనిచ్చిన విడిదికి వచ్చిచేరితిని. నాకు విజయనగరమున నున్నంత కాలము దినవెచ్చమునకై రెండుగొఱ్ఱెలు, ఎనిమిదికోళ్లు, ఒక మణుగు నేయి, ఒకమణుగు పంచదార, రెండువరహాలును, పంపబడుచుండెను. ఈరీతిగ నేను ఆనగరముననున్నంతవఱకు జరుగుచునేయుండెను. వారమునకు రెండుపర్యాయములు, రాయలుతనకొలువునకునన్ను బిలువనంపుచుండెను. సాయంతనపువేళ, నేను సముఖమున కరిగినపుడు, రాయలప్పుడప్పుడు మాయేలికయగు ఖాకాని సయ్యదు సుల్తానువారినిగూర్చికుశల

ప్రశ్నలు చేయుచు వచ్చెను. కొలువుకూటమునుండి సెలవు గైకొని యరుగుసమయమున, తొలినాటియట్లె కర్పూరతాంబూలము బంగారుపణము లయిదువందలుగల పట్టుసంచి యొకటియు, నాకొసంగబడుచుండెను. ఇట్లు నన్ను బహూకరించు సందర్భమున నొకనాడు రాయలు, నన్ను చూచి, "ఓయీ,! మీరాజులు, తమకొలువు కేతెంచి రాయబారులతో సుఖవినోదగోష్ఠితో తనివినొందకసహపంక్తిభోజన మిచ్చి గౌరవింతురు. నీవు విమతస్థుడవు, విజాతీయుడవు నగుటచే నీతో మాకు సహపంక్తి భోజనభాగ్యము లభింపదు గావున, అందులకై చక్రవర్తిచే నంపబడిన నీవంటి రాయబారికుచితమైన రీతి భోజనమునకు మారుగా, మాగౌరవమును జూపుటకీ సువర్ణటంకము లొసంగితిమి." యని పలికెను.

## తమలపాకులు - తాంబూలము

" తాంబూలము నమలుటచే గాబోలునేమి తమలపాకులయొక్క గుణములవలననేమి, కర్ణాటభూపాలుడుతన అంతఃపురమున, ఇంచుమించుగా నేడువందలమంది రాణులను, ఉంపుడుకత్తెలను భరించుకొనుచున్నాడు! అంతఃపురములోనికి పదియేండ్లు గడచిన మగచిన్నవాడు సయితముబోరాడు. ఒకొక్కయువతికి, రాణియైనను, ఉంపుడుకత్తెయైనను, ప్రత్యేకముగ వేర్వేఱు వసతులు, పరిచారికలు, దాసదాసీజనమును గలరు. చివరకిద్దరు రాణులయినను, యిద్దరు ఉంపుటాండ్రయినను గలిసి నొక యింట నివసింపరు. ఈవిశాలరాజ్యమం

దెచ్చటనయిన సుందరియగు బాలికయుండుట తటస్థించెనేని వెంటనే రాయలామె జననీజనకుల యనుజ్ఞ బడసియో రొక్కమిచ్చియో, ఆబాలికను, మహావైభవముతో తీసుకొని వచ్చి తనవిలాసార్థము అంతఃపురమునందు జేర్చుకొనుచుండును. రాణివాసమున జేరిన తరువాత నామె యింక వరునికంట బడదు.

## రాయలను జంపుటకు జరిగిన ప్రయత్నము

“ఈ చరిత్రకారు డింకను కళ్ళికోటనగరమున, కారణ వశమున వేచియుండిన కాలమున విజయ నగరమున దారుణ మయిన వింత వృత్తాంత మొకటి జరిగియుండెను. అందలి విశేషము లిట్టివి. రాయలసోదరుడు,* తన నివాసము కొఱకు నూతనముగా భవనమును నిర్మించుకొనెను. నూతన గృహప్రవేశమహోత్సవమునాఁడు రాజధానియందుగల సకల సామంత మండలేశ్వరులను, సేనాపతులను, నియోగులను, విందారగింప నాహ్వానించెను. ఇచ్చటి దేశీయుల యాచార సంప్రదాయములను బట్టి ఒకరు చూచుచుండగ నింకొకరు భుజింపరు. విందుకై యరుదెంచిన అతిథులందఱు, ఆ నూత్న మందిరమున గల యొక విశాలమంటపమునందు సుఖాసీను

* రాయల సోదరుని పేరు రజాక్ తెలుపకున్నాడు. ఇమ్మడి దేవరాయలునకు సోదరు లెందరో ఇప్పటికి దొరకిన శాసనములు తెలుపక సందేహము కలిగించుచున్నవి.

లయి యుండిరి. యజమానియో, లేక యాతని పరివార ములో పెద్దవారో, యొకరు అతిథులు కూర్చుండియున్న మంటపముకడకు వచ్చి, లోపల సిద్ధమయిన భోజనాదికము నారగించుటకు ఒకని తరువాత నింకొకరిని లోనికి దీసికొని పోవుచుండిరి. ఆమహోత్సవ సందర్భమునకు పట్టణము నందు గల యన్ని వాద్యములవారిని రప్పించి, రాయల సోదరుడు భేరీ, మృదంగ, ఢక్కా, కాహళాదివాద్యధ్వనుల చేతను, సంగీతవాద్య విశేషములచేతను, హర్మ్యమంతయు, గింగురు మని మారుమ్రోగునట్లు కోలాహల శబ్దమును చేయించుచుం డెను. ఆ సందడిసమయమున, నౌకరి మాట యొకరెకి కష్టముమీదనయితము వినబడుటలేదు. ఒక్కొక్క అతిథిని లోనికితీసుకొనిపోవుచు, ప్రత్యేకమందిరములందు కూర్చుండ బెట్టుచుండిరి. అట్లు ఒక్కొక్కడే లోనికి ప్రవేశించునపుడు ద్వారముచెంతను తలుపుచాటున దాగుకొనియుండిన హం తకు లిరువురు,హఠాత్తుగా వాని మీదబడి, తమత్తుల త్రికత్తో బొడిచి ముక్కలు ముక్కలుగ జీల్చివైచుచుండిరి. ఆ నిర్భా గ్యుని శవ మచ్చటినుండి యతిత్వరితముగ గొంపోవబడిన వెంటనే, మరియొక యదృష్టహీనుడు లోనికి ప్రవేశపెట్టబడు చుండెను. ఆనాడు అతిథులయివచ్చిన, అదృష్టహీనుడెవ్వ డును తిరిగి తమ యింటి ముఖమును జూడబోయి యుండ లేదు.

"ఆనాడు జరుగుచుండిన మేళ, తాళ, వాయిద్యముల ఘోషవలన,నూతన గృహప్రవేశ సందర్భమున నిరపరాధులగు

వారెందరి ప్రాణములు, పరులెరుగకుండ క్రూరముగ గైకొనబడుచుండెనో, యాహంతకుని పరివారము తప్ప నొరులెవ్వరు నెఱుంగరు. ఇట్లు నగరమున నూరును, పేరును గలుగుబడియు గల్గి రాజభక్తిగల ప్రతిమనుజుడును దారుణముగ వధింపబడియెను. ఒకమూల నీ దారుణ కృత్యములు జరుగుచుండ, రాయలసోదరుడు, రాయల యంతఃపురమునకు జనెను. అచ్చట కావలివాండ్రను మచ్చికలాడి, తనయింట జరుగుచున్న విందునకై యాహ్వానించి, మెల్లగా వారినందరి నొకరి తరువాత నొకరిని తనయింటికి బంపివైచెను. ఇట్లు యించుమించుగా, నగరికావలివాండ్రనందఱిని బంపివైచి, మెల్లగా రాయలను సమీపించెను. రాయల సమ్ముఖమునకు జనునపు డాతడు చేత నొక బంగరువళ్లెరము బట్టుకొని, యందొక బాకును దాచియుంచి దానిపై తమలపాకులు కప్పి వైచి యుంచెను. రాయలను సమీపించితోడనే "జగత్ప్రభూ! ఏలినవారు విందారగించుటకై సర్వము సన్నద్ధము చేయబడినది. ఇక తమరాక మా కనుగ్రహింప వేడెదను." అని పల్కెను. అదృష్టవంతులను, కారణ జన్ములు నగు మహారాజులకు రాబోవు విపత్తులు సూచితమగుచుండునని పెద్దలవలన వింటిమి. అందుచేతనే కాబోలు రాయ లదృష్టవశమున తన కస్వస్థతగా నున్నదనియు తమ్ముని యాహ్వాన మంగీకరింపజాలకునికి మన్నింపవలయుననియు వేడుకొని విందునకు బోయియుండలేదు.

"రాయ లిట్లుతనమూహోపాయమును భగ్నపఱచుట గ్రహించి, యాగ్రహము పట్టజాలక, నాదుర్మార్గుడు పళ్లెరమునుండి బాకును దీసి రాయల దేహమంతయు తూట్లు పడునట్లుగ హఠాత్తుగ మీదపడి గాయములు గలుగజేసెను. ఈ దారుణ కృత్యమును లేశమయినను అనుమానింపకయున్నవాడుగావున రాయ లసహాయుడై, గాయపడి, సింహాసనము మీదనుండి వెనుకకు వడిపోయెను. అద్దురాత్ముడంతట రాయలు మరణించెనని భావించి, తన చెంతనున్న సేవకునకాతని శిరము ఖండించవలసినదని యాజ్ఞాపించెను. తానును తమకము నాపుకొనజాలక, రాజద్వారము కడకు బోయి, యచ్చట నున్న పరివారముతో "నేను రాయలను; మంత్రిని ధన్నాయకులను, మండలేశ్వరులను ఎల్లరును జంపితిని. ఇపుడు నేనుసింహాసనమధిష్ఠింపబోవుచున్నాను" అని బిగ్గరగ నఱచెను. ఇంతలో రాయల తలను గొట్టుట కాజ్ఞాపింపబడిన ద్రోహి మెల్లగా రాయలచెంతకు జేరి కత్తి యెత్తునప్పటికి, రాయలు సింహాసనపుకాలు నూతగొని లేచి ఖడ్గమును దీసుకొని యాహంతకుని హృదయము పైనొక్క వ్రేటువేసి క్రిందకు బడద్రోసెను. ఆ సమయమున రాజభక్తి, విశ్వాసములుగల యొకభటుడు అంతవరకు భీతచిత్తుడై మూలలను డాగియుండి రాయలు లేచుటయు, జీవించియుండుటయు గాంచి ధైర్యము దెచ్చుకొని, రాయలకుసాహాయ్యముగాబోయి, హంతకుని యమపురి కంపియుండెను. రాయలును, జరిగిన

బీభత్సమునకు వెఱగంది యాభటుని సాహాయ్యమున, అంతః పురము లోనికిఁ బోయెను. ఇంతలో నా రాయలసోదరుడు సింహాసనమెక్కి యచ్చటనున్నవారి నందరిని తన్ను రాయలుగా బరిగణింపవలసినదని యాజ్ఞాపించుచుండెను. అదివిని రాయలే మరియొక ద్వారమునుండి ప్రవేశించి "ఓరోరి రాజద్రోహులారా! నే నింకను జీవించి యుండగనే మరి యొక దురాత్ము డెట్లు సింహాసన మధిష్ఠింపగలడు? నా కండ్ల యెదుట ద్రోహియైన నాసింహాసనము నధివసించియున్న యాతనిఁ బట్టుకొనుడు" అని బిగ్గరగనఱచెను. ఆసాదడీనం తయు నిశ్చేష్టులయి యవలోకించుచున్న జనసమూహము ఆదుర్జాతిమానవుని పైబడి కత్తులతో కండకండలుగ జీల్చి వైచి చంపివేసిరి. రాయ లంతట కొలువుదీరి, తన యితర సోదరులను, సామంతులను, దళవాయి, ప్రధానులను రాజ బంధువులనురావలసినదని యాజ్ఞాపించెను. మహాప్రధానితప్ప నందరును మృతులైరన్న వృత్తాంతమును దెలిసికొని రాయలు విషణ్ణుడయ్యెను. ధన్నాయకుడనబరగు ప్రధానమంత్రి, ఈ దారుణ విప్లవమునకు కొంతకాలము క్రిందటనే సింహాళ ద్వీపముమీదకు దండయాత్రి వెడలియుండెను. లేకున్న అతడును చచ్చియేయుండును. రాయలును, రాజధానియం దిట్టి ఘోరకృత్యము జరుగుటకై చాలతడవు చింతించి ధన్నా యకుని వెంటనే బయలుదేరి త్వరితముగ రావలసి నదని సింహాళమునకు చారులను పంపెను. ఈ కుట్రయం

దేమాత్రమయిన జోక్యముగలవారి నందఱిని బ్రతికియుండగనే కాల్పించియో, ఒడలు చీలిపించియో, మరియొక విధముగనో చంపించి శిక్షించెను. వారికుటుంబముల నన్నింటిని నాశముచేసి వారిసొత్తు స్వాధీనము చేసుకొనెను. మొదట విందునకును గృహ ప్రవేశసందర్భమునకును ఆహ్వానము గొనివచ్చినవాడుకూడ మిగిలిన రాజద్రోహులవలెనే శిక్షింపబడెను. ధన్నాయకుడు రాజధానికి తిరిగివచ్చినపుడీ వృత్తాంతమంతయు విని యాశ్చర్యమగ్నమానసుడయ్యెను. రాయలు ధన్నాయకుని కటాక్షవీక్షణములతో సముఖమునదయ చూపినపుడు, అతడు సాష్టాంగముగ నమస్కరించి "యేలినవారీమ హోపద్రవమును సుఖముగ దాటచేసిన యీశ్వరునకు నాకృతజ్ఞతావందనము లర్పించుచున్నాను" అని పల్కెను. ఆ సంవత్సరము రాయలకు గొప్పగండము తప్పుటచే, పునర్జనియయ్యె గావున ధన్నాయకుడు మహర్నవమి మహోత్సవములు ద్విగుణీకృతవైభవముతో జరుపవలసిన దని యాజ్ఞాపించి సన్నాహము చేయించెను.

## మహర్నవమి- మహోత్సవములు

"ఈదేశీయులనుపమ భాగ్య,వైభవ,బల సంపన్నులు. అందువలన, తమవిభవమును, ఐశ్వర్యమును, గౌరవమును నగర్వముగ ప్రకటింపవలయునను కౌతుకము గలవారు. మహర్నవమి పండుగ నీరాయలు, ఆతని మండలేశ్వరులు మున్నగువారలు తమతమ యైశ్వర్యవిభవముల ననుసరించి

అతి వైభవముగ జరుపుదురు. ఆమహోత్సవములు కన్నుల పండువుగా జూడవలసినదేకాని వర్ణింపనలవిగానిది. అయినను ఆమహార్నవమి వృత్తాంతమును వర్ణింప ప్రయత్నించెదను. ముందుగా సామ్రాజ్యములోని యన్నిప్రాంతములనుండియు, మండలేశ్వరులను, మహామండలేశ్వరులను, దుర్గాధిపతులను, దళవాయిలును, మహార్నవమి పండుగలకు రాజధానికి రావలసినదని యాజ్ఞాపించును. కొందఱి మండలేశ్వరుల రాజ్యములురాజధానికి మూడుమాసములు ప్రయాణదూరమునందు గూడ నున్నవి, ఆవచ్చిన సామంత రాజులందఱకును తమ పరివారములో వేయేసియేనుగులకు తక్కువగా కుండ నుండును. తుపానుచే నల్లకల్లోలమైన, యలచే నొప్పారు మహాసముద్రపు కెరటములవలె నీమత్త గజములు తొండములు విసరుకొనుచు, ఊగుచు లేచుచు ఊపుకొనుచు నడచుచుండును. ఆమత్తేభముల ఘీంకారములు మేఘగర్జనములని భ్రమింపజేయుచుండును. తొండములకు ముఖములకు తళతళమెరయు ఇనుపకత్తులు, బాకులు, బల్లెములు, తాపించిన కవచములును సర్వాలంకార భూషణములతో, వింతవింతరంగులతో, శృంగారింబడిన చవుడోలులమర్చబడి, నామదకరులొండొంటి నొరసికొనుచు. తొండములు సాచుచు,విసరుచుమావటీంద్రను బెదరించుచు,చూపరులువిసరు ఫలముల నందుకొనుచు నడచుచుండును. ఈయేనుగులపైనొక్కొక్కప్పుడాయామండలేశ్వరుల పరివారమునకుజెందిన గార

డివాండ్రు, దొమ్మరివాండ్రు, విప్రవినోదులు; మున్నగువారు ఆసీనులయితమ నేర్పరితనమును, చూపు విద్యలను ప్రదర్శించు చుందురు. ఈయేనుగుల ముఖములపై, తొండములపై, వింత వింతరంగులతో చిత్రింపబడిన రూపములు చిత్రములు చిత్రింప బడి మనోహరముగ గట్టబడియుండును.

"రజాబ్ మాసమునపూర్ణిమనాడు(ఆశ్వీయుజము౧౪౪౬ క్రీ. శ.) విశాలమయిన యొక మైదానముమీద రాయలు డేరాలు వేయించి కొలువుయుండెను. ఆతడేర్పఱచిన ముహూర్తమునకు రాజ్యమునందలి మహాప్రధానులు, దళవాయిలు, ధన్నాయకులు, మండలేశ్వరులు, బ్రాహ్మణులు, రాకుసులనుబోలు ఏనుగులు రాయలసముఖమున కొలువు బలిసియుండిరి. * ఆవిశాలమయిన మైదానమున, నవ్వగింజలు చల్లిన రాలనియా జనసమూహము, నడుమనడుమ మహోన్నతములయిన ఏనుగులు, వింతరంగులు కనులు మిరుమిట్లు గొల్పుచిత్రములు, పతాకములగల, అంబారీలు, అన్నియు నొకమహాసముద్రమును దలపునకు దెచ్చుచుండెను.

"సుందరమైన యాబయలునందు, రమణీయమైన మందిరములు, అయిదేసి అంతస్థులు ఎత్తుగలవి అనేకమును నిర్మింపబడి యున్నవి. ఆయంతస్థులయందు అత్యద్భుతములును, విధములును, నానావిధరూపములతో సొంపుమీఱుచిత్రములు,

*రజాక్ మహార్నవమియుత్సవమునాడువిజయనగరముననుండినట్లాతనివ్రాత వలన దెలియుచున్నది. అబ్దుర్ రజాక్ మహార్నవమినిమహానవమియనిబిలిచినాడు.

చిత్రపటములు వ్రేలాడగట్టబడియున్నవి. ఆచిత్తరువులలో పక్షులు, జంతువులు, మృగములు, మనుష్యులు, స్త్రీలు, మున్నగునవి యనేకములు చిత్రింపబడియున్నవి. ఇవియన్నియు, నత్యాశ్చర్యకరమైన కళాచాతుర్యముతో చిత్రింపబడిన చిత్తరువులు కాని యొండుకావు. ఇచ్చటి మందిరములలో కొన్ని పాంచాలికాయంత్ర నిర్మితములయినవి గలవు. అవియూరక యప్పుడప్పుడు ప్రదక్షిణము సేయుచుండును. అవి, యొక్కొక్క ప్రదక్షిణమునందు ఒక్కొక్కవింత రూపమును దాల్చుచుండును. మరియు ప్రతిక్షణమునందును ఆమందిరములు క్రొత్తక్రొత్త శృంగారములతో మనోహరముగ గన్పట్టుచుండును. ఒకమారు చూచి తనివినొందుటకు వీలులేనియందములు,వింతలు, వర్ణింపనలవిగాని శృంగారములు, నాబయలునం దెచ్చట చూచినను గానవచ్చుచుండెను.

"ఆబయలున కెదురుగా సోపానమంటప మొకటి నిర్మింపబడెను. ఆసోపానమంటపము స్తంభములపై కట్టబడెను. ఆసోపానమంటపమునకు తొమ్మిది విశాలములైన అంతస్తులుగలవు. తొమ్మిదవదానిపై రాయలు సింహాసనస్థుడై కొలువుదీరియుండెను. నాకీసోపానమంటపముమీద నేడవయంతస్తుమీద, నాసనమిప్పింపబడియెను. అచ్చట నాపరివారమును, ప్రాణమిత్రులును తప్ప నితరునెవ్వారికిని స్థలమిప్పింపబడలేదు. ఈసోపానమంటపమునకును, మైదానములో నిర్మింపబడిన మందిరములకును నడుమగల విశాలమయిన బయలునందు వింతవింత విన

యములు చూపరులకు గన్పట్టుచుండెను. అందు గాయకులు వీరకథలు పాడువారును విశేషముగా నుండిరి. గాయకులలో జాలమందిజవ్వనులగుస్త్రీలే కలరు. అవిలాసినుల తళుకుచెక్కులు చంద్రునిపోయగమును బోలియుండెను. యౌవనప్రాదుర్భావముతో వికసించువారి నెమ్మోములు వసంతాగమనమున చివురించు తొల్కరివలె మనోజ్ఞములయి యుండెను. సర్వాలంకారభూషితలయి, శృంగారంపుకణికలయి, నృత్యముచేయుచున్న యాబాలికలరూపము, సౌందర్యము, విలాసము, హొయలు, శృంగారము, వేయేల వారి వాలుచూపులు మా హృదయములను, గులాబిపుష్పములను జూచినపుడువోలె తహతహలాడించుచుండెను. ఆసౌందర్యవతులు రాయల కెదురుగా నొక అందమైన తెఱవెనుక కూర్చుండిరి. ఇంతలోతటాలున నా తెర రెండువైపులనుండి లాగివేయబడెను. తెఱ దింపినంతలో నాసుందరులు నృత్యముచేయనారంభించిరి. గూడఆహాఏమి ఆనృత్యము! సర్వసంగపరిత్యాగులయిన మునులకు మతిచలింపజేసెడి వారి నృత్యములు, హస్తవిన్యాసములు, కడగంటిచూపులు, ఆహా! మాయాత్మలానృత్యదర్శనముచే సంతుష్టిచెంది పరవశములయ్యెను.

బొమ్మలాటవాండ్రు, దొమ్మరి, గారడివాండ్రు

"ఇకగారడివాండ్రత్యద్భుతమయిన వింతలను జూపిరి. గజముపొడవును ఒకమారెడువెడల్పును, మూడునాలుగు గజము లెత్తును గల దూలములను మూడింటిని కలిపి కట్టి

యొకచో నుంచిరి. వానిలో మొదటి రెండుదూలములమీద న, అంతేయెత్తును లావును వెడల్పును గల మరి రెండుదూలముల నమర్చియుంచిరి. వీటిపైన నొకచిన్న దూలము నుంచిరి. ఇయ్యది యంతయు మెట్లవలె నమర్పబడియుండెను. ఈవిద్యకే శిక్షణగావింపబడిన యేనుగు నొకదానిని దెచ్చిరి. అది మెల్లగా సోపానములుగా గట్టబడిన యాదూలములపై కెక్కెను. మొదటి సోపానముమీదనుండి, రెండవదాన మీదను, అందుండి జేనెడైన వెడల్పులేని మూడవమెట్టుమీదకుకూడ నాఏనుగు నేర్పరితనముతో నెక్కి నాలుగు పాదములను మోపెను. అంతట దానిపాదములు మోపినదూలము ప్రక్క దూలముల నన్నిటిని దీసివైచిరి. అచ్చట నిలువబడిన యాగజముక్రింద డోమ్మరివాండ్రు పాడు వింత పాటలకు తొండముతో తాళము వేయుచు,ఎత్తును, దించుచుండెను.

"మరియొకచోట పదిగజము లెత్తుగల స్తంభము నొకదానిని నిలువబెట్టిరి. ఆ స్తంభముకొనయం దొక రంధ్రమును జేసి యందుండి మరియొక దూలమును దూర్చి త్రాసువలె నమర్చిరి. ఆవాసమున కొకవైపు ఏనుగంత బరువుగలయొక పెద్దబాతిని వ్రేలాడగట్టిరి. రెండవ వైపున ఒకగజముపొడవు చాలశాలమును గల యొకపలకను తాళ్లతోకట్టి వ్రేలాడతీసిరి. ఆపలక కొకబలమైన త్రాడును గట్టిరి. ఒక ఏనుగును దెచ్చి యాపలకమీద నెక్కించి, త్రాసునందువలె, యొకప్రక్క బండరాతిని, మరియొక ప్రక్క యేనుగును ఎక్కించిం

స్త్రీలు నాట్యము చేయుచు రాజు ముంగిట ఏతాముతోడుట భినయించిరి. రాయిక్రిందకువచ్చి ఏనుగు, గాలిలో పైన నున్నప్పుడు సయితము తొండమును తనహంగుపాటదారుల పాటలకు లయ, చెడకుండ తాళమువేయునట్లు ఎత్తుచు దించుచుండెను.

పౌరాణికులు, కథకులు, పాటలవాండ్రు, సుద్దులవారు గాయకులు, నటులు, గారడివాండ్రు, విప్రవినోదులు మున్నగువారలకెల్లను రాయలు, వారివారి విద్యాగౌరవము నుబట్టి, సువర్ణాభరణములను, నూతన వస్త్రముల నొసంగి సత్కరించెను. ఇట్లీ మహోత్సవము లెడతెఱపిలేక మూడ హోరాత్రములు, అత్యంత వైభవముతో జరిగెను. అచ్చటి వింతలను, విశేషములను ఒక్కొక్కటిగా చెప్పినగాని తనివి తీరదు. అటు చెప్పుటకు తగినంత సావకాశముగాని కాలము గాని లేదు. వాటి నన్నిటిని జూచియుండవలసినదే.

దేవరాయ మహారాయల సందర్శనభాగ్యము

"పండుగ మూడవనాడు రాయలు సోపానమంటప మునుండి పయనమయి ఇంకొక చోటకు బోవును. ఆదిన మున నన్ను అచ్చటిపరివారము రాయలసన్నిధికి దోడ్కొని బోయిరి కర్ణాటాంధ్రాధిపు మధిష్ఠించియున్న సింహాసనము మహోన్నతమయి యుండెను. అంతయు స్వర్ణమయమును, రత్నఖచితము నయియుండెను. ఆసింహాసనమునుచేసిన యగసాలి యెట్టిశిల్పియో కాని యందలి కళానైపుణ్యము వర్ణనాతీతము. ప్రపంచమందు ఏదేశము నందును ఏరాజున

కిట్టిసింహాసన ముండుటనే నెఱుగను. ఇట్టి పనితనమునుగూడ ఎచ్చటను జూచియుండలేదు. సింహాసనము మీద మూడు వరుసల ముత్తెపుసరులంచులుగాకుట్టబడిన పసుపుపచ్చని చీనా పట్టుతో చేయబడిన తల్పముగలదు. ఆముత్యముల సౌరును కాంతియు నద్భుతముగనుండెను. అట్టివాటిని నేనెచ్చను జూచియుండలేదు. ఆమహార్నవమి పండుగలలో రాయలీసింహాసనముపై యాపట్టుమెత్తపై నాసీనుడైయుండెను. మహార్నవమిండుగ గడచిన మరునాడు రాయలవారు నన్ను నగరునకు రావలసినదని యాజ్ఞాపించిరి. అప్పుడు సాయంసమయము. నమాజుచేసికొను వేళ. నేను నగరు సమీపించునప్పటికే అచ్చోట పదిచతురపు గజముల మేర నొకకూటము సోపాన మంటపమును బోలినది నిర్మింపబడి కానవచ్చెను. ఆమంటపమునకు పైకప్పు, గోడలును, కత్తివెనుక భాగమున్నంత దళసరి బంగారు రేకుతో కప్పబడి యందందు మేలయిన నవరత్నములతో మనోహరముగ స్థాపితమయి యుండెను. ఆమంటపములో పైనుండి మొదటి అంతస్తుమీద రాయల సింహాసనము అమర్పబడియుండెను. ఆసింహాసన మంతయు స్వర్ణనిర్మితమే! అదిచాలయెత్తుగాకూడనుండెను. రాయలందు రాజసమొప్పనిండుగా కొలువుదీరియుండెను. నేనాప్రభుని సమీపించి బహూకరింపబడి యాసీనుడయినపిదప మృదుమధుర గంభీరభాషణముల, మాయేలికయగు శాఖానిసయద్ సుల్తాను వారినిగూర్చియు నాతనిసామంతులనుగూర్చి యుప్రసంగించెను.

మాప్రభువున కెంతసైన్య మున్నదనియు అశ్వబలమెంత యుండుననియు నడిగెను. మాదేశపు నగరములందలి వింతలు విశేషములను, అందు ముఖ్యముగ సమరఖండము, హీరాటు, షిరాజు, మొదలగు నగరములగూర్చిప్రశ్నించెను. నేను మున్నెన్నడు నెఱుగని యపార కరుణావిశేషములతో నాదరించి మన్నించెను. పిమ్మట నన్నుగాంచి "మీరాజు, మాకు నీయట్టి రాయబారినిబంపి మైత్రి నెఱపుచున్నందులకు మేమెంతయు సంతసించినారము. ఇపుడు మేము కొన్ని యేనుగులను, ఇరువురు తుర్కీబుకొజ్జాలను, అమూల్యములును అద్భుతములు నగు వింత వస్తువులును కానుకగానిచ్చి మీఖాఖానిసయదు సుల్తాను వారికి, యోగ్యుడును, నీతికళారహస్యజ్ఞుడునగు నొకరాయబారినిచ్చి, పంపుచున్నాము" అనినాకు సమ్మోదము కలుగ బల్కెను.

"కొలువుకూటమునందు పరివేష్టితులయియున్న రాజకుమారులలో నొకడు నన్నుజూచి, ద్విభాషిద్వారా రాయల సింహాసనము మీదనున్న జరీనగిషీ, అంచులు లతలు, పుష్పములు అల్లిననాల్గుమొఖమలు పట్టుసోపాలనుజూపిఎటులున్నవని ప్రశ్నించెను. ఆతని యభిప్రాయము అట్టివి మాదేశములో చేయజాలరనుట నేనెఱింగి "అవి చాలబాగున్నవి. అట్టివిమా దేశములో తయారుచేయుఅలవాటులేదు. ఒకవేళచేయదలచిన యింత అందముగను చేయగలరని నానమ్మిక" అనిప్రత్యుత్తర మిచ్చితిని. రాయలునునాప్రత్యుత్తరమునకు సంతసించి ఎప్పటి

యట్లు అనేకదీనారములతో నింపబడినసంచులను తాంబూలము
ను, తనకై ప్రత్యేకముగా నుంచుకొనిన కొన్ని యపరూపపుఫల
ములనిచ్చియింటికిబంపివై చెను.

హోర్మజు (హురుముంజి) నగరవాసుల మాత్సర్యము

"విజయ నగరమున కొంతకాలము నుండి నివసించు
చుండిన హోర్మజునగరవాస్తవ్యులు కొందఱు నాకు రాజుజూ
పిన గౌరవమును, ఆదరమును, ప్రేమను జూచి సహింపజాలక,
మీదుమిక్కిలి, మాయేలికకు రాయబార మంపబూనుట
విని యోర్చుకొనజాలక మాత్సర్యగ్రస్తులయి యెటులయిన
మాస్నేహసౌధమును ధ్వంసము జేయ బ్రయత్నించిరి. ఈఅల్ప
జ్ఞులు, నిజముగా ఖాకానిసయిదు సుల్తానువారి నిజమైన రాయ
బారి కాడనియు, కపటవేషము బూని వచ్చినాడనియు నొక
యపవాదమును వ్యాపింపజేసిరి. నాదురదృష్టవశమున నీవార్త
క్రమక్రమముగా, ఆనోటనుండి యానోటబడి రాజోద్యోగుల
నుండి మంత్రి దళవాయులకు, తుదకు రాయలవారికి జేరెను.
ఆవల జరిగిన వృత్తాంతమును పిమ్మట దెల్పెను.

కల్బరిగపై దండయాత్ర.

"విజయనగరమునందు వృత్తాంతము లిట్టులుండ నన్నిం
తవఱ కత్యంతాదరగౌరవములతో మన్నించుచుండిన ధన్నా
యకుడు(మహాప్రధాని)కలబరిగె రాజ్యముపై దండెత్తిపోయెను.
కలబరిగరాజ్యమునాకాలమునసుల్తానుఅల్లాఉద్దీన్ అహమ్మదుషా
పరిపాలించుచుండెను. సుల్తానుఅహమ్మదుషా, విజయనగరమున

దేవరాయులను ఆతని సామంతులను వధించుటకు ప్రయత్నముల నెల్ల విని సంతుష్టాంతరంగుడై, రాయలకు తన ధూర్త స్వభావము తేటబడ "ఏడు లక్షల వరహాలనిపుడు నాకు గప్పముగా జెల్లింపుము, లేని యెడల నీ రాజ్యమును భస్మీపటలము చేయజాలు సైన్యమును బంపి, నిన్నును నీమతస్థులను రూపుమాపెదను" అని వార్త నంపెను. విజయనగరాధీశుడగు దేవరాయలా మాటలాలకించి క్రోధావేశపరవశుడై "ఔరా! ఏమి ఏనికండకావరము, తురుష్కుల ముష్కరత! నేనింకను జీవించియుండగనే, ఎవరో, కొద్దిపాటివుంది మావారు, చనిపోయినంతమాత్రాన అహమ్మదుషా యిట్టి విపరీతపు తలంపుతో నన్ను జయింపదలచెనా మంచిది, మీ సుల్తానుతో కయ్యము సేయుటయే మాకు సమ్మతము. మిమ్ములను ఎదుర్కొని సమరము చేయుటకు నాకు దగిన బలగమున్నది, ఒక్కరోజులో నొకలక్ష సైన్యమును గూర్పగలను. సూర్యుడు తేజోమూర్తి వెలుగునంతకాలము ప్రతియణువును కనబడును. నా శత్రువులు, నాకు మహోపద్రవము తటస్థించినదనిగాని,: నా బంధుమిత్రపరివారము నశించిరనిగాని నన్నుందఱు ద్రోహాలయి వీడిరనిగాని యెంచినయెడల వారు మిక్కిలి పొరబడిన వారగుదురు. నాకివి శుభదినములు, నాకిది మంచి దశ, నాకేయాపదయు వాటిల్లదు. నా సైన్యము లెక్కడకు బోయినను జయభేరినే మోగింపగలవు గాని పలాయనము కావు. అదృష్టదేవత నావైపున్నది. ఇపుడు మీ సుల్తాను నా దేశములోని ప్రజలను కొల్లగొట్టి ధనమును గొనిపోయి,

సయ్యదులకు మౌల్వీలకు నొసంగుదును. నేను అతని దేశమును ధ్వంసముచేసి నా వేటకాండ్రకును, ద్విజోత్తములకు నొసంగుదును" అని గంభీర భాషణముల దిరస్కరించిపల్కి, రాయబారి నవమానించి పంపివైచెను. పిమ్మట ఉభయులును సమర సన్నాహము చేయించి రణరంగమున సైన్యముల నడిపిరి. ఒకరి దేశముల నొకరు కొంతకాలము కొల్లగొట్టి పాడుచేసిరి.*

ప్రధానమంత్రి హాంబనురీర్. ♦

"కలబరిగె రాజ్యముపై దండెత్తిపోయిన, బ్రాహ్మణ

* ఫెరిష్టాకూడ నీ కాలమున (౧౪౪౩—౪ క్రీ. శ.) దేవరాయలకును, అహమ్మదుషాకును, యుద్ధము సంభవించెనని తెల్పుచు నందులకు వేఱు కారణములను దెలిపియున్నాడు. మూడుమాసముల కాలము యుద్ధము సాగెను. అందు మూడు ఘోరయుద్ధములు జరిగెను. మూడింటియందును కర్ణాటాంధ్ర సైన్యములే గెలుపొందుచువచ్చినవి. చూడుడు: Briggs Ferishta Volume II, p. p. 430-435.

♦ ఈపదము విపు నేవిధముగ పూర్వస్థితికి సమన్వయింపవలెనో తోచకున్నది. అబ్దుల్ రజాక్ యీపేరును తప్పుగా నుచ్చరించి వ్రాసుకొనినట్లు కన్పట్టుచున్నది. అబ్దుర్ రజాక్ గ్రంథముయొక్క మరియొక ప్రతియందు ,,నిమపజీర్" అని యున్నది. కాని పెక్కుప్రతులందు హాంబనురీర్ అని యున్నందుల నిదియే సరియైన పాఠమని యెంచదగును. దేవరాయల ప్రధానులలో త్ర్యంబక దేవఒడయలని యొకరును, హాండే యరాయలని యింకొకరును గలరు. వారెవరైనయీ అబ్దుర్ రజాక్ కాలమున కొలదికాలము ప్రధానియుద్యోగము నిర్వహించిరేమో తెలియదు. హాంబనురీర్ అనునది కొంచమించుమించుగా త్ర్యంబక దేవ అనుదానికి సరిపోవుచున్నది. త్ర్యంబకదేవుడు చంద్రగుత్తిసీమాధిపతి. ఈవిషయ మింకను విచార్యము.

ధన్నాయకుని స్థానమున, దేవరాయలు కార్యనిర్వహణము నకై, "హాంబనురీర్" అనునాతని ప్రధానిగ నియమించెను. రాయల యభిప్రాయమున నీతఁడు ఆబ్రాహ్మణ ప్రధానియంతటి ప్రజ్ఞావంతుఁడగుటచే, నా యుద్యోగ మొసగియుండెను. కాని యీతనియంత దుర్మార్గుడును, కుటిలుఁడును, క్రూరుఁడును, మరియొకఁడు లేఁడు. ఇతఁడు చూచుటకు పొట్టిగను, అసహ్యాకరముగ నుండును. మీఁదు మిక్కిలి హీనకులసంజాతుఁడు, అసూయాపరతంత్రుఁడు, ముక్కోపి, కుటిల ప్రవర్తనముగలవాఁడు, దుర్మార్గుఁడు, నీచుఁడు, గౌరవమెఱుగనివాఁడు. వేయేల? యీతనియందు దుర్గుణము లన్నియు మూర్తీభవించినట్లు దోచును. చెప్పుకొనుటకు మంచి విషయ మొకటి యైనలేదు. రాజకార్య మీతనిపాలబడినతోడనే ధర్మాసనము గూడ మాలిన్యపూరితమయ్యెను. ఆత డధికారము పూనిన తరువాత మొదట గావించిన ఘనగార్యము నాకు ప్రతిదినము బంపబడుచుండిన దినవెచ్చమును ఆపివేయుట. హొరముజి నగరపువారి కిపుడు నామీఁద తమకుగల అసూయను దీర్చుకొనుట కవకాశము గలిగెను. ఎన్నెన్నివిధముల నామీఁద చాడీలు చెప్పి మనస్సు పాడుచేయవలయునో అన్నియు చెప్పి నామీఁద ప్రధానికి మునుపున్నదానికంటె నసహ్యము నెక్కువజేసిరి. హాంబనురీర్ యభిప్రాయము నెఱిగినవారందఱు, నాతని యిష్టానుసారముగ, నేను నిజముగా పారశీక చక్రవర్తిచే సంపబడిన రాయబారిని గానని యు వైరకము చేయదలచివచ్చి,

కపటరాయబారినై మెలగుచున్నాననియు నెన్నియో మంత నములను జెప్పుచుండిరి. రాజకీయోద్యోగులు నమ్మునట్లనేక అనృతములను కల్పించి, మెల్లమెల్లగా వాటిని రాయల చెవి సోకునట్లుగూడ జేసిరి.

ఇట్లు దినవెచ్చము లేక, శత్రువులయపాయమునకు గురియై ధనములేక, గౌరవముచెడి, నిరాశచెంది, కొంత కాల మెట్లో యీపాపిష్టి రాజ్యమున, దుర్మార్గులయిన విగ్రహారాధకు లగు ప్రజలమధ్య కాలము గడిపితిని. నే నిట్లు ఇడుమలబడు చుండినను, అప్పుడప్పుడు పురవీథులందు రాయ లూరేగుచు నా కెదురయినపుడు మదపుటేనుంగు నాపి, చిరునగవుతో, దయారసమొలుక నాయోగక్షేమ మారయుచునే యుండెను. నిజముగా మహారాజు చాల ఔదార్యముగలవాడు. సుగుణ ముల పుంజ మనదగిన మహానుభావుడు.

పారశీకదేశమునకు రాయలు రాయబారము నంపుట.

"ఇంతలో బ్రాహ్మణ ధన్నాయకుడు కలబరిగె రాజ్య ముపై దండయాత్రలు ముగించి, దురదృష్టవంతులగు కొంద రిని బానిసలగను, ఖైదీలుగను బట్టుకొని, రాజధానికి విజయ లక్ష్మితో మరలివచ్చెను. అతడు రాజధానిని ప్రవేశించిన దినముననే, నా దుస్థితిని గూర్చి విని, హంబనురీర్‌ను చాల మందలించి, ఆ దినముననే నా ఖర్చులకై ఏడువేల పణముల నివ్వవలసినదని టంకసాలకు బరాత మిచ్చెను. విజయనగర వాస్తవ్యులయిన ఖ్వాజా-మసూద్, ఖాజామహ్మదు (ఖురా

సానుదేశీయుడు) అనువారలను, రాజపరమేశ్వరు డనదగిన రాయలు అనేక అమూల్యాభరణములు,దుస్తులు, రత్నములు, కానుకలు, మొదలయినవి యొసంగి మాపారశీకచక్రవర్తికడకు ప్రతిరాయబార మంపించెను. ఆ సమయముననే, డిల్లీ సుల్తానుగానుండిన ఫిరోజుషావంశీయుడగు ఫత్తేఖానుగూడ, ఖ్వాజా జమాలుద్దీను అనునాతని తన వకీలుగా, నేర్పఱచి, మాచక్రవర్తికడకు అనేక కానుక లర్పించుచు నొక విన్నపమును బంపించియుండెను.

"నేను విజయనగరమునుండి, రాయలయొద్ద సెలవుగైకొని ప్రయాణమగు రోజున, చక్రవర్తి నన్ను జూచి కృపాలుండై "ఓయీ! నీవు నిజముగా, పారశీకసుల్తానుషారుఖ్ వారి భృత్యుడవు గావనియు, మమ్ము మోసముచేయ నేతెంచినవాడవనియు ననేకులు మాతో చెప్పియుండిరి; లేకుండిన వారావలన ఇంతకంటె గొప్ప యాదరణకును, గౌరవమునకు నీవు పాత్రుడవైయుందువు. గడచినదానికై వగవవలదు. ఎన్నటికైన నీవు తిరిగి మాకు విశ్వాసము గలిగినపిమ్మట మారాజ్యమునకు మీ సుల్తానువారిచే బంపబడుదువేని మా సామ్రాజ్యగౌరవప్రతిష్ఠలకు దగినరీతిని నిన్ను గౌరవించి బహూకరించెదము" అని పల్కెను.

... ... ... ...

"మా సుల్తానువారికి వ్రాసిన సుహృల్లేఖలో దేవరాయ మహారాయలు నావిషయమయి, తన దేశములో

బుట్టినయపప్రథ నన్నింటిని నుడువుచు హార్మజు నగరవాస్తవ్యులు జూపిన యసూయతను వర్ణించి, మరియు నీవిధముగా వ్రాయించెను. "మీతోడ మాకు నెయ్యమును, స్నేహమును ఎంతయు మోదావహములును, వాంఛనీయములును; గాని కొందఱు మాకు అబ్దుర్ రజాకు మీ భృత్యుడు గాడని చెప్పుచు వచ్చిరి; లేకుండిన యింతకంటె నెక్కువగా, మా గౌరవము జూపుచు, మాస్థితికి దగినట్లుగా కానుకల నంపి యుందుము; మీ రాయబారిని ఎక్కువగా గౌరవించియుందుము." పిమ్మటనా ప్రయాణ సన్నాహము బూర్తిచేసికొని శుభదినమున స్వదేశమునకై బయనమైతిని.

స్వదేశాభిగమనము; నడుమ తుపాను.

"నా యదృష్టాకాశమున దైవకృప అను భానుడుదయమయ్యెను. ఆశాభువనగోళమున, భాగ్యతార ప్రకాశింప జొచ్చెను. కటికిచీకటిరాత్రియందు, సంతోషకాంతులు వెలుగసాగెను. అంతట నాకు దైవమును నమ్మినవారికే బాధయు నెప్పుడును గల్గదని తోచెను.

... ... ... ...

"హిందూస్థానమునం దొకచోట మారుమూల నున్నది ఈ విజయనగరము. దేశమంతయు, విగ్రహారాధనపరులు. నేను సంపాదించుకొనినదంతయు, నాకష్టకాలము వ్యయమయిపోవుటచేత, ప్రయాణమునకు గావలసినంత ధనము నాయొద్ద లేకుండెను. ఇక, నా దురదృష్టపు సంగతులను

చెప్పను. ఎట్లో అల్లా సాయందు కరుణాళుడై యుండినందున ప్రయాణము సాగించితిని. షాబాను మాసమున *పండెండవ దినమున నేను విజయనగరమునుండి యితర రాయబారులతో పాటు బయలుదేరితిని. పదునెనిమిదిదినము లహోరాత్రములు పయనము గావించి 'రమ్‌జాను' * మొదటిరోజున మంగుళూరునగరమున జేరితిని. మంగుళూరులో రమ్‌జాను ఉపవాస దినములను జరిపి, పిమ్మట హోనూరు రేవునకు బయలుదేరితిమి. మంగుళూరులో సయ్యదు అల్లాఉద్దీన్ మహాది అను మహా న్యాయఫకీరు గలడు. అతనికి నూటయిరువది సంవత్సరములు వయస్సుండునని చెప్పెదరు. హిందువులను, మునల్మానులు నుగూడ నాతని మహనీయునిగా భావించి పూజింతురు, అట్టి మహనీయుని సందర్శించి, యాశీర్వాదము బడయుభాగ్యము నాకు లభించునందులకే నెంతయు నదృష్టవంతుడనని యెంచెదను. ఇచ్చట నుండగనే విజయనగర రాయబారులలో ప్రధానుడగు ఖ్వాజామసూద్ అకస్మాత్తుగ మరణించెను.

హోనూరు రేవునందు పారశీక దేశమునకు బోవుటకై యోడ నొకదానిని గుదుర్చుకుని నలుబదిదినముల ప్రయాణమునకు వలసిన సామగ్రినంతయు సమకూర్చితిని. ఇచ్చట

*షాబానుమాసము మనకు పుష్యమాసమగును.

*రమ్‌జాన్ మొదటిరోజు మాఘ శు ౧ నో ప్రథమతిథియో యగును.

శుభశకునమును పరీక్షించి, జిరాకడా మాసమున* ౨౫వ దినమున ఓడలంగరు నెత్తించితిని. ఓడప్రయాణము మాకు చాల యుపద్రవకరమయ్యెను. వరుసగా రెండు మాసములించుమించుగా తుపాను రేగుచుండుటవలన మేము చాల యిబ్బందులు పాలబడితిమి. ఎట్టకేలకు హిజరాశకము ౮౪౮ సంవత్సరమున మహారము పండుగ సమీపించునప్పటికి (ఏప్రిల్=చైత్రము: క్రీ. శ. ౧౪౪౪) సముద్రపుగండములను గడిచి మాదేశములోని కలహాట్ ♦ శిఖరమును సందర్శింప గల్గితిమి.

సముద్రయాన సమాప్తి : హోర్ముజునగర ప్రవేశము.

"నాప్రయాణ చారిత్రముగూడ ముగియుచున్నది. మొహారముపండుగ గడచువఱకు మేము మస్కాటురేవును గూర్చి సుఖముగా పయనము సేయుచునేయుంటిమి. మస్కాటు రేవునుజేరి కొంతకాల మచ్చటలంగరు దించి, సముద్రము మీద తుపానువలన గల్గిన నష్టమును కూడి తీర్చుకొని హోర్ముజునగరమునకై ఓడ లంగరెత్తించి పయనము సాగించితిమి. మస్కాటురేవు దాటిన పిదప "ఖూర్ పకాన్" రేవున రెండు దినములాగి, మరల బయలుదేరితిమి. అప్పటికి వేసవికాలపు వేడి దుర్భరమగుటచేత నారేవున రెండుదినముల నఱకునాగ

* మాఘమాసాంతము గావచ్చును.

♦కలహాట్ శిఖరము మస్కాట్ రేవునకు నలుబది మైళ్ళదూరమున నున్నది. దానియెత్తు ౬౦౦౦ అడుగులుండును.

వలసి వచ్చెను. ఖూర్ఫకాన్ రేవునుండి బయలుదేరి సురక్షితముగా హార్మజు రేవున సఫర్ నె ౧౭ వ తేదీని మధ్యాహ్నమగునప్పటికి లంగరు దింపితిమి. ఆనాడు శుక్రవారము.

హోనూరు రేవునుండి హురుమంజి (హార్మజు) రేవునకు మాకు పయనముచేయుటకు డెబ్బదియైదుదినములుపట్టెను."

## ఇమ్మడి దేవరాయల పరిపాలనము-

రాయబారి అబ్దుర్ రజాకు సందర్శించిన దినములలో, కర్ణాటాంధ్రమహాసామ్రాజ్యమును ఇమ్మడి దేవరాయలు (లేక దేవరాయాభిధానులలో రెండవవాడు) పరిపాలించుచుండెను. ఇమ్మడిదేవరాయలవంశము చరిత్రయందు సంగమవంశమని బిలువబడుచున్నది. విజయనగర సామ్రాజ్యమును, స్థాపించి, దక్షిణ హిందూ దేశమునకు రెండున్నర శతాబ్దముల కాలము తురకలవలన హిందూసంఘము, మతము, సాంకర్యము జెంది, స్వాతంత్ర్యము నశింపకుండ నరికట్టగలుగుటకు బునాదులు వేసిన దీసంగమవంశమే! విజయనగరరాజ్యమును నెలకొల్పినది సంగమరాజుకుమారులు హరిహరరాయ బుక్కరాయాదులు. ఒకవంక నుత్తరమున, బహామనీసుల్తానులు మహమ్మదు, ఫిరోజషాహిలవల్లనేయాపదయు వాటిల్లకుండ, జూచుకొనుచు చెదరిపోయిన, దక్షిణరాజ్యములనన్నింటిని, సంగమవంశజుల పరిపాలనము క్రిందకు దెచ్చి, సామ్రాజ్యమును రక్షించి వృద్ధి చేసినాడు రెండవబుక్కరాయలు. ఆతని వెనుక, విజయనగర

సామ్రాజ్యమున కఖండవైభవైశ్వర్యములను, యశమును సంపాదించి, దేశదేశాంతరములనుండి యేతెంచిన రాయబారులకు తనకొలువున కాశ్రయమిచ్చి, ప్రతాపమూర్తియై, దిగంతవిశ్రాంతమైన యశము నార్జించి, కవియై, రసజ్ఞుడై, సార్వభౌముడై ప్రఖ్యాతిఁజెందినవాడు రెండవ లేక యిమ్మడి దేవరాయలు.

ఇమ్మడి దేవరాయలు శా. శ. ౧౩౪౩ (క్రీ. శ. ౧౪౨౧) శార్వరిసంవత్సరమున వైశాఖమాసాదిని సింహాసనస్థుడై మహారాయబిరుదమును ధరించి పరిపాలింప నారంభించెను. అంతకుబూర్వము కూడ నాతడుమూడు సంవత్సరములనుండి, తన తండ్రికి దోడుగా, యౌవరాజ్యపట్టభద్రుడై, తండ్రికిమారుగా, తానే సామ్రాజ్యమును బాలింప నారింభించినట్లు శాసనప్రమాణములు గాన్పించుచున్నవి. న్యూనిజు అను పోర్చుగీసుచరిత్రకారుడు, దేవరాయనికి యిరువదియైదు సంవత్సరములు రాజ్యకాలము చెప్పుచున్నాడు. మరియు నీతనితండ్రి, విజయ (బుక్క) రాయలు ఆరుసంవత్సరములు రాజ్యముచేసెనని కూడ దెలుపుచున్నాడు. విజయరాయ, యిమ్మడిదేవరాయలు భయులును, కలిసి, మహారాయబిరుదముతో నీభూమండలినేలుచున్నట్లు క్రీ.శ. ౧౪౧౯ మొదలుకొని ౧౪౨౧ వఱకును శాసనములు, గాన్పించుచున్నవి. * విజయరాయలు, ఈమారునితో గలిసి మూడేండ్లును, తన తండ్రి)

* Ep. Car. Vol. x. Introducion, p. xxxv.

యగు మొదటిదేవరాయనితో గలిసి యాతని ముదిమిని, మూడేండ్లును, న్యూనిజ్, వ్రాసినప్రకారము, వెరశి, యారేండ్లును, నిరర్థకముగ పరిపాలించియున్నాడు.

యిమ్మడి దేవరాయలు సింహాసనమెక్కి, తండ్రితో సమానముగా బరిపాలింప నారంభించిన సంవత్సరమందే (క్రీ. శ. ౧౪౧౯) యాతనికి బహుమినీసుల్తానగు ఫిరోజుషాహాతో గలహాము సంభవించెను. సుల్తాను ఓరుగంటిపైదాడి వెడలి యుద్ధమునందు పరాజితుడై వెనుకకు మరలుచుండెను. అట్టితఱి, యోరుగంటి కాకతీయులకు సాహాయ్యముగా బోయిన దేవరాయలు. తన యశ్వదళముతోడను, భటసమూహముతోడను సుల్తాను, వెన్నాడి తఱుమనునారంభించెను. ఫిరోజుషా, కుపితుడై, బాలుడగు దేవరాయలతో యుద్ధమునకు సేనలను మరల్చెను. ఈ యుద్ధమెచ్చట జరిగినదో, పెరిష్టా దెలుపడుగాని తురకసేనలు పరాజితులయి, రణరంగమునుండి, పారిపోయెను. దేవరాయలచే ప్రేరేపితుడైన రాహుత్తుడొకడు-సుల్తాను పరివారములోనివాడు-సుల్తానుశిరముపై నొక దెబ్బ గొట్టెననియు, నాతడు దానిమూలమున వీరస్వర్గమును జూఱగొనెననియు పెరిష్టా వ్రాసినాడు. సుల్తానునకు తగిలిన దెబ్బను, మహమ్మదీయుల కపజయమును స్థిరమగుటయు జూచి తురకసేనలు, మరల వెన్నిచ్చి పాఱెను. ఆసమయమున హిందువులు, కనబడిన ముసల్మానులనందరిని జంపి, "వారిశిరములతో కదనస్థలిపై నొకమంటపమును గట్టిరి" పారిపోవుచున్న సుల్తా

న సేనలను వెన్నాడి, దేశమును పరశురామప్రీతి చేసిరి. చిరకాలమునుండి తురకలమీదనున్న కసిని, నాటి హిందూ క్షత్రియులు తమ కత్తులనుకడిగి దీర్చుకొనిరి.

ఈయుద్ధమునందు గాయపడి ఫిరోజుషా రాజధానిని జేరినవెనుక నెంతకాలమో జీవింపలేదు. అతనివెనుక నాతని రెండవకుమారుడు అహమ్మదు సింహాసనమధిష్టించెను. సుల్తానుఅహమ్మదుషా, తన తండ్రికి జరిగిన యవమానమునకు అలుకవహించి, విజయనగరరాజ్యసీమలపై దండెత్తివచ్చెను.

అహమ్మదుషాకును, దేవరాయలకును అంతట రెండేండ్లువరుసగా యుద్ధములు జరిగెను, సుల్తాను, ఆయుద్ధములందు త్రొక్కిన ప్రదేశమునెల్ల నిర్ధూమధామము గావించుచు క్రూరుడై. స్త్రీలనక, శిశువులనక, చేతికందినవారినెల్ల నఱకివేయించెను. ఈయుద్ధములందొకప్పుడు విజయము, హిందువులకును, మరియొకప్పుడు తురకలకును, గలుగుచు చంచలమై యుండుటజూచి, దేశమున కాటకము రేగుచుండుటచే, సుల్తానును, రాయలును సంధిగావించుకొని, యుద్ధమునుండి విరమించిరి. అదిమొదలుగా, క్రీ. క. ౧౪౩౫ వ సంవత్సరము వఱకును, దేవరాయలే యుద్ధములును లేక దేశమునందు శాంతియు, సౌఖ్యమును నెలకొల్పి, రాజ్యమును బాలించెను.

క్రీ. శ ౧౪౩౫ సంవత్సరమున, అహమ్మదుషా మరణించెను. అంతనాతని పుత్రుడు రెండవ అల్లాఉద్దీను, భామినీ రాజ్యభారమును వహించెను. ఆ సంవత్సరమే యాతడు

విశేషసైన్యమిచ్చి తన సోదరుడు, మహామ్మదుఖానుని రాయలమీాదికి, బంపెను. దేవరాయలాసమయమున, తురకలతో సంధి చేసుకొని మహామ్మదుఖానుని సాగనంపెను. ఈ విజయమున కుప్పొంగి మహామ్మదుఖాను, సోదరునిపై దిరుగబడెను. ఈ తిరుగుబాటునందు, దేవరాయలు, మహామ్మదునకు దోడ్పడి యెను. మహామ్మదు, ముద్గకల్లు, షోలాపురము, రాయచూరు, బీజపురము మొదలగు పట్టణములను స్వాధీనము చేసుకొనెను గాని సుల్తాను సైన్యములతో దలపడినవు డపజయమునొంది పాఱిపోయెను. తరువాత సుల్తాను, అనుజుని, తప్పిదమును మన్నించి, రాయచూరుకోట నాతని కిచ్చెను.

విజయనగరమునకును, కలబరిగెసుల్తానులకును జరుగుచుండిన యుద్ధములందు, జయలక్ష్మి చంచలమై యుండుట జూచి, ఇమ్మడి దేవరాయలు, భామినీసుల్తానులకును, తనకు గల విరోధమును గుఱించి తలపోసి, మంత్రి, పురోహిత, సేనాపతి, సామంత, దండనాధులను, హితులను, బ్రాహ్మణులను బంధువులను ఎల్లరను రావించి, యొక సభగావించి, తనరాజ్యము, భామినీరాజ్యము కంటె నధికవిస్తీర్ణత కలదనియు, ఐశ్వర్యప్రద మైనదనియు, బహు సేనావృతమైనదనియు, అట్లయినను, దురష్కులే యుద్ధములందు జయముగాంచుచుండుటకు గతంబేమియనియు ప్రశ్నించెను. అందులకు పలువురు పలువిధములుగ తమకు తోచినతెఱంగుల విన్నవించిరి. రాయలువారు బల్కినదంతయు విని, తురకల యుద్ధపనిద్ధతి

తెలిసికొని, తనసేనయందు విలుకాండ్రను, అశ్వదళమును అభివృద్ధి పఱచుకొని రాజ్యము ననేక విధముల పెంపు నొందించెను.

రాయలరాజ్యము తుంగభద్రా కృష్ణవేణీనదులకు దక్షిణముగా, పూర్వ, పశ్చిమసముద్రముల దాకుచు, సింహళద్వీపములలోనికి సయితము వ్యాపించియుండెను. అందువలన నాతని శాసనములు ఇంచుమించుగా, పైజెప్పిన దేశమంతటను గానవచ్చుచున్నవి.

దేవరాయల కర్ణాటసామ్రాజ్యము, చిన్నచిన్న రాజ్యములక్రింద విభజింపబడి, యొక్కొక్క దండనాథునిక్రింద నుంచబడుచుండెను. ఈ రాజ్యములందు, రాయల ప్రతినిధులు పారుపత్యము నిర్వహించుటకుకొందరు(కారకర్తలు) ప్రధానులుండిరి. వారందఱు నవసరమువెంబడిని,యొక రాజ్యమునుండి, మరియొక రాజ్యమునకు మార్పబడుచుండిరి. కర్ణాటసామ్రాజ్యములోని మైసూరుప్రాంతము, నాలుగు రాజ్యములుగా పరిపాలింపబడుచుచుండెను. పశ్చిమరాజ్యము, ఆరగడరాజ్యమనియు మంగళూరు ప్రాంతము, మంగళూరు రాజ్యమనియు, కోలారుమండలము, ములువాయి రాజ్యమనియు, ఈ మూడింటికి నడుమగల దేశము బారకూరు రాజ్యమనియు వ్యవహరింపబడుచుండెను. విజయనగరమునకు సమీపమునగల దేశము పెనుగొండరాజ్యమనియు, దానికి దక్షిణసీమ వేలూరురాజ్యమనియు, దానికి తూర్పుప్రాంతము చంద్రగిరిరాజ్యమనియు,

ానికుత్తర దేశము చంద్రగుత్తిరాజ్యమనియు బిలువబడుచుం
ను. మైసూర్ప్రాంతమునకు దక్షిణమున ననగా నిప్పటి
చ్చి, మలబారు దేశములు తెరకనాంబి రాజ్యమని బిలువ
డుచుండెను. చంద్రగిరి రాజ్యమునకు దక్షిణమున రాజగం
ర రాజ్యమను మధుర రాజ్యముండెను. మైసూరు రాజ్యము
జేరిన ఆరగర రాజ్యమును బ్రహాక్షత్రియ వంశజుడైన రా
ప్ప ఒడయుని కుమారుడు శ్రీగిరినాథ బడయురు పరిపాలిం
చుండెను. ఆకాలమున గుత్తిలేక, గోవచంద్రగుత్తిరాజ్య
నౌకరితరువాత నౌకరు త్ర్యంబక దేవ, హండేయరాయుల
వారలు వరుసగా బాలించియుండిరి. మంగళూరు రాజ్య
ను, వరుసగా నాగణఒడయులు, నాగిమంగళం దేవరాయఒడ
యలు నేలియుండిరి. బారకూరు సాళువ రాజ్యమును, చందరసఒడ
యలు, నరసింహదేవవొడయులు బాలించియుండిరి. దేవ
యుల తమ్ములలో వీరపార్వతిరాయుడు తెరకనాంబి రా
మును, ప్రతాపదేవరాయలు వేలూరిరాజ్యమును, శ్రీగిరి
థుడు చందగిరిరాజ్యమును బాలించుచుండిరి. తెలుగు
మిలోని వినుకొండరాజ్యమును, వల్లభరాయమంత్రి యే
చుండెను. ముళువాయిరాజ్యమును అనగా కోలారు మండల
ను సాళువ గోపరాజు పరిపాలించుచుండెను.

దేవరాయల రాజ్యపాలనాపద్ధతులు రజాక్ వర్ణించిన
యు యదార్థములయినట్లు శాసనప్రమాణములు గన్పట్టు
న్నవి. మండలేశ్వరులైన, దేవరాయని ప్రధానులు, రాయలకు

త్రబతిగా, నాయా రాజ్యములపై పారుపత్తెము నిర్వహి...ను.
సమయానుకూలముగ నొక రాజ్యమునుండి మరియొక ...
మునకు మార్చబడుచుండిరి. ఇట్టిప్రధానులలో, పెరుమ
దణ్ణాయకుడు పశ్చిమదేశములకును, చోళ, పాండ్యమం
ములు అనగా రాజగంభీర రాజ్యమునకు లక్కణ, సిం...
వొడయులును, పారుపత్తెము నిర్వహించుచుండిరి. ఈ ...
ప్వరి ప్రధానులలో, లక్కణ దణ్ణాయకుడు, రాయలకా...
కర్తయై మహామంత్రియై, సామ్రాజ్యమునందంతటను పా...
పత్తెమునడవు చుండెను. ఇతడే, మన అబ్దుర్ రజాక్, పేర్కొ...
మహాప్రధాని. ఇతడు బ్రాహ్మణుడు. కలబరిగపై దండెత్తి ...
యుడై వచ్చినదీతడే! లక్కణవొడయలు, దేవరాయలయాజ్ఞ...
సావహించి సింహళముపై దండెత్తి, యాలంకాధిపతి,కప్ప...
గట్టుటమానినందున శిక్షించివచ్చెను, ఇయ్యది. అబ్దుర్ రజ...
విజయనగరమునందున్నపు డెపుడో జరిగియుండవలయు...
కాని, అంతకు పూర్వమునుండియు, లక్కణ ఒడయ...
దక్షిణసముద్రా ధీశ్వరుడని బిరుదముండుటచేత క్రీ.
౧౪౪౧ సంవత్సరమునకు పూర్వమే సింహళద్వీపమ
జయించి యుండినట్లు విశ్వసింపవలయును.

ఇమ్మడి దేవరాయల పరిపాలనము శాంతిప్రద
యుండినట్లును, ప్రజలు యుద్ధములవలనగాని, దండయా...
వలనగాని, యేయొత్తిడిలేక సుఖముగా నుండిరనియు

న్నిటికంటె పారశీక దేశమునుండి సుల్తానుషా, రుఖ్ ప్రౌఢ దేవరాయలకడకు రాయబారిగా, అబ్దుల్ రజాక్ ను పంపుట, ప్రధానమైనది. రాయలకీర్తి, దిగంత విశ్రాంతమైన దనుటకును, ఆతడు, మహా పరాక్రమశాలి యనుటకు నాతని తోడి నెయ్యము, దేశాంతరముల నుండు రాజన్య లపేక్షించి నుటకు నింతకంటె వేఱె కారణమేమి గావలయును? అబ్దుర్ జాక్ విజయనగరమును సందర్శించుటకుఁబూర్వము నికోలో ంటి యను ఇటాలియా వాస్తవ్యుడొకడు, వచ్చియుండెను. తడు ప్రౌఢదేవరాయలగూర్చి" యాతడు హిందూదేశము ని నృపాలురందరి కంటెను ఎక్కు బలపరాక్రమ సమనిర్వ డు „ అనివ్రాసియున్నాడు. నికోలో చేసిన విజయనగర ర్ణనము, మన రజాక్ చేసిన వర్ణనలను ఇంచుమించుగా బో యుండును. రాజ్యమంతయు శాంతి ప్రదమై, రాజ్యకాల ంతయు సౌఖ్యావహమై యుండుటచేతనే ప్రజలకు విద్యా ప్తియుండుటకును,సాంఘికాచారములందు సంస్కరణములు పుకొనుటకు నవకాశము గలిగినది. ఈతనికాలమున, వైది పసీమ్న బ్రాహ్మణలు—కర్ణాటాంధ్ర ద్రావిడ లాట దేశీ యులు — నప్పటినుండియు, (క్రీ. శ. ౧౪౨౫) హాములందు, కన్యాశుల్కమును దీసుకొను నాచారము నీతిమనియు, వివాహములు, కన్యాదానములుఁగావున న్యావిక్రయములుగా జరుగరాదనియు, నొడంబడిక జేసు రి. ఆకట్టడియందు, కులపెద్దలు వ్రాళ్ళుచేసియుండిరి.

ఇమ్మడిదేవరాయల కాలమున, విదేశవాణిజ్యము చక్క గాసాగుచుండెను. రాయులకు మూడువందల రేవులున్నవని రజాక్ వ్రాసినాడు. కాని అది అతిశయోక్తిగా గన్పట్టుచున్నది. ఆంధ్రదేశమున మోటుపల్లి మొదలుకొని తూర్పుతీరమున కన్యాకుమారివరకును అచ్చటనుండి, పశ్చిమతీరమున గోవ వఱకునుగల సముద్రపుటొడ్డు పట్టణములన్నియు రేవులేయని యెంచుకొన్నచో మున్నూరు రేవు లుండుటలో నాశ్చర్యకరమైన దేమియు లేదు. విదేశవాణిజ్యము విరివిగా సాగుటకై రాయల మంచి కట్టడులు చేసినట్లు గానవచ్చుచున్నది. దేవరాయల కాలమున, రేవుపట్టణములకు అభయశాసనము వీయబడి, ఎగుమతి దిగుమతి సరకులపై సుంకములు, పూర్వ మర్యాదల ననసరించి కట్టడలు చేయబడెను. ఆంధ్రదేశమున మోటుపల్లి రేవునందున్న దేవరాయల శాసనమందు, దిగుమతి, యెగుమతి సరకులపై సుంకాలు వివరింపబడియున్నవి ఇట్టి శాసనము లింకను ఇతర తావులం దెన్నిగలవో!

రాయలు, ఏనుగుల వేటయందు ఎక్కువ ప్రీతిగల వాడని అబ్దురజాక్ చెప్పినమాటలు విశ్వసనీయములుగా గన్పట్టుచున్నవి. రాయలకు, తగినంత శాంతియుండినగాని ఏనుగులవేట యొకటి యాచారము చేసుకొనుటకవకాశము డదుగదా! అతడు ఏనుగులవేటాడుట మొదట నెలకొల్పినకారణమునగాబోలు తన నాణెములపై రాయ గజగండ భేరుండయనియు, గజబేటకారయనియు, బిరుదులు వ్రాయుం

న్నాడు దేవరాయలు, మహాసామ్రాజ్యమునుని నిర్మింప ఁగుటయెగాక దానికి సుస్థిరత్వమును సమకూర్చినగాని, గజ ం విలాసార్థముగా జేయుచుండుటకు తగిన యవకాశ ుండదు.

ఇమ్మడిదేవరాయలు కవితాప్రియుఁడు. రసజ్ఞుఁడు. శేషించి కవియు గూడనై యుండి, తనయాస్థానమున బెక్కు ంది కవులను పండితులకును ఆశ్రయమిచ్చెను. శ్రీనాథు తని ముత్యాలశాలయందే క్రియాశక్తి ఒడయలసమక్ష ్షన, గౌడడిండిమభట్ట కవి సార్వభౌముని యోడించి, ాతని కంచుఢక్కను బగులగొట్టించి, కనకాభిషేకమును ేసినాడు. ఈతనికాలవు పరిస్థితులు శ్రీనాథుని చాటువుల లసి తెలియవచ్చుచున్నవి. దేవరాయలు సంస్కృతభాష ుందు, కవియైయుండి, "మహానాటక సుధానిధి" యను ాక చంపూకావ్యమును రచించి, అందు శ్రీరాముని రిత్రము వర్ణించినాడు.

రాయలసోదరు డొకడు, రాయలపై కుటిలబుద్ధి, ్రూరముగ వధింపనెంచినటుల, అబ్దుర్ రజాక్ వ్రాసిన వ్రాత ం నిజముగావచ్చును. ఆదారుణకృత్యమును దలపెట్టిన ోదరుడెవడో యింతవఱకు దెలియరాదు. ఆకుట్రలో, తగి ిన గాయములవలన రాయలు, వ్రణపీడితుడై యారుమాసము ైన గతించక ముందె (౧౪౪౭నందు) మరణించెను. ఈతని మరణమునకు బూర్వమె మనరాయబారి విజయనగరమునుండి,

స్వదేశమునకు బయలుదేరినట్లు యాతడు వ్రాసిన వానినిబట్టి తెలియుచున్నది.

దేవరాయలు తన్ను జంపుటకు జరిగిన యాప్రయత్నమునందు బాల్గొన్నవారందఱిని చిత్రవధపాలుచేసెను. విజయనగరమిట్టి దురవస్థలో నుండగా భామినీసుల్తానగు రెండవఅల్లా యుద్దీను డీసమాచారము నంతయుగూఢ చారుల వలన నాకర్ణించి, ధూర్తుడై యేడులక్షల దీనారములు కప్పము బంపవలసినదనియు, లేకున్న రాజ్యముపై దండెత్తి రాగలననియు వర్తమానమంపెను. రాయలా బెదరింపులకు జంకక, సైన్యమును గూర్చుకుని భామినీరాజ్యముపై దండెత్తిపోయి ముద్గల్లు కోటనుగొట్టి రాచూరు, వెంగాపురపుకోటలను సాధించి, సాగరు బిజాపురమువఱకునుగల తురుష్క రాజ్యమును గొల్లవెట్టుచు దేశమునల్లకల్లోలము చేసివైచెను. ఆయుద్ధములో మహమ్మదీయులకు విశేషముగా బ్రాణనష్టము సంభవించెననియు తుదకొండొరులకు హానికలుగజేసుకొనకుండ సంధిచేసుకొని యెవరిరాజ్యములకువారు వెడలిపోయిరని ఫెరిష్టావ్రాయుచున్నాడు; గాని యది నిజమనివిశ్వసింపజాలము. అబ్దుర్ రజాక్, ఆసమయమున. దేవరాయల యాస్థానమునందుండినవాడగుటచే,నతడు దేవరాయలబ్రాహ్మణ మహాప్రధాని కలబరిగె రాజ్యముపై దండెత్తి, తురుష్క సేనలను జయించివిజయలక్ష్మీసమేతుడై తిరిగివచ్చుచు,కొందఱిదురదృష్టవంతులగు

ఖైదీలను వెంటబెట్టుకొనివచ్చినాడని వ్రాసినది, యదార్థమని యొప్పుకొనక తప్పదు.

దేవరాయనిసమకాలీనులలో, రాజమహేంద్రవరము రాజధానిగా, పూర్వాంధ్రదేశమును చిల్కాసముద్రము పర్యంతమునేలిన అల్లాడ వీరారెడ్డి, వేమారెడ్లు, మిక్కిలి ప్రఖ్యాంతిగాంచినవారు. వారి యాస్థానమునందే, కవిసార్వభౌముఁడగు శ్రీనాథుడు తనకౌమార దశనంతయు, గడపియుండెను. ఈ రెడ్లకును, భామినీసుల్తానులకును గల స్నేహమువలన, కర్ణాట భూపాలునకువీరు ప్రబలుశత్రువులుగావలసివచ్చెను.

మన అబ్దుర్ రజాక్, నికోలోకొంటి. విజయనగరమును సందర్శించిపోయిన ఇరువదిసంవత్సరములకు పారశీకరాయబారిగానే తెంచియుండెను. ఆతడు రాయబారమున క్రై. శ. ౧౪౪౨ వ సంవత్సరము జనవరి ౧౩ వ తేదిని బయలుదేరి ఎట్లో, పడరానిపాట్లుపడి ఆసంవత్సరము నవంబరు మాసాదినికళ్ళికోట రేవును, జేరగల్గెను. కాని కళ్ళికోటలో నాతడు ౧౪౪౩ వ సంవత్సరము ఏప్రిల్ మాసాదివఱకుండిపోవలసి వచ్చెను. అంతట రాయలచే నాహ్వానింపబడి, కళ్ళికోటనుండి బయిలుదేరి ఏప్రియల్ మాసాంతమున కచ్చుటికిజేరి యది మొదలుకొని డిశెంబరు ౫వ తేది వఱకును విజయనగరమునందుండెను. ఈతడు మహార్నవమి యుత్సవములని, వర్ణించినాడుగానియాతని వర్ణనలుబట్టిఆతడు జూచినది, వర్ణించినది, నవరాత్రియుత్సవము లగునో కాదో యని సందియము గలుగ

ఘుచున్నది. అతడు త్రిరాత్రియుత్సవములనే వర్ణించి మహా ర్నవమి యుత్సవములని జెప్పినాడు. అతడు పొరబడియుండ వచ్చును లేదా యీతడు వ్రాసిన చరిత్రలో కొంతభాగము శిథిలముకాగా శేషించినదానిని సంస్కరించి పూరించినవారు పొరబడియుందురు. అబ్దుర్ రజాక్ రాయల పరిపాలనావ సానదశయందుండి, విజయనగరవైభవమును కన్నులారఁ గాంచి, వర్ణించిన యదృష్టవంతుడు. మన కందువలన చిరస్మ ణీయుఁడు.

University of Hyderabad
IGM Library
221744

UNIVERSITY OF HYDERABAD
INDIRA GANDHI MEMORIAL LIBRARY
Hyderabad (A.P.)

Cl. No. T 92 V55A Acc. No. 221794

DATE DUE

DURATION OF LOAN - Not later than the last date stamped below, falling which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD

Acc. No. 221744

Call No. T92, V55A

Author [illegible]

UNIVERSITY OF HYDERABAD
INDIRA GANDHI MEMORIAL LIBRARY
HYDERABAD - 500 046.

1 Books/should be returned on or before the due date.

2 Borrowers are responsible for every book taken by them and will be expected to pay for any book damaged, defaced or lost.

Help to keep the book fresh and clean